ఆంధ్రసాహిత్యపరిషత్ప్రకాశితము. ౨.

శ్రీరస్తు.

జైమినిభారతము.

ఇది,

సముఖము వేంకటకృష్ణప్పనాయక ప్రణీతము.

చెన్నపురి

ఆంధ్రసాహిత్యపరిషత్తువారిచేఁ

ప్రకటింపఁబడినది.

చెన్నపట్టణము :

సదానందనిలయముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

౧౯౧౬

వెల, ౧[illegible] అణాలు.

All Rights Reserved.

PREFACE.

This is a Telugu prose version of the well-known Sanskrit poem called the "Jaimini Bharatam" of which there is also a metrical translation by Pillala-...ri Pina Virabhadra. The author is Samukham ...kata Krishnappa Naik, son of Minakshi Naik and ...nelu or Alamelu Akka. Accroding to one ac-..., Minakshi Naik was the Chief Minister of the ... Tirumala Naik who was king of Madura from 1623 to 1659 A. D. His son Venkata Krishnappa Naik lived at the court of Tirumala Naik's great great grandson Vijayaranga Chokkanadha who reigned from 1704 to 1731. The interval between the father and son would thus be great. Although it might be explained away by supposing that Minakshi Naik was old when Venkata Krishnappa Naik was born and that the latter was also old during the reign of Vijayaranga Chokkanadha, it would seem to be more in accordance with probabilities to refer Minakshi Naik ... the reign of Vijayaranga Chokkanadha's grand mother Queen Mangamma (1689-1704) who, accord-...g to the tradition referred to above, had brought up Alamelu from her infancy.

Vijayaranga Chokkanadha was a great patron of learning and, among his many gifts, was that of a village to a learned Telugu Brahmin named Sonti Gunnayya whose descendants now live at Periyakulam ...therwise called Thenkarai.

Among the contemporaries of our author was Kumara Ramabhadra Naik, the then *Zamindar* of Vadagarai and his name is perpetuated by a street named after him in Vadagarai and a mantapam in Periyakulam where an annual festival is held.

After the downfall of the Naik dynasty of Madura during the time of Vijayaranga's widow Meenakshi, the family of Venkata Krishnappa Naik settled down at Vadagarai under the auspices of the *Zamindar* of that place to whom it was related and it held the office of the village munsif of Vadagarai till 1870 The last member of the family was Vijayabhagam Alagari Swami Naik who was the husband of the paternal aunt of the present *Zamindar* of Vadagarai He died leaving a daughter whose son Mr. Rama Venkatasawmi Naidu has inherited his grand-father's property.

Venkata Krishnappa Naik was also the author of another prose work dealing with the story of Sarangadhara and of two poems *Ahalyasankrandanamu* and *Radhikasanthvanamu* all of which he dedicated to the god of Srirangam. The present work, he dedicated to his Sovereign and patron. This is one of the several Telugu prose manuscripts that have been secured for the library of the Telugu Academy in the Tamil districts. Till recently, it was believed that there was no prose literature in Telugu prior to the time of the well-known author and scholar Chinnayya Suri, but the discovery of these manuscripts by the Academy has upset that theory.

While true to the original Sanskrit in the story, the translator has expanded the descriptive portions and there are evidences that he kept Pina Virabhadra's poem closely in view. The style is elegant and flowing and the language chaste and, on the whole, simple. The work is of a high order and will repay reading.

This edition is based on two manuscript copies which are in the library of the Academy. One was obtained from Mr. G. S. Krishnayya of Batlagundu in the Madura District and the other from Mr. Thirumalai Veeraswami Pantulu of Puddukottai. To give an idea of the method of editing which is adopted, a portion of one of the manuscripts which corresponds to the printed page 7 is printed as an appendix to this book, just as it is in the original.

The book is published at the cost of the Hon'ble Dewan Bahadur V. Ramabhadra Naidu Garu F.M.U. Zamindar of Vadagarai and Doddappanayakkanur, whose relationship to the family of the author has been set forth above.

J. RAMAYYA.

భూమిక.

ఇది సుప్రసిద్ధమైన సంస్కృతజైమినిభారతమునకుఁ దెలుఁగువచనము. ఈవచన రచనకు ముందే పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి సంస్కృతజైమినిభారతమును బద్యకావ్యముగ నాంధ్రీకరించియుండెను. ఈవచనజైమినిభారతమును సముఖము వేంకటకృష్ణప్పనాయఁకుఁడు రచియించెను. ఈతనితండ్రి మీనాక్షినాయఁకుఁడు. తల్లి అలమేలక్క. మీనాక్షినాయఁకుఁడు 1623-వ క్రైస్తవ సంవత్సరము మొదలు 1659-వ సంవత్సరమువఱకును మధురరాజ్యమును బాలించి యశస్సుగాంచిన తిరుమలనాయఁకుని మంత్రిగా నుండెనని యొకప్రతీతి గలదు. వేంకటకృష్ణప్పనాయఁకుఁడు తిరుమలనాయఁకుని మనుమనిమనుమఁ డగు విజయరంగచొక్కనాథుని యాస్థానమునం దుండెను. విజయరంగచొక్కనాథుఁడు 1704-వ సంవత్సరము మొదలు 1731-వ సంవత్సరమువఱకు రాజ్యమేలెను. దీనిని బట్టి తండ్రికిని గుమారునకును నడుమ నంతర మధికముగాఁ గనుపట్టుచున్నది. వేంకటకృష్ణప్పనాయఁకుఁడు మీనాక్షినాయఁకుని వృద్ధదశలోఁ బుట్టినవాఁడనియు, విజయరంగచొక్కనాథుని రాజ్యకాలమందు వేంకటకృష్ణప్పనాయఁకుఁడుఁగూడ వృద్ధుఁడుగానుండెననియు నూహించినచో నీయంతర మత్యధికముగాఁ దోఁపకపోవచ్చును; గాని వేంకటకృష్ణప్పనాయఁకుని తల్లియగు అలమేలక్క "మంగమ్మ సాకుడుకూఁతు" రను

ప్రతీతి యుండుటచే నామెభర్త యగుమీనాక్షీనాయఁకుఁడు విజయరంగచొక్కనాథుని పితామహి యగుమంగమ్మదేవి క్రింద మంత్రిగా నుండె నని యూహించుటయే సమంజసముగాఁ గన్పట్టుచున్నది. ఈమంగమ్మదేవి క్రీ. 1689-వ సం. మొదలు 1704-వ సం. వఱకు విజయరంగచొక్కనాథుని సంరక్షణకర్త్రిగా రాజ్యముచేసెను.

మీనాక్షీనాయఁకుఁడు మధురమీనాక్షీ యాలయమున కెదుట నొకమండపమును గట్టించి యఖండదీపముఁ గూడ నిల్పెనఁట. విజయరంగచొక్కనాథుఁ డనేకధర్మకార్యములు చేసెను. శొంఠి (సొంటి) గున్నయ్య యనునాంధ్రబ్రాహ్మణున కొకయగ్రహార మిచ్చెనఁట. ఈ బ్రాహ్మణుని సంతతివా రిప్పటికిని నాయగ్రహార మనుభవించుచు పెరియకొళగ్రామమందున్నారు.

విజయరంగచొక్కనాథుఁడు గతించినపిదప నాతని భార్య మీనాక్షమ్మ 5-6 సంవత్సరములు మాత్రమె రాజ్యముచేసెను. అనంతరము దేశము తురుష్కాక్రాంత మాయెను. అపుడు వేంకటకృష్ణప్పనాయఁకుని కుటుంబము వారు తమబంధు వగు వడగరై జమీందారు నాశ్రయించి యచ్చటనే నివసించిరి. 1870-వ సంవత్సరము వఱకు నీకుటుంబమువారు వడగరై గ్రామాధికారులు (గ్రామమునకు మునసబులు) గా నుండిరి. విజయభాగము అఁగరిస్వామి నాయఁకుఁ డనునాయనతో సముఖవంశ మంత

రించెను. ఈయలగరిస్వామినాయఁకుఁ డిపుడు వడగరై దొడ్డప్పనాయఁకనూరుసంస్థానములకు జమీందారు లగు ఆనరబుల్ దివాన్‌బహదర్ వి. రామభద్రనాయఁడుగారి మేనత్తపెనిమిటి. ఆయన దౌహిత్రుఁడగు రామా వేంకటస్వామి నాయఁడుగారు వర్ధమానులైయున్నవారు.

ఈగ్రంథమునకు రెండువ్రాఁతప్రతులు మాత్రమే పరిషత్తునకు లభించినవి. అందొకటి మ. రా. పుదుకోట తిరుమల వీరాస్వామి పంతులవారివలనను, మఱియొకటి మ. రా. వత్తలకూండు జి. ఎస్. కృష్ణయ్యగారివలనను లభించినవి. పరిషత్పుస్తకభాండాగారమున మొదటిది 142-వది. రెండవది 308-వది. ఈ రెండునుదప్ప మూఁడవప్రతి యెక్కడ నున్నట్లు కనఁబడదు.

అచ్చులో నేమేమి మార్పులు జరిగినవో తెలుపుటకై 7-వ పుటకు సరియైన భాగ మొక్క వ్రాఁతప్రతిలో నున్నది యున్నట్లీగ్రంథమున కనుబంధముగ ముద్రింపఁబడినది.

మధురజిల్లాలోని వడగరై, దొడ్డప్పనాయఁకనూరు జమీందారు లగు ఆనరబుల్ దివాన్‌బహదరు వి. రామభద్రనాయఁడుగారి ధనసాహాయ్యమున నీగ్రంథము ప్రకటింపఁబడినది. శ్రీనాయఁడుగారి యౌదార్యము, మాతృభాషాభిమానమును బ్రశంసనీయములు.

జయంతి రామయ్య.
పరిషత్కార్యనిర్వాహకసభాధ్యక్షుఁడు.

శ్రీరస్తు.

జైమినిభారతము.

పీఠిక.

జైమినిభారత మనునీవచనకావ్యమును సముఖము వేంకటకృష్ణప్పనాయకుఁడు రచియించెను.

—* కవివంశము, కాలము. *—

ఇతఁడు తనవంశకర్తయయిన కేశవప్పనాయనింగూర్చి యహల్యాసంక్రందనసారంగధరచరిత్రల యవతారికలలో నిట్లు వర్ణించికొనెను.

క. శరణంబులు జగముల కా
భరణంబులు వేదములకుఁ బంకజలక్ష్మీ
కరణంబులు నారాయణ
చరణంబు లెసంగు శూద్రజాతికి నిరతన్.

క. నాలవవర్ణం బనియొప
పాలసముద్రంబునందు భాసుకలక్ష్మీ
లోలుండు లోకపావనకరు
శాలీలుఁడు కేశవప్పనాయఁడు ఘనుఁడౌ.

జైమినిభారతమునందుఁ గూడ నీతనివంశావతార మభివర్ణింపఁబడియుండును గాని పరిషత్తునకు దొరకిన రెండు

ప్రతులయందు నవతారికాభాగము పోయినది. శేషము వేంకటపతికవి తనవంశావతారమును వర్ణించినట్లుగా నొక్క రీతిగా సారంగధరచరిత్రయందు నహల్యాసంక్రందనము నందును వర్ణించికొనిన యాతని వంశక్రమ మిట్లని తెలియుచున్నది.

"ఈకవివంశమందు మూలపురుషుఁడు కేశవప్పనాయఁడు; అతనిపుత్త్రుఁడు వేంకటనాయఁడు; అతనికుమారుఁడు పెదగురువప్పనాయఁడు; అతనిసుతుఁడు ఎల్లిసెట్టినాయఁడు; అతనితనూజుఁడు వేంకటనాయఁడు. ఈవేంకటనాయనికి వేంకటాంబయందు మీనాక్షినాయఁ డుదయించెను. ఈమీనాక్షినాయఁకునకు నలమేలమాంబయందు జైమినిభారతాదికర్త యగుసీవేంకటకృష్ణప్పనాయఁకుఁ డుద్భవిల్లెను."

ఈతఁడు తన తాత నీక్రిందివిధముగా నయ్యవతారికలయందు వర్ణించికొనెను.

సీ. ధన్యుఁ డై నృపతిమూర్ధన్యుఁ డై నిర్ధూత
దైన్యుఁ డై నృపసంఘమాన్యుఁ డగుచు
గేయుఁ డై సుజనావిగేయుఁ డై దానరా
ధేయుఁ డై విద్వద్విధేయుఁ డగుచు
ధీరుఁ డై కదనహమ్మీరుఁ డై కనకాద్రి
ధీరుఁ డై సద్గుణాహారుఁ డగుచు
శీలుఁ డై హరిభక్తిశీలుఁ డై సంగీత
లోలుఁ డై కవిబృందపాలుఁ డగుచు

గీ. సకలబాంధవసంతోషి సత్యభాషి
స్వామిహితకారి స్వజనరక్షణవిహారి
వెలయు బుధసంపదలచేత విబుధభాగ్య
దాయకుం డైనవేంకటనాయకుండు.

ఇక్కవి జైమినిభారతవచనకావ్యమునే కాక నారంగ ధరచరిత్ర మను మూఁడాశ్వాసముల వచనగ్రంథమును, అహల్యాసంక్రందన మను మూఁడాశ్వాసముల శృంగార ప్రబంధమును, రాధికాసాంత్వనమనెడి యేకాశ్వాసశృం గారప్రబంధమును రచియించెను. ఇందు మొదటిది పాం డ్యమండలాధీశ్వరుఁ డగువిజయరంగచొక్కనాథున కంకిత మొనర్చి మిగిలినవానిని శ్రీరంగస్వామికిఁ గృతియొసంగెను.

ఇందు జైమినిభారతము నైదాశ్వాసముల యాద్యంత ములయందును—

క. శ్రీరాధావరచరణాం
భోరుహభృంగాయమాన భుజకరవీరా
ధారాఖండితశాత్రవ
శూరా శ్రీవిజయరంగచొక్కనరేంద్రా.

ఇత్యాదిగాఁ గృతినాయకవర్ణనపద్యంబులును, ప్రత్యా శ్వాసాంతమునను—

"ఇది శ్రీపాండ్యమండలాధీశ్వర శ్రీవిజయరంగచొక్క నాథమహీనాథకరుణాకటాక్షసంపాదితగజతురంగమాందో ళికాప్రముఖనిఖిలసంపత్పారంపరీసమేధమాన సముఖ వీరా నాక్షినాయఁకతనూభవ" ఇత్యాదిగా గద్యములు నుండుటం

బట్టి యితఁడు విజయరంగచొక్కభూపాలునకు సమకాలికుఁ డై యాతనికిఁ గృతినిచ్చిన కేవలకవి యనియే కాక యహల్యాసంక్రందనములో శేషము వేంకటపతికవి చెప్పినట్లుగాఁ దన్ను వర్ణించికొనిన—

సీ. ధైర్యమా శౌర్యమా దాక్షిణ్యమా పుణ్య
మా నయమా జయమా ప్రతాప
మా శుభరూపమా మహితవిజ్ఞానమా
దానమా భోగమా శ్రీనిసాఘ
యోగమా యాశ్రితవ్యూహమా రక్షణ
రాజద్విలాసమా రమ్యమంద
హాసమా మహితసౌహార్దస్వభావమా
భావమా భూరిప్రభావమాన్య
గీ. నీకె తగు నంచుఁ బాండ్యభూనేత విజయ
రంగచొక్కేంద్రుఁ డత్యంతరంగసబహు
మానసామాజికత్వ మింపూన నొసఁగె
సముఖవేంకటకృష్ణేంద్ర శౌర్యసాంద్ర.

అనుపద్యముంబట్టి యితఁడు పాండ్యభూనాథుని యాస్థానమందలి ముఖ్యసామాజికులలో (ముఖ్యమంత్రులలో) నొకఁ డైనట్లును దెలియుచున్నది. మఱియు—

గీ. ...రంగధరపతి నేను సారంగధరచ
రిత్ర నచనము చేసి తత్కృతిని నాకు
నంకితము సేయుము శుభంబు లగును నీకు.

శా. వాసిన్ రంగవిభుండ నేను ధరణిన్ వాక్ప్రౌఢిమన్నిమహా
ల్యాసంక్రందనమున్ ప్రబంధము రసోల్లాసంబుగాఁ జేయ నే
నాసం గోరి వినంగ వచ్చితిఁ బ్రియం బౌనట్లు నా పేరటన్
భాసిల్లం దగ నంకితంబు నొనఁగూర్పన్ నీకు మేలౌ నికన్.

అని (శ్రీరంగనాయకుఁడు) యానతిచ్చుటయు నేనును దోడన మేల్కాంచి......పురోహితభృత్యామాత్యసామాజికవర్గంబులు గొలువం గూర్చుండి యుభయభాషాకవితావిశేషు లైన శేషము వేంకటపతి, బుణి శ్రీకృష్ణకవీంద్రులు మాకాప్తసఖులు గావునం బిలిపించి యాశుభస్వప్నంబు వినిపించుటయు" అని సారంగధరచరిత్రమునందు మహాల్యాసంక్రందనమునందును దనకుఁ గూడ భృత్యామాత్యసామాజికవర్గము గల దని వ్రాసికొనుటంబట్టి పూర్వగద్యములో వ్రాయఁబడినట్లుగా నితఁడు విజయరంగచొక్కనాథుని దయచే సామంతరా జై కొన్నిగ్రామముల కధిపతి యై యున్నట్లు కూడఁ దెలియుచున్నది.

శ్రీవిజయరంగచొక్కనాథుఁడు క్రీ. శ. 1704–1731 నడుమఁ బాండ్యమండల మేలినవాఁ డగుటచే (ఆం. సా. పత్రిక, సంపుటము 2. 220) మనకవికూడ నక్కాలము ననే యుండె ననుట స్పష్టము.

ఇవ్విధముగా నీకవి నీతనికాలమును దెలిసికొనిన పిదప నీతనిప్రకృతకృతిని గూర్చి యిక్రిందివిధముగాఁ దెలియ నగును.

జైమినిభారతము.

ఇది యయిదాశ్వాసముల వచనకావ్యము. ఇది సంస్కృతమున జైమినిభారత మనిపిలువఁబడు నశ్వమేధపర్వమునకుఁ దెలుఁగు. సంస్కృతమున నశ్వమేధపర్వ మొక్కటియే మిగిలినట్లు ను, దక్కినపర్వము లన్నియు నశించినట్లు ను, గాకున్నచోఁ జైమిన్యశ్వమేధపర్వ మనియే కాక జైమిని భారత మని పే రేల వచ్చు ననియుఁ గొందఱు తలంచెదరు, గాని యది యెంతవఱకు సత్యమో యూహింపరాదు. జైమినిభారతములో మిగిలినపర్వములు గొన్ని కల వని గాని, యవి నశించిన వని గాని యశ్వమేధపర్వముఁ దెలిఁగించిన పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి గాని, యీ వేంకటకృష్ణప్పనాయఁకుఁడు గాని, యెందును జెప్పియుండలేదు. అశ్వమేధపర్వమునఁ గొన్నివిశేషాంశములను జెప్పఁదలఁచి వ్యాసునియశ్వమేధపర్వము కంటె వేఱుగా నతనిశిష్యుఁ డగు జైమిని యీయశ్వమేధపర్వ మొక్కటియే రచియించి యుండు నని మఱికొందఱు తలంచెదరు. ఏమయిన నేమి జైమినిభారత మనుపేర నీయశ్వమేధపర్వ మొక్కటియే లోకమున విఖ్యాతిం గాంచుచున్నది.

ఈకవి యీయశ్వమేధపర్వమును వచనముగా రచియించునపుడు "ఇది శ్రీసముఖమీనాక్షీనాయఁకతనూభవ వేంకటకృష్ణప్పనాయఁకప్రణీతం బయినజైమినిభారతంబునం దశ్వమేధపర్వంబునందుఁ బదునాల్గవయధ్యాయము" అనునట్లు

గా నధ్యాయక్రమమున గద్యములు వ్రాయుటంబట్టి సంస్కృతాశ్వమేధపర్వమునుగూడఁ జూచినాఁడని చెప్పవలసి వచ్చినది. కాని వచనరచనమంతయుఁ బదములు, వాక్యములు, సమాసములు ప్రయోగించుటలోఁ గూడఁ బిల్లలమఱ్ఱి పినవీరభద్రుని పద్యకావ్యమునే వచనశైలిలో వ్రాసెనని చెప్పఁగలదు. కాని, కవి యం దందు, విశేషముగా శృంగారవర్ణనాసందర్భములయందును, సామాన్యముగా యుద్ధవర్ణనములయందు, నాసంస్కృతాంధ్రకావ్యములను రెంటినిగూడ మీఱి యథేచ్ఛముగాఁ గల్పనము గావించి స్వకవిత్వమునుగూడఁ గొంతవఱ కిందుఁ జొనిపెను. మఱియు మూలమును నాంధ్రజైమినిభారతపద్యకావ్యమును గూడ మీఱి వర్ణనాతిరేకంబునను గథితకథనంబునను గ్రంథమామూలాగ్రముగాఁ బెంచి వ్రాసెను. ఈపై విషయంబుల కీక్రింద నుదాహరణంబు లిచ్చెదను.

గీ. పంకనిర్మగ్న మగుగోవుఁ బరికరంబు
సుకరముగ నుద్ధరించు గోపకునిమాడ్కి
ముదము దైవాఱ నుద్ధరింపుదువు గాక
పంకనిర్మగ్ను నన్ను గోపాలతిలక. — వీరభద్రుఁడు.

పంకనిర్మగ్నంబైనధేనువును గోపాలకుచందంబున శోకమగ్నుల మైనమమ్ము నీ వుద్ధరింపుము.

వేం. కృ. నాయుఁడు.

చ. పుడిసెఁడునీటిచే నడఁగిపోయెడు ధూళికి గాలమేఘముల్
దోడరునె తెప్పవేయఁ జెడుదోమలమీఁద సుపర్ణుఁ డెత్తిపోఁ
గడఁగునె యీసుధన్వరథికప్రభుఁ డెన్నఁగ మీకు నీడుగాఁ
డుడుగుఁడు సంభ్రమం బితని నోర్చెదఁ దెచ్చెద నధ్వరాశ్వమున్. వీర.

పుడిసెండునీళ్లు చల్లిన నడంగిపోయెడు ధూళికిఁ గాల మేఘంబులు వర్షింపవలెనే: తెప్పవేసినం బడిపోవు దోమల మీఁద గరుత్మంతుం డెత్తి రావలయునె? ఈరాజు మీకు సమానుండు గాఁడు. మీ రితనిమీఁదఁ జేయిచేసికొనం బనిలేదు. నేనె యీతనిం గెల్చి యధ్వరాశ్వంబుఁ దెచ్చెద.

వేం. కృ. నాయఁకుఁడు.

మఱియు వీరభద్రకవి యుపయోగించిన లోకోక్తులు, జాతీయపదములు, నిందు సరిగాఁ గనఁబడుచున్నవి.

క. కలనన్ మనవారెల్లను
బొలిసిరి నీదుర్నయమునఁ బోయినయవి పె
ద్దలె నాకును "స్త్రీబుద్ధిః
ప్రలయాంతిక" యనెడిపలు కబద్ధం బగునే?—వీరభద్రుఁడు.

నీదుర్నయంపుబోధనచే యుద్ధంబునకుం బోయిన నాకుం గలవా రెల్లను సమసిపోయిరి. 'స్త్రీబుద్ధిః ప్రలయాంతిక' యనెడు పలుకే యథార్థం బయ్యె. వేం. కృ. నాయ.

క. అతిమించి చొచ్చినిల్లటు
చెఱిచితి వీఁకఁ బుట్టినిల్లు చెఱిచెద నని యే
పఱతెంచితి రెండిండ్లకుఁ
"జెఱుపనచేఁట"యి యేమి చేసెడి దనుచున్.—వీరభద్రుఁడు.

పాపాత్మురాలా! చొచ్చిన యిల్లు చెఱిచినదియుంగాక పుట్టినయిల్లునుం జెఱుప వచ్చితివే? నీవంటి చెఱుపనచేట మాయింట నుండం దగదు. వేం. కృ. నాయకుండు.

క. చిలువదళవాయు లప్పుడు
"తలబీకనకాయ" లై "యథాయథలై" కా
కులువత్తులు నై మొనతల
నిలువక శేషాహికడకు నెఱచెడి పాఱన్.— వీరభద్రుఁడు.

చిలువదళంబులు తలబీకనకాయలు యథాయథలు కకాపికలు నై మొనగట్టంజాలక శేషాహిచెంగటికింబఱచిన. వేం. కృ. నాయకుండు.

క. నారద సదాచారంబుల
ముఱు వగుచున్ బ్రథమపాద-మునఁ గలిమహిమం
బెరుఁగును వడ్లును గలిపిన
కరణిన్ వర్ణాశ్రమములు కర్తరి గలయున్.—వీరభద్రుఁడు.

అందులోనఁ బ్రథమపాదంబున దురాచారంబులు సదాచారంబులు సమ్మిశ్రంబులై పెరుఁగునవడ్లు గలిపిన కరణి వర్ణాశ్రమధర్మంబులు సంకరంబు లగు. వేం. కృ. నాయకుండు.

వీరభద్రకవి 19 పద్యములలో వర్ణించినస్త్రీమాంటల వృత్తాంత మిందు 19 పుటలకు సరిపడునంతగా వివరింపఁ బడినది. ఇందుఁ బ్రమీల యర్జునునిరాక విని యాతని మదిలోఁ గామించుటయు, యుద్ధముఁ జేసి యతనిని వశపఱచి కొని యింటికిఁ దీసికొని వచ్చి యాతనితోఁ గ్రీడించుటయును

మిక్కిలి పెంచి వ్రాయఁబడినది. ఆభాగ మిప్పటిలోకమునకు రుచింప దని యిందు ముద్రించుట మాని వేసినారము. ఇదిగాక పరిషత్తునకు వచ్చిన రెండుప్రతులలో నొక్కప్రతి యందుమాత్రమేయట్టి విశేషవర్ణనము కనఁబడుచున్నది.

వచనశైలి.

దాదాపు రెండువందలసంవత్సరములక్రిందట మన భాషలో వచనకావ్యములే మిక్కిలి యరుదుగా నున్నట్లు కనఁబడుచున్నది. అక్కాలమునందుఁ బండితులను గవులను బోషించి యాంధ్రగ్రంథములు వ్రాయించుటయే కాక తానుఁగూడ శ్రీరంగమాహాత్మ్య మాఘమాహాత్మ్యములనెడి పెద్దవచనగ్రంథములను రచియించిన కవిరాజై భాషకుఁ జేయూఁత యొసంగిన మహాత్ముఁడు విజయరంగచొక్కనాథుఁడు. ఈతఁడు వచనకావ్యములను రచియించుటఁ గనియే "యథా రాజా తథా ప్రజా" యనునట్లాతని యాశ్రితులును వచనరచనకుఁ గడంగి యుందు రని తోఁచుచున్నది. అట్టివారిలో నక్కాలమున విజయరంగచొక్కనాథుని వలె నీ వచనరచనఁ గావించినవారిగ్రంథములలో నీకవి వచనకావ్యములే ప్రధానములై కనఁబడుచున్నవి. కొంచె మెచ్చుతక్కువగా వచనకవిత్వ మంకురించిన యక్కాలమునకు నిక్కాలమునకు వచనరచనయందును, దానిశైలియందును, నేదో కొంచెము భేదము గన్పట్టుట యాశ్చర్యకరముగాదు. చక్కఁగఁ బరిశీలించినచోఁ జిన్నయసూరి

నీతిచంద్రికశైలివంటి ప్రౌఢశైలి యప్పుడు నిప్పుడుఁ గూడ నెందును గానరాదు, గాని, సామాన్యదృష్టితోఁ బరికించిన చోఁ నిప్పటివచనశైలి కీగ్రంథశైలి తీసిపోదని నాయభిప్రాయము. కాని, కథాసందర్భమును బట్టి కథాపాత్రముల నామములకు సర్వనామవాచకపదము లుపయోగించుటచే సరిపోవుచుండఁగా మరల మరల నాయాపాత్రముల నామములనే తఱుచుగా నుపయోగించుటయు, యమకవృత్త్యనుప్రాసాదిశబ్దాలంకారములకై కథాప్రసక్తి కభ్యంతరముగా విశేషణబాహుళ్యమును గల్పించుటయు, గ్రంథమామూలాగ్రముగా నెఱసున్నలే కాని యరసున్న లుపయోగింపకుండుటయు, మొదలుగా నీతనివచనరచనశైలియందుఁ గొన్ని విశేషాంశములు గన్పట్టును.

ఇందలి ప్రయోగవిశేషములు.

'నేను' అనఁదగినచోటఁ "దా" ననుటయు, 'చెప్పెను' అనఁదగినచోట్లఁ 'బలుకరించె' ననుటయు, 'వానితోఁ' అనుటకు "వానితోడంగూడ" ననుటయు నీకావ్యంబున సర్వత్ర కనుపట్టును. కాని, యిందు "నేను" అనుటకు బదులుగాఁ "దా" నని యుపయోగించినస్థలముల నే ననిసవరింపఁబడినది "నేను" అనుటకు బదులుగా "తాను" ప్రయోగ మాకాలమునఁ బుట్టిన వచనగ్రంథములలోఁ దఱచు కనఁబడును.

మాకు లభించిన రెండుప్రతులును గూడ దక్షిణదేశమందే వ్రాయఁబడిన వగుటచే సామాన్యముగాఁ దాటాకులపుస్తకములలో నుండు లేఖనదోషములకన్న నిందు మఱికొన్ని వ్రాఁతతప్పులు* మాత్రమే కలవు, గాని, కవి దాక్షిణాత్యుఁ డగుటచేఁ గలిగినయపప్రయోగములు విశేషముగా లేవు. అట్టి చిన్నచిన్నదోషము లిందు సవరింపఁబడినవి. 'పెట్టుక' మొదలగు నసాధుప్రయోగములు కొన్ని ప్రాచీనగ్రంథములయందువలె నిందును గలవు.

కావ్యప్రశంస.

ఇందలికథ మిక్కిలి పవిత్రమయినదగుటచేతను, భగవంతుఁ డగు శ్రీకృష్ణుఁడు ధర్మరాజు నశ్వమేధంబునకు సంరక్షకుఁడై కథ కామూలాగ్రముగా సంబంధించి వర్ణింపఁబడుటచేతను, పెక్కండ్రు పుణ్యపురుషు లగురాజుల పావనజీవితము లిం దుదాహరింపఁబడుటచేతను, భక్తిజ్ఞాన వైరాగ్యంబులను బోధించు పెక్కువిషయంబు లిందు వర్ణింపఁబడుటచేతను సర్వజనసుబోధక మగుశైలిలో నున్నయీగ్రంథ మాంధ్రదేశమందలి యెల్లరకుఁ బఠనీయముగా నుండు ననినాయభిప్రాయము.

మల్లాది సూర్యనారాయణశాస్త్రి.

---

* అనుబంధము చూడుఁడు.

విషయసూచిక.

ప్రథమాశ్వాసము.

	పుట.
కథాప్రారంభము	1
ధర్మరాజునొద్దకు వేదవ్యాసుండు వచ్చుట . . .	2
వ్యాసుండు ధర్మరాజు నశ్వమేధం బొనర్పుమనుట . .	3
వ్యాసుఁ డశ్వమేధవిధానంబుఁ జెప్పుట . . .	5
వ్యాసుఁ డశ్వమేధహయం బున్నతావుఁ జెప్పుట . .	8
భీముఁ డశ్వముం దెత్తు నని ప్రతిన పట్టుట . . .	8
శ్రీకృష్ణుండు హస్తినాపురమునకు వచ్చుట . . .	12
శ్రీకృష్ణుఁడు భీముని తేజంబు వృద్ధినొందింప యత్నించుట .	15
భీముఁ డశ్వమునకై భద్రావతి కేగుట	18
అశ్వమేధాశ్వము నీరుద్రావ వచ్చుట	23
మేఘవర్ణుఁడు గుఱ్ఱము నపహరించుట	25
యౌవనాశ్వుఁడు భీమాదులపై యుద్ధమునకు లేచుట . .	28
వృషకేతుండు భీముని నిలిచి చూడు మని కోరుట. . .	29
యౌవనాశ్వవృషకేతుల యుద్ధము	31
వృషసేనుండు మూర్ఛిల్లుట	35
సువేగభీమసేనులగదాయుద్ధము	37
యౌవనాశ్వుఁడు భీమాదులతో భద్రావతి కేగుట . .	41
ప్రభావతి మాహాత్మ్యము	44

	పుట.
వ్యాసుఁడు మరల వచ్చుట	51
ధర్మజుపనుపున భీముఁడు ద్వారక కేగుట	55
శ్రీకృష్ణుని భోజనసమయము	56
శ్రీకృష్ణభీముల సంభాషణము	58
శ్రీకృష్ణుఁడు సకలజనులతో హస్తినాపురమునకు వచ్చుట	60

ద్వితీయాశ్వాసము.

శ్రీకృష్ణుఁడు హస్తినాపురంబునకు వచ్చుట	67
అనుసాళ్వుఁడు సవనహయము నపహరించుట	69
వృషకేతుఁ డనుసాళ్వునిఁ బట్టితెచ్చుట	71
ప్రవీరుఁ డశ్వమును బట్టుట	76
వృషకేతుప్రవీరుల యుద్ధము	78
నీలధ్వజుండు పరాక్రమించుట	79
అర్జునుఁ డగ్నిదేవుని స్తుతించుట	81
అగ్నిదేవుని వృత్తాంతము	84
జ్వాలాదేవి సోదరునికడ కేగుట	90
గంగ యర్జును శపించుట	92
జ్వాలాదేవి చనిపోవుట	93
అధ్వరాశ్వము జాతి నంటుకొనుట	93
అర్జునుండు సౌబరియాశ్రమమునకుఁ బోవుట	94
ఉద్దాలకమహర్షి కథ	95
హంసధ్వజుఁ డశ్వమును బట్టవచ్చుట	100
సుధన్వుఁడు సంగరమునకు రాక జాగుసేయుట	101
సుధన్వుఁడు తప్తతైలకటాహమున దిగుట	105
దేవతలు సుధన్వునిపైఁ బూలవాన గురియుట	106

	పుట.
హంసధ్వజుం డధ్వరాశ్వమును బట్టించుట	108
వృషకేతుసుధన్వుల యుద్ధము	110
ప్రద్యుమ్నుండు సుధన్వునిం దాఁకి మూర్ఛిల్లుట	112
కృతవర్మాదులు సుధన్వునిం దాఁకుట	112
అర్జునసుధన్వుల యుద్ధము	115
శ్రీకృష్ణుం డర్జునునకుం బ్రత్యక్ష మగుట	116
అర్జునసుధన్వుల ప్రతిజ్ఞలు	118
అర్జునుండు సుధన్వునితల ద్రుంచుట	121
సురథుం డర్జునునితో యుద్ధముసేయుట	125
అర్జునుండు సురథుని జంపుట	129
శ్రీకృష్ణుండు గరుత్మంతునిం దలంచుట	131

తృతీయాశ్వాసము.

సవనాశ్వము గోడిగయై పులియగుట	137
స్త్రీమండలవృత్తాంతము	138
ప్రమీలావిజయుల యుద్ధము	145
ప్రమీల యర్జును మోహించుట	146
ప్రమీల యర్జును నంతిపురంబునకుం గొనిపోవుట	147
వృక్షదేశవృత్తాంతము	148
అర్జునుండు భీషణుం జంపుట	152
కుశలవోపాఖ్యానము	165
లక్ష్మణుండు సీతాదేవిని వనంబునకుం గొనిపోవుట	174
లక్ష్మణునియొద్ద సీత దుఃఖించుట	177
వాల్మీకి సీతను తనయాశ్రమమునకుం గొనిపోవుట	179

పుట.

కుశలవుల జన్మవృత్తాంతము 181
శ్రీరాముఁ డశ్వమేధముచేయ హయంబును విడుచుట . . 183
యాగీయాశ్వమునకై లవశత్రుఘ్నులు పోరాడుట . . 185
సీత లవునిఁ దలఁచి విచారించుట 188
కుశలవులపాటవము రామునకు భటు లెఱింగించుట . . 192
రాముఁడు సౌమిత్రిని యుద్ధమునకుఁ బంపుట . . . 193

చతుర్థాశ్వాసము.

సూర్యుఁడు లవునకు వి ల్లొసంగుట 196
లవుండు రుషిరాక్షునిఁ జంపుట 197
కుశలక్ష్మణుల యుద్ధము 199
లక్ష్మణుండు మూర్ఛితుండగుట 200
సౌమిత్రిమూర్ఛ రాముఁడు దుఃఖించుట . . . 202
భరతాదులు యుద్ధమునకు వచ్చుట 204
భరతుఁడు మూర్ఛిల్లుట విని రాముఁ డరుదెంచుట . . 207
శ్రీరాముఁడు మూర్ఛిల్లుట 209
వాల్మీకి శ్రీరామాదులమూర్ఛ దేర్చుట 211
వాల్మీకి రాముని స్తుతించుట 212
శ్రీరాముఁడు పుత్రులం గొని యయోధ్యకుఁ జనుట . . 214
సువేగబభ్రువాహనుల యుద్ధము 217
వృషకేతనబభ్రువాహనుల యుద్ధము 220
అర్జునబభ్రువాహనుల యుద్ధము 225
అర్జునుఁడు శిరంబు దెగి పడుట . . . 227
అర్జును [illegible] [illegible] చింతించుట . . 228

	పుట.
చిత్రాంగద యులూచియు యుద్ధభూమికేగుట	230
ఉలూచి మృతసంజీవనమణికై నాగలోకమునకుఁ బుండరీకునంపుట	234
బభ్రువాహనుండు సర్పములతోడి యుద్ధంబునకేగుట . . .	238
బభ్రువాహనుఁడు సంజీవనమణిఁ దెచ్చుట . . .	240
నాగకుమారు లర్జునుతల నపహరించుట . . .	240
శ్రీకృష్ణుండు మొదలగువా రర్జునునిదగ్గఱకు వచ్చుట . .	242
కుంతి యర్జునుమరణంబునకు విలపించుట . . .	243
శ్రీకృష్ణుఁ డర్జునుని బ్రదికించుట	245
శ్రీకృష్ణాదులు మణిపురంబున కేగుట	246
తామ్రధ్వజుఁడు పాండవాశ్వంబును బట్టించుట. .	
ప్రద్యుమ్నాదివీరులు తామ్రధ్వజునితోఁ బోరాడుట	
తామ్రధ్వజుండు యాగహయంబు గొని పురంబునకుఁ బోవుట .	259
శ్రీకృష్ణుఁడు మాయారూపంబున నర్జునునితో రత్నపురంబు సేరుట	261

పంచమాశ్వాసము.

వీరవర్మ గుఱ్ఱంబును బట్టుట	274
కృష్ణుం డర్జునునకు యమవృత్తాంతంబుఁ జెప్పుట	275
అర్జున వీరవర్మల యుద్ధము . . .	280
చంద్రహాసోపాఖ్యానము . . .	283
చంద్రహాసుఁడు పుళిందునకు దొరకుట . .	287
అరిష్టలక్షణంబులు	299
చంద్రహాసునకుఁ గుంతలరాజ్యపట్టాభిషేకము .	301
చంద్రహాసుఁడు దుష్టబుద్ధిని మదనుని బ్రదికించుట .	304
చంద్రహాసుని కొడుకులు యాగాశ్వంబులం బట్టుట . .	306

SREE VEMANA ANDHRA ... NILAYAM HYDERABAD 1923

	పుట.
శ్రీకృష్ణాదులు బకదాల్భ్యునిఁ జూచుట	309
బకదాల్భ్యుఁడు విష్ణుమహిమ సెప్పుట	312
అర్జునుని రాక విని సైంధవుని పుత్రుండు మృతుం డగుట	314
కృష్ణార్జునులు హస్తినాపురమునకు మరలుట	316
కృష్ణుండు ధృతరాష్ట్రునకు వచ్చినరాజుల నెఱింగించుట	318
ధర్మరా జశ్వమేధం బొనరించుట	320
అశ్వమేధవిధి	321
భీముని పాకమహిమ	324
కృష్ణధర్మరాజులు బ్రాహ్మణవివాదము వినుట.	325
సూర్యుఁడు [illegible]	[illegible]6
లవుండు [illegible]	

శ్రీరస్తు.

జైమినిభారతము.

ప్రథమాశ్వాసము.

—* కథాప్రారంభము. *—

*అభ్యుదయపరంపరాభివృద్ధిగా నారచియింపంబూనిన జైమినిభారతంబునం దశ్వమేధపర్వవచనకావ్యంబునకుఁ గథావిధానం బెట్టి దనిన శ్రీమంతుండును సామ్రాజ్యలక్ష్మీమఘవంతుండు నైనజనమేజయమహీకాంతుండు, వేదవ్యాసమహామునీంద్రశిష్యుండును సకలపురాణేతిహాసవ్యాఖ్యానవిఖ్యాతుండును మేధాసాంద్రుండు నైనజైమినిమహామునీంద్రునిం గనుంగొని, మహాత్మ! సకలపాపహారంబును బవిత్రంబు నైనకురుక్షేత్రంబునందు శత్రుసంహారకుండు శరధిగంభీరుండును గురువంశకర్తయు ధర్మమయుండు నైనపాండవాగ్రజుండు కపటవర్తను లగు ధృతరాష్ట్రకుమారులఁ జతురంగబలసమేతంబుగఁ బదునెనిమిదిదినంబుల

---

*మంగళాచరణాది కృత్యాదిపద్యములు పరిషత్పుస్తకములు దేనిలోను లేవు.

బోన రణాంగణంబున గీటడఁగించి చతుస్సముద్రముద్రితం బైనభూమండలంబు నేకచ్ఛత్రంబుగ నేలుచు నశ్వమేధయాగం బొనరించె నని యెఱింగించితివి. ఆకథ సవిస్తరంబుగ నెఱింగింపవలయు ననిన జైమినిమునీంద్రుండు జనమేజయనరేంద్రు నవలోకించి, రాజేంద్రా! భవదీయపితామహుం డైనధర్మనందనుండు విశ్వవిఖ్యాతంబుగా నశ్వమేధంబు గావించినక్రమంబు వివరించెద వినుము. సకలశాస్త్రపారీణుండు సంగరధురీణుండు సర్వజ్ఞుండు నైనభీష్ముండు స్వర్గలోకంబున కరిగినయనంతరంబ యుధిష్ఠిరుండు శోకవ్యాకులిత

—* ధర్మరాజునొద్దకు వేదవ్యాసుఁడువచ్చుట. *—

మానసుండై చింత నొందుచున్నసమయంబున వేదశాస్త్రపురాణేతిహాసవిద్యావిశారదుండును దనుప్రభావిజితనీరదుండును త్రైలోక్యపూజితుండు నైనవేదవ్యాసమునీంద్రుండు విజయంబుసేయుటయు ధర్మనందనుం డెదుర్కొని సాష్టాంగంబుగా నమస్కరించి యర్ఘ్యపాద్యాదిపూజావిధానంబు లొనరించి కనకపీఠంబున నునిచి యిట్లనియె. మహాత్మా! మేము రాజ్యంబుకొఱకుఁ గ్రూరత్వంబున గొడిగట్టి పితామహుం డైనభీష్ముని ధనురాచార్యుం డగుద్రోణుని నగ్రజుం డైన కర్ణుని వధించితిమి. ఈపాపం బేమిటం దీఱు? అక్కట! భూవలయంబునం గలభూసురులు మాయన్న యైనకర్ణునిచే వలసిన వస్తువ్రాతంబులు గైకొని హర్షబాష్పంబులు గురియు బహువిధంబులుగా స్తోత్రంబులు సేయుచు నున్నవార లం

ఱిప్పుడు శోకజనితం బైనకన్నీరు గురియ రోదనంబులు సేసెదరు.

భీష్మద్రోణకర్ణాదు లైనగురుజనులు చూడనిరాజ్యభోగంబు కన్నులు లేనికాయంబుకరణి సౌఖ్యావహంబు గానేరదు. పిన్ననాఁటనుండి మమ్ముఁ బెంచి పెద్దలఁ జేసిన భీష్మాదులం జంపి చేకొన్నరాజ్యంబు నే నొల్ల. భీమునిం బట్టంబు గట్టి, కానలకుం జని తపం బొనరించి పాపంబునం బెడఁబాసెద. మునీంద్రా! ఏతపంబుల నేజపంబుల నేతీర్థయాత్రల నేయాగంబుల జ్ఞాతివధం బొనర్చినపాతకంబు దీఱు? శుభంబు చేకూరు? అనిన విని సాత్యవతేయుండు

—* వ్యాసుఁడు ధర్మరాజు నశ్వమేధంబొనర్పుమనుట. *—

కౌంతేయుం గనుంగొని, ధర్మనందనా! నీవు బంధువధం బొనర్చినపాపంబు దీఱ నశ్వమేధయాగంబుఁ జేయుము. సుగుణసాంద్రుండైన రామచంద్రుండు పులస్త్యవంశంబునం బుట్టినరావణునిం ద్రుంచినపాతకంబు దీఱ హయమేధంబు గావించె. సంగరంబువలనఁ గలుగుజయంబు క్షత్రియునకు విడువందగదు. నీతమ్ము లొక్కొక్కరుండు పెక్కుసమరంబులం గెల్పులు గన్నవారలు, యావ ద్ధనంబు నీకుం గైవసంబు గావునఁ దక్కినతలంపులు మాని నియమముం బూని యశ్వమేధంబున కారంభంబు సేయుము. అనిన విని ధర్మనందనుండు డెందంబున దైన్యంబు దోఁపఁ గృష్ణద్వైపాయనుం గనుంగొని, "మునీంద్రా! నిన్నటిసమరంబున రాజపీన

తెల్లను సమయుటం జేసి వారలకుమారులు తల్లిదండ్రులం
బెడఁబాసినవారలు కావున దయసేయం దగినవారలు.
తక్కినప్రజ లందఱు సుయోధనున కప్పనంబు లొసంగి
నొచ్చి యున్నవారలు. నేను నూతనంబుగఁ బట్టంబు గట్టు
కొన్నాఁడ. కావున నిమ్మహాయాగం బొనరింప రొక్కం
బెక్కడ నున్నయది? రాజవంశంబుల నెల్ల సమూలంబుగాఁ
బెల్లగించి కులంబు నీఱుసేసిన యట్టిదోసంబునం గాక ప్రజా
లం బాధించి ధనంబులు దండుగలుం గొనం దలంచితిమేని
గోరుచుట్టుపై రోఁకటిపోటు చందంబున జనులు నొవ్వఁడరి
నన్నుం జూచి నవ్వుదురు. కావున బహుద్రవ్యసాధ్యం బైన
యశ్వమేధంబుఁ గావింప శక్తి లే" దనిన విని పారాశర్యుండు
భరత కులధురీణుం జూచి "తొల్లి మరుత్తుం డను మహీపా
లుండు బహుసువర్ణకం బనుయాగంబు గావించి యపారంబు
గా దక్షిణ లొసంగిన బ్రాహ్మణులు తమ మోపినకొలంది మో
త్తుకొని తక్కిన ద్రవ్యంబులు హిమశైలంబుచేరువం బాఱ
వైచి పోయిరి. కావున నాధనంబు నీకుం దొరకెనేని యధ్వ
రంబుఁ జేయవచ్చు" ననిన విని ధర్మనందనుండు "మునివరే
ణ్య! తొల్లి మరుత్తుండు బహుసువర్ణయాగంబుం జేసి భూసు
రుల కొసంగినద్రవ్యంబు వారల సొమ్ము కావునఁ దద్ద్రవ్యంబు
దానంబుసేసి తరింపంగోరుట గొప్పఱాయి దెప్పగా వైచి
కొని సముద్రంబు నీఁదఁ దలంచినచందం బగు. కులంబుఁ
ద్రుంచుటయు గురువులయెడఁ గల్లలాడుటయుం గాక

బ్రాహ్మణద్రవ్యం బపహరించితిమేని పాతకంబునకుం గొ అంత యేమి?" అనిన విని మునికులతిలకుండు కురుకులతిలకుం గాంచి మున్ను పరశురాముండు కశ్యపునకు దానంబు సేసినభూమండలంబు రాజులెల్లం బరిత్యజించిరె! విప్రులకు మోహం దరంబు గాక పరిత్యజించిన ధనంబు రాజులకుం గాని తక్కినవారలకుఁ బనిలేదు. అదియునుం గాక మరుత్తుండు యజ్ఞ సమయంబున నుచితంబైన ధనంబు దక్షిణ లిచ్చి మిగిలిన ద్రవ్యంబు కొల్లవిడిచిన బ్రాహ్మణులెల్లఁ దనిసి విడిచినయర్థంబుఁ గైకొనుటకై వెఱవం బనిలేదు. ఇందు నిమిత్తంబుగా నీమనంబున నావంతయు వంత వలనదు. అశ్వ

—* వ్యాసుఁ డశ్వమేధ విధానంబుఁ జెప్పుట. *—

మేధ్వరంబు గావించు విధానంబు సావధానంబుగా నాకర్ణింపుము. వేదశాస్త్రపురాణాదివిశారదులును, సత్కులప్రసూతులును, గోవిందపాదారవిందకందళితాంతరంగులును, యశోవిరాజితులు నైనబ్రాహ్మణు (1)లఱువదివేలు ఋత్విజులు గావలయు. అందు నొక్కొకరికి హాటకసమేతంబుగా నొక్కఘోటకంబును, నొక్క (2)మనపుటినుంగును, నొక్క సురదంబును, బయఁడేసి రత్నంబులును, వెయ్యేసి యావులును, నావునకు నూఱేసి గొఱ్ఱెలుంగా దక్షిణ యొసంగి నియమంబునం దురంగమంబును బూజించి విడువవలయు. ఆ మొదటిదినంబున నీయందగిన దక్షిణాప్రకారంబు దెలి

(1) మూఁరుపదివేలు—పా. (2) మూలములో మనము నేసుంగు అనియున్నది.

౭౩. ఇంక నశ్వలక్షణంబు వినుము. చంద్రచందనకుంద కుసుమసవర్ణం బైనవర్ణంబును, నింద్రనీలంబుసవి యగుచెవియును, గనకగుచ్ఛంబుంబోలు పుచ్ఛంబును, గలిగి నిరాఘాటఘాటీపాటవం బైనయశ్వరత్నం బశ్వమేధయోగ్యం బగు. చిత్రాపౌర్ణమీదినంబునఁ జతురంగంబుల జతనంబుసేసి తమ్ముల నేనియుం గొడుకుల నేనియుఁ దద్రక్షణంబునకు నియోగించి కనకపట్టికయందుఁ దనబిరుదాంకంబులతో, "వీరుండు శూరుండు ధారణిం గలిగి రేని యీహయంబుం బట్టుం" డని వ్రాసి యాసువర్ణపట్టంబు దేజినుదుటం గట్టి యథేచ్ఛంబుగా విడిచి, యాహయంబు మూత్రపురీషంబులు విసర్జించు తావుల గోసహస్రంబు దక్షిణగా హోమంబు సేయం బనిచి సంవత్సరంబు సంకల్పంబు సేసికొని యయ్యశ్వంబు మగుడ వచ్చుపర్యంతంబు నియమంబుతోడంగూడ దీక్షించి భార్యయుం దానును బ్రహ్మచర్యంబు నధక్షి[illegible] నంబునుం జేయుచు నసిధారావ్రతంబుగా నుండ వల[illegible] మున్ను దేవేంద్రుండు నూ ఱశ్వమేధంబులు సేసెం గా[illegible] నియమంబు సలుపనేరం డయ్యె. పాండునందనా! నీవు [illegible] యమంబుతోడ నొక్కయాగంబు గావించితివేని సకలపా[illegible] హరం బగు. వలరాజువలలకుం దగులని భీష్ముం డో[illegible] రుండు దక్కఁ దక్కినవారలకుఁ గూడదు. కావున నిమ్మ[illegible] ధ్వరంబు రాజు లెవ్వరుం జేయ నోపరు. నీకు శక్యం [illegible] చేయుము.

అనిన విని ధర్మనందనుండు కృష్ణద్వైపాయనుం గనుం గొని, మహాత్మా! నాతమ్ములు భీమార్జుననకులసహదేవులు యుద్ధంబున మిగుల డస్సి యున్నవారలు. మహాబలుండును, గర్ణసూనుండు నగువృషకేతుండు బాలుండు. ఘటోత్కచుండు మాకార్యంబున హతుం డయ్యె. అతనితనయుం డగుమేఘవర్ణుం డత్యంతబాలుండు గావున వారల నిరువురఁ గయ్యంబునకుం బంపుట యయుక్తంబు. ఎవ్వాని ప్రాపునఁ గవ్వడి వైరిరాజులం బరాజయంబు నొందించె నాగోపాలదేవుండు దూరంబున నున్నవాఁడు. కావున నియ్యాగం బేవిధంబునఁ జేయఁగలవారము. అనిన విని భీమసేనుం డగ్రజు నవలోకించి "శ్రీకృష్ణదేవుండు సర్వత్ర పరిపూర్ణుండు. ఇచ్చట లేఁ డన నేటికి? అద్దేవుం దలంచినమాత్రంబునఁ బాపంబులు తూ పడంగు. సుకృతంబులు లభించు. అదియునుంగాక యొక్క రహస్యంబు వినుము. శ్రీవాసుదేవుని యానతిప్రకారంబున మనము కయ్యం బొనర్చి జ్ఞాతివధం బొనర్చితి మింతియ కాని స్వతంత్రంబుగఁ జేసినవారము కాము. కావున మనకు లేశమాత్రంబును దోషంబు లేదు. అశ్వమేధంబు సేసిన నేమి చేయకున్న నేమి? శ్రీకృష్ణదేవునిపాదాంబుజంబులు నమ్మి యున్న మోక్షంబునకుం గొఱంత లేదు. ఎట్లయినను రాజలోకంబులోఁ గీర్తి కలుగుటకు నై యీయాగంబు సేయ నుద్యోగింపుము. హయమేధయోగ్యం బైనగుఱ్ఱం బీలోకంబున నున్నం జాలు. ఎం

—* వ్యాసుఁ డశ్వమేధహయం బున్నతావుఁ జెప్పుట. *—

తవా రెదిరించినను జయించి తెచ్చెద" ననిన వ్యాసమునీం
ద్రుండు ధర్మరాజుతో ని ట్లనియె. మహీపాలకా! భీముని
వాక్యంబు నిజంబు. భద్రావతీపురంబున యౌవనాశ్వుం
డనురాజు రాజ్యంబు సేయుచున్నవాఁడు. అతనిలాయం
బున నేఁజెప్పినలక్షణంబులు గలగుఱ్ఱం బొక్కటి యున్న
యది. పదియక్షౌహిణులసైన్యంబు రేయునుం బవలు ఱెప్ప
వేయక దానిం గాపాడుచునుండుఁ గావునఁ బోతుటీఁగ కేని
యుం బొలయఁగూడదు. అత్తురంగంబు నీకుం దక్కునేని
జన్నంబు నెఱవేఱు. అనిన విని భీమసేనుం డి ట్లనియె.

—* భీముఁ డశ్వముం దెత్తు నని ప్రతినపట్టుట. *—

అన్నా! దేవాసురు లడ్డ మైరేనియు జయించి యౌవనాశ్వు
నింట నున్నయాశ్వమేధాశ్వంబుం దెచ్చెద. మీపాదంబు
లాన. అట్లు సేయ నైతి నేని, వేదఘోషంబు లేని గ్రామంబు
నందును శివాలయంబు విష్ణుదేవుని దేవళంబును లేని
స్థలంబునందును వాసంబుసేయువాఁడును, దల్లిదండ్రులకు
(1)రెండు దలంచిన దుర్జనుండును, జనంబు వాడనిబావిలోని
జలంబు గ్రోలినవాఁడును, బ్రాహ్మణులతోడ నసత్యంబు
పలికినవాఁడును, నప్పు దీసికొని యటమటించిన యధముం
డును, విశ్వాసపాతకియుఁ బోవుగతులకుఁ బోవంగలవాఁడ.
అని పలికి యూరకున్న తమ్మునిం జూచి, యయ్యా! యౌవ

(1) రెండు = భేదము.

నాశ్వంబు పరాక్రమధురీణుండు. అతని సైన్యంబు బహు సమరంబుల నారి తేరినశూరులు గలది. వారలం గెలిచి యశ్వంబు దెచ్చుట యత్యంతదుష్కరంబు. నీ విట్లు ప్రతిన సేయం జెల్లునే? యనిన విని వృషకేతుం డజాతశత్రునితో, మహారాజేంద్ర! భీమసేనుతోడం గూడ నన్నుం బంపు మనిన వాయునందనుండు కర్ణనందనుం జూచి, కుమారకా! మీతండ్రి యైనకర్ణుని మాయన్న యని తెలియక సంగరంబునం గూల్చితిమి. నాటనుండియు మామన స్తాపంబునకు మట్టు మితి యు లేదు. నిన్నుం జూచినఁగొఱఁత సంకోచం బగుచున్నయది. అనిన వృషకేతుండు భీమునితో, నయ్యా! మాతండ్రి బుద్ధిమాలి వసమాలిభక్తులౌనైనమీయెడ ద్వేషంబు సేసి దివ్యమణిం బొఱవైచి గర్వంచేకొన్న చందంబున దుర్యోధను నవలంబించి ద్రౌపదీ స్వయంవరంబున దొమ్మియుద్ధంబు సేసె. విరాటునగరంబునఁ బసులం బట్టించె. మాయజూదంబున మాతల్లి యగు ద్రౌపదీదేవిం జీరలొలిపించె. దుర్యోధనుని వారింప శక్తి గలిగియు ధర్మాత్ములైన మీయందు మహాద్రోహంబు సేసె. అప్పాపంబులు వాయ శ్రీకృష్ణదేవునిసన్నిధానంబున ధనంజయుని మహోగ్రబాణంబులచే సంగరాంగణంబున సంహారంబు నొంది తండ్రి యగునాసూర్యదేవునిం గలసె. కావున మాతండ్రి యగుకర్ణున కర్జునుఋణంబుఁ దీర్చుకొనం గూడదు. అది యట్లుండె. నరేంద్రా! నేను భీమసేనుని

తోడంగూడం జని దుర్గమం బైనయావనాశ్వపురంబు ప్రవేశించి నాభుజాబలంబుచే శత్రుసైన్యంబుల గెలిచి యశ్వమేధాశ్వంబుఁ దెచ్చి మీకు సమర్పణంబు గావించి మా తండ్రిపాపంబులం బోఁజేసి సద్గతికిం బనిచెద నుత్తరువు దయ సేయవలయు.

అనిన ధర్మనందనుండు కర్ణపుత్త్రునిఁ గౌఁగిలించుకొని, యన్నా! మీపినతండ్రితోడఁ గూడఁ జని శత్రుసంహారంబు గావించి జయంబుఁ జేకొని హయంబుఁ దె మ్మని పంచిన నమ్మాటలు విని ఘటోత్కచకుమారుం డైన మేఘవర్ణుండు కయ్యంపువేడుక మొగంబునఁ జెంగలింప ధర్మనందనుం గనుఁగొనినయభిప్రాయం బెఱింగి భీమసేనుండు, వత్సా! మీతండ్రి యగుఘటోత్కచుండు మేము వనవాసంబు చేయునప్పుడు గంధమాదనపర్వతంబున మమ్ము రక్షించె. మానిమిత్తంబుగా రణంబునఁ బ్రాణంబుల విడిచె. అతండు చేసిన యుపకారంబులఁ దలఁచికొనిన మనంబు గరఁగుచు నున్నయది. కావున నిన్ను జగడంబునకుం దోడ్కొని పో వనోప. మేము నచ్చుపర్యంతంబు ధర్మనందనుం గొలిచి యుండుము. అనిన విని మేఘవర్ణుండు తాత యగుభీముం జూచి తొల్లి శ్రీరామభద్రునిపాదారవిందరేణువులచేఁ బాషాణంబు పావనం బైనతెఱంగున గంగానదితోఁగూడి యడవివాఁక యోగ్యం బైనకైవడి మాతండ్రి మీకు జనియించుటవలన ధన్యుం డయ్యెఁ గావున నేను మిమ్ముఁ గొ

లిచి భద్రావతీపురంబునకు వచ్చెద. అగస్త్యుండు సము
ద్రంబుఁ గ్రోలిన చందంబున వైరిసేనాసముదయంబుల
నీవు బింకంబు లణంప నీవృషకేతనుండు సగతురగసైన్యంబుల
నడ్డగించి యాహవంబు సేయుసమయంబున మేఁకపిల్లను
బోలె నాయశ్వరత్నంబు నెత్తికొని యతివేగంబునం జను
దెంచెద నని పలికినఁ బరమానందంబు డెందంబునఁ
గ్రందుకొన సమీరనందనుండు ఘటోత్కచతనయుం గౌఁగి
లించుకొని, పౌత్త్రకా! నీభాషణంబులు మాకుం గర్ణభూష
ణంబు లయ్యె. నీవు నేను వృషకేతనుండును గూడితిమేని
మనమువ్వురితోఁ బ్రమథగణసమేతుం డైనత్రినేత్రుండు
నెదిరింపఁ జాలఁడు. అని పలికి యుద్ధసన్నద్ధులై యున్న
సహోదరపుత్త్రపౌత్త్రులం గనుంగొని ధర్మపుత్త్రుం డానంద
బాష్పాకులితనేత్రుండును బులకాంకితగాత్రుండు నై త్రే
తాగ్నులచందంబునం దేజరిల్లు నమ్మువ్వురం జూచి లోక
త్రయంబున వీరల కసాధ్యంబు లే దని యుత్సహించె.
అంతఁ బడమటికొండ కనియాడుసంతకౌస్తుభం బెక్కుడు చెంగ
లువచందంబున రవిబింబంబు కెంజాయ నగుకాంతితోఁ బొలయుచు
నస్తగిరిప్రాంతంబునకుం జనియెను. అప్పుడు వివిధవిద్యావిలా
సుండును జ్ఞానకలావాసుండును బ్రహ్మజ్ఞానసమాహ్లాసుం
డును నైనవేదవ్యాసుండు ధర్మనందనుచే నాశీర్వదించి యాసం
దొనర్చు పూజ నంగీకరించి నిజసుపుత్త్రసూనంబులకు నిజ
యంబు సేసిన ధర్మతనయుండును సంధ్యావందనాదికృత్యంబు

లాచరించి తమ్ములు సమీపమ్మునం గొలువ రత్నసింహాస నమ్మునం గూర్చుండె. తదనంతరంబు కౌంతేయాగ్రజుండు క్రమ్మఱఁ జింతాక్రాంతుండై, భద్రావతీపురంబున కెవ్విధం బునం జనువారము! గుఱ్ఱంబు నెట్లు దెచ్చువారము! దక్షి ణలకు ధనం బెక్కడ నున్నయది! యాగంబునకు నిర్వా హకుం డెవ్వండు! కృష్ణద్వైపాయనుం డాడినమాటల కేల యియ్యకొంటి. త్రిలోకాధిపతి యైనశ్రీకృష్ణుండు నిర్వ్యా జకరుణాకటాక్షంబునఁ దనకుఁ దాన వచ్చి యీయాగంబు నెఱవేర్చినం గాని యెవరికి శక్యంబు! శ్రీకృష్ణా! వృష్ణికుల భూషణా! కమలాక్షా! త్రిలోకాధ్యక్షా! భక్తసంకటవిమో చనా! శోకార్ణవంబున మునింగి యున్నవాఁడ. నీకృపయను నోడచే నన్నుద్ధరింపం జేయుము. మున్ను కౌరవసభలోన మానభంగంబు గాకుండఁ బాంచాలిని రక్షించినక్రమం బున నన్ను రక్షింపుము. అని బహువిధంబులఁ బ్రస్తుతింపుచు ఫాలతలంబున మోడ్పుంగేలు గీలించి శ్రీకృష్ణదేవా! నీవే దిక్కని వేఁడుకొను నవసరంబున సర్వభూతాంతర్యామియు

—* శ్రీకృష్ణుండు హస్తినాపురమునకువచ్చుట. *—

విశ్వరూపియు నగుగోపికావల్లభుండు నయ్యర్ధరాత్రంబున హస్తినాపురంబునకు వచ్చి ధర్మనందనునగరు సొచ్చి ప్రతిహారిం గనుంగొని మారాక ధర్మనందనున కెఱింగింపుము. ఎంత వానికేనియు మహీకాంతునిసమయంబు దెలియక చనవు గల దని యంతిపురంబునకుం బోవుట యుచితంబు గా

దనినఁ బడిహారి గోవిందునకు వందనంబు గావించి దేవర
యేసమయంబున విజయంబుసేయుదు రదియ సమయం బని
మొదల నాతోడ మహారాజుగా రుత్తరు విచ్చియున్నవారు.
కాన నవసరంబుఁ జూడం బనిలేదు. పరస్త్రీపరధనంబులు
గోరు దురాత్మకులును, బరుల దూషించు దుర్మతులును నీ
కరుణ వడయలేరు. ధర్మనందనున కీదుర్గుణంబు లెవ్వియు
లేవు. తానుం దమ్ములు సహోగాత్రంబు దేవరపాదార
విందంబులు ధ్యానంబు సేయుచు నున్నవా రని పలికి యతి
శీఘ్రంబుగఁ బఱతెంచి, రాజేంద్రా! శ్రీకృష్ణదేవుండు నగరి
వాకిటికి విజయంబుసేసె ననుటయుఁ బాండవాగ్రజుం డా
శ్చర్యభరితమానసుండై మొగంబు చెంగలింపఁ దమ్ములుం
దాను నెదుర్కొనుటయు వసుదేవనందనుండు ధర్మజుపదం
బులకు వందనం బాచరించిన నతండు గ్రుచ్చి కౌఁగిటఁ
జేర్చుకొని యానందబాష్పంబులు కపోలతలంబులం గురియ
రోమాంచంబు ముంచికొన నద్దేవుదివ్యరూపంబు సందర్శిం
పుచు నానందసముద్రంబునం దేలియాడుచును నుండె. అంత
భీముండు నర్జునుండును శ్రీకృష్ణదేవుని చరణారవిందంబు
లకుఁ బ్రణామంబులు సేసిరి. నకులసహదేవులు నట్లు గావిం
చిరి. అంత సత్యభామాకాంతను నంతఃపురంబునకుఁ దోడు
కొనిపోయి యర్ఘ్యపాద్యాదివిధానంబులం బూజించి సగౌరవిం
చి కనకాసనంబున నునిచి తాము నుచితాసనంబులం గూ
ర్చున్నయెడఁ బాంచాలరాజనందన ముకుందునకు వందన

బోనరించి మందస్మితంబు వదనారవిందంబునం జెలువొంద ధర్మజు మొగంబు గనుంగొని యర్ధరాత్రంబున నచ్యుతుం డిచ్చటికి వచ్చె నని యచ్చెరు వొందనేల? తనభక్తు లెచ్చట నెచ్చట నుపద్రవంబు నొందుదు రచ్చటికి వచ్చి రక్షించుట యద్దేవునకు సహజగుణంబు. ఆకౌరవసభలోన దుశ్శాసనుండు మీఱ లేవురుఁ జూచుచుండ వలువ లొలుచునప్పుడు హా! గోవిందా! పుండరీకాక్షా! శ్రీకృష్ణా! యని డెందంబునం దలంచిన యంత నక్షయవస్త్రంబు లిచ్చి మానసంరక్షణంబు సేసె. మన మర్జునుని ద్వారకానగరంబునకుం బంపి పిలిపింపవలయు నని తలంచుచు నుండఁ దనకుం దానె వేంచేసె. ఇద్దేవుని భక్తవాత్సల్యం బెంతని కొనియాడం గలదాన ననినఁ బాంచాలి నవలోకించి కించిదంకురితహాసభాసురముఖారవిందుం డై గోవిందుండు చాల నాదరించె.

అంతఁ గౌంతేయాగ్రజుండు రుక్మిణీకాంతుం జూచి మేఘగంభీరస్వనంబున ని ట్లనియె. కమలనాభ! నాదుమనస్తాపంబు నుపశమనంబు నొందింపం గోరి దేవరఁ దలంచితి. నాతలంపునకంటె మున్నుగా నీవు ప్రసన్నుండ వైతివి. నా మనోరథంబులు ఫలియించె. వ్యాసమునీంద్రునిమతి నశ్వమేధంబుం జేయం దలంచితి. సకలకర్మంబులకుఁ గర్తవు భోక్తవు నీవ కావున నీయధ్వరంబు నిర్వహించుభారంబు నీయది యనిన విని దేవకీనందనుండు కుంతీనందనుం గనుంగొని శౌర్యవంతులకుఁ జేయంగూడని కార్యంబు లేదు. నీ

—* శ్రీకృష్ణుఁడు భీముని తేజంబు వృద్ధిఁబొందింపయత్నించుట. *—

తలంపు సమకూరు నని పలికి పవననందనుం జూచి నెమ్మొగంబునం జిఱునగవు దళుకొత్త, వృకోదరా! నీకు బుద్ధి మందంబు, ఆహారం బపారంబు, పొట్ట రెట్టించుచున్నది, రక్కసిరతులకుం జొక్కినవాఁడవు, మాటల పోఁబడి గొఱుఁగవు, నీవంటివాఁడు మంత్రి యై యున్నఁ గార్యంబు లగుటకు సందియం బేమి! అంగహీనుని నిల్లటంపుటల్లుని బ్రల్లదంబుపలుకువానిని గామినీలోలుని మఱుగుజ్జువానిఁ జెవుడు గలిగినవానిం బందయగువాని మామగారిని నెత్తిపట్టిన వాని స్త్రీవశంవదుని నిర్దయునిఁ బ్రచండకోపనునిఁ బ్రమత్తుని మంత్రిఁ జేసినఁ గార్యభాగంబులు సిద్ధిఁబొంద నేరవు. నీవు బాహుబల గర్వంబునఁ గార్యపద్ధతు లెఱుంగవు. గర్వాంధులుఁ బాపస్వభావులు నగుబక హిడింబ కిమ్మీర జరాసంధాదులం జంపినయట్లు సులభంబుగఁ దలంపకుము. సత్యసంధులును భుజాబలధురంధరులును జితేంద్రియులు దానశూరులు నగురాజశ్రేష్ఠులు పెక్కండ్రు గలరు. ఒక్కొక్కని జయించుట కక్కసంబు. సూర్యుం డస్తంగతుండు గాకమున్న సైంధవుని వధియింతునని నాఁడు గాండీవి గావించినప్రతిన నెఱవేఱుట దైవయత్నంబు. మారుతనందనా! నీ వంతయు సాహసంబుగాఁ బ్రతిన సేసితివి. ఇది నెఱవేఱుట యెట్లు? యుద్ధపాటవంబు నిర్వాహకత్వంబుగా [illegible]

గంధర్వ కిన్నర యక్షరక్షోగణనాథులును బహువిఘ్నం బులు గావింతురు. మున్ను దశరథనందనుం డశ్వమేధంబు సేయుచు వానరబలంబులను భల్లూకసేనల నశ్వరక్షణార్థ ముగా నంపిన శక్తిమతీపురంబున సురథుం డను మహా రథుండు తురంగంబుతోఁగూడ వానరవీరుల నెల్లం గట్టివేసి నయెడ శ్రీరామభద్రుండు తానె చని యశ్వంబును మరల్చికొని వచ్చెఁ గావున నీవు సహాయంబుగా నర్జునుం దోడ్కొని పోవుట కర్జంబు. అనినఁ గంసమర్దనునకు బక మర్దనుం డి ట్లనియె. బావా! నేను నీ వానతిచ్చిన గుణం బులు గలవాఁడ నగుదు. నీకు నటునంటిగుణంబు లెవ్వి యు లేవు గద! నీకామాతురత్వంబునకు గొల్లయిల్లాండ్రు గుబ్బపాలిండ్లుసాక్షి. నీచస్త్రీసంగమంబునకు నీదు మత్స్య కూర్మ వరాహావతారంబులె సాక్షి. బహుభక్షకుండ వగు టకు బ్రహ్మాండకోటిపరిపూరితం బైననీకుక్షి సాక్షి. నీస్త్రీ లోలత్వంబునకు సత్యభామానిమిత్తంబుగా భూమికిం దె చ్చిన పారిజాతవృక్షంబు సాక్షి. నీదు మాయాచరితంబులు ప్రకటింప నెవ్వరితరంబు? దేవరకటాక్షంబు తోడఁగఁ దొల్లి బకహిడింబకిమ్మీరజరాసంధుల గెలిచితి నిప్పుడు నటువలెనె యౌవనాశ్వవిశ్వంభరావల్లభుని గెలిచి యశ్వమేధాశ్వం బుం దెచ్చెద. నాహృదయంబులో దేవరదివ్యశ్రీపాద పద్మం బులు కుదురుగ నున్నం జాలు. తద్బలంబున గదాదం డంబు కేలం గొని కులపర్వతంబులం బెకలింతును. క్షోణీ

మండలంబుఁ జూర్ణంబు సేయుదు. దిగంతదంతావళంబులదంతంబుల దుల్చి వైతు. గ్రహతారకాగణంబుల జలజల రాలుతును. నా కసాధ్యం బేమి యున్నయది! చాతకంబులు మేఘాగమనంబు కరణి మేము నీరాక నపేక్షించుచున్నారము. మమ్ము నీకృపాదృష్టిచే రక్షింపుము. మీయెడ భక్తి లేనివారలకు నీవె యగ్నివర్షంబు గురియుదువు. పంకనిర్మగ్నం బైనధేనువును గోపాలకుచందంబున శోకమగ్నుల మైనమమ్ము నీవుద్ధరింపుము" అని యనిలనందనుండు పలుకు పలుకులకు ముదంబు దొలఁక గోపకులతిలకుండు తదీయ తేజంబు వృద్ధి నొందించుచు గాఢాలింగనం బొనరించి, సమీరకుమారకా! నీవాక్యంబులకు నాయంతరంగంబు సంతసంబు నొందె. నీవు ధన్యుండవు. రాజమూర్ధన్యుండవు. మాన్యుండవు. మీరాజన్యునకు దైన్యంబు వలవదు. జన్నంబు నెఱవేఱెడిని. ద్రోణభీష్మకర్ణప్రముఖు లైనగురుజనులం దక్కిన సంబంధిబాంధవులం దురంబునం దునిమిన దుష్కృతంబు మిమ్ముం జెందదు. అశ్వమేధాధ్వరంబు గావించి మాకు సమర్పణంబు సేయుఁడు. మీకు వంత వలవ దయ్యాగంబు నేన సాగించెద.

అనిన భీముండు గోపాలదేవునిం గనుంగొని వెండియు దండప్రణామంబు గావించి, దేవా! సోపానపక్షంబున వస్తు వొకటి కోటిగుణితం బై వృద్ధిం బొందుంగాన హయమేధంబు గావించి తత్ఫలంబు నీకె సమర్పింపం గోరియున్నవారము. నేను

భద్రావతీపురంబునకుఁ జని తద్రాజవర్యుని గెలిచి హయం బు దెచ్చుపర్యంతంబు సవ్యసాచి ధర్మరాజుసముఖంబునం గాచికొని యుండు నని మాటలాడుసమయంబున ద్రుపద రాజపుత్త్రి వచ్చి యారగింప సమయం బయ్యె విజయంబు చేయుఁ డనుటయు ధర్మనందనుండును వసుదేవనందనుండును గృతమజ్జనులై ధౌతపరిధానంబులు ధరియించి యిష్టాన్నపా నంబులం బరితుష్టి నొంది యుచితప్రకారంబుల నారాత్రి సు ఖనిద్రం జెంది మఱునాఁడు వందిమాగధబృందంబులబిరుద గద్యపద్యంబులు గాయకవైణికులయంత్రగాత్రగానంబులు నాలకించుచు నిదుర మేల్కాంచి స్నానసంధ్యావందనాది నిత్యకృత్యంబులు నిర్వర్తించి సంతోషభరితాంతరంగులై సభాస్థలంబునకు వచ్చిరి.

—* భీముఁ డశ్వమునకై భద్రావతి కేగుట. *—

అంత భీమసేనుండును యుద్ధసన్నద్ధుఁ డై ధర్మతనయు పాదంబులకుఁ బంకజాక్షుని పదపంకజంబులకు వందనంబు లాచరించి కుంతికిం బ్రణమిల్లి విప్రుచ్చుం గ్రుచ్చి కౌఁగిటం జేర్చుకొని తాను వచ్చుపర్యంతంబు ధర్మతనయుం గాచి యుండుమని నియమించి మాద్రీనందనుల నుపచరించి ద్రౌ పదికిం జెప్పి మఱిమఱియు మురవైరిచరణాంబురుహంబులకుం బ్రణమిల్లి ప్రమోదభరితమానసుండై వృషకేతుమేఘవర్ణు లు సంగరోత్సాహపరిపూర్ణులై తోడం జనుదేర యావనా శ్వుం డేలు భద్రావతీపురంబునకుం గతిపయప్రయాణంబు

లం జనిచని బంగరుమెఱుంగులం దురంగలించు నుత్తుంగంబులైనశృంగంబులం గీలుకొలిపిన కెంపులగుంపుల సొంపులుగులుకు ప్రకాశంబుల రాత్రులం బగళ్లు సేయుచు నమరావతీపురసమానంబును స్ఫటికమణిమయంబులు నంబరతలచుంబితంబులు నైనకోటలును, బాతాళతలగంభీరంబులు నుల్లోలకల్లోలసముల్లసితంబులుఁ గమలకువలయగంధబంధురంబులు నైనయగడితలును, గనకమయశిఖరంబులం దాపినగుత్తంపుముత్తియంబులడంబులచేఁ దారాగణంబులవిడంబించు సౌధంబులును, గోపురాగ్రంబులం గీలితంబు లైన యింద్రనీలంబులకాంతుల నకాలతిమిరములం గలుగఁ జేయు గవనివాకిండ్లునుం గలిగి వేదఘోషంబుల మట్టుపడం జేయుచు హోమధూమంబులచే మార్గంబులం గానరానీయక యాగయూపసంఘంబులచే నడువంగూడక సాధుజనసంతోషణంబును వైరిజనభీషణంబు నైనయాపురంబు సేరం జని పూచి కాచి ఫలించి కైవ్రాలిన మావులు మోవులుఁ బొన్నలుఁ బొగడలుఁ దాలహింతాలతమాల నారికేలపనసక్రముకప్రముఖతరువులు నల్లిబిల్లిగా నల్లికొనిన మల్లెలు మొల్లలు సన్నజాజులు విరవాజులు మొదలైన తీవలం బొలుపొందుచు చిలుకలుఁ గోయిలలు శారికలుఁ జకోరికలు నాదిగాఁ గల పక్షికులంబులకలకలంబులును, జింకలు దుప్పులు సీహమృగంబులుఁ దక్కినమృగవిశేషంబులచే భూషితంబులు నైనపువ్వుంబోదలం బొలు

పొందు హృద్యం బైనయుద్యానంబునందు నిలిచి సమీర కుమారుండు వృషకేతుం జూచి, కుమారకా! యీవనం బునం జెంగలువలు నల్లగలువలుఁ దెలిగలువలుఁ జెందా మరలు వెలిదమ్ములుం దొరంగినపుప్పొడులం దేనియలం బొంది చిత్రవర్ణంబు లైన తరంగమాలికలం జెన్నుమెఱసిన తటాకంబుఁ గనుంగొనుము. ఇచ్చటి కీరాజునగరి వాజి సంఘంబులు నీళ్లుద్రావం జనుదెంచు నం దశ్వమేధయోగ్యం బైనయశ్వంబును వచ్చుఁగావున, దానిం గాపాడికొనివచ్చు సైనికానీకంబుం బాఱఁద్రోలి హయంబు రయంబునం గొని పోవుద మని పలుకుచు నొక్కపాదరింటం బొంచి యుండె.

అప్పుడు కర్ణసూనుండు పినతండ్రి యగుభీమసేనుం జూచి, యీరాజునకుంగల సేన యంతయుం బదియక్షౌహి ణులు, వానిలోఁ గొంతకొంత తురంగంబు వెంబడిం జను దెంచుఁ గాని యెల్లసైన్యంబుఁ బెల్లగిలి రాదు. కావున మన కీయశ్వంబును గ్రహించుట సులభంబు. గంగాతీరంబునం జేరిన జనులపాతకంబులుం బలె, లలాటలోచనుం డాసిన కాలకూటంబుకరణి, శ్రీవాసుదేవపాదారవింద చింతనంబు వలన మానవుని జన్మంబునుంబలె, గయావర్జనంబు సేసిన వాని పితృవర్గంబుల దుర్గతింబలె, నిమిషమాత్రంబులో నీగ దాఘాతంబున యౌవనాశ్వుని సైన్యంబు లయంబు నొందు నని సల్లాపంబు లాడుచునుండుసమయంబున దండిమెఱయు

డిండిమవాద్యఘోషంబులును గాంచనమణిమయంబు లైన ఘంటల ఘణంఘణారవంబులును, నంకుశాఘాతంబులం బొడము ఘీంకారంబులును, గండస్థలంబులం దొరఁగు మదజలంబుల పరిమళంబులకై మ్రోయు తుమ్మెదలఝుంకారంబులునుం జెలంగ నేనుంగులు గుంపుగుంపులుగా వచ్చి యాసరోవరంబు సొచ్చి మచ్చికలు హెచ్చఁ దుండాగ్రంబుల నుదకంబులం బూరించి పెంటియేనుంగులమీఁదం జల్లుచు వానిచేఁ జల్లఁబడిన సలిలంబులచే మేనులు దడియ మెల్లమెల్లనఁ దద్గాత్రంబులు నిమురుచుఁ బుండరీకముకుళంబులం బెఱికి యొండొంటితో నేటు లాడుచు నన్యోన్యముఖసౌరభంబుల నాస్వాదించు సంతోషంబున ఘోషించుచు నక్కు నక్కునుం జెక్కుఁ జెక్కును దొడఁ దొడయునుం జెవిఁ జెవియు బరిబరియు సరినొరయఁ గరాగ్రంబున జలంబులం బీల్చి చిమ్మనగ్రోవులం బలెఁ జిమ్ముచుఁ బెద్దయుం దడవు తద్దయుం గ్రీడించి మావంతులబలవంతంబున జలవిహారంబులు చాలించి యమ్మదగజంబులు పురంబునకుం జనియె.

తదనంతరంబ క్రొమ్మించులమించు తేరిగండ్ల యంచుల వలనం బొడమిన భూరేణువు లకాలతిమిరంబు సంపాదింపఁ గాలరుద్ర ఢక్కాఘుమఘుమాత్కారంబులం ధిక్కరించు వాద్యఘోషంబులు మొఱయ మృత్యువునాలిక పోలికఁ జదలం గదలు బిరుదకేతనంబులు మెఱయఁ బట్టపగలింటి మార్తాండకిరణంబులకు ననుకరణంబు లైనప్రహారణంబులం బొలు

పొందు భటసమూహంబులు సందడింప నేల యీనిన తెఱం గున సముద్రంబు పొరలినచందంబున వచ్చుసైన్యముం గనుం గొని యౌవనాశ్వభూపాలుండు వచ్చెనో యనుతలంపున దిగ్గన లేచి కర్ణకుమారుం డాసైన్యముం గలయం జూచి నీరు ద్రోలc జనుదెంచు తురంగబృందంబులసందడి గాని రాజు కాcడని తెలిసి యనిలనందనుం జూచి, అయ్యా! కయ్యం బునకుం గాలుద్రవ్వుచందంబున ఖురంబుల భూతలంబు ద్రవ్వుచు నూరcబిచ్చుకలు ముంగిసలు నొంటెలు నడచిన కైవడి బెడంగునడలు మెఱయం బరిచారకులు వాగెలం గుదియంబట్టి నిట్టట్టు గెరలుచు వేనవేలు తురంగంబులు జలతరంగంబులకరణిc ద్రొక్కినచోటుం ద్రొక్కక యిక్కల నికిం జనుదెంచి నీరు ద్రావుచుం బోవుచు నున్నయవి గాని యశ్వమేధాశ్వంబు గనంబడదు. దానికున్నచోటన గడ్డి యుం గవణంబు నీరు నమరించి బయలువుచ్చరు గాcబోలు ననిన వృషకేతుం జూచి యనిలసూతి, కుమారకా! మన ము ధర్మజునిసమ్ముఖమున నానావిధంబులైన ప్రతినలు గావిం చితిమి. సవనహయంబు లేకయ రిత్తచేతులతో మగిడి పోవం జనదు. పుత్రులు లేనివానికిం గతి గలుగనేరని వితంబున, నంగనావశుం డైనయజ్ఞానికి బంధుమర్యాదలు మాలిన కరణిc, గార్యాలోచనము సేయనిమనుజనాథునకు రా జ్యంబు సిద్ధింపనితెఱంగున, శ్రీవిష్ణుదేవునిచరణకమలం బులం దలంపనివానికి శుభంబులు లభింపనిచదంబున, శంక

రునిం బూజింపని వంకరకట్టెకు సంపదలు సంభవింపని
కైవడి, హయంబునుం గైకొనకయ విఫలప్రతిజ్ఞుల మైతిమేని
మనకీర్తి హానిం జెందు నని మాట లాడుచుండె.

—* అశ్వమేధాశ్వము నీరుద్రాన వచ్చుట. *—

ఆసమయంబున ద్విరదంబులు నరదంబులు ఘోటకం
బులు భటసమూహంబులు వాద్యఘోషంబులు మ్రో
య నిచ్చలంపుముత్యాలకుచ్చులగచ్చులు మెఱయు ధవళా
తపత్రంబు పున్నమచందురుచందంబునఁ గాంతిచంద్రికలు
వెదచల్ల నుభయచామరంబులు ధవళశంఖంబులు సాం
బ్రాణిధూపంబులుఁ జంద్రకావిపావడలు దీపింప మహా
మండలేంద్రుని చందంబున నతిశయితవైభవంబుతోఁ బద్మా
కరంబునకు నయ్యాగీయహయంబు రా నాలోకించి పట్టం
దమకించు కుమారుని నివారించి మనుమనిం గనుంగొన్న
నమ్మేఘవర్ణుండు సమరవిజయనేత యగుతాతకు నమస్కరించి
మహాబలనందనా! లెక్కకు మిక్కుటం బైనకక్కసంపుజో
దులు పెక్కండ్రు చుట్టునుం బరివేష్టింప వచ్చుచున్నట్టి యి
త్తేజిం జెవి వట్టికొని లేఁగదూడ నీడ్చి తెచ్చినవిధంబునఁ బట్టి
తెచ్చెద. యౌవనాశ్వుని నాతని కుమారుని మూటకట్టు
గాఁ గట్టి మీముందఱం దెచ్చిపెట్టెద. ఇంత యేల! తురం
గంబె చాలు నంటిరేని యత్తెఱంగునం జేసెద నని సంగ
రోత్సాహంబున నంగంబు పొంగుచుండ శైలశృంగంబునుండి
చంగునం దుముకు సింగంపుంగొదమకరణి ధరణికిం జను

డెంచి మాయాప్రభావంబునఁ గాలకంఠకంఠకుహాళీకరాళ కాలకూటంబు కరణి గాటం బైన యంధకారంబు గల్పించి దిక్కులు విదిక్కులుం దళుక్కున మెఱపుటొఱపులు మిగుల బ్రహ్మాండకుహరంబు విరియింపంజాలు గర్జితంబు లూర్జితం బులై యెల్లెడల వినంబడ బలుపిడుగులు వడంజేసి దేవ మానవాదులకు భయంకరంబుగ మేఘనాదునిచందంబున సింహనాదంబు సేసి యద్దనుజసింహుండు పరాక్రమంబు మెఱయించుటయు దేవేంద్రుండు చారులవలనఁ దద్వృ త్తాంతంబు విని యాఁగక్కసుం డెక్కడివాఁడు? ఏల విజృం భించినాఁడు? తెలిసి ర మ్మని యొక్కదూత నంపించిన వాఁ డునుం ద్వరితంబుగా వచ్చి యంబరంబున నాడంబరంబులు సేయు హిడింబాపౌత్రునిం గాంచి నీవెవ్వండవు? ఏమిటి కిట్లు విపరీతంబులు సేసెదవు? దీన నీకేమి ఫలంబు? ని న్నెవ్వ రంపించినారు? త్రైలోక్యవల్లభుం డైనదివిజనాథుండు తెలిసి ర మ్మనియె, ననిన విని యాఘటోత్కచపుత్త్రుండు, నేను బాండుపుత్త్రుం డైనభీమసేను పౌత్త్రుండ. మాపెద్దతాత యగు ధర్మరాజు హయమేధంబు గావింపంగోరి యావనా శ్వుని నగరంబున యాగీయతురంగం బున్నదని విని నన్నుం బంపిన నేను దానిం బట్టికొన వచ్చి మాయలం బన్ను చున్నవాఁడం గాని దేవతలకు విరోధంబుసేయం దలంచిన వాఁడఁ గాను. అనిన విని యా దూత దేవేంద్రున కత్తె ఱం గెఱింగించిన నతండు సంతోషంబునొందె. అంత

నంతకాలకాలునిచందంబున నద్దనుజుం డొక్కెడం బిడు
గులు గురియించుచు నొక్కదిక్కున ఱాళ్లుఱువ్వుచు నొక
చోట మిడుంగుఱులు నింగి కెగయ నిప్పులు గుప్పిళించుచు,
నొక్కెడ ఝుంఝామారుతంబుల విసరించుచు, నొక్క
చక్కి మిక్కుటంబైన దుమ్ము గ్రమ్మంజేయుచు, నొక్కచోట
గాటంబులైన చీఁకటుల నుత్పాదించుచు, నొక్కతావునఁ
బెళపెళమని యుఱుములుఱుమం జేయుచు, నొక్కొక్క
దిక్కునం దళుక్కు మను మెఱుంగులచే దృష్టులు మిఱు
మిట్లు వడం జేయుచు సేనలనెల్లం జీకాకుపఱిచి పొట్టిటి

—* మేఘవర్ణుఁడు గుఱ్ఱము నపహరించుట. *—

పిల్లం బట్టిన తెఱంగున నశ్వంబు నాలుగుకాళ్లుం బట్టి
మూఁపునం బెట్టుకొని గగనమార్గంబున కెగసిన వియ
చ్చరు లచ్చెరువొంది యదె యదె దానవుండు హయంబుం
బట్టికొనిపోయెఁ బోయె ననియెడు నెలుంగులు నింగిముట్టఁ
బ్రశంసించి కృపాయత్తచిత్తులై మేఘవర్ణుని పయిం బుష్ప
వర్షంబులు వర్షించిరి.

ఇవ్విధంబున భీమసేనపౌత్త్రుండు మాయాబలంబున
యాగతురంగంబు నపహరించి కొనిపోయిన తెఱంగు హత
శేషు లయినభటులు (1)పలుకరించుటయు యౌవనాశ్వవి
శ్వంభరాధీశ్వరుండు విని యులికిపడి నిప్పు లుప్పతిల దశదిశ

(1) పలుకరించుట=చెప్పుట యను నర్థమున నందు వాడఁబడు
చున్నది.

లుం జూచుచు దురాపప్రతాపదీపితుండై యంబరతలం బున కెగయంజాలు రథికుల నాలుగువేలకుం బనుపుటయు వారలు క్రోధంబున యూథంబు లగుచు విక్రమంబునఁ జక్రగదాకుంతకరవాలభిండిపాలముసలముసుండికాఫరిఘ పట్టసాది సాధనంబులు సారించుచు నవ్వీరుం జుట్టుముట్టిన నాబిరుదుమగండు బెట్టుగా నట్టహాసంబు సేసి యశ్వంబు నమరావతీపురంబున నునిచి తానుం బెట్టిదం బైనచెట్టు వెఱికికొని చుట్టుకొనిన మూఁకలం గనుపుగొట్టి యిట్టట్టు వడం జేసి యాగీయహయంబును మగుడం గొని తెచ్చి భీమసేను ముందఱం బెట్టి నిలిచిన నతండు పౌత్త్రుం గౌఁగి లించికొని దీవించె. ఆసమయంబున యౌవనాశ్వునిసైన్యం బులు క్రమ్మఱం జుట్టుముట్టిన మేఘవర్ణుండు మహార్ణవంబు నం దిరుగు మందరనగంబుచందంబునం దచ్చమూసముద యంబు గలగుండునడం జేయుచుఁ బరాక్రమించుసమయం బున వృషకేతుండు తనమనంబున “హయంబుం బట్టికొని వచ్చునప్పటికయ్యంబున మేఘవర్ణుండు మిగుల నలసి యు న్నవాఁడు. పెక్కండ్ర నొక్కనికి గెలువ శక్యంబు గా” దని యూహించి, యనిలసుతునకు మ్రొక్కి శస్త్రాస్త్రభీకరం బైన వైరిసైన్యనికరంబు సొచ్చి యరుణారవిందచిత్రంబు లైన నేత్రంబులం జుఱచుఱం జూచుచు లయకాలహుంకారశం కాకరం బైనశింజినీటంకారంబు దిశావిటంకంబులకు సంక్ర మింపం గోపాటోపంబునం దత్సైన్యంబుం జొచ్చి మేఘవర్ణు

నకుం గౌతూహలంబు సంపాదింపుచు, వత్సా! నీవు కయ్యం
బున మిగుల నలసినాఁడవు. తలంచిన కార్యంబు నెఱవేర్చి
తిమి. ముహూర్తమాత్రంబు బడలిక దీర్చికొమ్ము." అని భీము
చెంతకుం బంచి కంఠీరవంబు గంధగజయూథంబుపై నుఱు
కుచందంబున నుఱికి క్రొవ్వాఁడిమెఱుంగుఁదూపు లని
యెడుగోళ్లచే భద్రగజకుంభస్థలంబులు పెకలించి! తురంగ
సంఘంబులం దెగటార్చి, యరదంబులం జెక్కులుసేసి, కాలు
బంట్లఁ గాలునిప్రోలి కనిచి రోదసీకుహరమేదురం బైనసిం
హనాదంబు సెలంగఁ ద్రిపురంబులపయిం గడంగు త్రి
లోచనునిచందంబున నిరర్గళంబుగ మార్గణవర్షంబులు వర్షిం
చిన విదళితమాతంగంబును, విధ్వస్తతురంగంబును, విశీర్ణ
శతాంగంబును, విఖండితభటాంగంబు నై యాసైన్యంబు
చచ్చియు నొచ్చియు విచ్చియుఁ జీకాకుపడుటయు నందొ
క్కరుండు బలుగాయంబుల నెత్తురు జొత్తిల్లుగాత్రంబుతోఁ
బురంబునకుం బరువెత్తి భద్రావతీశ్వరునకుం బ్రణమిల్లి
సైన్యంబు సమసిన తెఱంగును యాగీయవాజిం గొనిపోయి
నచందంబును విన్నవించిన యౌవనాశ్వుండు రోషారుణి
తలోచనుం డై, యెట్టెట్టురా! వింతలు వింటిమి! పరబలం
బెంత వచ్చె? గుఱ్ఱం బెటువలెం బట్టువడియె? వివరంబుగా
నెఱుంగంబలుకు మనిన, దేవా! యెవ్వరో యెఱుంగము.
ముప్పురు వచ్చిరి. వారిలో నల్లనిబాలకుం డొక్కరుండు గగ
నంబున కెగసి డేగ తూఁటినవిధంబునం దూఱి సేనామధ్యం

బున నున్న తురంగంబు నెత్తి మూఁపున నుంచుకొని మీ
రంపించినయంబరచరులనాలుగువేలరథికుల నంబరమున నె

—* యౌవనాశ్వుఁడు భీమాదులపై యుద్ధమునకు లేచుట *—

సంహరించి వెండియు నాబలంబుతో భండనంబు సేయుచు నుండఁ బెద్దనిట్టతాటిచెట్టుచందంబున లోకభీకరం బైనయి నుపగుదియ కేలంబూని యొకండు నిలిచియున్నాఁడు. వాని చెంగట సింగంపుఁ గొదమ తెఱంగున గర్జిల్లుచు నొక్క-చక్కని రాచకొమరుండు కొలుచుచున్నవాఁడు. అని విన్న వించిన యౌవనాశ్వుండు దన యిచ్చలో మచ్చరంబు నచ్చెరువు విచ్చలవిడిం బెచ్చుపెరుఁగ, వారు మానవసామాన్యులు గారు, కారణజన్ములు; నాకుం జూడఁ ద్రిమూర్తులు నరమూర్తులై వచ్చిరని తోఁచుచున్నది. ఒక్కండు గుఱ్ఱంబును బట్టుకొనిపోవుట యేమి! వేఱొక్కండు లెక్కకు మిక్కుటంబైన సైన్యంబు నుక్కడంచుట యెట్టు! ఒక్కరుండు వేడుక చూచుచు నూరకెయుండుట యేమి! ఐన నశ్వమేధంబు సేయవలయునని యతిప్రయాసంబుగా నశ్వంబు సంపాదించితి నది యిత్తెఱంగునం బోయినఁ బోవనిమ్ము. ఇమ్మువ్వురితోఁ గయ్యం బనుజన్మంబొనర్చి దేవతల నెల్లం దృప్తి నొందించెద నని యాహవోత్సాహకౌతూహలంబున నమ్మహీవల్లభుండు దిక్కులు పిక్కటిల్ల రణభేరి మ్రోయించి మదపుటేనుంగులు, మనోజవతురంగంబులు, మణిమయరథంబులు, మహాసాహసికవీరభటులు లెక్కకు మిక్కుటంబుగా దిశలు

ప్రక్కటిల నార్చుచు, వీరాలాపంబులం బేర్చుచు, నలుఁగె లంకులం బలసి చనుదేఱఁ బురంబు వెడలి సమీపంబునకు వచ్చి యుగాంతకాల కాలుండునుంబోలెఁ బ్రచండగదాదండంబు భుజాగ్రంబునం గీలించి భండనంబు గనుంగొనుచున్న వృకోదరు విలోకించి లోకోత్తరం బైనతదీయదివ్యతేజోవిలాసంబున కచ్చెరువందుచు నాయోధనంబున నాయోధుల నెల్ల సమయించి వింటికోపునం జే యూఁది యున్న వృషకేతునింజూచి శిరఃకంపంబు సేయుచు యౌవనాశ్వుండు తనమనంబున "సాగరంబు మేరమీఱినచందంబున నపార చతురంగబలంబుతో భూనభోంతరంబులు కంపింపఁజేయుచు నెత్తివచ్చిన నన్ను సడ్డసేయక యనాదరంబుగఁ జూచుచు సింహకిశోరంబుకరణి శంకారహితుం డై కర్మపాశవినిర్ముక్తుం డైన యోగిచందంబున మరణభయంబు లేక యిక్కుమారుండున్నవాఁడు." అని సంతసంబు రోషంబు నగ్గలింప బలంబునకుఁ జేయి వీచుటయు వానిపయిం గడంగువృషకేతనుం జూచి మారుతసుతుండు రోషతామ్రాక్షుం డై గదాదండంబు నంకించి కదలుటయుఁ గర్ణకుమారుం డెదురుగాఁ బఱతెంచి, "అయ్యా! యీరెండులోకంబులెత్తివచ్చినను మీకు

—* వృషకేతుండు భీముని నిలిచి చూడు మని కోరుట. *—

నీడు గా దనినయెడ నీయల్పసైన్యం బేమి లక్ష్యము! నీ పుత్రుం డగునన్నుం దయచేసి చూచుచుండుము. నే నీ కుఱంబ కార్చిచ్చుచందంబునం బేర్చి పరదళంబుల భస్మీకరిం

చెద. తండ్రీ! కాయంబులు బుద్బుదప్రాయంబులు. జవ్వనంబులు చంచలంబులు. బలంబు లస్థిరంబులు. ఇంతయుం గలిగినపుడె త్రైలోక్యవర్తిని యైనకీర్తి నార్జింపవలయుం గాని స్వార్థంబుగా బ్రదుకం జనదు. గజగమనంబు లనియెడి గమనవిలాసంబులును, బాణంబు లనియెడి భుజంబులును, చక్రంబు లనియెడి స్తనంబులును, శంఖంబు లనియెడి కంఠంబును గలిగినశత్రుసేనారమణీమణిని మున్నుగా నేను వరించినాఁడ. దానితోడం గ్రీడించి కీర్తి యనియెడు సంతానంబు గాంచెద. మీకుఁ జేర వావి గాదు. కోడ లయినసేనావధూటి మిమ్ముం జూచి వ్రాలుపతాక లనియెడివ్యాజంబున మొగంబు వాంచుచున్నయది." అనిన వాయుసూనుండు "కుమారకా! సేనావధూటి నీకుం గైవసం బైన మిగుల లెస్స. అటుగాక నిన్నుం దలమీఁజె నేని దాదవ్వుల నస్మదీయగదాప్రహారంబులఁ జేవ యణంచి శిక్షించెద. మామగారు కోడలిని శిక్షించుట యుచితంబుగదా! యని పలికి, నీవు పాదచారివి, వారు రథికులు, నిన్ను నొంటిగఁ బనుపం జాల ననిన వృషకేతుండు మారుతసూతిం జూచి మీకటాక్షం బనువజ్రాంగిజోడు గలిగియుండ నాకు భయం బేమిటికి? చింత వలదు. నన్నుం బంపు మని భీమునకుం బ్రదక్షిణంబు సేసి యుబ్బునం గబ్బుమీఁజిన దేహంబుతోఁ గన్నులం గెంపు దొలంకఁ గాముకుండు కామినిం గదియుచందంబునఁ గెందూళి యనియెడు కుంకుమరసంబు నలంది, సింగిణివిం డ్లనుకనుబొమ్మ

లల్లార్చుచు, మెఱుంగుఁదూపు లనుచూపులఁ దళుక్కొత్తుచుఁ గరికుంభంబు లనియెడు కఠినస్తనంబుల నొఱపు మిగ్గిలిన వైరిసేన యనుచానం గదిసి వృషకేతుండు కౌతుకంబ్బు నెమ్మొగమ్మునం జిగురొత్త మున్ను దనచేతం గూలినచతురంగబలంబుల నెత్తురు లనియెడిసలిలపూరంబులచే సాగరంబు తెఱంగునఁ గన్పట్టుచు రుద్రవిహారస్థానం బగుటం జేసి కైలాసంబుకరణి నొప్పుచు, విదళితసైంధవం బగుటకతనఁ బార్థునిప్రతినచందంబునం దోఁచుచు, శంఖచక్రసమన్వితం బగుటకతన శౌరిహస్తంబులంబోలెఁ జెలువొందుచు, నిజనిశితవిశిఖంబులచే శకలితంబు లైన రథగజతురగపదాతిగాత్రఖండంబులచేత మిట్టు పల్లంబు లైనసంగరాంగణంబు సొచ్చి కార్ముకజ్యారావంబును, గఠోరసింహనాదంబును, గనకపుంఖచిత్రితంబు లగుకంకపత్రంబు లుల్లసిల్లఁ గోదండపాండిత్యంబు మెఱయ వింట బాణంబు దొడుగుట తివియుట యేయుటయు నెఱుంగరాకుండ శరపరంపర లను వర్షంబు వర్షించుచు సమున్నిద్రం బైనరౌద్రరసంబు మూర్తీభవించిన చందంబునఁ గనుపట్టి కుంభికుంభస్థలంబులు పెకలించి ముత్యంబుల జలజల రాల్చుచు నశ్వగాత్రంబుల శకలంబులు వికలంబులు సేయుచుఁ బరాక్రమించుచు నుండె.

—* యౌవనాశ్వవృషకేతులయుద్ధము. *—

ఇవ్విధంబునం జాపవిద్యానైపుణంబు సూపుచు నున్నవృషకేతుం గాంచి యౌవనాశ్వుండు దంతావళంబు నెక్కి ధవళ

చ్ఛత్రచామరంబులు మెఱయ వగ్గఱ వచ్చి "కుమారకా! ఆది విష్ణుదేవుండునుం బోలెఁ బ్రకాశించుచున్నవాఁడవు. నీకు లంబు గోత్రంబు నామధేయంబు నెయ్యది? నీతండ్రి తాత లెవ్వరు? నీరాకకు నేమికారణంబు? నీచరిత్రంబు దెలియక యుద్ధము సేయరాదు. కాన నెఱింగింపు" మనిన, వృషకేతుండు, "కశ్యపమహామునీంద్రుఁడు మావంశకర్త, వేదమయుండైన సూర్యుండు మాతాత, త్రైలోక్యవిఖ్యాతదానలక్ష్మీసముదీర్ణుం డైనకర్ణుండు మాతండ్రి, నాపేరు వృషకేతుండు, మాపినతండ్రి ధర్మనందనుం డశ్వమేధంబు సేయం దలంచి నీవశంబున యాగీయాశ్వ మున్న దని విని భీమసేనునన్ను ఘటోత్కచపుత్త్రుం డగుమేఘవర్ణునిం బనిచె. అమ్మేఘవర్ణుండు తురంగంబు నపహరించె. నేను బలంబులం బొలియించితి. మాయయ్య వేడుక చూచుచు నున్నవాఁడు." అనిన నమ్మహీకాంతుండు సంతసంబు నంది "రాజనందనా! ముహూర్తమాత్రంబు బడలిక దీర్చికొనుము. చే యలసినవానితోఁ గయ్యము సేయరాదు. నీవు పాదచారివి నే నేనుంగు నెక్కి యున్నవాఁడ నగుట నీతోడఁ గయ్యంబొనర్చుట పాడిగాదు, కనకమయం బైనయరదంబు నొసంగెదఁ గైకొని యుద్ధమునకు ర" మ్మనిన వేవెలుంగులదొరమనుమండు మొగంబునఁ జిఱునగవు దళుకొత్త "నెవ్వాని పట్టణంబునఁ జెట్లు రాళ్లు పసులుసైత మఖిలార్థంబు లొసంగి యాచకులం బ్రోచు నట్టి యమరవల్లభుం డర్థి యై వచ్చి వేఁ

డినఁ గవచకుండలంబు లొసంగె నట్టిదానశూరుం డైన
కర్ణునకుం గుమారుండ నైననేను నీవలన నరదంబుఁ బుచ్చి
కొందునె! నీ వాడెడుమాటలు వినిన సంధికి వచ్చినయట్టు
లున్నయది కాని సమరంబునకుఁ గాఁ దోఁపదు.” అనిన
నారాజు “నీవు బాలుండవు, మేము చాపవిద్యాప్రవీణుల
ము. మున్నుగ నీపరాక్రమంబుఁ జూపుము. నీసామర్థ్యంబుఁ
జూచి తరువాత మేము యుద్ధము సేసెద” మనిన వృషకే
తుండు నవ్వుచు మున్నుగాఁ దురంగంబుఁ బట్టితి మని
చెప్పిన న్వాని కోపాటోపంబున గృహంబు వెలువడి సకల
దళంబులం గూర్చుకొని ప్రతిజ్ఞలు వలుకుచు యుద్ధంబునకై
బయలు మెఱసినవారలు తమపరాక్రమంబులు మెఱయింప
వలయుం గాని ముందుగ నాప్రతాపంబుఁ జూపితినేని మఱి
నన్ను మెచ్చి యుద్ధంబు సేయువా రెవ్వరు? కాలమృత్యు
ముఖంబునఁ బడినపిమ్మటఁ గ్రమ్మఱ వచ్చుట యెట్లు? నీవు
పుత్రులు పౌత్రులు మిత్రులు బంధువులు సింధురంబులు
హయంబులు రథంబులు నధిరోహించి భేరులు బిరుదకాహ
ళంబులు మొదలైనవాద్యంబులును మొరయ బిరుదధ్వజం
బులు మెఱయ సలువగలకైదువులు సారించుచుఁ గయ్యం
బునకుం గాలుద్రవ్వుచు మెండుకొని యున్నవారలు.
నీవు వృద్ధుండవు, నేను బిన్నప్రాయంబువాఁడ. న న్నొంటి
గాఁ డని యనవలదు. కమలాక్షుని కృపాకటాక్షంబె నా
కక్షయబలంబు. పెక్కుమాట లేమిటికి! తొలు దొలుత నీకు

ఱ్ఱంబుఁ బట్టి తెచ్చితిమి. నీచతురంగబలంబులో సగము సమయించితిమి. తొలుపోటు మాదె కావున నీవె మార్కొనుమనుటయు నాయౌవనాశ్వుం డలిగి యేనుంగు డిగి రథారూఢుండై గుణంబు మ్రోయించి యిరువదియైదుసాయకంబులు దొడిగి యేయుటయు నక్కుమారుం డొక్కబాణంబున ఖండించి యర్ధచంద్రబాణంబు నిగిడించుటయుఁ గుటిలవర్తనులం గూడిన సజ్జనునిగుణంబు సమసినకరణి యౌవనాశ్వుని ధవళచ్ఛత్త్రచామరంబులు తుమురయ్యె. అంతటం బొక మూఁడువాఁడితూపులు వింట సంధించి యొక్కబాణంబునఁ జాపంబును వేఱొక్కశరంబున గుఱ్ఱంబులను నొప్పించి మఱియొక్కమార్గణంబున యౌవనాశ్వవక్షస్థలంబు నేయుటయు నది యతనినడిఱొమ్ము వ్రక్కలించుకొని వెన్నున డుస్సి దబ్బఱసాక్ష్యముపలికినవాఁడు ఘోరనరకంబునం గూలు తెఱంగున భూతలంబునం బడియు (మరలఁ దెలివొంది యరదం బెక్కి) యమ్మహీకాంతుండు వేఱొండుకార్ముకంబు కరంబునం బూని సజ్యంబు గావించి గుణస్వనంబున దిక్కులు వ్రక్కలం జేయుచు నఱువదిబాణంబు లొక్కపిడికిటం బట్టి వృషకేతునిభుజమధ్యంబున గాటంబుగ నాటించుటయుఁ జిమ్మనఁ గ్రొవ్వులం జిమ్మినచందంబునఁ గ్రొత్తనెత్తురు లెగసిన నక్కుమారుండు తరుణకిరణమాలికరణిం బ్రకాశించుచుఁ గోలచేఁ గొట్టువడిన బెబ్బులికరణి బిట్టురోఁజుచు నాలుగువాలుతూపుల రథ్యంబులం గీటడంగించి

యొక్క మార్గణంబున సారథిశిరోధిం ద్రుంచి బహుముఖంబు లైనశిలీముఖంబుల నజ్జననాథు మునుంగ నేసి పందిరి వెట్టినకరణి శరకదంబకంబుల నంబరంబుఁ గప్పి రవికిరణంబుల మఱుంగుపఱిచి సింహనాదంబు సేసి "భూనాథుండు పొలిసెఁ బొలిసె' నని సైనికులెల్లఁ దల్లడం బంద నాగ్నేయాస్త్రంబు వింటఁ దొడిగి యేయుటయుఁ బొగలు సెగలు మిణుంగుఱులు మంటలు మింటికి నంటఁ గడంగిన నద్ధారణీరమణుండు వారుణాస్త్రంబున దాని నివారణంబు గావించినఁ బంకజమిత్త్రపౌత్త్రుం డంతటం బోక వాయవ్యాస్త్రంబును సంధించిన నమ్మేదినీనాథుండు పర్వతాస్త్రంబుఁ బ్రయోగించుటయు నేనుంగులం బోలిన ఱాలు ఱువ్వుచు వచ్చు నయ్యస్త్రంబుమీఁద వజ్రాస్త్రంబుఁ బ్రయోగించి తత్పాషాణంబులం జూర్ణంబు సేసి హాలహాలవిషజ్వాలలం

—* వృషసేనుండు మూర్ఛిల్లుట. *—

గ్రక్కువాలుమెఱుంగుఁదూపు లపారంబుగా నిగిడించిన నమ్మహీనాథుం డొక్క భల్లంబున దన వక్షంబు పెల్లగించిన రవికిరణసంకాశంబైన యొక్క మెఱుఁగుటమ్ము రాజభుజమధ్యంబున నాటించి తాను మూర్ఛిల్లిన భీమసేనుండు రణరంగంబునం బడియున్న కుమారుం గాంచి కనుఁగవ జేవుఱింప నవుడుగఱచి యాలంబున యౌవనాశ్వనృపాలునిఁ బుత్త్రమిత్త్రబంధు సేనాసమేతంబుగఁ గాలునిపురంబున కంపకయే యీబాలుని కొదవ దీఱ దనుచు నుద్దండగదాదండంబు సా

రించి రెండవదండధరుండునుం బలె భండనంబునకుం గడంగి నితాంతకోపంబునఁ గొండలంబోని యేనుంగు తండంబులం గనుపుగొట్టిన నప్పట్టున వెడలు నెత్తురుటేఱు లపారంబులై పాఱినం బారవశ్యంబున నవ్వఱద వెంబడిం బోవు వాహనంబులు నానెత్తురుటేటి యుభయతీరంబులందును జొత్తుపాపలుంబలె నెమ్ములతిత్తు లై పడిన రాహుత్తులును బ్రవాహవేగంబునం దలక్రిందుగా దుల్లిన రథంబులును రథంబులచెంగట యమపురంబునకుఁ బథికు లైనరథికులును కాలుఁ గాలుం బెనఁచికొని తేలి యాడు కాల్బలంబును గలిగి యాలంబును త్రిజగదాభీలం బయ్యె నప్పుడు భీముని యూరువేగంబునం బొడమినచండమారుతంబులు బిసబిస విసరినం జతురంగబలంబు బొందెతో స్వర్గమునకుం బోవు కైవడి సూర్యమండల పర్యంతంబు నెగసి యందుండి కాలుఁ గేలుఁ గీలు వీడి పడునట్టుగ విష్ణుద్రోహులు నరకంబునం గూలుకైవడి భూతలంబునం బడియె. మఱియు నవ్వడముడి మోఁకాలివేగంబునఁ బిక్కలవలనం బుట్టిన ఝంఝామారుతంబు విసరినం బెల్లగిల్లిన దంతంబులు భగ్నంబులైన కుంభస్థలంబులు విఱిగినచరణంబులుం గలిగి పీనుంగు లైన యేనుంగులును దునిసిన గళంబులుఁ దెగిన ప్రేవులుఁ జెక్క లైనడొక్కలుం గలిగి చాఁపకట్టుగాఁ బడిన తురంగంబులును జక్కు లైనచక్రంబులును నుగ్గునూచము లైననొగనులు విఱిగిన కేతనంబులును విటతాటంబు లైన యుగయుగంబు

లును గలిగి శకలంబు లైన యరదంబులును సడుగులు వీడి కుత్తుక లెండి వెడరూపంబులఁబడిన వీరభటులునుం గలిగి సంగరాంగణంబు ఘోరం బయ్యె.

—* సువేగభీమసేనుల గదాయుద్ధము. *—

అప్పుడు యౌవనాశ్వకుమారుం డగు సువేగుండు రథ ముడిగ్గి మహోగ్రగదాదండంబు సారించుచు భీమునిం డాసి వాసి మెఱయ శిరంబు నురంబుఁ బ్రక్కలుం జెక్కులు నొప్పించి యల్లటంబోక సుడిగాలితీరునం బేరెంబులు వాఱి యతనిగదాప్రహారంబుల మైమెలఁకువచేఁ దప్పించుకొని యుప్పరంబునకెగసియు దిక్కు లరికట్టియు విచిత్రవిహారం బులు సలిపిన నవ్వడముడి గదపొదలికలు మెఱయఁ గుడి యెడమలం జడియుచు నొడలు దగులం గొట్టుచు మండల ప్రచారంబుల గోమూత్రికాబంధంబుల సంచరించుచుఁ గోలాటలాడుచందంబునఁ గీలుబొమ్మలు నటించువైఖరి నా నాంబు లైన విన్నాణంబులఁ ద్రాణలు మెఱయించుచు గద లమర్చుకొని గగనము గదల నార్చుచు నొకరొకరిని మెదలనీయక పొదలికలుం గదలికలు మెఱయం బెద్దయుం బ్రొద్దు గదాయుద్ధంబు సేసి యుం గసి దీఱక గదలు దిగువ వైచి యాత్రైలోక్యమల్లులు మల్లయుద్ధంబునకుఁ జొచ్చి పాయుచుఁ డాయుచుఁ జుట్టుకొనుచు వదనవక్షోబాహు దేశంబులం దగులఁ బొడుచుచు "మేలు హైసరి మా యన్న హేయిరే!" యని మెచ్చుచు బాహాబాహిఁ గచాక

చిం దొడరి ప్రాబల్యదౌర్బల్యంబులు లేక తుల్యంబుగా మెలంగిరి. అప్పుడు భీమసేనుండు సువేగునిం జొచ్చి పడ వైచి చరణంబు లొడిసి పట్టి బిఱబిఱఁ ద్రిప్పి వేసిన భూత లంబు సోఁకి సోఁకకమున్న బంతిచందంబున నెగసి వాయు తనూభవు నట్లు చొచ్చి పట్టి త్రేసిన నవ్వడముడియు భూత లంబునం బడక నెగసి దట్టంబు లై పడియున్న ఘోటక గజకళేబరఘట్టంబుల వైచిన నవ్వీరుండు ముంజేత నొడ్డుచు దండె వెట్టి కఠోరముష్టిఘాతంబుల నొప్పించిన సమీర కుమారుండు వాని పెట్టు తప్పించి కర్ణకంఠగండప్రదేశంబులం బిడుగులంబోని పిడికిళ్లం బొడిచిన వాఁడునుం బొలివోవని బంటుతనంబున నొడ్డుకొని యఱచేతిపెట్టులఁ బెడచేతి దెబ్బల ముష్టిప్రహారంబుల జానుఘాతంబుల నొప్పించిన నాజగజెట్టు లొండొరులపెట్లవలన మూర్ఛల మునింగి పు డమిం బడిరి.

అంత వృషకేతనుండు కొంతవడికిం దెప్పిఱి వదలిన కేశపాశంబు బిగియించి యెప్పటియట్ల కిరీటంబు ఘటి యించి నుదుటిపయిం గనుపట్టు చెమటబిందువులు చేలాంచ లంబున నార్చుకొని బలువిల్లు పిడికిటం బదిలంబుగాఁ బట్టి యెదుట నున్నవిరోధి నీక్షించి ఱెక్కలతోడి పెనుఁబాముల చందంబునఁ గుందనంపుఁబింజల రంజిల్లు నైదుబాణంబు లొక్కపిడికిట నాకర్ణాంతంబుగాఁ దిగిచి యయిదుప్రాణం బులం గొనుతెఱంగున నమ్మండలేంద్రుని వక్షస్థలంబుఁ

దూఱనేసిన నతండు నెత్తురు గ్రక్కుచు మూర్ఛ మునింగి మరణంబు నొందినకరణి మేను మఱచి నిశ్చేష్టితుండై రథం బుమీఁద ఖోరగిలం బడుటయు వృషకేతుండు కరుణాకలి తమానసుం డై 'యక్కటా! క్షత్రధర్మం బింతక్రూరం బగునే' యని గర్హించుచు నతనిరథంబుమీఁది కరిగి గాయంబులం దొరఁగు నెత్తురు కేలం దుడుచుచు వృద్ధుం డైన యమ్మహీధవుని శిరంబునకు దాపుగాఁ దనయూరుకాం డంబు నునిచి తనువున నాటియున్న బాణంబులు తివిచి వైచి యుత్తరీయంబున గాయంబు లొత్తి యొత్తి తనబంగరు దట్టి ముంగొంగుచే నెమ్మొగంబున విసరి యుచ్ఛ్వాసని శ్వాసంబులును హృదయంబునుం బట్టి చూచి శ్రీహరి! నిర్వ్యాజకృపాలహరీ! ప్రత్యహంబును నీపాదారవిందంబులే భజియింపుచు దేవతాంతరంబు నెఱుంగ కుండితి నేని సుకృతశాలియుఁ బరాక్రమవిజితశూలియు సుగుణహారుం డును మహాశూరుండును నైనయీరాజేంద్రుండు బ్రదుకుం గాక! యని శ్రీకృష్ణచరణారవిందయుగళంబు మనంబునం దలంచి తలంచి యగ్గాయంబు లభిమంత్రించిన నెత్తురు లణంగి ప్రాణంబులు కుదురుపడి యుచ్ఛ్వాసనిశ్వాసం బులు యథాపూర్వంబుగా నిగుడ ఱెప్ప లల్లార్చి లోచనం బులు విచ్చి కర్ణసుతుని మొగంబు నూచి లేచి కూర్చుండుట యు వృషకేతుండు చివ్వన నతనిరథంబు డిగ్గ నుఱికి తొంటి దిక్కునకు వచ్చి విల్లు గైకొని గుణధ్వని గావించిన యావ

నాశ్వమహీశ్వరుం డక్కుమారుని శౌర్యధైర్యంబులు గరు
ణాపరత్వంబునుం గాంచి సంతోషభరితమానసుం డై శరశ
రాసనంబులు వైచి రథంబు దిగి వచ్చి కౌఁగిలించికొని కర్ణ
నందనా! నందనందనుండు నరవిందసంభవుండు నిందుశేఖ
రుండును సాక్షిగా నన్ను రక్షించితివి. ప్రాణదానంబు సేసిన
నీతోడ సమరంబునకుం గడంగితి నేని నాకంటె వెఱ్ఱి యెవ్వఁ
డున్నాఁడు? మీతండ్రి యయినకర్ణుండు నిఖిలదానంబులు
సేసెఁ గాని పోయిన ప్రాణంబులం దెచ్చి యిచ్చినవాఁడు
కాఁడు. జయలక్ష్మీవల్లభుండ వైననీకు నాసామ్రాజ్యభా
గంబు లన్నియు నర్పించి కమలపత్రాక్షుండును గౌస్తుభ
వనమాలికాకలితవక్షుండును యాదవకులోత్తంసుండును వేద
శాస్త్ర కృతప్రశంసుండును నైనకంసారిం గొలుచుచు సం
సారబంధంబుల నిరసించెద నని పలుకుచు యాతనిస
ఖ్యంబు సేసికొని, సువేగుండును భీమసేనుండు నున్నచోటికి
వచ్చి నృపకేతనుండు తన్ను రక్షించినచందంబు వారలతో
వివరించి "యనిలనందనా! యీశిరంబు మీరిచ్చినయది.
ఈ క్రతుహయంబు వెంట నన్నుం బనుపుము. నేనె దిక్కు
లరాజుల నెల్ల జయించి ధర్మజుసముఖంబునకు వచ్చెద.
అదియుంగాక యైరావతకులసంభవంబు లైన పదివేలయే
నుంగులు ధర్మజునకు నర్పించెద. దయాసముద్రుండు ననంత
కల్యాణగుణసమున్నిద్రుండును బురుషోత్తముండు నైనయా
దవోత్తముని చరణారవిందంబుల నత్తమిల్లి పుత్రమిత్రకళత్రాది

బంధుసమేతంబుగా నా సర్వస్వంబు సమర్పణం బొనరించెద. విశేషించి యును బ్రాణప్రదానంబు సేసినవారితోడి యుద్ధం బసంబద్ధంబు గావున మీకు నేను మాన్యుండను." అనియెడిరాజన్యుని సౌజన్యవాక్యంబులకుఁ బరితోషంబు నొందినపవననందనుసమీపంబునకు మేఘవర్ణుండును సవనహయంబునుం గొని వచ్చె.

—* యౌవనాశ్వుఁడు భీమాదులతో భద్రావతికేఁగుట. *—

తదనంతరంబ చిత్రవర్ణంబులును రత్నపరిస్తీర్ణంబులు నైనమెత్తలు ఘణంఘణితదిగంతరాళంబు లైనకాంచనఘంటికాజాలంబులును శరచ్చంద్రచంద్రికాడంబరంబు లైనకర్ణచామరంబులును బౌరసుందరీమందగమనసమానంబు లైన గంభీరయానంబులును గ్రమ్ముతుమ్మెదలకు సమ్మోదప్రదంబు లైన యష్టమదంబులును వజ్రవలయప్రభాధవళితదిగంతంబు లైనదంతంబులును గైరికాదిధాతురసకల్పితచిత్రతిలకంబు లైనగంధఫలకంబులునుం గలిగి ధవళవర్ణబంధురంబు లైన గంధసింధురంబుల మావంతులు బంతులుగాఁ దెచ్చి నిలిపిన యౌవనాశ్వపృథివీశ్వరుండు భీముండుం దాను నొక్కొక్క వేదండంబును, రెండుశుండాలంబుల మార్తాండపౌత్రుండును ఘటోత్కచపుత్రుండు గా నెక్కి లెక్కింపరాని సేనలు క్రిక్కిఱిసి నలుదిక్కులం గొలువ వందిమాగధబృందంబులు బిరుదావళులు వంశావళులుం జదువ భేరులు ఢమాములు ఢక్కలు హుడుక్కలు దమ్మెటలు గుమ్మెటలు మురజంబులు

నరగజంబులు కాహళంబులు జయదోహలంబు లైనశం ఖంబులు నసంఖ్యంబులుగా మొరయఁ గదళికాస్తంభం బులు పోఁకమ్రాఁకులు చూతపల్లవముల్లసితతోరణంబులు కాలాగురుసాంబ్రాణికాధూపంబులు మొదలైన యలంకా రంబులం బొలుపారు గోపురద్వారంబు సొచ్చి యచ్చటఁ బచ్చవిలుకాని తేజీకూనలంబోని చానల వలకారిచూపు లనియెడువలలం దలిగి యిట్టట్టు గదలనేరక జిట్టలచంద ముగఁ జిట్టకంబులం బొదలు చిట్టివిటులచేత హారువులైననెఱి తెరువులును మొత్తంబులైనముత్తియంబులు సొంపు లైనకెం పులు పచ్చికలం దచ్చన లాడుపచ్చలు నిగరాలమగఱా లును జగడంబు లైనపగడంబులును ముంగిళ్ల నత్తమిల్లిన యంగళ్ల నునిచిన మంగళద్రవ్యంబులును నంతరిక్షంబునఁ గాంతులు వింతలు పొంతలుగ సంచరించు వైజయంతికలును భూసురాశీర్వాదపురస్సరంబుగా సువాసినీజనంబులు చల్లు తెల్లనిపూవుల నక్షతలం దేజరిల్లురాజమార్గంబునం జని నవ రత్నరచితం బైనహజారంబు సేరంబోయి మదదంతావళం బులు డిగ్గి హితులఁ బురోహితుల మంత్రుల సామంతుల నిండ్ల కనిచి యౌవనాశ్వవిశ్వంభరాధీశ్వరుండు భీమ వృష కేతు మేఘవర్ణులతోడంగూడ నంతిపురంబునకుం జని హాట కమయం బైనకొలువుకూటంబున సింహాసనంబునందు సుఖా సీనులై యుండిరి. అప్పుడు యౌవనాశ్వునిభార్య యైనప్ర భావతి సఖీజనులుఁ దానును బంగరుమెఱుంగుంబళ్లెరంబున

ముత్తియంబులు పగడంబులుఁ గూర్చిన రంగవల్లికలు రం
గమరఁ గర్పూరదీపంబులు వెలుంగఁ జెలంగుచుం జను
దెంచి "సంగరంబునఁ దనదుమంగళసూత్రంబు సంగతిగ
నిలిపినసదయునకు జయమంగళం శుభమంగళ" మ్మనెడు
పాటలు పాడుచుఁ గర్ణకుమారుని కీర్తి లోకవిఖ్యాతం బగుం
గాక యని దీవించి వారలకు నివాళి దీసి యప్పురమసాధ్వి
యంతిపురంబునకుం జనియె.

తరువాత వరుణకాంతలు జలకంబు లాడుచు సన్నె
కంటిమీఁద నునిచిన పసుపుముద్ద చందంబున నరవింద
మిత్రుం డస్తగిరిశిఖరంబు నలంకరింపఁ గాటుకపొడి చల్లిన
తెఱంగునఁ జీఁకటులు నలుగడల నల్లుకొనియె. క్రేపులఁ
దలంచి మందల నున్నయావులు తిరుగంబడియె. పక్షులు
గూండ్లకుం బంతులుగట్టె. కమలవనంబులు సొగసె. కలు
వలు విరిసె. అవ్వేళ గబ్బిగుబ్బెతలు తెచ్చినబంగరుకుం
డల సలిలంబుల సంధ్యావందనాదికృత్యంబులు నిర్వర్తించి
యౌవనాశ్వుండు భీమసేన వృషకేతు మేఘవర్ణులును
దక్కుంగలబాంధవులును బంతి గూర్చుండి బంగరుపళ్లెరం
బులు పటికపుఁగోరలు మగఱాలగిన్నెలు కుందనంపుగిండ్లు
నునిచి చలువపరకాళకుచ్చెళ్లపెళపెళలు మగఱాలకమ్మల
ధళధళలు మొలనూలిచిఱుగంటలఘణంఘణలు కంకణం
బుల ఝణంఝణలు కీలందియల ఝళంఝళలు మట్టియల
గిలుకుగిలుకులం గులుకులు మెఱయఁ గోమరుఁ బ్రాయంపుఁ

బహంతులు చతుర్విధాన్నంబులు నింపుతో వడ్డింప రుచుల నుతియింపుచు భోజనంబు గావించి గంధోదకంబులఁ గర పదప్రక్షాళనంబు చేసి గంధపుష్పంబు జేతు లార్చికొని యూ డిగంబులు కపురంపువీడియంబు లందీయఁ గొలువునం గూ ర్చుండి పవననందనుని కోపప్రసాదంబులు వృషకేతను విక్ర మంబును మేఘవర్ణు నేర్పును వినుతించి ధర్మనందనవసుదేవ నందనుల సందర్శనంబు సేయఁ గలిగెఁ గదా యని తన పూర్వపుణ్యపరిపాకంబునకు మెచ్చుచుఁ బట్టణంబునఁ జా టంబనిచి యగసాలె పట్టుసాలె కుమ్మరి కమ్మరి చిత్రకార కలాదప్రముఖులు రజకక్షౌరకశిల్పాచార్యప్రభృతులు నైన పదునెనిమిదిజాతులవారిం బయనముసేసి తనయొద్ద నున్న మన్నీల వజీరుల రాజులం జూచి మీమీయంతిపురంపుటిం తులతో దంతిపురంబునకుం జనుండు. కుంతీ ద్రౌపదీప్రము ఖకాంతాజనంబులం గనుంగొని ముకుందచరణారవిందంబు లకు మ్రొక్కి గంగాతరంగిణిలో నశ్వమేధావభృథస్నానం బులు సేసి పావనమూర్తులరై వత్తురుగాక యని యాజ్ఞా పించి సుతుం దగునువేగునిం జూచి నీవు సకలదళంబులఁ దోడ్కొని మున్నుగా హస్తినాపురంబునకు నీజనని యగు

—* ప్రభావతి మాహాత్మ్యము. *—

ప్రభావతితోడంగూడ నీపల్లకుల మున్నిడుకొని పొమ్మని యాజ్ఞాపించిన నతఁ డంతిపురంబునకుం జని తల్లికి మ్రొక్కి "అమ్మా! ధర్మనందనుని యజ్ఞంబుఁ గనుఁగొనుటకుఁ గరినగ

రంబునకుం బోవలెఁ బయనంబు గ” మ్మనవుడు నవ్వనిత కోపించి “పుత్రకా! నీకేమిటికి వెఱ్ఱిపట్టె. ఈధనంబులు నీధాన్యంబులు నీపూకలు నీకోకలు నీయిండ్లు మొదలగు సంపదలు వీటిఁబుచ్చి నన్నెందులకు వెడలి ర మ్మనియెదు, మదిమదినుండి రాజ్యంబు విడిచి పోవుటకు నీ కేల బుద్ధి పుట్టె? పురజనులు మీరలు నెచ్చటి కేనియుం బొండు నీ వేమి చెప్పిన నే వచ్చుదానం గాను.” అనిన సువేగుఁ డమ్మా! యింతమూఢత్వంబు నింతసంసారభ్రాంతియు నీ కేల వచ్చె? ధర్మజుని యశ్వమేధంబున వేదవ్యాసప్రముఖు లైనమహామునులును నింద్రాదిదేవతలును దేవదేవుం డైన వాసుదేవుండును రుక్మిణీసత్యభామాప్రముఖ లైనయద్దేవుని పట్టమహిషులును జనుదెంతురు. వారల సందర్శనంబువలనఁ బంచమహాపాతకంబులు పంచబంగాళంబు లై పాఱిపోవుం గావున మఱుమాట లాడక లేచి ర” మ్మనిన “నోరి మాతాతతరంబున మాతండ్రితరంబున నాతరంబున నణుమాత్రం బేని పుణ్యంబు సేసి యెఱుంగము. ఈముదుసలి వయసున నీతోడుసులు నాకు వలదు. ధర్మనందన వసుదేవ నందనులను దర్శింపకున్న నాకు గోరంత కొఱంత లేదు. ధర్మజునకు యాగంబుమీఁద విశ్వాసంబు శౌరికి ధర్మరక్షణంబునఁ బ్రేమ నాకు సంసారంబుమీఁద భ్రాంతి. ఇది యెవ్వరికిం దప్పింప శక్యంబుగాదు. వేయేటికి? నేను యాగంబునకు వచ్చుదానం గాను. వలయు నేని మీరు సకుటుం

అనిన సువేగుఁడు యౌవనాశ్వ భీమసేనులకు నాయమ్మ పల్కులు పల్కరించి కొంతతడవు నవ్వించి యంతటం బరిచారికాజనంబులచే నయ్యాంబం బట్టితెప్పించి మొఱ్ఱో యని కూఁతలువెట్టుచు నీడిగిలంబడ నెట్టకేలకుం దిగిచి యందలంబుపై నిడికొని కరిపురంబునకుం* బయనంబయ్యె. పల్లకు లందలంబులు భద్రగజంబులు కొలారుబండ్లు గుఱ్ఱపుమోటులు వేసడములు మహోష్ట్రములు మొదలైనవాహనంబు లెక్కి పురంబులోనం గలుగు బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రాది పౌరజనంబులు రాజుకంటె నయిదుదినంబులు మున్నగా హస్తిపురంబునకుం జనిరి. కరితురగస్యందనంబులు వీరభటసమూహంబు లిరువంకలఁ గొలువఁ జలువలు వెదచల్లు వెల్లగొడుగులనీడ యువనాశ్వవృషదశ్వతనూజులును గుఱ్ఱముతో వృషకేతు మేఘవర్ణులును గతిపయప్రయాణంబుల హస్తినాపురంబునకుఁ జేరవచ్చుచుండ నిరువదియామడదూరంబున నిలిచి* భీముఁడు యౌవనాశ్వుం గాంచి “కాంచనాహార్యధైర్యా! మీరు విజయంబుచేయువిధంబు మున్నగామాయన్నతో నెఱింగించి యెదురుగఁ దోడితెచ్చెద. వృషకేతుండు మిమ్ముం గొలిచి వచ్చు” ననిపలికి శీఘ్రబుగఁ గరిపురంబునకుం జని యందు నవరత్నఖచితంబైనసభామందిరంబున బంగరు సింగంపుమోము గద్దె

* మాతృకలోఁ దాఱుమాఱుగానున్న యీవాక్యము లిం దర్థ-పరోచితముగా సవరింపఁబడినవి.

X

యందుఁ దమ్ములు గొలువ రెండవయాఖండలుం డన నిండోలగం బైనయగ్రజుం గాంచి సవినయంబుగా సాష్టాంగనమస్కారము గావించిన నతండు దీవించి దిగ్గనలేచి కౌఁగిటం జేర్చుడు నర్జునుండును మాద్రీనందనులును దనకు వందనంబులు సేసిన వారల నభినందించె. అంతఁ గాంతేయాగ్రజుండు 'సమీరకుమారకా! సేమమే, యని యడిగినఁ గరకమలంబులు ఫాలతలంబునం గీలించి రాజోత్తమా! యుత్తమం బైననీకరుణ గలిగి యుండ సేమంబు నకుఁ గొఱంత యేమి! భద్రావతీశ్వరుం డగుయావనాశ్వుం డశ్వమేధాశ్వంబుం గొని వచ్చె. విశ్వంబున నీకీర్తి శాశ్వతంబుగా వర్తించు. అతనిసతి ప్రభావతి సఖీసహస్రంబుతోఁ బాంచాలిని గనుఁగొన వచ్చుచున్నయది. వృషకేతుండు భండనంబున నప్పుడమిఱేని మెప్పించె. మేఘవర్ణుండు సావఘళంబుగా నధ్వరాశ్వంబుఁ బట్టికొని వచ్చె ననిన ధర్మనందనుం డానందకందళితాంతరంగుఁడై మనవిజయంబు యాజ్ఞసేనికి నెఱిఁగించి ర మ్మనిన నతండు నంతిపురంబునకుఁ జనినఁ గనకపీఠంబునం గమలకర్ణికాసీన యగు కమలాదేవికరణిం గూర్చున్న ద్రౌపది దిగ్గన ద్దియ డిగ్గి యెదురు వచ్చి నాయుతనూభవుం గనక ంతంబున నునిచి విజయంబు గలుగ విజయం చేసితిరె? ర్ణనందనుండును నామనుమఁడు మేఘవర్ణుండును సేమంబున న్నవారె? యని యడుగుచు నతని కడిందిఱొమ్మునఁ

గనుపట్టు వెడందగాయంబులు కరకమలంబున నిమురుచుఁ గుశలప్రశ్నంబు సేసిన "భద్రేభయానా! భద్రావతీశ్వరు రాణి యగు ప్రభావతీమంజువాణి వేవురుచెలులతోడంగూడ నిన్నుఁ జూడవచ్చుచున్నయది. కావున నీవు నలంకరించు కొని యమ్మించుఁబోఁడికి నెదురుగ రమ్ము. మనకు రక్షకుఁ డైనపుండరీకాక్షుండు ద్వారకానగరంబునకు నరిగెనో యి చ్చట నున్నవాఁడో" యని యడిగినఁ గృష్ణ యి ట్లనియె. ఆశ్రీకృష్ణుండు నల్లదె నీలంపుటుప్పరిగలో నున్నవాఁ డనిన సంతోషభరితాంతరంగుఁ డై నీమందిరంబున నిందిరా కాంతుం డున్నవాఁడు గావున నీవు ధన్యవు. తామసింపక శృంగారంబు సేసికొని యంగనాజనులు నీవును బ్రభావతికి నెదురుగా రండని పలికి యనిలనందనుండు చనినఁ బాం చాలియుఁ బన్నీట జలకంబులాడి వెన్నెల న్నిరసించు సన్న హొన్నంచువలువ విన్నాణంబుగాఁ గట్టి నెఱికురులవిరులు దుఱిమి సిస్తుగాఁ గస్తూరిరేఖ ఫాలతలమునం దీర్చి తార హారంబులు హీరకంకణంబులును జారుకాంచీమంజీరంబులు మొద లగుసొమ్ములు ధరించి యలంకృత లైనసఖీసహస్రంబు లతోఁగూడ జీవరత్నంపు గుంపుల నుల్లసిల్లుపల్లకిపై నెక్కి హల్లకపాణులు వింజామరంబులు వీవ నంతఃపురసంచారు లగుకంచుకులు సందడి ఱొమెడగలుగం జడియ వెడలునపుడు యుధిష్ఠిరుండును నచ్యుతుండును శృంగారితంబు లైనయే నుఁగులపై నెక్కి శంఖకాహళదుందుభిమృదంగపటహాము

రజఝల్లరీజర్ఝరీడిండిమప్రముఖవాద్యంబులు భూనభోఽంతరమున బోరు కలంగ మ్రోయ నెదురు వచ్చిన యౌవనాశ్వుం డధ్వరాశ్వంబు గానుకగా నునిచి దండప్రణామంబు సేసినం బాండవాగ్రజుం డేనుంగు డిగ్గి యానృపాలునిం గౌఁగిటం బొదివి నరవరేణ్య! భీమార్జుననకులసహదేవులట్లు నీవును నాకు నొక్క సహోదరుండవు. ద్రౌపదితోఁ గూడఁ బ్రభావతి నంతిపురంబునకుఁ బంపు మనుటయు నతండు నట్లు గావించె.

తదనంతరంబ యౌవనాశ్వమహీశ్వరుండు గోవిందుని పదారవిందంబులు తనశిరంబున సోఁకం బ్రణమిల్లి "ముకుందా! నందనందనా! అరవిందనయనా! ఇంద్రాదివందితా! భవదీయపాదారవిందంబులు దర్శింపఁ గంటిఁ గావున నా జీవనంబు సఫలంబు. భవదీయభక్తులైన భీమవృషకేతుమేఘవర్ణులు మెట్టిరి గావున మాపురంబు సిరులకుం గాఁపురంబు. ధర్మజుని జన్నంబున కొదవెం గావున నీతురంగమంబును జనహృదయంగమంబు. ఇన్నిటికి శేఖరంబుగ నీకు జోడు కోడెయైన యర్జునునిం జూడఁ గలిగె" నని పలుకునవసరంబున సవ్యసాచి యవ్విశ్వంభరాధీశ్వరుఁ బరిరంభణం బొనర్చి "నీవు నాకు ధర్మనందను నట్ల పూజ్యుండవు. నాచేసిన పురాకృతపుణ్యంబున నీసందర్శనము గలిగె" నని కొనియాడె. అప్పుడు పాంచాలికిఁ గుంతీదేవికిఁ బ్రభావతి చాఁగిలి మ్రొక్కిన వార లక్కోమలి నక్కునం గదియించి మిక్కిలి

గారవించిరి. అంత భద్రావతీశ్వరపుత్త్రుం డైన సువేగుండు ధర్మజప్రముఖులకు వందనంబు సేసి "కర్ణనందనునికతంబున శ్రీవాసుదేవచరణారవిందంబులు సేవింపం గలిగె. మాభాగ్యంబు నెంతని వినుతింతుము. ఇంక సర్వకాలంబులందును నద్దేవుని చరణకమలంబులు స్మరియింపుచు నుండఁగలవారము. శ్రీకృష్ణునకు నర్పితంబు గానిరాజ్యంబు ధనంబును వ్యర్థంబులు. మఖతురంగంబు వెంట నన్నుఁ బనుపుము. ఎదిరించు మేదినీపతుల నెల్లఁ జెల్లాచెదరుగాఁ బాఱం ద్రోలి నేన యశ్వంబు రక్షించుకొని వచ్చెద" నని పలికిన సువేగునిఁ గౌఁగిటం జేర్చి శ్రీహరి కరుణాకటాక్షంబుల వీక్షించె. వృషకేతుండును నందనందనపురందరనందనులకు వందనంబు గావించిన నందఱుం బ్రమోదకందళితమానసులై కరినగరంబునకుం జనుదెంచిరి. అంత రుక్మిణీకాంతుండు దంతిపురంబున నొక్క నెలవసియించి ధర్మతనయునిం జూచి 'యిందునకుఁ బదునొకండవనెల చైత్రశుద్ధపౌర్ణమాసినాఁడు జన్నం బొనర్చుట ముఖ్యంబు గావున నిప్పు డుగ్రసేనభూపాలకునిచే సంరక్షితంబైన ద్వారకాపురంబునకుం జనియెద. యౌవనాశ్వ, నర్జును, భీమునిం దక్కిన యోధులను దురగంబుఁ గావం బంపవలయు. నీవు ద్రౌపదీసమేతంబుగా యాగదీక్షఁ గైకొని సావధానంబుగా నుండందగినయది. యాగదీక్షాకాలంబున మమ్ముం బిలిపించితివేని బంధుమిత్త్ర సమేతంబుగా వచ్చెద' మని పలికిన గోవిందునికందువ యొ

జేరంగి కుంతీనందనుండు బహువిధము లగు బహుమాన ములు గావించి వీడ్కొలిపిన సంపత్పారంపరీనిర్జితాలకా పురం బైనద్వారకాపురంబునకు వనజాక్షుండు విజయంబు సేసె.

—* వ్యాసుఁడు మరలవచ్చుట. *—

తదనంతరంబ కృష్ణద్వైపాయనమహామునీంద్రుండు సన్నిహితుం డగుటయు ధర్మతనయుండు వినయంబున వంద నంబు సేసి యర్ఘ్యపాద్యాదివిధులం బూజించి నవరత్నపీఠ మున నునిచి కృతాంజలి యై మహాత్మా! మున్ను మరుత్తుం డనుమహారాజు యాగం బెవ్విధమునం జేసె? నానతి యొ సంగవలయు ననిన వ్యాసమునీంద్రుండు నరేంద్రునిం జూచి, "తొల్లి, హరిధ్యానసమాయత్తచిత్తుం డైనమరుత్తుం డశ్వమేధం బొనర్పం గోరి బృహస్పతి నాచార్యునిఁగా వరించిన నింద్రుం డసూయచే నతనిం బోవల దని నివా రింప నతనితమ్ముం డైన సంవర్తుని గురువుగా వరియించి యా గంబొనర్చునపు డింద్రాగ్నులు విఘ్నము సేయందలంచిన వారల నిరాకరించి యాగంబు నెఱవేర్చి యామరుత్తునకు వరంబులొసంగి సంవర్తుండు యథేచ్ఛంబుగాఁ జనియె. అన్న రేంద్రుండు సర్వభూతనివాసుం డైన శ్రీనివాసదేవునిసాయు జ్యంబు వడసె" ననిన విని యమతనయుం, "దేధర్మమువలనన రుండు భవబంధంబులం దరించు నాధర్మం బాన తీయవలయు" ననుటయు సాత్యవతేయుండు, కౌంతేయునింగాంచి "వేద

శాస్త్రంబులు సదివి తదర్థంబుల నెఱింగి తాను నాచరించిన బ్రాహ్మణుండును, నయమార్గంబున భూమండలిం బరిపాలించినక్షత్త్రియుండును, వంచన లేక క్రయవిక్రయాదులు గావించిన వైశ్యుండును, శ్రీమన్నారాయణస్మరణయు బ్రాహ్మణపూజయుం గావించిన శూద్రుండును నైహికాముష్మికంబుల సుఖంబుం గాంతురు. ఇంక స్త్రీజనుల లక్షణంబులు వినుము. చక్కనిపురుషునిం గన్నఁ గూడఁ జనుటయు బిత్తరంపుఁ జూపుల తెప్ప లల్లార్చుటయు, సంకేతంబుగ మాట లాడుటయుఁ, జెలికత్తెం బిలుచువిధంబున నుచ్చైస్స్వనమునం గూయుటయుఁ, బలుమాఱు నవ్వుటయుఁ, బొరుగిరుగులకుఁ బోవుటయు, మేరమీఱి పలుకుటయు, సారెసారెకుం బైఁట జార్చుటయు, మిగుల సిగ్గరికత్తెయుం బలె మెలంగుటయుఁ, బరపురుషులచంక నున్నపసిబిడ్డల ముద్దాడుటయుఁ, గోడ నెక్కిచూచుటయుఁ, గొప్పు దిద్దికొనుటయు, నత్తమామలకు మగలకు మాఱుమలయుటయు నివి మొద లగువికారంబులు జారకాంతాలక్షణంబులు. మఱియుఁ బువ్వులమ్ము పువ్వుఁబోఁడితోడ, దాసీజనులతోడ, సైరంధ్రులతోడ, దాదులతోడ, మగలు విడిచిన సతులతోడ, మంత్రసానులతోడ, దూతికలతోడ, జోగురాలితోడ, నాకులమ్మెడి యంగనతోడ, వితంతువుతోడం గూడి చెలిమిచేయుదానిం గుల ట యని యెఱుంగవలయు. ఈచెప్పిన దుష్టసతులలో దూతియు దాదియు నను నిరువురు జారిణికి సాహససముద్రంబు

గడవం జెప్పలు. కావున మానధను లగుపురుషులు చానల
కుం జన వీయంజనదు. జననంబు మొదలు మరణపర్యంతంబు
వారల నమ్మంగూడదు గావున నత్తయు మామయు మగం
డునుం గత్తులబోనులవలె మత్తకాశినులం గదలమెదలకుండం
గాపాడందగు. కౌమరుం బ్రాయంపుటింతులచిత్తము సదాపర
పురుషభోగాయత్తం బై యుండు నని యెఱుంగుము. విధ
వయగు వెలంది యుపవాసంబులచే మేను గృశింపంజేయక
పాలు పెరుంగు ఘృతంబు మొద లగురసద్రవ్యంబులచే
దేహంబుం బోషించుచు మలినవస్త్రంబులు గట్టక మడుంగు
లుగట్టుకొని మైపూంతలు వెట్టుకొని దానధర్మంబులు సేయక
వడ్డికిచ్చి కూడం బెట్టుచు తలిదండ్రులక్రింద నడంగక పొరు
గిరుగిండ్లం దిరుగుచు హరిస్మరణంబు లేక దుర్భాషణంబులు
గూయుచునుండెనేని పెనిమిటితోడంగూడ దానును గల్పాం
తరంబులు నరకకూపంబునంగూలు. నాలుకయుం దాలువులు
నధరంబులు నీలవర్ణంబు లై యెవ్వతెకుండు నేతరుణిపాద
ములు నేల మోవకయుండు నత్తరుణి శీఘ్రంబుగ వైధవ్యంబు
వహించు. విధవాసంగమంబు చేసినయధముండు దాను
జేసిన పుణ్యంబులెల్లం గోల్పడి నరకంబునంబడు. బాల్యం
బునం దల్లిదండ్రుల మఱుంగునం, బ్రాయంబున మగని
యొద్ద వార్ధకమునం దనయునికడ నుండవలయుం గాని
స్త్రీలకు స్వాతంత్ర్యం బెన్నటికిం జెల్లదు. ఇది నీయడిగిన
ప్రశ్నంబునకు నుత్తరంబు. నీవు జూదరుల నాస్తికుల నసూ

యాపరులఁ గొండెంబుపలుకువారలం జెంతం జేర్పక ప్రజలం బాలింపుము. పోషింపఁబడిన జనులచేత ధనంబును ధనంబుచే ధర్మంబును ధర్మంబునఁ గీర్తియుఁ జేకుఱుఁ గావున రాజులకుం బ్రజాపరిపాలనం బవశ్యంబును జేయవలయు. తనకీర్తి మర్త్యులకుఁ గీర్తనీయంబై యుండ నారాయణచరణారవింద సంస్మరణశీలుం డైయున్న భూపాలుం డీహంబున భోగంబును గీర్తిని బరంబునఁ గైవల్యంబును గాంచు. శమదమసదాచార సంపన్నుం డైనబ్రాహ్మణుం డేనియు శ్రీవిష్ణుభక్తివిరహితుం డయ్యెనేని చండాలుం డని యెన్నుము. చండాలుం డేనియు శ్రీహరిపదాయత్తచిత్తుం డైనఁ ద్రైలోక్యపూజ్యుం డగుం గావున నీవు శ్రీ వాసుదేవచరణారవిందంబులు త్రికరణంబుగ నమ్మి సుఖంబుననుండు" మన ధర్మనందనుండు,మహానుభావా! ఆభక్తి యెవ్విధమున వచ్చు? లక్ష్మీవల్లభుం డెవ్వారల గృహంబుల నిలుచు నని యడిగిన, నమ్మునీంద్రుండు, "తనశక్తివంచన చేయక పితృదినంబులు నెఱవేర్చునతండును దీర్ఘయాత్రాపరుండును దానశీలుం డయ్యు వినయపరుండగువాఁడును బరకాంతాసంగమంబు గోరనివాఁడును, శూరుండును సత్యము శుచిత్వమునుం గలుగువాఁడును జననీజనకుల బాంధవులం బోషించువాఁడును బాపభీరువును సప్తసంతానములంబడసినవాఁడు, దయాపరుండు చేసిన మేలుమఱవనివాఁడు తక్కుంగల పుణ్యపురుషులగృహంబుల మహాలక్ష్మి వాసంబుసేయు నచ్చుటనే శ్రీమన్నారాయణుండు నెలకొని

యుండు. జూదగాని దుష్టుని దుర్వ్యసనశీలుని జోరునిం జారుని సజ్జనదూషకుని దబ్బఱకాని నిర్దయు గృహదాహకు లుబ్ధుని స్వోదరపోషకుని గర్వోద్ధతుం బెడఁబాసి లక్ష్మి, పరాన్నభోజనశీలుం డగుబ్రాహ్మణుని వేదాదివిద్యలువిడిచిన తెఱంగునఁ దొలంగిపోవు. ధర్మనందనా! తొల్లి నీవు దుర్వ్యసనాసక్తుండవై జూదంబాడితి వదికారణంబుగా నింత యనర్థంబు సంభవించె. ఇంక నెన్నండట్టు లాచరింపకుము. కృష్ణపదభక్తిపరాయణుండ వయియుండుము. వ్యతీపాతవైధృతిసంక్రాంతి యమావాస్య మొదలగు పితృదినంబులఁ దీర్థయాత్రావ్రతచర్యాదినంబుల వనితాసమాగమం బొనర్చినవాని యొద్ద లక్ష్మి సేరవెఱచు. నీకుం దెలియవలయు నర్థంబులు దేటపఱిచితి. ఇంకఁ దామసింపక జన్నం బొనర్పవలయు. కావున సకలశ్రేయంబులకు హేతు వయినశ్రీకృష్ణదేవుం బిలిపింపు" మని యానతిచ్చె.

—* ధర్మజుపనుపున భీముఁడు ద్వారక కేగుట *—

అంత నజాతశత్రుండు వైరిసేనాభీముం డైనభీముం బిలిచి నీవు ద్వారవతికిం జని యాగయోగ్యం బైన చైత్రమాసంబు సేరవచ్చెం గావున మంత్రిపురోహితసామంతదండనాథబంధుమిత్రపుత్రకళత్ర సమేతంబుగా రుక్మిణీకాంతునిం దోడ్కొని ర మ్మని పంచిన నన్నపాదంబులకు మ్రొక్కి వృకోదరుండు సత్వరంబుగా ద్వారకానగరంబునకుం జని దేదీప్యమానదివ్యరత్నప్రభాధగధగితనిజారరం బైనమహాజారంబు సొ

చ్చి చిరత్నరత్నమయంబులును గాంచనసమంచితంబులును గలధౌతనిర్మితంబులునైన జోడు పక్కెర పల్లంబు జానంబు నం

—* శ్రీకృష్ణుని భోజనసమయము *—

కవన్నెలు మున్నగుముస్తీదులతోఁ గైజామోఱ లల్లార్చుచు రాజిల్లు వేనవేలు పడివాగె తేజీలును నడగొండలు సెలయేఱులం బోలుపొందుకైవడి మదధారాధూసరితగండస్థలంబులైన వేదండతండంబులును వివిధాయుధసంపన్నం బైనవీరభటవ్రాతంబును బోలుపొందు కక్ష్యాంతరంబులు గడచి ఫణిహారిం గనుంగొని తనరాక లోకరక్షకుండైన పుండరీకాక్షునితో విన్నవింపు మని పంచుటయు వాఁడునుం జని దివ్యరత్నప్రభానికరంబులచే నంధకారంబు దూరంబునం ద్రోయుచుఁ గాలాగరుసాంబ్రాణిగంధసారకర్పూరధూపంబులపరిమళంబుచే భూనభోఽంతరంబులు వాసింపంజేయుచు బంగరుచెఱంగుల రంగుమెఱయుచీనిచీనాంబరంబుల తెరలును గ్రొత్తముత్తియంపుజల్లుల నుల్లసిల్లుచుఁ గందొవలకు విందులుసేయు చెందొవలచందువలును రత్నప్రభాకంబరంబులైనరత్నకంబళంబులును జిలుకలుఁ గోయిలలు గోరువంకలుఁ జకోరంబులు (1)శతపత్రంబులుఁ బావురంబులు మయూరంబులు లేళ్లు దుప్పులు జింకలు మొదలగు సకలవిషదోషపరిహారక్రియానిపుణచాతురీధుర్యంబు లగుమృగపక్షిసమూహంబులచే నభిరామంబును మల్లెలు మొల్లలు జాజు

(1) శతపత్రము=బెగ్గురుపిట్ట.

లు విరవాజులు పొన్నలు పొగడలు సంపంగులు గోరంటలు
చేమంతులు చెందామరలు చెంగలువలు మొద లగుపూవు
లతోరణంబులచే నేత్రానందకారణంబును నైనభోజనాగా
రంబున మృగమదంబున నలికిన ఘనసారరజంబున రంగవల్లి
కలం దీర్చిన చతురస్ర వేదికయందు బాలభానుప్రభాభాస
మానరత్నపీఠమున సుఖాసీనుండై నవరత్నమయం బగుపళ్లె
రంబున దేవకీదేవి వడ్డింపఁ దుమ్మిపూవులచందంబునఁ దెల్ల
నగురాజాన్నంబులును సువర్ణచ్ఛాయారూపంబు లగుసూపం
బులును సద్యోఘృతంబులును నప్పడంబులు వడియంబులుఁ
దాలింపులు సంభారపరిమళగంభీరంబులై నులివెచ్చ నగు
పడిదెంబులుఁ గలవంటకంబులుఁ దియ్యచేగులు మోరుఁజే
రులుఁ బంచదారలుఁ బానకంబు లానవాలుఁ జక్కెర పొం
గలి దధ్యోదనంబు పులియోర యొల్లోగిరంబు నతిరసంబులు
వడలు నప్పంబులు దోసె లిడ్డెనలు లడ్డుకంబులుఁ బేణీలు
సుకియలుఁ గుడుములు మణుంగుఁబూలు సారెసత్తులు
మనోహరంబులు నఱిసెలు నమృతఫలంబులు మండెఁగలు
మొద లగుభక్ష్యవిశేషంబులును బాయసంబులు శిఖరి
ణులు(2) ఫలరసాయనంబులుఁ బచ్చళ్లుఁ బెరుఁగు లూరుఁ
గాయలు వరుగులు నాది యగుభక్ష్యభోజ్యలేహ్యచోష్య
పానీయంబులును గుందేలు, ఉడుము, ఆళువ, లేడి, యడవి
పంది మొదలైనభూచరంబులును గండె వాలుగ జెల్ల మలు

---

(2) శిఖరిణులు=సిగరులు, మజ్జిగపులుసు.

గు కొఱ్ఱ మాఱువాయి బొమ్మిడాయ యిసుకదొందు ఉలచ తిఱికి చేప తాఁబేలు మొదలగుజలచరంబులును గొఁజు పూరేడు పొట్టిపిట్ట పొన్నంగి వెలిచె బెడిచె లావుక కేర జము బెళవ పొడబెళవ పచ్చబెళవ కాటిగాఁడు ఉల్లంకి చింతవంకలు లకుముకి వంగపండు మొదలగుఖేచరంబు లునుం దెచ్చి లవణామ్లమరీచికాజీరకకర్పూరమృగమదాది పరిమళసంభారసంభృతంబులుగాఁ బాకం బొనర్చి బంగరు గిన్నెలఁ బటికంపుదొన్నెల నుంచి యమర్చియుండ రుక్మిణీ సత్యభామ లిరుకెలంకులఁ గంకణఝణఝణాత్కారంబులు తోరంబులుగా సురటులు వీవ జాంబవతీమిత్రవిందలు చేపా వడలువీవ లక్షణాసుదంతలు బంగారుగిండ్లతో గంధోదకం బులు పూని యాయత్తముగా నిలువ భద్రయుఁ గాళిందియుఁ జెలికత్తెలం బంపి యయ్యెవస్తువులు వేవేగఁ దెమ్మని తీవరిం చుచునుండ నారగించుచు నుండినసమయంబున నప్పుండరీ కాక్షునితో దౌవారికుండు భీమసేనురాక నెఱింగించిన నవ్వి యవ్విరించిగురుండు వాకిట నిలువనేల వేగంబ తోడు కొని రమ్మని పంచిన వాయునందనుండు నందనందనుని సన్నిధికిం జని సాష్టాంగదండప్రణామంబు సేసిన శ్రీవాసు

—* శ్రీకృష్ణభీముల సంభాషణము. *—

దేవుండు, మందహాసభాసురవదనారవిందుం డై "బావా! నీభావంబుననున్న కార్యంబు లన్నియుఁ గుశలప్రశ్నంబును వెనుక నొడువుదువు. ఇంతియకాని మున్నుగ బుద్ధిమత్కృ

త్యం బగుభోజనంబు నాకంతపరిపూర్తిగఁ గావింపుము. అట్లు గాక నీకెద్దియుం దోఁచదు. నాపలుకులకు శంక వలదు. నీకరణి బహుభక్షకు లగస్త్యకుంభకర్ణాదులు కొందఱు గలరు. నీ వేమిటికి సిగ్గుపడియెదవు." అనిన ననిలనందనుండు మందస్మితంబు వదనంబునం గనుపట్ట, యాదవేంద్రా! నీ వింత లెన్నెన్ని పల్కరింతు! కడుపారం దల్లి పాలు గ్రోలియుఁ జాలకపురుటింటిలోనఁ బూతనచనుఁబ్రాలు గ్రోలి దానిం బిలుకుమార్చితివి. జనని వెట్టిన యుగ్గునం దృప్తి నొందక ప్రేపల్లెలో నున్నవెన్నలు పాలు నిచ్చ నిచ్చలు ముచ్చిలించితివి. యశోదమ్మపొత్తున భుజియించియు నాఁకలి యడంగమి నింద్రయాగవిఘాతంబు సల్పి యతనికై యుంచిన యన్నరాసుల భక్షించితివి. మాత యొసంగు నేతికజ్జాయంబులు చాలక కుచేలుచేతియడుకులు నాఁచికొని మెసవితివి. యుగాంతకాలమునఁ జరాచరపరిపూర్ణంబు లైన బ్రహ్మాండకోటు లుదరంబులోఁ గూరుకొని యుండిన నఱకొఱఁతయ గాని తృప్తుండవుంబోలె నుండ లేదు. ఇట్టినీపొత్తున భుజియింపు మనిన నాకుం బోసంగునె! నీవు మెండైనదీపనంబు గలవాఁడవు. అని పరిహాసంబు లాడుచుండ వాయునందనుని గనకాసనంబునఁ గూరుచుండ నియమించి సరసాన్నపానంబులం దృప్తి నొందించి యొక్క రమ్యస్థలంబున వసియించి యంగరాగంబులు కప్పూర తాంబూలంబులుఁ గుసుమమాలికలు నవరత్నఖచితభూషణంబులు

దుకూలంబులు వలయునస్తువాహనంబులు బహుమానంబు లొసఁగి, వచ్చినకార్యం బడిగి, యతనివచనంబు లాలకించి, కృతవర్మం బిలిపించి, "పౌరజనులనెల్ల నజాతశత్రుని యశ్వమేధాధ్వరంబు గనుఁగొనుటకుఁ బయనంబు గండని చాటింపఁబనుపుము. నగరసంరక్షణంబునకు మాతంత్రి యగు

—* శ్రీకృష్ణుఁడు సకలజనులతో హస్తినాపురమునకు వచ్చుట *—

వసుదేవుని నన్నయగు బలభద్రుని నియోగించువాఁడ" నని యానతిచ్చె. అపుడు భోజభూనాయకుండు కల్పాంతకాల తంతన్యమానధారాధరగర్జితానుకారి యైనప్రయాణభేరి వేయించినఁ బురజను లాబాలగోపాలంబుగాఁ బయనంబు వెడలిరి. అపుడు పుండరీకాక్షుండు వసుదేవునిచెంత కరుగుదెంచి నమస్కరించి తన పయనంబుం దెలుపుటయు నతండు కుమారుం జూచి, నీవు ధర్మజునశ్వమేధాధ్వరంబు నవలోకింపం బోవునప్పుడు హరికథావిముఖుండును నన్యాయవర్తనుండును ధర్మార్థకామరహితుండును దపోవర్జితుండును మిత్రవంచకుండు స్వామిద్రోహి పతితుండుఁ బందయుఁ బరదారనిరతుండు నల్లునిసొమ్ము భక్షించునధముండు ధర్మబాహ్యుండు విదూషకుండు దుర్వ్యసనాసక్తుండు బహుభాషియు విశ్వాసపాతకియు ఋతుకాలపరిత్యాగియుఁ గష్టలోభియు ఖలుండు నాత్మస్తోత్రపరుండు గలహశీలుండును గృతఘ్నుండు భృత్యవంచకుండును క్షేత్రవిత్తాపహారకుండును నగువారలఁ దోడుకొని పోవలదు. నినుం బాసి నిమిష

మాత్రం జేనియు నోరువం జాల నని తానును బయనం
బైనం గమలలోచనుండు నగరసంరక్షణార్థంబుగ మీా కుం
డక తీర దని యొడంబడం బలికి ప్రశస్తముహూర్తంబున
నాప్తమంత్రి యోధభృత్యవర్గము పరివేష్టింపం బల్లకుల ముం
దరం బనిచి యదువృష్ణిభోజాంధకవీరులతో నిరాఘాట
ధాటీపాటవంబునం బటుతరం బైనతురంగంబు నెక్కి పురంబు
వెడలి గండస్థలంబులం దొరంగు మదాంబుధారావాసనల
కుం గ్రమ్ము తుమ్మెదలకై శిరంబులు గదల్చుచు ఘీంకారం
బులు సేయుసింధురంబులును సింధురంబులం జూచి కెరలి
రాహుత్తులు తత్తఱం బంద దాంటుతురంగంబులును దురం
గహేషారవంబులకు బెదరి గోనెలు దిగవైచి పాఱువృష
భంబులును వృషభమ్ముల సందడి దందడిగొని మోపులు
క్రిందం బడవైచి దైవంబును దూఱుభారవాహకులును
గలిగి ఔమ్ము ఔమ్ముం దొలంగం ద్రోయరాని సందడిలో
మందమందగమనమ్మున గోవిందుండు చనుచు, జనుపనార
లంబోలు తలవెండ్రుకలు గాలి కల్లాడ వెలిచిన చెవ్వాకులు
కర్ణంబుల వీడ రొంటిమీాందం గట్టిన ముదుకచేలంబు లూడ
నాడాడ నల్లుండ్రం జూచి యింటికి రావైతి వేమి? నాకూం
తురు నిన్నుం జూడక రాతిరియెల్ల నిదురరాక విరహవేదనం
బొరలుచుండె' నని పలికి బెల్లించి విటులచేతుల నున్నవక్క
లాకులు జల్లించి కొలయూనికొనుచు మెల్లమెల్లనం జని
యెవ్వరినిం గన్న నవ్విధంబున నె పలుకుచుం బయనంబు

సనుచున్న వృద్ధవారకాంతలం గనుఁగొని చిఱునగవు దళుకొత్త భీమసేనుదిక్కు మొగం బై, వాయునందనా! తొల్లి వయసుకాలంబున నాటిన గోటిమీటులు మోవికాటులు గాయలుకాచి, నీ మేని గాయంబులకరణిం గనుపట్టు. బొట్టలం బోని పొట్టలు నీపొట్టకు సమానంబై చూపట్టు. అతిస్థూలాకారంబుల నీకు సమానలై యున్నయీవృద్ధవేశ్యలం బరిగ్రహింపు మనిన నవ్వి భీముఁడు, మున్ను మధురానగరంబున మువ్వంకగూనిదాని నొక్కఁతెం జక్కఁ బెట్టితివి పాదపద్మపరాగంబులచేఁ బాషాణంబును యోషారత్నంబుఁ జేసితివి. ఇట్టి కొఱమాలిన జంతువుల నెల్ల దిద్దికొనుట నీభారంబుకాని మాకుం దరం బానె! ఎంతపాఱవేసినవారలైనను నీకటాక్షంబున ధన్యులగుదు రని పలుకుచు నయ్యిరువురుఁ బరిహాసంబు లాడికొనుచుఁ గొంతదూరంబు చనిరి.

రుక్మిణీకాంతుఁ డందం బైనచెందొవలవలనం జెందిన పుప్పొడులు గప్పి యొప్పులు గులుకు తరంగంబులం జెలంగు రాజహంస చక్రవాక బక క్రౌంచాదిపక్షిగణంబుల కోలాహలముచే మనోహరంబును బాపహరంబును మాధురీజితసుధాసారంబు నైన కాసారంబుఁ గాంచి దానితీరంబునఁ జందనమందారకుందకురవకాశోకకదళీప్రముఖతరువుల నీడలఁ బాళెంబులు విడియ నియమించి బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులును నటనర్తకగాయకవందిమాగధులును జిత్రకార ఘటకార పటకార సూచీకారకులు మొదలైనజాతులవా

రును నవ్యోత్తావుల గుడారంబులు వైచికొని నిలిచి రంతఁ బ్రియకాంత యైనరుక్మిణీరమణిం జూచి రాజహంసములు మదపుటేనుంగులు గండుఁదుమ్మెదలు మధురసంబుల నాస్వాదింప సొంపు మెఱయునీపద్మినిం గంటివె! పురుషులకంటెఁ బొలఁతులకుఁ గామం బెనిమిదింత లధికము గదా యనిన నక్కాంత తనకాంతునితో, దేవా! నీవు సర్వభూతాంతర్యామివి, నీ వెఱుంగనియర్థం బేమి యున్నయది! నీకు మాఱుం డగుబ్రహ్మకు వాహనంబు రాజహంస. నీ వాహనం బేనుంగు. తేఁటులు దానియెడం బుట్టినవి. అన్నియుఁ దనూజులకు సమానం బగుటం జేసి యిట్లు పలుకందగ దని పరిహాసపల్లవితం బగుసల్లాపంబుఁ జేయుపల్లవాధరితో నా జగద్వల్లభుం డుల్లసిల్లు చున్నసమయంబునఁ దెల్లని పట్టెనామంబులును దీఁగెలయొడ్డాణంబులును బాదంబులం బెట్టినబిల్లచెప్పులును జెవులం జెక్కిన నెమలిఱెక్కలును గటితటంబునం దాల్చినకంబళ్లును బెరుఁగు పాలు నేతులు నించినకావళ్లును నుల్లసిల్ల వేలకొలఁది గొల్లలచ్చటికివచ్చి తెచ్చిన ద్రవ్యంబులు కానుకగా నిచ్చి గ్రుచ్చి కౌఁగిలించుకొని యచ్యుతునింజూచి, "ఓరి కిసనా! నీయప్పటికంబళి యేడ నేసితివి. కొండగోఁగు పువ్వులచాయకంబళి యెవ్వ రిచ్చిరి. చుక్కలం దెచ్చిగ్రుచ్చిన ట్లున్నయది. ఈ తెల్లగురిగింజపేరు లేడ సంపాదించుకొంటివి? అప్పప్ప! చంద్రునిప్పుల యొప్పున నొప్పులు గులుకు నీగాజుపూస లేడఁ దెచ్చుకొంటివి?

గబ్బుకంపులం బొల్చిన నల్లనితిరుణామం బేడ దొరకె? జల్లి తోఁకయేంది? మెడమీఁదిజడలేంది? నిక్కుచెవులేంది? అప్పప్ప! ఈకోడెబోడియెద్దేడ సవరించుకొంటివి? వింతవింత వేసంబులతో నీచుట్టునుం జుట్టుకొన్న యీగొల్ల లెచ్చట నుండువారలు?" అనిపలుక వారిమూఢవాక్యంబులకు సంత సించి విరించిజనకుండు వారల నాదరించె. అప్పు డొక్క కుంభస్తని నవనీతకుంభంబును నొక్క మెఱుఁగుఁబోఁడి పెరుఁగువంటకంబును నొక్క బాలిక వనమాలికయు, బంగ రుకుండయుఁ దెచ్చి శౌరిం బొడఁగనిరి. ఒక్క వాలుగంటి జుంటితేనియఁ గానుక యొసంగిన గోపాలచక్రవర్తి దాని యధరామృతంబు తొల్లి గ్రోలినవాఁ డగుటఁ జేసి తలంచు కొని నవ్వె. ఒక్క వేదండయాన పూదండ దండ నుంచు టయుఁ దదీయభుజాలతాలింగనంబు స్మరించి కనుగీఁటె. ఒక్క చెల్వ బిల్వఫలంబులు ముందఱ నునిచిన దాని కుచంబుల దృష్టి నిలిపె. మఱి యొక్క తె నెమ్మిగరులకుంచె యెదుట నుంచిన నయ్యింతికుంతలంబులు మున్ను దాఁ బట్టి యీడ్చినది తలంచి కనుమొగిచె. ఇవ్విధంబునం దొంటివల పులం దలఁపింప నాగోపకాంతలం జూచి గోపాలదేవుండు నర్మగర్భంబుగాఁ బలుకుచు వారల వీడుకొలిపి యారాత్రి యచట వసియించె. అని జైమినిమునీంద్రుం డానతిచ్చు టయు జనమేజయనరేంద్రుండు తదనంతరకథావృత్తాంత శ్రవణకౌతూహలాయత్తచిత్తుం డై యుండె.

చ. అవిరతదానశీల శరణాగతరక్షణలీల సత్కళా
కువలయమిత్ర సూనశరకోటిమనోహరగాత్ర సాహితీ
నవరసభోజ నూత్నదిననాథవిడంబకతేజ రాజమా
న్య విజయరంగచొక్కనరనాయక సజ్జనభాగ్యదాయకా!

క. శ్రీరంగకృష్ణముద్దుల
వీరేంద్రకుమార సమరవితరణశూరా
శ్రీరంగపతిపదాంబుజ
సారంగా సమదశైలసమానారంగా!

మాలిని. సదయహృదయపద్మా శాస్త్రతత్త్వార్థసద్మా!
మదనవిమతశౌర్యా మందరాహార్యధైర్యా!
విదితవిభవసాంద్రా విశ్వనాథాన్వయేంద్రా!
ముదితకవిసమాజా ముద్దనాంబాతనూజా!

గద్య. ఇది శ్రీపాండ్యమండలాధీశ్వర శ్రీవిజయరంగచొక్క
నాథమహీనాథకరుణాకటాక్షసంపాదిత గజతురంగ
మాందోళికాప్రముఖనిఖిలసంపత్పారంపరీసమేధ
మాన సముఖమీనాక్షినాయకతనూభవ మీనాక్షీ
దేవీకటాక్షలబ్ధకవితాసాంప్రదాయ వేంకటకృష్ణప్ప
నాయకప్రణీతం బైన జైమినిభారతంబున నశ్వమేధ
పర్వం బనువచనకావ్యంబునందుఁ బ్రథమాశ్వా
సము.

శ్రీరస్తు.

జైమినిభారతము.

ద్వితీయాశ్వాసము.

క. శ్రీరాధావరచరణాం
భోరుహభృంగాయమాన భుజకరవీరా
ధారాఖండితశాత్రవ
శూరా శ్రీవిజయరంగచొక్కవజీరా!

అవధరింపుము జైమినిమునీంద్రుండు జనమేజయనరేంద్రుం గనుంగొని యిట్లనియె. అమ్మఱునాటి వేకువజామున స్నానసంధ్యావందనాదినిత్యకర్మంబులు నిర్వర్తించి నందయశోదాదు లున్నతావునకుం బోయి కుంతీదేవి మామేనత్త గావున నద్దేవికి సమస్కరించి ధర్మజుని యశ్వమేధంబు గనుంగొని వత్తురుగాక మీరలు ప్రద్యుమ్నాదికుమారకులం దోడ్కొని మెల్లన రం డని యానతిచ్చి, కోడండ్రును దానును దేవకీదేవి కుంతిదేవియొద్దను, సుపాకన్య సఖీజనంబులతోడఁ బాంచాలిసమీపంబునను, బ్రద్యుమ్నుని యాదవకుమారులతోడఁగూడ ధర్మజునిసమీపంబునఁ, దనతో మున్ను బాల్యంబున నాటలాడినగోపాలకుల నెల్ల గాండీవి

చెంత, నుండునట్లుగా నియమించి యాభీరవరులం జూచి, సింహరాశియందు బృహస్పతి యుండుసమయంబునఁ బ్రశస్త తరంబైన గోదావరీప్రభావంబు గాంచి సకలతీర్థంబులు విస్త యంబుఁ జెందినభంగి మీరలు కిరీటిపరాక్రమంబు గాంచి ఆశ్చర్యపడి యుండక తోఁచినపాటి పరాక్రమంబు గావించి యతని మెప్పింపుఁ డని యాజ్ఞాపించి కృతవర్మభీమసేనులం గాంచి, మీరిరువురు సకలదళంబులం దోడ్కొని మెల్లన రండు నేను మున్నుగాఁ గరినగరంబునకుం జనియెద నని పలికి పవనజవం బైనతురంగంబు నెక్కి మితపరిజనసమేతం బుగా హస్తినాపురంబునకు వచ్చి ధృతరాష్ట్రవిదురకృపసం జయసమేతుం డైనధర్మనందనుం గదిసి కంసారి సంసారిచం దంబున సాష్టాంగదండప్రణామంబు గావించి తనకు మ్రొ

—* శ్రీకృష్ణుఁడు హస్తినాపురంబునకు వచ్చుట. *—

క్కిన యర్జుననకులసహదేవుల నుచితసంభాషణంబుల నా దరించి స్వర్ణపీఠంబునం గూరుచున్నసమయంబున యుధిష్ఠి రుండు, దేవా! నీవుపుత్త్రమిత్త్రామాత్యసమేతంబుగా రాక యొంటిగ వచ్చిన దేమి యని యడిగిన నవ్వి యవ్వాసుదే వుండు వసుదేవబలదేవు లిరువురుం దక్కఁ దక్కినవార లందఱు వచ్చిరి. రేపకడ నిచ్చటికి వత్తు రనిన, సంతసించి కౌంతేయాగ్రజుండు పార్థునిం గాంచి సకలదళసమేతంబుగా రేపకడఁ గదలి యాగతురంగంబు నడుమ నునిచికొని వారల కెదురుగాఁ జనవలయు నని పలికి మఱునాఁ

డరుణోదయంబున వనజోదరుండు సోదరుండు యౌవనా శ్వుండు మొదలగువారలు తోడ రా నధ్వరాశ్వంబు నలం కరించుకొని కుంతీద్రౌపదీప్రభావతులం బెలుమెఱయుం దని నియమించుటయు వారలు రుటంపు సూర్యపటంపుఁగురా శంబులం దులకించు కుందనంపుటాందోళికల నెక్కి యు భయపార్శ్వంబుల ఘోటికాసహస్రంబులపైఁ జేటికాసహ స్రంబులు కాంచనదండమండితంబు లగుఛత్త్రచామరకలా చికాపాదుకాస్త్రముఖ రాజచిహ్నంబులతోఁ గొలిచి నడువ దేవకీయశోదాదులకెక్కం దగినకట్టనంబులు పెట్టియల నలవ రించి కట్టాయితంబై పట్టణంబు వెడలి రెండవయాఖుండలుం డునుంబలె నఖండితవైభవంబునం గదలి కాళిందీతీరంబుఁ జేరం జనియె. అంతకమున్న భీమకృతవర్మాదులు సకల సన్నాహంబులు మెఱయ నెదుర్కొనునప్పుడు గంభీరభేరీ భాంకారంబులను గంచుకులహుంకారంబులను మదగజ ఘీంకారంబులను జామరంబులు వేయుతోయజాక్షుల కంక ణక్రేంకారంబులను భూనభోఽంతరంబులు ఘూర్ణిల్లె. ఆసమ యంబున శమననందనుండు సహోదరులుం దానును దేవకి కిం బ్రణమిల్లె. భీమసేనుం డేనుంగు డిగ్గి ప్రద్యుమ్నాది యాదవకుమారులుం దాను నన్నకు నమస్కరించె. దేవకి కోడండ్రతోఁగూడఁ గుంతికిఁ బ్రణామంబు సేసె. ద్రౌపది ప్రభావతియుం దానును దేవకీదేవి పాదంబులకు మ్రొక్కె. మఱియుఁ దారతమ్యంబు లెఱింగి వారు వారు తగుతెఱం

గావించినం గర్ణనందనుండు వాయుపుత్త్రునిం జూచి కంఠీరవంబు మదగజంబు విడిచి నుఱియొక్కతుచ్ఛమృగంబునకుఁ బోవునే? నీప్రతాపంబునకు నీయల్పబలంబులు సరియగునే. ఇంతమాత్రంబునకు మీరు గదాదండంబుఁ బూనం దగదు. మఱలుం డని పలుకునవసరంబున ననుసాల్వుండును మహోగ్రబాణంబు వింట సంధానంబు గావించి మారుతకుమారు మర్మంబులు లక్ష్యంబు గావించి యేయుటయు మంత్రించి పడవైచినకరణి మహీతలంబునం గూలె. అంత మురవైరి యనుసాల్వునిం గనుంగొని, యెందుఁ బోయెదవు నిలునిలు మని యదల్చిన నయ్యనుసాల్వుండు 'కమలనాభా! నీవు మాయగ్రజుం డగుసాల్వునిఁ గొని గగనమార్గంబునకుం గొనిపోయి బావిలోనం బడవైచి మృతినొందించితివి కావున నిన్ను గీటడఁగింపక మానను. నీకొడుకును మఱందియును బడినపాటు గన్నారం గనుఁగొంటివి గదా? ఇంక నీవు పాతాళంబుసొచ్చితి వేనియు వానిమానసంబునం డాఁగితి వేనియు నిన్నుఁ బోనిచ్చువాఁడను గాను. నీవు పురాణపురుషుండవు నేను బ్రాయంపువాఁడ నీకు నాకునంతరం బని భ్రూకుటీకుటిలంబును విశంకటంబు నగునాననంబునం గనుపట్టుచు నాలుగు తూపులు సంధించి రథ్యంబుల ప్రక్కలు వ్రక్కలించుటయు యుగ్యంబులు మ్రొగ్గిన దారుకుండు వగ్గంబులు పదిలంబుగాఁ బట్టి యరదంబు పిఱిందికిం దివియించి క్రమ్మఱం దురంగంబుల సేదదీర్చి యెట్టకేలకు

రథంబు ముందఱికిం దెచ్చుటయు మురాంతకుం డతని వక్షంబునం బదుమూఁడు బాణంబులు గ్రుచ్చిన నతండును జిచ్చులు రాల్చు మెఱుంగుఁదూపు శింజినిం గూర్చి యాకర్ణాంతంబుగాఁ దిగిచి మురవైరివక్షంబు లక్ష్యంబు సేసియేసిన నచ్యుతుండు పెనుమూర్ఛ చేత ముచ్చముడింగి లీలామానుషనటనంబున రథంబుపయిం బడియె. అంత మురాంతకునిపాటు గనుంగొని చతురంగబలంబులు పటాపంచలై తంత్రి భిన్న యన్న తమ్ముఁ డనక విడిచి పాఱుటయు వృషకేతనుం డదలించి విఱిగినసైన్యంబు మగిడించి యనుసాల్వుని నిలు మని గద్దించి సప్తసాయకంబులు నిగిడించిన వాఁడును దశనిశాతబాణంబులు కర్ణకుమారునివక్షంబు వీక్షించి యేయుటయు నవ్వృషపౌత్త్రుండు తురంగంబులం ద్రుంచి సారథిం బడఁగెడపి రథంబు చెక్కులు సేసిన నుక్కుదక్కక యనుసాల్వుండు రథంబుమీఁదికి నుఱికి కర్ణుని వక్షంబు తన్నినం బడక యతఁడు వానికిరీటంబు వీడ బట్టి ముందలం బట్టి బిఱ్ఱబిఱ్ఱం ద్రిప్పి భూమిం బడవైచి యామ్మునం దుమికి తనవింటినారి వానికంఠంబునం దగిలించినం గన్నుల ముక్కుల నెత్తురులు గ్రమ్మ ముసురించిన మూర్ఛం గ్రమ్మి మేనెఱుంగక యున్నయెడ నేఁటకాఁడు లేడింబట్టి యీడ్చి తెచ్చిన తెఱంగునం బట్టి తెచ్చి "వీఁడె గుఱ్ఱపుదొంగ వచ్చెఁ గనుంగొని యవధరింపుము" అని విన్నవించుటయు యాదవేంద్రుండు కర్ణకుమారునిం జూచి "నాయనా! [illegible]

డవు వీరలోకమాన్యుండవు నీకుం దక్క నన్యులకు నిమ్మహా రథునిం బట్టి తేఁగూడునే?' యని గోపాలదేవుండు సూర్య పౌత్రునిం గొనియాడ నతండును వానికంఠంబునం దగిలిం చినగుణంబు వదలించుటయు ననుసాల్వుఁడు మూర్ఛదె ప్పిటి శ్రీకృష్ణదేవునిం గనుంగొని శాంతచిత్తుండై స్వామీ! మీపాదంబులకుం బ్రణామంబు. కర్ణనందనునిసామర్థ్యంబు వలన దేవరసందర్శనంబు లభించె నని యనేకప్రకారం బులం బ్రశంసించినయనుసాళ్వునిం గృపాతరంగితంబు లగు నపాంగవిలోకనంబులం గనుంగొని గారవించి కౌఁగిలించి యతనికరంబు నవలంబించి తోడ్కొని పోయి ధర్మనందనుం గానిపించి దండప్రణామంబు సేయించినఁ బాండవాగ్రజుం డాదరించి నాకు నీవు వృకోదరాదిసహోదరులట్ల గాదిలిసోద రుండవు. క్రతురక్షణంబున సావధానుండవై యుండు మని యానతిచ్చె.

అంత ధర్మనందనుం డయ్యధ్వరాశ్వంబునుం గొని తెచ్చినప్రద్యుమ్నవృషకేతనులం బ్రీతులం గావించి కరి పురంబునకు వచ్చి యాదవుల విడియించి కృష్ణానుసాళ్వ యౌవనాశ్వమహీపతుల సబహుమానంబుగా నిజనివాసం బులకుం బోవంబనిచి తా నభ్యంతరమందిరంబునకుం జని యజ్ఞరక్షాసమయంబుఁ బ్రతీక్షింపుచుఁ బుణ్యకథాప్రసం గంబులం బ్రొద్దులు గడపుచుండఁ జైత్రశుద్ధపౌర్ణమి వచ్చు టయు నప్పుణ్యదివసంబున ధర్మనందనుండు ద్రౌపదీసమేతఁ

బుగాఁ గృతస్నానుండై నిత్యకృత్యంబులు నిర్వర్తించి యా
గదీక్ష వహించి తురంగంబు దెప్పించి గంధపుష్పధూపదీప
నైవేద్యాదిపూజలుగావించి నిజబిరుదాక్షరసమేతంబుగా సు
వర్ణపట్టంబు దానిలలాటంబునం గట్టించి రత్నఖచితమంజీ
రంబులును గనత్కనకకింకిణీజాలంబులును బురుసాకురాళం
బును ముత్యంబులజల్లులపైదండలు నీలాలదృష్టిదండలు హే
మపక్షంబులమెచ్చులు మీఁదుమెచ్చులు బంగరుతంగుపట్టి
యు వజ్రాలమోముట్టు సింగంపుమోముతలాటంబును జల
చ్ఛామరంబులు గబ్బి మీఁదుహారబ్బికవికయుం జోకగావించి
దవిణ మలహారి సాంబ్రాణి ధూపంబులు పచ్చపావడలు విరా
జిల్ల వేనవేలు తేజీలు గంధసింధురంబులు స్యందనసందో
హంబులుం గూర్చి ధనంజయుని నశ్వసంరక్షణార్థంబు గా
నియమించి యాశీర్వదించి పంచిన నతండును ధర్మజునకు
మ్రొక్కి శౌరిపాదాబ్జంబులకు వందనంబు గావించి దేవకీ
దేవికిం దన్నుఁ గన్నతల్లికి గాంధారికి ధృతరాష్ట్రునకు నభివాద
నంబులు గావించి కృష్ణానుమతంబునఁ బ్రద్యుమ్నుండును
వృషకేతుండును యౌవనాశ్వుండు ననుసాల్వుండును మొద
లగుమహారథికవరులు నిజచమూసమేతంబుగా వెంబడిం
జనుదేర వెడలె. అత్తురంగంబు నభిజిన్ముహూర్తంబునం
గదలి గ్రామంబులు పల్లెలు నగరంబులు పేటలు కోటలు
నదులు నదంబులు శైలంబులు కాననంబులు తటాకంబులు
చెఱువులు దొరువులు గ్రమించుచు యథేచ్ఛవిహారంబు

గా వచ్చి వచ్చి దక్షిణదిశామండలమండనం బైనమాహిష్మతీ
పురంబు సేరం జనుదెంచె.

—* ప్రవీరుఁ డశ్వమును బట్టుట. *—

అవ్విధంబునఁ దురంగంబు మాహిష్మతిం జేరం జని హృద్యంబు లైనయుద్యానంబులం బూచినపూవులతావులకుం దావలంబు లైనమందానిలంబులచే నందంద కదలెడు చిఱుతరంగంబులవలనం బొడమినజలధూమ్రంపుసొంపునం బెనువరుల బడలిక లపనయింపుచుఁ ద్రిలోకశర్మదం బైన నర్మదాతటంబు చేరం జని యం దొక్క శృంగారవనంబుఁ జొచ్చి యయ్యశ్వరాజంబు జంబూకదంబాదివృక్షజాతంబుల నీడ దూరంబు నడచివచ్చినబడలిక దీఱం జరియింపుచుఁ గోమలంబు లైనదూర్వాదళంబులు మేయుచు జలంబులు గ్రోలుటకై కొలంకుకడకుం డాయుచున్న సమయంబున నద్దేశాధీశ్వరుం డగునీలధ్వజునికూర్మితనయుం డైనప్రవీరుం డనువాఁడు నిజకళత్రం బైనమదనమంజరితోడంగూడ నయ్యుద్యానంబున విహరింపుచుండి కుందచందనమందార చంద్రశకలశరచ్చంద్రకిరణంబులంబలెఁ దెల్లనగుశరీరంబును సంపెఁగపూవులచాయం బచ్చ నైనపుచ్ఛంబును నింద్రనీలవర్ణం బైనకర్ణంబులును బాలసూర్యబింబంబునుంబోనియుధరంబును బగడంబులవలె గోరోజనంబు కైవడిఁ గుంకుమపంకంబుపోలిక నెఱ్ఱ నైనకంఠంబునుం గలయుత్తురంగరత్నంబుం గనుంగొని యయ్యంగన తననాథునితోఁ గోటానకోటి

ఘోటకంబులలో మేటి యైన యాఘోటకంబు నీలాయం
బున నుండెనేని నీవు చేయురాజ్యంబు సఫలం బగు ననిన
విని నీలధ్వజకుమారుం డైనప్రవీరుండు చేరం జని దానిను
దుటం గట్టియున్నట్టి బిరుదుపట్టంబు గనుంగొని యందు
"రాజాధిరాజరాజపరమేశ్వరసకలసామంతరాజభయంకరవీ
రప్రతాపమూర్తియైనయుధిష్ఠిరమహారాజేంద్రుం డధ్వరంబు
సేయం బూని విహరింపంబంపిన యీయశ్వరాజంబు నీశ్వ
రునిం బోరిలో గెలిచిన నెఱయోధు దుర్జనదండధరుం
డైనయర్జునుండు రక్షింపం బూని వచ్చె ధారణీతలంబున
వీరుండు శూరుండునుం గలిగెనేని పట్టి కట్టుం" డని వ్రాసిన
వక్కాణ చదివి యాచక్కరబొమ్మం జూచి యిత్తురంగంబు
వెంబడి వచ్చినయర్జునుం గెలిచి నే నీహయంబు దెచ్చెద.
నీవు సఖీజనంబులతోడం గూడఁ బట్టణంబునకుం బొమ్మని
పంచిన సమ్మించుఁబోఁడి గడగడ వడంకుచు గుత్తంబుమీఁది
వాంఛ చాలించి తనతనువల్లికి సమానం బైనపువ్వుఁదీఁగె
లు వంచుట మాని కరపల్లవంబులసౌరు గలిగినచివురు
గిల్లుట లుడిగి గబ్బిగుబ్బలవలె నుబ్బు మీఱుకుసుమగుచ్ఛం
బులు ద్రుంచుట వర్జించి పెదవితేనియలకుం బదు లైన పు
వ్వుఁదేనియ లానుట విడిచి వనంబు వెడలి ప్రాణేశ్వరు
నెడఁబాయఁజాలక తాల్మితో త్రోవ మెల్లనఁ బల్లకి నెక్కి
సఖీజనంబులతోడం గూడఁ బట్టణమార్గంబు పట్టి చనియె.

అంత నరాతిభయంకరుం డైనప్రవీరుండు నేనుంగులుఁ దురంగంబులు నరదంబులు వీరభటపటలంబులు దృఢవ్యూహంబు పన్ని వజ్రకవచంబును జగ్గుమీఱు తలగొగ్గియు నడుముచర్మంబునం బొదవిన కరతలత్రాణంబును మెఱయ దివ్యబాణతూణీరంబులు మూఁపునం గట్టి కనకరేఖాలంకృతం బైన కార్ముకంబు భూతలంబున నూఁది వింటికొప్పునం దనకిరీటంబు సేర్చి సరకుసేయక పరదళంబులం గనుంగొనుచున్నసమయంబున నయ్యాజ్ఞికులు నెదురుగాఁ బఱచి పార్థునిం గనుంగొని తురంగంబు పట్టువడినవృత్తాంతంబు పల్కరించుటయు ముఖారవిందంబున మందస్మితంబు దళుక్కొత్తఁ గయ్యంపువేడుక మొగంబునం జెంగలింప దిగ్గజంబులకర్ణపుటంబులకుం గఠోరంబుగా గాండీవగుణారావంబు నెగడ నరదంబు త్వరితంబుగాఁ బోవనిమ్మని వచ్చువిన్వచ్చుని ము

—* వృషకేతుప్రవీరులయుద్ధము. *—

న్నాఁడి వృషకేతుండు, పట్టినహయంబుతో నడ్డపెట్టక దిట్టఁడై యున్నరాచపట్టిని విలోకించి, తురంగంబు విడిచెదో మాతోడం బోరి ప్రాణంబులు విడిచెదో రెంటిలో నొక్కటి విడువక కర్ణసుతుండు నిన్ను విడువఁ డని పలికినం బ్రవీరుండు మొగంబునం జిఱునగవు దొలఁకఁ జిన్నయ్యకుం బలమీఱి వచ్చిన నిన్ను సురనగరంబున కలంకారంబుగాఁ బంచి యాపిమ్మటఁ బరాక్రమోపార్జనుం డైనయర్జునిం దెగటార్చెద నని నాలుగుక్రొవ్వాఁడిబాణంబుల గుఱ్ఱిఁ

బుల నొప్పించి యొక్కశిలీముఖంబు ఛత్రంబులు నివుఱులై వుచ్చి యయిదుమెఱుంగుఁదూఁపు గిరీటంబులం దాపినరత్నం చినఁ గర్ణకుమారుండు నేఁడువాఁడేహాంబులతోఁ నటునిటుం గంబుల గీ టండంగించి యొక్క బ కేడెంబులు జీరా గొగ్గి ప్పించి నాలుగు వేటుబల్లెంబుల నారాచ గమలి భస్త్రావశే దూయ నేసిన నాప్రవీరుండు కంపంబు నొంబులతోఁ బీనుం ఘుంబులు పిడుగులు వర్షించువడువున నపారంబులైనశర వర్షంబులు గురియించి కర్ణనందనుని స్రుక్కించి వేఱొక్క తూపు వింటం గీలించి యాకర్ణాంతంబుగాఁ దీసి యనుసాల్వుని మూఁపు నాటించి యుద్ధంబునకు నిలిచిన, వాఁడును సువర్ణపుంఖంబులు మనోమారుతరింఖంబులు నైనకంకపత్రంబులు నసంఖ్యాతంబులును బుంఖానుపుంఖంబులుగాఁ గురిసినఁ గాలు చే యాడక ప్రవీరుం డాహవంబున కోహటించి యుండుసమయంబున సేనలు కలంగం బొఱి యాహాకారంబు లొనర్ప నాసుద్ది యాలకించి మాహిష్మతీపురాధీశ్వరుం డైన నీలధ్వజుండు మూఁ డక్షౌహిణులసైన్యంబుతోఁ దనయల్లుం డైనయగ్నిదేవుని ము న్నిడుకొని కదనంబునకుం గదిసి తన

—* నీలధ్వజుండు పరాక్రమించుట. *—

కుమారుం డగుప్రవీరునియరదంబునకుం దలకడచి చొచ్చి విచ్చలవిడి నస్త్రవృష్టిచే ననుసాల్వుని ముంచి వచ్చినయోధవీరుల నెల్లం బదేసివిశిఖంబులం గ్రుచ్చుటయు, సేనాసందోహంబులు పటాపంచలై నలుఁగడలకుం బఱచిన ధనంజ:

అంత నరాతిభయంకరుఁడగుడం బురికొల్పికొని యా
దురంగంబులు నరదంబులు మబాణంబులు ప్రయోగించుట
హంబు పన్ని వజ్రకవచములు దొడిగి త్రోవనేయ నబ్బాణం
నుడుముచర్మంబునం బొనాదంబుసేసిన యౌవనాశ్వుండును
దివ్యబాణతూణీరంబాళ్వుండును వృషకేతుండును మొదలు
కృతం బైన కావర్గంబు లనర్గళంబు లగుమార్గణాసారంబులు
గురిసిన నలధ్వజుండు వెఱవక యందఱ కన్నిరూపు లై
తూపులసోనలు గురియుచుఁ దన యల్లుఁ డైనయగ్నిదేవునిం
బిలిచిన నతండు నస్త్రరూపం బై యెదుటం గనుపట్టిన
నయ్యాగ్నేయాస్త్రంబు కార్ముకంబునం గదియించి మార్వి
నాదంబున దశదిశలు ఘూర్ణిలం జేయుచుఁ బ్రయోగించిన
నర్జునుండు వారుణాస్త్రంబు సంధించుటయు జలకణంబు
నుం బోలె నయ్యస్త్రంబు నొక్కటొక్కటగాఁ బీల్చి చటచ్ఛ
టార్భటులు మింట నంట నొంటుకొను మంటలును మంటల
కంటె మున్నుగా మిణుంగుఱుబూచులకైవడి మీఱి నింగి
కెగయు మిణుంగుఱులును మిణుంగుఱులం దలకడచి ప్రళ
యకాలంబున గబ్బిమెఱయుమబ్బులవలె నుబ్బిమెఱయు
పొగలును బొగలకంటె మున్నుగా గగనంబునం బఱచు
దివ్యవిమానంబుల ధగధగ మని రగులుకొనం జేయుసెగ
లునుం గలిగి సాక్షాత్కారంబుగా నగ్నిదేవుం డర్జునుని
సైన్యంబులం బొదివిన, భద్రగజకుంభంబులు పగిలి పెట
పెటం జిటిలిన ముత్తియంబులరాసులును యుగ్యంబుల

పగ్గంబులు కేతనంబులు పతాకలు ఛత్రంబులు నివుఱులై పూదెలుగట్టిన కనకరథంబులును గిరీటంబులం దాపినరత్నంబులు చిటిలి పడం జిటిలిన దేహంబులతోఁ నటునిటుం బొరలాడు వీరయోధులును గత్తులు కేడెంబులు జీరాగొగ్గి ముస్తీదులు తరకసంబులు సింగిణులుం గమలి భస్మావశేషంబులై గాలికిం బోవం గమలిన దేహంబులతోఁ బీనుంగుపెంట లైనసుభటులును నూకలపెటికలు క్రిందం బడవైచి మంటలు వెంట నంటం గుంటుచుం బోఱు నొంటెలును నొంటెలకంటె మున్నుగా అంకెలు వైచుచు మోపులు వైచి పరుగిడునృషభంబులునుం గలిగి పాండవబలంబులు ధూళిపటలంబులై పఱచినం గని నీలధ్వజుండు నవ్వుచుం దురంగంబుం బట్టికొని యాలంబు చాలించి పురంబునకుం జనియె.

—* అర్జునుఁ డగ్నిదేవుని స్తుతించుట. *—

అప్పు డర్జునుండు ధనుర్ధరుండై వహ్ని నుద్దేశించి యంజలి యొనర్చుచు "దేవా! వేదమయుండవు. శ్రుతిస్మృతిపురాణేతిహాసంబులు నిన్నుం గొనియాడు. నీవు సకలదేవతలకు ముఖంబవు. ఆహవనీయంబును దక్షిణాగ్నియు నీయం దుద్భవించె. సర్వసాక్షి వగునీకుం బ్రియంబును శ్రీకృష్ణదేవునకు నారాధనాత్మకంబును బృందారకుల కానందకరంబునుం గా ధర్మనందనుం డశ్వమేధంబు సేయ నుద్యోగించె. క్రతుదీక్షా సంగతుండ నైననీవు దీనిం బత్నీకరించి రక్షింపవలయుం

గాని యుపేక్షింపం దగునె” యని ప్రస్తుతించినం గైకొనక మేరమీఱి మామగారిమీఁది కనికరంబున శిఖానికరంబులు పరఁగించుచుఁ బొగలు సెగలు మిగుల రగులుకొన దిగదిగ మని తగులుకొని మెరగలిపగిది మించి చనుదెంచు నచ్చిచ్చుఁ గనుంగొని విష్వక్సేనుండు మనంబున నతనికామాతురత్వంబు గర్హించుచు శ్రీమన్నారాయణునిచరణంబుల స్మరణంబులు గావించి నారాయణాస్త్రంబు వేదోక్తప్రకారంబుగా వింట నొంటించి ప్రయోగింప నుద్యోగించుటయు సూర్యచంద్రాంగారకాదిగ్రహతారకాగణంబులు గతులు తప్పె. దిగ్గజంబులు మ్రొగ్గె. పంచభూతంబులు హాహాకారంబు లొనర్చె. వేదంబు మఱచి మోదంబు మాని చతుర్ముఖుండు తమ్మిగద్దియ విడిచి దిగ్గన లేచె. సప్తసముద్రంబులు గలంగె. కులపర్వతంబులు వణంకె. భూమి పెటపెటం బగిలె. బ్రహ్మాండభాండంబు దిగఁబడియె. ఇంద్రాదిదిక్పాలకులు సిద్ధసాధ్యకిన్నరకింపురుషగరుడోరగాదులు దిక్కుమొకంబులై పాఱం జొచ్చిరి. అపుడు హవ్యవాహనుండు భయం బొంది వేంద్రంబు మాని యింద్రనందనునిచెంతకు బ్రాహ్మణరూపంబునఁ జనుదెంచి వినయంబున ని ట్లనియె.

“మహాత్మా! నాయెడం దయసేయుము. ఏదేవునిం దలంచినంతమాత్రంబున నె నూఱువేలయశ్వమేధంబులు పదిలక్షల షోడశమహాదానంబులు కోటితీర్థయాత్రలు ననేకకోటి వ్రతంబులుం జేసినఫలంబు లభించు నట్టి శ్రీవత్సాంకుం

డును నిష్కళంకుండును రమాకళత్రుండును బరమపవిత్రుండును బరంజ్యోతియుఁ బరబ్రహ్మంబును వేదాంతవేద్యంబు నైనపరతత్త్వంబు నీయింట నుండి కంటికి ఱెప్పగాచినచందంబున నిన్నుం గాచుచునుండ నాబోటులకుఁ దేఱిచూడం గూడునే? శ్రీహరిని విసర్జించి దేవతాంతరంబుల పేక్షించు నతండు పాలసముద్రంబు దొరకినను బాలకై మేఁకం బితుకువానిచందంబున సూర్యకిరణంబులం గాదని మిణుంగుఱుపురువుల కానసడు నపస్మారివితంబునం బరిహాసయోగ్యుం డగుం గావున నంబుజోదరదివ్యపాదారవిందవందనానందంబునం బొదలునీకు నశ్వమేధాదియాగంబులు సిద్ధించుట యెంతవింత! నాకు మానుషమైనమాహిష్మతీపురాధినాథునిం దోడ్కొని వచ్చి నీకు సేవకునిం జేసెద. ఇమ్మహానారాయణాస్త్రం బుపసంహరింపు" మని ప్రియవాక్యంబుల వేఁడుకొనుటయుఁ గ్రీడి పావకునియెడం బ్రసన్నచిత్తుండై యమ్మహాస్త్రంబు నుపసంహారంబు గావించిన నగ్నిదేవుండు భంజనంబునం బడినసేనల నెల్ల నైంద్రజాలికునిపగిది మగుడం బ్రతికించి యర్జునునకుం బ్రదక్షిణంబు గావించి పురంబునకుం జనియె. అనిన విని జనమేజయనరేంద్రుండు జైమినిమునీంద్రుం గనుంగొని పావకుండు నీలకేతున కెవ్విధంబున నల్లుం డయ్యె నని యడిగిన నతండి ట్లనియె.

—* అగ్నిదేవుని వృత్తాంతము. *—

రాజేంద్రా! నీలధ్వజుని పట్టంపురాణి జ్వాల యను వధూటి గలదు. అప్పురంధ్రీమణికి నీరేడులోకంబుల నీడు జోడు లేనిచక్కఁదనంబున నుతికెక్కిన స్వాహానామధేయ యగుకన్యకారత్నంబు గలిగిన నాతరుణి జవ్వనంబును సౌందర్యంబు గుణంబులు లీలావిలాసంబులును ద్రిభువనమోహనంబులు గావున దానికిం బెండ్లిసేయం దలంచి నీలధ్వజుండు రూపలావణ్యవంతులు కీర్తిమంతులు నైనరాజకుమారులం బెక్కండ్ర వ్రాసి తెచ్చినచిత్రపటంబులు సూపి యందొక్కని వరియింపు మనిన నగ్గజగమన సిగ్గునం దలవాంచి మదాంధులు గర్వగ్రంథులు వసుంధరాధిపతులు. తక్కిన మానవు లెల్ల దీనులు. వారలశరీరంబులు నిత్యంబులు గావు గావున మర్త్యుల వరియించుట నాకు సమ్మతంబు గాదు. అమర్త్యులందు నొక్కరుని వెదకు మనిన నీలకేతుండు కూఁతుంజూచి మంచిది వాసవుని రప్పించెద వరియింపు మనిన నమ్మదిరాక్షి మదిలోన విచారించి "సురపతి నాకుం దగినపతి యగుం గాని యతండు జారుండు తపోవిఘ్నకరుండు కులగోత్రవిదారుండు సవికారుం డదియుంగాక దేవాదిదేవుం డైనశ్రీవిష్ణుదేవునిం దనకుఁ దమ్మునిఁగా నెంచి భక్తి గావింపఁడు గావున దేవేంద్రుండు సన్నుతుండు గాఁ" డన, నతండు మఱియెవ్వరిం గోరుదు వంటేని "యగ్నిదేవుండు జగత్పూజ్యుండు. దేవతలకెల్ల నగ్ని ముఖం బని

వేదవచనము గలదు. కావున నతనియెడ నాభావంబు నిలిచి యున్నయది. పతితోడం గూడ ననుగమనంబు సేయం దలంచినసతి తనశరీరం బాహుతి గావించె నేని దానిదురితంబుల నణంచి కైవల్యంబు నొసంగం జాలునట్టి దైవం బగ్ని దేవుండు దక్క వే ఱొక్కరుండు లేఁడు. సురగరుడోరగవిద్యాధరసిద్ధసాధ్యచారణగంధర్వాదులలో నొక్కరుండును నామనంబునకు సమ్మతుఁడు గాఁడు. వైశ్వానరుని యందు నాడెందంబు లగ్నం బయ్యె ననినఁ జెలులు నవ్వుచు నప్పువ్వుఁబోఁడిం జూచి 'యేమని కోరితివమ్మా! రాఁజుచుండెడు మొగం బేమి! నిప్పులు కుప్పళించు నడక లేమి! సర్వభక్షకత్వం బేమి! యెచ్చటకు వచ్చినం గాల్చుట యేమి! పోయినమార్గం బెల్ల మలినం బగుట యేమి! యిట్టివానిం బెండ్లియాడు నాఁడువారుం గలరె! అదియునుంగాక రెండు తలలతోడి మూఁడుకాళ్లముదుసలిని వరియింపఁ దగ నగునే! అనిన సఖీజనంబులవాక్యంబులు నిరాకరించి తండ్రిచే ననుజ్ఞఁగైకొని తపోవనంబునకుం బోయి నియమవ్రతంబు సంకల్పించి సమంత్రకంబుగా వైశ్వానరు నావాహనంబు సేసి కర్పూరంబు కుంకుమంబు కస్తూరియు నగరు చందనంబు మలయజంబును లవంగశర్కరాఘృతపాయసంబులు తేనెయు బిల్వఫలంబులు తెల్లచెఱకులు కదళీఫలంబులు తాంబూలంబులు మొదలైనపూజాద్రవ్యంబులు దెచ్చి హోమంబు నర్చనంబునుం జేయుచు బహుకాలంబు భజించు

టయుఁ జిచ్చుదొర మెచ్చి నృపాలునిపురంబునకు వచ్చి విప్రరూపంబున రాజమందిరంబు సొచ్చి సముచితోపచారంబులఁ బూజితుండై "మహీశ్వరా! నీకన్య యగుస్వాహావధూరత్నంబు నాకుం గన్యాదానంబు సేయు" మనిన నీలధ్వజుండు ధూమధ్వజునిం జూచి "నాకన్యక యగ్నిదేవునిం దక్క నితరుల నొల్లదు గావున వే ఱొక్కకన్నియ నోసంగెద వివాహంబు గ" మ్మనిన, ననలుండు నిజరూపంబుఁ జూపిన రాజు ప్రమోదభరితుం డై స్వాహాకన్యకను జిత్రభానునకుం గన్యాదానంబు సేసె. అది మొదలుగా వీతిహోత్రుండు వారియింట నిల్లంట్రపు టల్లుండై తత్పురంబు రక్షించుచు వైరులమీఁదం దార్కొనుచు నతనికి నస్త్రంబై యుండె. ఇది జాతవేదుండు నీలధ్వజునకు నల్లుఁడైన తెఱంగని వివరింప జనమేజయుం డవ్వలికథ సెప్పు మనుటయు జైమిని యిట్లు సెప్పం దొడంగె.

అవ్విధంబున ధూమకేతనుండు నీలకేతనుని సమ్ముఖంబునకుం బోయిన నతండు నల్లునిం జూచి శత్రుసైన్యంబు నిశ్శేషంబుగా దహించి వచ్చితివే యని యడిగిన ననలుం డతనిం జూచి "నరేంద్రా! నరనారాయణులమహాత్త్వంబు తొల్లి వినలేదా! అర్జునుండు నారాయణపరాయణుండు గావున నావ్యూహంబు నాకు దురవగాహంబు. దాహంబు నొందింపం గూడదు. అదియునుంగాక తొల్లి దేవేంద్రుం డు ప్రయోగించిన వజ్రాయుధంబు స్తంభింపంజేసి ఖాండవ

వనంబు నా కాహుతి సేసె నయ్యుపకారంబు దలంపక యతనితో నాచేత నైనయంత యుం బోరితి నింక నాకు నసాధ్యంబు. నీవు నిరర్థకవిరోధంబు వాటింపక యాహా యంబు రయంబునం గొనిపోయి పార్థున కొసంగి కృతార్థుం డవు గమ్ము." అనిన రాజపుంగవుండు తనకులాంగన యగు జ్వాలాసతిం గనుంగొని యల్లుం డైనయగ్నిదేవుండు మనకు హితంబు సెప్పెం గావునం గ్రతుఘోటకంబు గొనిపోయి కిరీటికి నొప్పగించి స్నేహంబు గావించుకొనియెద ననిన దంట యగునావాలుగంటి తననాథునితో ముక్కంటివంటి వాఁడు పెనంగనేనియుం జలపట్టి తనపట్టినకార్యంబు విడు వక కీర్తిం జేపట్టుట రాజధర్మంబు. సాహసంబు సేయక శ్రీయు ను గీర్తియుం గలుగనేరవు. పట్టినగుఱ్ఱంబు మగుడ నిచ్చి యతని వేఁడుకొనం బోయితివేని సరిరాజులు నవ్వరె! గెలిచితివేని నరలోకరాజ్యంబును మృతుండ వైతివేని సుర లోకరాజ్యంబును ననుభవించెదవు. పరునకుం బ్రియంబు సెప్పి బ్రతుకుటకంటె క్షత్రియునకు మరణంబు మేలు. అనిన విని యమ్మనుజనాథుఁ డట్లె కావించెద నని యమ్మిం చుఁబోఁడితోఁ బంతంబులు పలికి రణభేరి భాంకారంబులును గజఘీంకారంబులును శింజినీటంకారంబులును నెసంగ నహంకారంబున సేనలం బురికొల్పికొని పురంబు వెడలి పురందరనందనునితోడం దలపడుటయు గాండీవి గాండీవ గుణధ్వని దిక్కులు గ్రక్కదలం జేయు ప్రలయకాలనీలజల

ధరంబు వర్షించిన తెఱంగున నంపఱల పరంపరల వెంపర లాడుటయుఁ బడినయేనుంగులును మడిసిన గుఱ్ఱంబులును బొడి యగురథంబులును జడిసిన వీరభటులును దునుక లైనకేతనంబులును దుమురు లైనగొడుగులును ద్రుంగిన సేనాంగంబులును విఱిగిన కైదువులును విటతాటనంబు లైన మొనఱువులును విశకలితంబు లైనకిరీటకేయూరహారాదిభూషణంబులును వ్రేలెడు ప్రేవులును దుమ్ము లైనయమ్ములును గ్రమ్మిన రుధిరమ్ములును నాడెడు నట్టలును నందంద విహరించు భూతబేతాళంబులును నానందంబు నొందుకంకకాకగృధ్రజంబుకంబులునుం గలిగి సంగరాంగణం బతిఘోరం బయ్యె. అంత నీలధ్వజుండు కపిధ్వజునిం దాఁకి నిశితవిశిఖంబుల నొప్పించిన గాండీవి మండలీకృతకోదండుం డై చండకాండంబులు తండోపతండంబులుగాఁ గురిసిన నొక్క తీక్ష్ణభల్లంబున భుజమధ్యంబు పగుల నేయుటయు నెత్తురులు గ్రక్కుచు మరణసమానం బైనమూర్ఛ నొందిన సారథి యన్నీలధ్వజుని దుర్దశయును సైన్యంబులు సమయుటయును గాలు కాలుం బెనఁచుకొని పడిన సుతభ్రాతృబంధుయోధజాలంబులనుం గాంచి యరదంబు కదనరంగంబునకుం దొలంగించి పట్టణంబునకుం దెచ్చుటయు నెట్టకేలకు మూర్ఛఁ దెప్పిఱి యప్పుడమిఱేఁడు సారథిం జూచి మేలు సేసితి వని కొనియాడి మంత్రులం బిలిపించి మంతనంబు గావించి కృష్ణసహాయుం డైనజిష్ణుని మార్కొనుటకు

నెవ్వరికిఁ దరంబు? పర్వతంబుపై సన్నపడినఁ జి[illegible] [illegible]తందర నొచ్చుటయె కాని పర్వతంబునకుఁ గొఱంత యేమి? బలవద్విరోధంబు తగ దని యాలోచన నిశ్చయించి తనపట్టపురాణికిం దెలుపుటయు నియ్యకొనక యయ్యతివ ప్రల్లదంబులు ప్రేలినఁ గినిసి నీదుర్నయంపుబోధనచే యుద్ధంబునకుం బోయిన నాకుం గలవార లెల్లను సమసిపోయిరి. 'స్త్రీబుద్ధిః ప్రళయాంతకః' యనెడు పలుకె యథార్థం బయ్యె నని యాగ్రహంబున "నిన్నీ యిటువంటిదంటతోడం గాఁపురంబు సేసినఁ గులంబు సెడి మానప్రాణంబులకు హాని సంభవించు" నని యప్పుడె దానిం బట్టణంబు వెడల నడిచి చీనాంబరంబులును జిరత్నరత్నభూషణంబులును జిత్రంబులైనచేకానుకలును జిన్నారినారీమణులునుం గూడ నయ్యధ్వరాశ్వంబు దెచ్చి విజయున కొప్పగించి వినయపూర్వకంబుగా మ్రొక్కుటయు నర్జునుండు నతని నాలింగనంబు సేసికొని "నీవు సహోదరసమానుండవు. ఈసంవత్సరంబును నాతోడం గూడ నశ్వరక్షణంబు సేసి యాగంబుం గనుంగొని ధర్మనందనవసుదేవనందనులకు వందనంబు సేసి వత్తువుగాక" యని ప్రార్థించి యమ్మహీధవునిం దోడ్కొని యధ్వరాశ్వంబునుం దరలించిన నది యు దక్షిణదిశాభాగంబునకై యతివేగంబునం జనియె.

గగంబు నరిం—* జ్వాలాదేవి సోదరునికడ కేగుట. *—

అంత నీలధ్వజుభార్య యైనజ్వాలాసతి మగనిచే నవమానంబు నొంది డెందంబునం బట్టరానికోపవిషాదంబులం బొగులుచుఁ గాశీనగరంబునకుం జని యాదేశంబున కధీశ్వరుండు నవక్రపరాక్రమాటోపదీపితుండు నాత్మీయసహోదరుండు నైనయుల్ముఖునియొద్దకుం బోయి విషాదవేదనాదోదూయమానమానస యై పాదంబులపయిం బడి రోదనంబు గావించుటయు నతండును గరుణాయత్తచిత్తుం డై యూఱడించి "నీ వొంటిగా వచ్చుటకుఁ గారణం బేమి? ఇంతవంత యేమిటికిం జెందెదవు? ఎంతకార్యం బయిన నిర్వహించెద" ననియడుగుటయు, నామె, యశ్వమేధాశ్వంబు వచ్చుటయుఁ దనతనయుండు పట్టుకొనుటయు నందువలన సమరం బగుటయు బహుజనక్షయంబును దనమగనిపరాజయంబును దాను మగుడ సమరంబునకుఁ బురికొల్పుటయు నతండు మంత్రులతో యోజనచేసి కయ్యంబున కియ్యకొనక తన్ను నవమానించి పురంబువెడల నడుచుటయు నాద్యంతంబును బూస గ్రుచ్చినవితంబునఁ దెలియఁబలికి మఱియునుం దద్విరోధంబు దృఢమూలంబు సేయందలంచి యిట్లనియె. "అన్నా! నాబన్నంబు లె న్నని వివరించెద! నీమఱంది తానును బుత్త్రుండును దండనాయకులు దళసమేతంబుగా ధనంజయునిం దాఁకి దావాగ్నిజ్వాలలం బడినశలభంబులకైవడిఁ జచ్చియు నొచ్చియు వె న్నిచ్చియుఁ బార్థునికోల్తలకుం జాలక

కలహకారిణి యగు నన్నుం బురంబు వెడల నడిచి యతని శర
ణంబు నొందె. ఈ యవమానంబు సహింపఁగూడక యే నిందు
వచ్చితి. నీవు దక్క నాకు రక్షకులు లేరు. ఎవ్విధంబున
నైన నీ యవమానంబు దీఱునట్లు గాఁ బార్థునితోడం బోరి
సంహరింపు" మనుటయు, నతండు సహోదరిం జూచి "య
ట్ల కానిమ్ము. రేపటికి హయం బిచ్చుటికి వచ్చు. నేను బట్టి
కట్టెద నతనికి నాకును సమరం బయ్యెడు నపు డర్జునుని నిర్జిం
చెద నీవు వంతం బొందవల" దనుటయు నాజగజంత సహో
దరుం జూచి యింద్రనందనుండు గుఱ్ఱంబు పోయినత్రోవనే
పోవుఁ గాని యిచ్చుటి కేలవచ్చు? గుఱ్ఱంబు వెంబడి నతండు
పోయిన నీ వెవ్వరితోడఁ గదనంబు సేసెదవు? అని తీవరించు
టయు సహోదరీ! యింతలోన నేమి కార్యంబు దప్పె?
ఎన్నటి కేని యు నతనికి మనకు విరోధంబు పుట్టకపోవునే?
నాఁటికి నీకొఱఁత దీర్చెద. ఈ వేళ నూరకుండు మనుటయు
నాదంట యతనిం జూచి యన్నా పుట్టినజగడంబు తోడుత
నడుపవలయుఁ గాని యేండ్లు పూండ్లు చెల్లిన నేమిప్రయో
జనం బనిన నుల్ముకుండు నాగ్రహోదగ్రుఁడై "పాపాత్మురా
లా! చొచ్చినయిల్లు చెఱచినది యుం గాక పుట్టిన యిల్లు
నుం జెఱుప వచ్చితివే' నీవంటి చెఱపనచేట మాయింట
నుండం దగదు. పాఱెడు బంట్లకుఁ బాదంబులు సాఁచు
మని యెదు. నీవలసినయెడకుం బో" మ్మని విడనాడుటయుఁ
బిడుగు వడినదానిం గొఱవిఁ జూఁడిన తెఱంగున నయ్యంగన

కెరలి మనంబులో మిడుకుచు గంగాసమీపంబునకుం జని యోడ యెక్కి యవ్వలిగట్టునకుఁ బోవువారలతోడం గూడఁ

—* గంగ యర్జును శపించుట. *—

బోవునెడఁ దనయెడమకాలిమీఁద గంగాజలంబు తుంపుర పడుటయు “శివశివా! యెంతపాపాత్మురాలి నంటితిని. ఇందు కింక నేమిప్రాయశ్చిత్తంబు సేసికొందు” నని పలికినఁ దీర్ఘవాసు లయినజను లందఱు గువ్వకరి గొని త్రిలోకపావని యగునీపుణ్యవాహిని దూషించిన నీనోరు పుచ్చవలదా? కర్మచండాలి! నీవు మాతోడంగూడ నుండం దగ దని యేకవాక్యంబుగాఁ దిట్టిన నాగంగానది నవ్వుచు నంగనారూపంబునఁ బ్రత్యక్షం బై “సీమాటి! నాయం దేమి యన్యాయంబు గంటివి! నీవిట్లుదూషించుటకుఁ గారణం బేమి యెఱింగింపు” మనినఁ బుట్టినబిడ్డల నేడ్వురం దొట్టి తొట్టిన మొసలు నులిమివేసిన పాతకినీ! నీకుఁ గడపట నుప్పరాయిలై నొక్కండు నిలిచె. సత్యవ్రతుం డగునమ్మహానుభావుని శిఖండిని మున్నిడుకొని యర్జునుండు వధించె. ఆసూడు దీర్చికొనక యున్నదానవు. పుత్రహీనవు. నీమొగంబు సూడరాదు. అనిన నద్దివ్యనది కోపశోకంబులు మనంబునం బెనంగొన నేఁటి కాఱవనెలనాఁటికి నర్జునునిశిరంబు వానికుమారునిచేఁ ద్రెళ్లుంగాక యని శపియించి యంతర్ధానంబు నొందుటయు నాజ్ఞ్వాలయు సంతసంబు నొంది యాదివిజనదీతీరంబున దారువులచేతం జితి యమర్చికొని శివునుద్దే

—* జ్వాలాదేవి చనిపోవుట. *—

శించి తనశరీరం బాహుతి గావించి మృత్యుదంష్ట్రాకరాళం బును జ్వాలామాలికాభీలంబు నర్జునప్రాణాపహారకంబు నగు శరంబై జనియించి బభ్రువాహనుతూణీరంబునం దుండె.

—* అధ్వరాశ్వము ఱాతి నంటుకొనుట. *—

అంత నాసైంధవంబు జవంబున నయ్యై దేశంబులు దాఁటి వింధ్యపర్వతసమీపంబునకు వచ్చి యచ్చటఁ దిలకంబులు క్రముకంబులు కదంబంబులు కరవీరంబులు నర్జునంబులు నామ్రంబులు కుటజంబులు కురంటకంబు లామలకంబు లగురులు సాలంబులు రసాలంబులు పాటలంబులు వటంబులు లవంగంబులు నారంగంబులు నీపంబులు ధూపవృక్షంబులు మొద లగుతరువులచే బహుళంబు లైనగహనంబులు సొచ్చి పోవునెడ మార్గమధ్యంబున యోజనంబు నిడివియు నరయోజనంబు వెడల్పును నంతియపొడవునుం గల యొక్కశిలం జూచి దేహంబు తీఁట దీఱుటకై యాశిలతో నొరసికొను మాత్రంబునఁ జిగురుఁగండెలోనం దగిలిన పక్షికైవడి నాగుంటితో నంటికొని యవ్వ లివ్వలం గదలనేరక కనకంబునం జెక్కినరత్నంబు కైవడి నిశ్చలంబై యుండుటయు నాసాహిణు లాన హేనినాదంబుల నదల్చి కశాఘాతంబున వైచి వాగె పట్టి సాఁగదీసిన రాక యూరకుండుటయు నయ్యశ్వరక్షకులు భయభ్రాంతమానసు లై వడిగాఁ గవ్వడి కడకు వచ్చి యావృత్తాంతంబు విన్నవించుటయు నరుదంది

పురందరనందనుం డశ్వంబు దురవస్థఁ దప్పించునుపాయంబు గానక తత్సమీపంబున నున్న సౌబరియాశ్రమంబునకుం జని

—* అర్జునుండు సౌబరియాశ్రమమునకుఁ బోవుట. *—

యందు శరభంబుపిల్లలం బ్రక్కలో నుంచుకొని చన్నుఁబాలిచ్చి పాలించు గండభేరుండంబులును, బోదుగులం బాలు దాఁచి సింహకిశోరంబుల కొసంగి నిదురవుచ్చు శరభంబులును నేనుంగుగున్నల కటంబులతీఁట దీఱ మెల్లమెల్లన గోరులం గీఱు సింగంబులును లేడిపిల్లలం జూచి చన్నులు చేఁపి వానిమేనులు నాకుసివంగులును బాముపిల్లలకు నెండ సోఁకకుండ ఱెక్కలం గప్పు నెమళ్లును నెలుకపిల్లల మెల్లనం గలుఁగుసేర్చుమార్జాలంబులునుం గలిగి జాతివైరంబులు లేని జంతునివహంబులచే సకలభువనసంతోషకరం బైన యాశ్రమంబునకు ననతిదూరంబున సైన్యంబును నిలువ నియమించి ప్రద్యుమ్న వృషకేత నానుసాళ్వ యౌవనాశ్వ నీలధ్వజులం గూర్చికొని యాశ్రమప్రదేశంబున కరిగి వేదాంతవిద్యావిశారదుండును దయారసవర్షనీరదుండును శ్రీమదష్టాక్షరీమంత్రలబ్ధమహత్త్వుండును రుద్రాక్షమాలికా విభూతిజటావల్కలధారియు శమదమాదిగుణహారియు నగు సౌబరిం గాంచి సాష్టాంగంబుగా మ్రొక్కి సేవించి సవ్యసాచి నిటలంబునఁ గరకమలంబులు మొగిచి "మానికులచంద్రా! ధర్మనందనుండు జ్ఞాతివధం బొనర్చిన పశ్చాత్తాపంబునఁ గృష్ణద్వైపాయను ననుజ్ఞచే నశ్వమేధాధ్వరంబు సేయం

బూని చైత్రశుద్ధపౌర్ణమాసిదినంబున దీక్ష గైకొని బ్రాహ్మణులకు మణికనకాదిదానంబు లొసంగి మఘవాజిం బయనంబు సేసి పూజించి పంపుటయు నేను శ్రీకృష్ణయుధిష్ఠిరుల నమస్కరించి వారల యనుమతిఁ గైకొని యీయాపవనాశ్వాదులు వెంబడిం గదలి రా దేశంబులన్నియుం గడచి వచ్చి వింధ్యవనవాటిం జొచ్చి యయ్యశ్వంబు యోజనవిస్తారం బైనప్రస్తరంబుతో నొక్కటిగా నంటికొనియె. శిలానిబద్ధం బైనయీయాక్రతుహయం బేవితంబున విడివడు నావితం బెఱిఁగింపవే దయానిధీ! నీకు నమస్కారం" బని ప్రార్థనంబు సేసె.

—* ఉద్దాలకమహర్షికథ. *—

అంత సౌబరి యింద్రతనూభవుం జూచి తొల్లి యుద్దాలకుం డనుమహామునీంద్రుండు యథోక్తంబుగా బ్రహ్మచర్యవ్రతంబు నెఱవేర్చి కర్కశభాషిణియుఁ గలహాకారిణియుఁ బ్రతికూలాచారయు ననుదినకృతాపచారయు నైన చండిక యనుదానిం బెండ్లియాడి బాల్యంబుననుండి యౌవనకాలపర్యంతంబు నానావిధంబుగా మనోరంజనంబు సేసియు దానివలన గుణంబు గానకయే చింతించుచు నుండు. వేఁపచెట్టునకుం బాలుపోసి చక్కెరయెరువు వేసి పెంచిన నేనియుఁ జేఁదుగాక మాధుర్యంబు గలుగనేర్చునె? అతండు సంధ్యవార్పఁ బాత్రంబు దెమ్మనిన నది రాతిమీఁదం బగులఁగొట్టు. దాని నతిక్రమించికొనుట యతిప్రయాసం బగు. తడి

దోనతి యెత్తి యిమ్మనిన నడిమికి రెండుగాఁ జింపు, నది బ్రహ్మకమ్మి వైచి కట్టుకోనలయు. జపమాలిక దె మ్మనిన సూత్రంబు త్రెంచి పూసలు వెదచల్లు, నవి వెతకి యేఱి తెచ్చుకోవలయు. సమిధలు దె మ్మనినఁ గుండం బార్పివైచు, నది యూఁది రగులుకొల్పుప్రయాసంబు దైవం బెఱుంగు. వంట వేగంబె కావలె నని నఁ గడవలు పగులఁగొట్టు. కోపంబు వలదే యనిన రోఁకలిచేఁ బ్రహరించు, నివ్విధం బునఁ బ్రతిదినంబుం బ్రతికూలవర్తన యగుభార్యచేతం బడ రానిపాటులం బడుచు బ్రహ్మచారియు గృహస్థుండును గాక రెంటికిఁ జెడ్డ రేవఁడై వంతం బొందుచు నున్న యెడ నతనికి గురుం డగుకౌండిన్యుం డనుమునివర్యుండు శిష్యులు గొలువఁ దీర్థయాత్ర పోవుచు నుద్రోవ వచ్చి యుద్దాలకుని యాశ్రమంబునకుం జనుదెంచుటయు నతం డర్ఘ్యపాద్యాది విధానంబులం బూజించి కుశలం బడిగి కౌండిన్యుతోఁ దన భార్యప్రతికూలవర్తనంబు లెల్ల సవిస్తరంబుగాఁ బలుకరించి దుఃఖించుటయుఁ గౌండిన్యుం డుద్దాలకునిం జూచి "యయిన పనికి నేమి సేయం గలవారము. అగ్నిసాక్షికంబుగా వివాహం బైనసతు లెటువంటివా రైనను విడుచుట యెట్టు? దీని కొకయుక్తిఁ బలుకరించెద. చేయవలసినకార్యంబు చేయవల దనుము. చేయ నొల్లనికార్యంబు చేయు మనుము. ఇట్లు చెప్పితి వేని యకృత్యంబులు మాని కృత్యంబులు సేయుచు నుండు. నీయభీష్టంబు సిద్ధించు" నని యానతిచ్చిన నయ్యు

ద్దాలకుండు తనపత్నిం జూచి మనయింటినడవలో నెవ్వరో కొందఱు వచ్చియున్నారు. వారల నవ్వలికిం బొమ్మని తీర్థంబు మొదలుగ నీయక దుర్భాషలం దిట్టు మనిన నా చండి యక్కటా! యిట్లు సేయుదురె? అని వారలకు నమస్కరించి తోడ్కొని వచ్చి మద్రసోపేతముగా నన్నపానంబు లొసంగి పూజించె. వారలు చనినయనంతరంబ యుద్దాలకుండు మఱునాఁడు భార్యం గనుంగొని రేపటికిఁ బైతృకంబు నేను జేయంగలవాఁడను గాను. కా దని చేసితినేనియుఁ గుండగోళకుల దురాచారుల వేశ్యాపతుల బధిరుల నంధుల విష్ణుభక్తివర్జితులఁ బరదారద్రవ్యనిరతుల బ్రాహ్మణార్థంబునకు నియమింతు నింతియ కాని నిన్న మనయింటికి వచ్చినవారు మగుడ వచ్చిరేని వారల నియమించువాఁడం గాను. పైతృకంబు సేసితినేని యులవలు చామలు నాఁగులు కందులు నలసందెలు ననుములు సెనగలు తమిఁదలు జొన్నలు కంబు లుల్లి పుచ్చకాయ ముల్లంగి సొరకాయ పిండికూర నేతిబీఱకాయ చిట్టికూర మేడికాయ చెంచలికూర మొదలైన యభక్ష్యద్రవ్యంబులు దెచ్చి వడ్డింతు నది గుసుం గాక తెల్లవాఱిన జాముమీఁద బ్రాహ్మణులం బిలుతును గాని తొలినాఁటిరాత్రియే విజ్ఞాపనంబు సేయువాఁడం గాను. సాయంకాలసమయంబున రాత్రియేని యునర్చనంబు సేయుదుఁ గాని కుతపకాలంబున నిద్ర పోవం గలవాఁడ. నట్టింటఁ జిట్టుమొకయుఁ దవుడు మంటి పెంటలు

నెఱపుదు నింతియకాని గృహంబు నలంకరింప. బ్రాహ్మ
ణుల వస్త్రంబులు దోఁచుకొని దక్షిణ లేదు పొమ్మని యవి
శ్వాసంబుగా నాచరింతు ననిన విని చండి మండిపడి సదా
చారసంపన్నులు వేదవేదాంగపారగులు నైనబ్రాహ్మణోత్త
ముల నాఁటిరాత్రియే నియమించి గృహంబు ముంగిలియు
నడవయు గోమయానులేపనంబున రంగవల్లికలచే శృంగా
రంబు గావించి తానును నరుణోదయంబుననె స్నానంబుసేసి
మినుములు పెసలు యవలు గోధుమలు మొదలగు ధాన్యం
బులును దోసకాయ పనసకాయ కాఁకరగాయ యారు
దొండకాయ బలుసుకూర మొదలైనశాకంబులు, నతిరసం
బులు వడలు దోసె లిడ్డెనలు మొదలగు ప్రేక్ష్యంబు లైన
భక్ష్యంబులును గమనీయంబు లైననూతనభాండంబులం
దలవరించి దక్షిణలు హెచ్చువస్త్రంబులు మంచిగందం
బులు సంపాదించి యుక్తకాలంబున యథావిధిగా శ్రాద్ధం
బుఁ జేయించి మగనికి నిష్టబాంధవులకు షడ్రసోపేతంబుగా
భోజనంబులు పెట్టి తాంబూలాదు లొసంగి సంతోషంబు
నొందించుసమయంబున సూర్యమండలంబు బింబఫలడం
బరవిడంబనం బై కాంతికదంబకంబులం గనుపట్ట నస్తగిరి
శిఖరంబునఁ గనకకలశంబుకరణిం బ్రకాశించె నప్పు డుద్దా
లకుండు భార్య చేసినయుపచారంబులకుఁ సంతుష్టుండై
మేను మఱచి తద్విపరీతంబుగాఁ బలుకక పార్వణంబు గొని
పోయి గంగాజలంబులో నైవు మనినం గోపించి యాపాత

కిని యింటిసమీపంబున నున్న పెంటమీఁద వైచుటయు నుద్దాలకుం డాగ్రహవ్యగ్రుఁ డై కనుఁగొలంకుల నిప్పులుప్పతిలం జూచుచు నిర్భాగ్యురాల! పవిత్రంబు లైనపార్వణంబులు పెంటమీఁద వైచి శ్రాద్ధంబు వ్యర్థంబు గావించితివి. ఈయకృత్యంబు లెన్నాళ్లు సహించంగలవాఁడ? గొండారణ్యంబున గుండురాయి వై పెద్దకాలంబు పడియుండుమని శపియించి గడగడ వణంకుపడంతుకం జూచి కరుణాకలితమానసుం డై కొంతకాలంబునకు ధర్మనందనుని యశ్వమేధాశ్వసంరక్షణార్థంబుగా నర్జునుండు వచ్చు నతనికరంబు సోఁకినం గృతార్థ వయ్యెద వని శాపమోక్షంబు ననుగ్రహించెం గావున నీకరంబుచే నప్పాషాణంబు నంటుము. అశ్వమేధహయంబు వీడి వచ్చు. చండికయును శాపమోక్షంబు గాంచు ననిన నక్కిరీటి సౌబరిమహామునికి సాష్టాంగనమస్కారంబు సేసి వాజిసమీపంబునకుం జని నిజకరారవిందంబుచే (రాతి) నంటుటయు (హయంబు దానితోడ నంటు వాసె) శ్రీరామునిచరణారవిందరేణువులు సోఁకిన యహల్యకైవడిఁ జండియు శాపమోక్షంబు నొందె. ఉద్దాలకుండును గ్రమ్మఱ దానితోడం గాంపురంబు సేయనొల్లక సన్యసించె.

అంత నయ్యశ్వంబు వింధ్యకాననంబు దాఁటి యాదిభుజంగపుంగవుని ఫణాశృంగంబులు బరువుచేతం గ్రుంగఁబడునట్లుగాఁ జతురంగంబులు నడువ హంసధ్వజమహారాజ

ప్రతాపసంరక్షితంబును గోపురాగ్రపరిచుంబితగోపురం బైన చంపకాపురంబు చేరంజనిన సాహసప్రవీణులును మహా సాహసికులును బాహుబలభరితులు నైనయోధవీరులతో నింద్రనందనుండు తోడనె వచ్చె. అప్పు డధ్వరఘోటకంబు వచ్చుటయు నానాధ్వజినీసమేతంబుగా ధనంజయుండు కూడం జనుదెంచుటయు నుపలక్షించి వేగరులు వేగంబ చని హంసధ్వజునితో నెఱింగించుటయు మంత్రులం బిలిపించి యాలోచనంబు సేసి "ధర్మజునియశ్వమేధాశ్వంబు వచ్చెనఁట! విజయుండు తోడనే వచ్చుచున్నవాఁ డఁట! నే నత్తురంగంబుఁ బట్టి బెట్టుగా సమరంబు గావించెద. అపుడు

—* హంసధ్వజుఁ డశ్వమును బట్టవచ్చుట. *—

భక్తసంకటమోచనుండును బద్మలోచనుండును గరుణావరిష్ఠుండును నైనశ్రీకృష్ణుం డతనికిఁ బ్రాపై వేంచేయఁగలండు. నే నద్దేవదేవుని దివ్యపాదారవిందంబులు సందర్శించి కృతార్థుండ నయ్యెద" నని నిశ్చయించి సన్నాహసముచితం బైన రణభేరి మ్రోయించుటయుఁ గోలఁ గొట్టినభంగిఁ జతురంగ బలంబులు వెలువడియె. అపుడు బలపరాక్రమధురీణులును రణకలాప్రవీణులును బరమాప్తులు నైనడెబ్బదుంద్రు సేనాపతులు నొక్కొక్కనికి డెబ్బదియొక్కవేయిభద్రగజంబులును నవరత్నమయంబు లైన యన్నియరదంబులును జవసత్త్వవంతంబు లైనలక్షలక్షగుఱ్ఱంబులును నందఱు వీరభటులునుం గలరు. ధనబలుండును సురథుండును సుధన్వుండును

సుబలుండును ధర్మబాహుండు ననం బరఁగిన కుమారు లేవురు గలరు. వార లందఱు ధర్మపరాయణులును శ్రీ విష్ణు భక్తినిష్ఠాగరిష్ఠులును నేకపత్నీవ్రతులును సత్యభాషణులును దాతలును శూరులును సంగరప్రియులు నై యొప్పుదురు. అట్టిసేనలతో హంసధ్వజుండు కయ్యంబునకు వెడలునపుడు నిజపురోహితు లైనశంఖలిఖితులం బిలిచి నాయాజ్ఞ నుల్లంఘించి రణంబునకు రాక వెనుకఁజిక్కినవారిం గాఁగిన చమురుకొప్పెరలలో వైవుం డని యాజ్ఞాపించి భద్రగజంబు మీఁద నెక్కి శ్వేతచ్ఛత్రచామరంబులు మెఱయ వెడలు నపుడు మేడ లుప్పరిగలు చంద్రశాలలు నెక్కి పౌరసతులు మహీపాలుని మీఁదం జల్లుకమలదళంబులు తత్కటాక్షంబులతోడంగూడ మేనం బడిన నమ్మేదినీనాథుం డర్జునునితోఁ దాఁకం దలంచినంతమాత్రంబున దేవేంద్రుం డయ్యెనో యనం జూపట్టె. అయ్యవసరంబున సుధన్వుం డనంబరఁగిన

—* సుధన్వుఁడు సంగరమునకు రాక జాగు సేయుట. *—

యతని మూఁడవకుమారుం డాహవంబునకుం గట్టాయితం బై తల్లియొద్దకు వచ్చి వందనంబు చేసిన నయ్యంబ నెయ్యంబునఁ గౌఁగిట జేర్చి కులంబునకుం గీర్తి తె మ్మని పంపినం దనకు నగ్రజ యగుకువలాదేవికి మ్రొక్కిన నాయమ్మయు నట్ల దీవించి తామసింపక తండ్రివెంటం జను మని పంచుటయు పంతసంబుతోఁ దనమోహంపుటింతి యగుప్రభావతి చెంగటకు వచ్చి సంగరంబునకుం బోయి వచ్చెద ననిన

నయ్యంగన కస్తూరనీరాజనంబుల నివాళిదీసి చెట్టఁ బట్టు కొని కేళీగృహంబునకుం దోడ్కొని పోయి వలపు దెలుపు కలికివాలుఁజూపులం జూచుచు జాఱుపయ్యెద సవరించు చుఁ జెదరినముంగురులు కొనగోట దిద్దుచు రతికేళి కౌతు కంబు తెలియంబడఁజేసిన నారాకుమారుండు బోఁటి! కిరీ టిం గెలువక నిన్నుంబొందునది లేదనిన నమ్మగువ చిఱు నగవు మొగంబునకు వింతసొగసు సంపాదింప నీవు సకల ధర్మంబులం దెలిసినవాఁడవు. నే విన్నవింపఁదగిన దే మున్న యది! ఋతుధర్మంబు దాఁటవు గావున విన్నపంబు గావించి తిని. నాకోర్కె నెఱవేర్చి పోవుట యుక్తం బని కౌఁగిలించి కొనిన సుధన్వుండు నిజసతింజూచి దివాసురతంబు ధర్మంబు గాదు. రాజు మహోగ్రశాసనుండు. రణభేరీనినాదంబు విని వినకమున్న పురంబునందలి సైన్యపతు లెల్లఁ గరితురగస్యం దన వీరభటులతోడం గూడఁ గదనంబునకుం జనిరి. నేను వెనుకఁ జిక్కిపోయితినేని చండశాసనుం డైనమండలేశ్వ రుండు పురోహితులకు నొప్పగించు. వారలు నిర్దయాత్మకు లై తప్తతైల కటాహంబునం బడవైచెదరు. రమణీమణీ! నీఋతువాసరంబులు పెక్కు గలవు గాన నేఁటికిఁ గిరీటిం జయించి వచ్చెద. నేఁడు దక్క దినంబు లేకయున్నయది యే?" అనిన నయ్యిందువదన కందర్పబాణబాధిత యై నేఁటితోడం బదియాఱుదినంబులు నిండె నింక ముందర ఋతుదినంబులు లేవు. తంత్రి తిథి యైనను భార్యవే

ఋతుకాలగమనంబు సేసినదోషంబు లే దని శాస్త్రవచనంబులు గలవు. అదియునుంగాక యిది తెల్లవాఱుజాము గాని సూర్యోదయంబు గాలేదు. కావున దివాసంగమదోషంబును లేదు. కయ్యంబునకుం బోక వెనుకఁ జిక్కిన, శంఖలిఖితులు కాఁగిననూనెతొట్టిలోనం బట్టి వైతు రని భయపడియెద వేని ఋతుకాలంబు తప్పిన భ్రూణహత్యాదోషంబు వచ్చు నందుచే యమలోకంబునఁ దప్తతైలకటాహంబునం గూలవలయు. కాకున్న నిప్పుడే మదనవేదనచే శరీరంబు నిలువదు. నామాట జవదాఁటి పోయితివేని యు స్త్రీహత్యయు భ్రూణహత్యయు రెండుదోషంబులును ప్రాపించుచున్నయవి" యని పలుకుచుఁ గులుకు బెళుకుఁ జూపుల జంకింపుచుఁ గరకంకణంబులు మొరయఁ జనుగుబ్బలందు హారంబులు మెఱయ నెఱికురులు విరియ రయంబున బింకంపుఁజనుగుబ్బ లురమ్మునం జేర్చి కౌఁగిటం బొదివి గందంపుఁజెట్టునం జుట్టిన చిలువచెలువ చందంబునఁ దల్పంబునం బడఁ గెడపుటయు రాజనందనుం డాకుందరదన మాట జవదాఁటఁజాలక రతికేళిం దనియించె.

తదనంతరంబ సుధన్వుండు సత్వరంబుగా వెలువడి వచ్చుటయు నంతలో హంసధ్వజుండు తనకుమారుం డైన సుధన్వుండు తోడ రాకుండుటవలన మండిపడుచు దండధరకింకరులంబోని లంకెనాయకులవంకఁ గనుంగొని నాయాజ్ఞ నుల్లంఘించిన సుధన్వునిం బట్టుకపోయి మత్పురోహితు

లైనశంఖలిఖితుల కొప్పగింపుఁడు. ఇంచుకయు శంకింప వలవ దని నిరుత్తరంబుగా నాజ్ఞాపించుటయు వారలు చంపకాపు రంబున కరుగుదెంచుచు ముందట సఫలీకృతమనోరథుండు నాహవోత్సనసమున్నతుండు నై కవచకార్ముకంబులు ధరి యించి కవదొనలు బిగియించి కరత్రాణంబు నంగుళిత్రా ణంబునుం బూని సింగంపుఁగొదమకైవడిం జనుదెంచు రాజ కుమారునిం గాంచి మ్రొక్కి- “సుధన్వా! నీవు రాజశాస నంబు మీఱి వెనుకం జిక్కితివి గావున నీయెడ మిగులం గోపించి భూనాయకుండు నిన్నుం గట్టుకపోయి ధర్మశాస్త్ర గురువు లైనశంఖలిఖితుల కొప్పగించి రం” డనె ననవుడు సుధన్వుండు తండ్రియాజ్ఞ దాఁటినకుమారు, నేలినవాని యానతి మీఱినబంటు నేమిచేసినం జెల్లు. తండ్రియు ధర ణీవల్లభుండు నైనయమ్మహారాజునానతిఁ జేయుటయె జన్మ ఫలం బని రథంబు డిగ్గుటయు నధిజ్యకార్ముకుండు నాబద్ధ కవచతూణీరుండు నఖిలభూషణభూషితుండు నంగజాకా రుండు నైనయక్కుమారునిం బెడకేలుగట్టి పట్టి కొనిపోయి బ్రాహ్మణోత్తము లైనశంఖలిఖితులముందరఁ బెట్టి “యితండు రాజాజ్ఞ మీఱి వలరాజునాజ్ఞకు లోఁబడి కృష్ణపాదకమలం బులఁ జూడవలయు ననెడివేడుక లేక తనచేడియతోఁ గ్రీడారతుం డై వెనుకఁ జిక్కెం గావున నితనిఁ దప్తతైల కటాహంబున వైవుం” డనిపలుకుటయు లిఖితుం డగ్రజం డైనశంఖునిం జూచి భూమిలోన నేమనుజుండు తనపలికిన

పలుకు నిజంబు సేయక తప్పించు నమ్మనుజునకు రౌరవాది నరకంబులు సిద్ధించు. తొల్లి సత్యంబు నిర్వహించుటకు నై తనరాజ్యం బంతయు విశ్వామిత్రున కొసంగి కుమారుని భార్యను గాశిలో విక్రయించి తాను జండాలునిచే విలువంబడి సత్యంబు ప్రతిష్ఠించిన హరిశ్చంద్రనరేంద్రుని వినలేదా? యట్లే రామచంద్రుండును సత్యపరిపాలనంబునకై రాజ్యంబు త్యజించి వనంబునకుం జనియె. దశరథుండు కైక కిచ్చినవరంబులు దప్పక సత్యంబు నిమిత్తంబుగాఁ దనువు దొఱంగె. సత్యంబు దప్పిన రాజసేవవలనఁ గోటివేలు వచ్చినం గాదు. సజ్జననిందితం బైనయసత్యంబున కొగ్గునట్టిరాజు చేసినపాతకంబులు పురోహితుం జెందు. పతియాజ్ఞ మీఱినయెడ మిత్రుం డైనను బుత్రుం డైనను దల్లియైనను దండ్రి యైనను బాంధవు లైనం దండనార్హు లగుదురు:

—* సుధన్వుఁడు తప్తతైలకటాహమున దిగుట. *—

అని చెప్పిన విని శంఖుండు "నట్ల చేయం దగినయది. రాజకుమారకా! నీమనంబున కెట్లు తోఁచుచున్నది" యనిన సుధన్వుండు చిఱునగ నంకురింప ధనుర్బాణంబులు క్రింద వైచి కవచంబు సడలించి కవదొనలు వదలించి తొల్లి పరవీరులం జయించి తెచ్చినరత్నభూషణంబు లుజ్జగించి శ్రీకృష్ణపాదారవిందసమర్పితంబు లైనతులసిమాలికలు పద్మాక్షమాలికలు కంఠంబునం గదియించి శ్రీహరిపాదతీర్థంబులు

గ్రోలి కమలాక్షుండును త్రిలోకాధ్యక్షుండును గనకాంబరధారియు యోగిజనహృదయపద్మవిహారియు నగుశౌరిం జేర్కొని యుపనిషద్వచనంబులచే నద్దేవునిం బ్రస్తుతించుచు నీలమేఘశ్యామలంబును గోటిమన్మథోపమానంబును బూర్ణచంద్రవదనంబును నాశ్చర్యకరంబు నైనశ్రీమన్నారాయణమూర్తిని హృదయపంకజంబునం గుదురుకొలిపి సోపానంబులు గట్టినయట్టి నూనియతొట్టియొద్దకుం బోయి సెగలచే నలుదిక్కులం గప్పుచుం బొగ లెగయ నుడుకునట్టి తైలంబు కేలం ద్రోయుచు మదగజంబు సరోవరంబు సొచ్చుచందంబున మొదటిమెట్టునకుం దిగి రెండవమెట్టునకు నడుగుపెట్టి మూండవమెట్టునకుం బోయి నాలవమెట్టున నిలుచుటయు నగ్నిమయం బైనయత్తైలంబు కుత్తుకబంటి యయ్యె. అప్పుడతనివదనంబు యమునాజలంబునం గనుపట్టు కమలంబు కరణి నతిమనోహరం బై యొప్పె. త్రేతెత్తి చూపంగూడని యాస్నేహంబును శ్రీవిష్ణుభక్తుం డగురాజకుమారునితో స్నేహంబు సేసిన చందంబునఁ జంద్రకిరణంబులకైవడిఁ బన్నీటిధారతెఱంగునఁ జందనరసంబుచందంబున నతిశీతలం బై యుండె. జనమేజయనరేంద్రా! హరిదాసుల కసాధ్యం బేదియుం గలదె!

—* దేవతలు సుధన్వునిపైఁ బూలవాన గురియుట. *—

అవ్విధంబు గాంచి శంఖలిఖితు లాశ్చర్యంబు నొంది యిక్కుమారుం డిట్లుండుట యింద్రజాలంబుగాఁ దోఁచు

చున్నయది. లెస్సుగాఁ బరీక్షింపవలయు నని నారికేళఫలంబు లత్తైలంబులోన వైచుటయుఁ బెటాలునం బెటిలియించించుక చిద్రుపలై యెగసి చుట్టు నున్నజనులపయిం బడిన బొబ్బ లెగసి బొబ్బరించుచుం బరువెత్తిరి. అంతయుం గాంచి యమ్మహామునులు హరిభక్తియుక్తుం డైనరాకుమారుని మహత్త్వం బెఱుంగక యవమానించినమహాపాపం బేమిటం దీఱు? జ్వాలామాలికాభీలం బైనయాతైలంబులోనం బడుటయె ప్రాయచిత్తం బని యయ్యిరువురుఁ దోడనె యాతైలకటాహంబునం దుమికిరి. అప్పుడమ్మువ్వురిమీఁద దేవతలు పుష్పవర్షంబులు కురియించిరి. ఆసమయంబున నింద్రాదిదిక్పాలకులు సుధన్వునిం జూచి "కుమారకా! నీవు ప్రహ్లాదు నంతవాఁడవు. నీస్వరూపం బెఱుంగక యవమానంబు సేసినయమ్మునులకు నీపాదారవిందంబులు సోఁకిన యాతైలంబులో మునుంగుటయె గంగాస్నానంబు సేసినగతిం బ్రాయశ్చిత్తం బయ్యె నింక బయలువెడలుం" డనుటయు రాజపుత్త్రునితోడంగూడ నమ్మునులు బయలుదేఱి ధౌతవస్త్రంబులు ధరియించి హంసధ్వజునిచెంతకు వచ్చి యతనివృత్తాంతంబు వివరించుటయు నతండు సంతోషభరితమానసుం డై తప్తతైలకటాహంబున నవగాహనంబు సేసిననిన్ను శ్రీహరి రక్షించెం గావున నీవు ధన్యుండవు. నాయాజ్ఞ చెల్లించి సత్యంబు నిర్వహించి వచ్చితివి. కావునఁ గులోద్ధారకుండవు సేనాధిపత్యం బొసంగెద నని యాలింగనంబు సేసినఁ

దండ్రికిం జాఁగిలి మ్రొక్కి కరంబులు మోడ్చి తొంటికరణి సముజ్జ్వలభూషణంబులు ధరియించి నిజతేజంబునం దశది శాభాగంబులు ప్రకాశింపఁజేయుచుఁ దన్ను దండించిన శంఖలిఖితులుం దక్కినజనంబులు బహువిధంబులం గొని యాడ రథంబు నధిరోహించె.

—* హంసధ్వజుఁ డశ్వరాశ్వమును బట్టించుట. *—

అవ్విధంబున సుధన్వుండు తండ్రిచే సేనాధిపత్యంబు గైకొని రథచక్రసముద్భవంబు లగుదుమ్ములచే సప్తసాగరంబు లిట్టింకు లింకంజేయుచు భేరీపటహడిండిమశంఖకాహళాది వాద్యధ్వనులచే దిగ్గజంబులఁ జెవుడుపడంజేయుచు బాల సూర్యకిరణప్రకాశంబు లైనమణిమయధ్వజంబుల యౌన్న త్యంబుచే నాకాశంబు తూంట్లుపడంజేయుచుఁ గైదువులు సారించుటవలనం బొడముమిణుంగురులచే సూర్యునకు వేఁడిమి సేయుచుఁ జటులధాటీనిరాఘాటంబు లైనచతురంగ బలంబులు నలుదిక్కులం గ్రమ్మి చనుదేఱ విలునారి మ్రో యించుచు నాహవోత్సాహంబున వెడలునగ్గలికఁ గనుం గొని హంసధ్వజుండు సంతసంబున నయ్యధ్వరాశ్వంబు పట్టి తెప్పించి పద్మవ్యూహమధ్యంబున నుంచి తాను ముం దుగాఁ గయ్యంబువేడుక మొగంబునం జెంగలింపఁ గదలి వచ్చి ధ్వజంబు లనియెడివృక్షంబులును బతాక లనియెడి తీఁగెగుంపులును వీరభటు లనియెడి సింహశార్దూలంబు లునుం గలిగి ప్రవేశింపఁ గూడనికతంబున మహారణ్యం

బునం బోలె రాజాధిరాజకిరీటంబులం దాపినదివ్యరత్నంబులనియెడిగ్రహంబులును గజకదంబకంబు లనియెడిమేఘంబులు నర్జునరథం బనియెడిమార్తాండమండలంబునుం గలిగి గగనంబునుంబలె నంటం దరంబుగాక వెలిగొడుగు లనియెడితెల్లదామరలును జామరంబు లనియెడిరాజహంసంబులును ఖడ్గకాంతు లనియెడివారిపూరంబులును యోధవీరు లనియెడిబలుమొసళ్లునుం గలిగి మహాతటాకంబుచందంబున దురవగాహం బగుచుఁ జతురంగంబు లనియెడితరంగంబులును గజంబు లనుపర్వతంబులును రథంబు లనుద్వీపంబులును విజయుజయభుజప్రతాపం బనియెడిబడబానలంబునుం గలిగి సముద్రంబుకరణి నపారం బగుచు వృషకేతనుండును బ్రద్యుమ్నుండును యౌవనాశ్వుండు ననుసాళ్వుండును నీలధ్వజుండును సువేగుండును మేఘవర్ణుండును మొదలైన మహారథులచే దుర్నిరీక్ష్యంబును నై వచ్చువివ్వచ్చుసైన్యంబు నాలోకించె.

అపుడు సవ్యసాచి ప్రద్యుమ్నునిం జూచి "కృష్ణనందనా! నాపరాక్రమంబు మీర లందఱు గనుంగొనుఁడు దురవగాహం బైనయూహవ్యూహంబు చొచ్చి చెండాడి తన్మధ్యంబున నున్నయుఘాశ్వంబు గొని తెచ్చెద ననినఁ బ్రద్యుమ్నుండు పార్థునితో నిట్లను "మాతండ్రియగు వాసుదేవుండు సేనాసమూహంబుగా నన్నుంగూర్చి మీ వెంట నంపు ఎనుఁ బ్రయోజనం బేమి? ఎదుటిదళంబు లెల్ల నాపాలు

సేసి మీరు కనుంగొనుచు నుండుం డనుటయు వృషకేత నుండు క్రీడి నవలోకించి పుడిసెఁడునీళ్లు చల్లిన నడంగిపో యెడుధూళికిఁ గాలమేఘంబులు వర్షింప వలెనె? తెప్పవేసినం బడి పోవుదోమలమీఁద గరుత్మంతుం డెత్తి రావలయునె? ఈరాజు మీకు సమానుండు గాఁడు మీ రీతనిమీఁదఁ జేయిచేసికొనం బనిలేదు. నేనె యీతనిం గెల్చి యధ్వ రాశ్వంబు దెచ్చెద.

—* వృషకేతుసుధన్వులయుద్ధము *—

అని పలికి యర్జునుని వీడ్కొని యరదంబు నధిరో హించి కిఱకిఱం దిరుగురథచక్రంబులవలనం బొడమిన మిఱు గుఱు లంబరంబున కెగయ గుణంబు నారించుచు వచ్చునా వృషకేతనుం జూచి సుధన్వుండు, ధ్వజంబునందు వృషభాం కం బున్నయది గాన నితం డర్జునుండు గాఁడు. 'అని తలం చుచు నాతనిం జూచి 'ఓయీ! నీ కులగోత్రనామధేయంబు లెఱుంగక నీతోడం గదనంబు సేయ నొల్ల' ననిన, వృష కేతనుండు కశ్యపమహాముని మాకుం గూటస్థుండు. నాచేత నిహతుండవై యెవ్వానిబింబంబు భేదింపం గోరెద వాసూ ర్యుండు మాతాత త్రిలోకాధిపతి యైనదేవేంద్రుం డెవ్వా నికడకు యాచకుం డై వచ్చి యాచించె నట్టిదాతలదా తయు శౌర్యసముద్దీర్ణుండు నగుకర్ణుండు మాతండ్రి. నా పేరు వృషకేతుం డనిన విని సుధన్వుం డిట్లనియె. మధు చ్ఛందసుం డనుమహాముని మాకుం గులగురుండు. హంస

ధ్వజుండు మాకుం దండ్రి. నాపేరు సుధన్వుండు. మన యిరువురకు జోడు తగి యున్నయది. అనిన విని కోపా వేశంబునం గన్నులు జేవురింపఁ గోదండంబు మండలా కారంబుగాఁ దిగిచి సానలం దీఱిన మెఱుంగువాలమ్ముల వానలు గురియించి చుట్టు నున్నసైన్యంబులం జెల్లాచెదరు గాఁ గొట్టి యయిదువిశిఖంబులు చాపంబునం గూర్చి విల్లు ఖండించి కేతనంబు దునిమి సూతుని ప్రాణంబులు గొని తురంగంబులం గూల్చి రథంబు చక్కాడుటయు, సుధ న్వుండు వేఱొండు రథం బెక్కి విల్లు గైకొని యయిదు బాణంబులచే వృషకేతురథంబు దూరంబునం ద్రోచి విల్లు తునియలు సేసి సేనలకుం జేయి వీచుటయుఁ జుట్టుముట్టి పరిఘంబులు పట్టసంబులు గదలు గుదియలు ముసలంబులు చంద్రహాసంబులు మొదలగు కైదువులవానలు గురియుట యుఁ జిక్కువడియునుం జేవచెడక సూర్యపౌత్త్రుండు మధు సూదనుని పాదారవిందంబు ఢెందంబునం దలంచుచు నొక్క రథికునిచేతివి ల్లొడిసి తీసికొని దురం బొనరించుటయు సుధ న్వుం డతనిసాహసంబునకు సంతసించుచు వజ్రాయుధంబు చందంబున జ్వాలామాలికా భీలం బైనయొక్కబాణంబు శరాసనంబున సంధించి యాకర్ణాంతంబుగాఁ దిగిచి యేయు టయు నడుఱొమ్మునం దాఁకి వెన్నున వెడలి భూతలంబున మునింగినం గర్ణనందనుండు కీ లెడలినజంత్రంపుబొమ్మ చం దంబున రథంబుమీఁదఁ బడి బలుమూర్ఛనొందె.

—* ప్రద్యుమ్నుఁడు సుధన్వునిం దాఁకి మూర్ఛిల్లుట. *—

అంతఁ బ్రద్యుమ్నుండు దుర్వారభుజాగర్వంబునం దేరు దోలించి నిలు నిలు మని యదల్చి యయిదునారసంబుల నొప్పించి నాల్గుసాయకంబుల నాలుగశ్వంబుల నిరువది తునుకలు గావించి మూఁడు బాణంబుల నొగలు ఖండం బులు చేసి యొక్కకాండంబునఁ గోదండంబు రెండుఖం డంబు లొనర్చి యార్చుటయు సుధన్వుండు ప్రద్యుమ్ని కరకౌశలంబునకు మెచ్చుచుఁ బదాఱుబాణంబు లొక్కపిడి కిటం బట్టి విల్లు దునిమి సారథిం గూల్చి ధ్వజంబు చక్కడిచి తురంగంబులం గీటడఁగించి బలుపిడుగులంబోని మూఁడు తూపులు నడుఱొమ్మునం గ్రుచ్చి యచ్యుతునిపట్టిని నొ ప్పించి సింహనాదంబు సేసె. ఇవ్విధంబునఁ బక్షులగతి గగ నంబున కెగయుచు సర్పంబులవలెం బెనఁగొనుచుఁ బొట్టేళ్ళ కైవడి గిట్టతోడనె చండించుచు నిరువురు నొక్కుమ్మడిఁ గర లాఘవశరలాఘవంబులును లక్ష్యశుద్ధి దృఢత్వచిత్రత్వంబు లును మెఱయ విలువిద్య నేర్పులు చూపుచుఁ బెద్దయుంద డవు పోరిపోరి మూర్ఛాపరవశులై వ్రాలిరి.

—* కృతవర్మాదులు సుధన్వునిం దాఁకుట. *—

అంత సుధన్వుండు శీఘ్రంబునం దెప్పిఱి వే ఱొక్క యరదం బెక్కి సేనం గనుపుగొట్టుచు నున్నఁ గృతవర్మ యెదఁదాఁకి తొమ్మిదితూపులు నిగిడించిన సుధన్వుండు నడు మనె ఖండించిన వెండియుఁ గృతవర్మ మూఁడువాఁడితూ

పులు మఱియు నైదుసాయకంబులు నించిన హంసధ్వజనం
దనుం డది గణింపక కృష్ణసర్పంబులంబోని తొమ్మిదివాలమ్ము
ల నిగిడించిన సహింపంజాలక తేరు డిగ్గి పలాయనంబు గా
వించె.

అనంతరంబ యనుసాళ్వుం డెదిరించి యదలించి నిజ
బాహాబలంబు గాన్పించి శరవర్షంబులు గురియించి మఱియు
నవ్వీరాగ్రేసరుం డుభయదళంబులు గొనియాడ 'నేనుబ్ర
యోగించు నీయస్త్రంబు సైరింతు వేని నిన్ను మెచ్చెద'నని
యెచ్చరించి బడబానలజ్వాలికయుం బోలె మృత్యుజిహ్వ
యుం బోలె వాఁడి మిగులువాలికతూపు నడుఱొమ్మునం
గ్రుచ్చుటయు, సుధన్వుండు ధైర్యంబు వదలక నిలిచిన నను
సాళ్వుండు వెండియుఁ బ్రచండకాండంబు లొండొండ నిగి
డించి యట్టహాసంబు సేసి మూఁడువాఁడితూపులు ఱొమ్మున
నాటించుటయు సుధన్వుండు మూర్ఛిల్లి తోడనె తెప్పిఱి
యయ్యనుసాళ్వునిపయి శరవర్షంబులు గురియించి మూర్ఛ
నొందించి సేనల విరియించి యంతకునిచందంబునఁ గోటి
సైన్యంబులం గనుపుగొట్టుచు నక్కజంబుగఁ జెక్కునారసం
బులు పఱపిన దొర్లినమావంతులును ద్రెళ్లినమత్తవారణంబు
లును జెక్కచెక్క లైనచక్రకూబరాదులును విశ్లథంబు లైన
రథంబులును విదారితంబు లగు కేతనంబులును విధ్వస్తంబు
లగుకార్ముకంబులును గూలినరథికులును గోల్పోయిన
తోడం బొరలుమహారథ్యలును శిరంబులు దెగి పడినరాహు

త్తులకబంధంబులు మోచుకొని నలుదిక్కులం బఱచుచుఁ దెగినమోరలు విఱిగినఱొమ్ములు పగిలినప్రక్కలు తెగిన తోఁకలు ఖండితంబు లైనపాదంబులు శిథిలీకృతంబు లగు సంధిబంధంబులుం గలిగి పొరలుసైంధవంబులును శిరంబు లురంబులు జానువులు జంఘలు కర్ణంబులు కపోలంబులు వెన్నులు కన్నులు పచ్చడికిం దఱిగినచందంబున శకలంబులు లైన నెత్తురులు గురియ వీరమార్గంబు గైకొని కాలు గాలుం బెనచుక పడ్డవీరభటులును విఱిగినయాఁకులు విటతాటనంబు లగు కేడెంబులును ఖండంబు లైన కోదండంబులును దుత్తుమురు లైనకత్తళంబులును జందంబు మాలినచిందంబులును జూర్ణంబు లైనశూలంబులును భంగంబు లైనప్రాణంబులును నింతింత లైనకుంతంబులును జక్కు లైనచక్రంబులునుం గలిగి యాభీలం బైనసమరభూభాగంబునఁ బెట్టువలు గట్టునట్టలతోడం గూడ గట్టు పొరలినట్టు మట్టు మీఱిన నెత్తురులును గైరికాదిధాతురంజితంబు లగుహిమశైలకటకభాగంబుల బహువిధంబులు గాఁ బ్రవహించుభాగీరథీప్రవాహంబులకరణిం గనుపట్టె. ఆసమయంబున సాత్యకి సుధన్వునిం దాఁకి నిశితాస్త్రవర్షంబులు గురిసిన వాఁడునుం దోడ్తోన మరలించిన శైనేయుం డెనుబది నారసంబులు ప్రయోగించి యతనియరదం బట్లు కావించె.

అవ్విధంబున విరథులై సాత్యకిసుధన్వులు వేఱె యరదంబు లెక్కి చలంబు డింపక యొండొరుల మైమఱువు

లఱువుల్లు సేసి నెత్తుటం జొత్తిల్లుచుఁ జూచినమోదుగుల చందంబునఁ బోలు పొందిరి. అంత సుధన్వుండు సాత్యకి నదల్చి మృత్యుదంష్ట్రాకరాళంబును జ్వలత్పావకసంకాశం బును గనకమాలికాలంకృతంబు నైనశక్తి కేలం గైకొని వ్రే యుటయు సాత్యకి చేష్ట లుడిగి వసుధాతలంబున వ్రాలె. అంతఁ గౌంతేయమధ్యముండు శత్రుభీకరం బైనయాకారం బునం గనుపట్టుచు సుధన్వునిం జూచి నృపాలకుమారకా! ద్రోణభీష్మకర్ణాదిమహాయోధవీరులతోడం బెనంగి వారల బలపరాక్రమంబు లెఱింగి యున్నవాఁడ. నీవిక్రమం బంత కంటె నతిశయించి యున్నయది యనుటయు నధిజ్యధన్వుం డగుసుధన్వుండు ‘కిరీటీ! నీబోఁటిమేటివీరునకుఁ బెక్కుమాట లేమిటికి? తొల్లి కృష్ణసారథ్యంబున జయంబు చేకొంటివి. ఇప్పుడొంటిగా వచ్చినాఁడవు. చక్రంబు కేలం బూని చక్రి నీకు సహాయుం డయ్యేనేనియు హయంబు విడువం గలవా రము గాము. శ్రీకృష్ణదేవునకుం బ్రియంబుగా మాతండ్రి హయమేధంబు సేయుంగాక’.

—* అర్జునసుధన్వులయుద్ధము. *—

అనిన విని ఫల్గునుండు క్రోధారుణలోచనుండై నూఱు నారాచంబులు నిగిడించిన నతండు నన్నియ బాణంబుల వానిం ద్రుంచి పదితూపులు మేనం గీలించి నవ్విన నవ్వీ రుండును గాలమేఘుంబుచందంబున శరవర్షంబు లపారంబు గాఁ గురిసిన సుధన్వుండు మండలీకృతశరాసనుండై మిన్ను

నేలయు దిక్కులు విదిక్కులు శరపరంపరలచే ముంచె.
అంతఁ గుంతీనందనుండు ను గాలకూటవిషాగ్నిజ్వాలలం బో
నికీలాజాలంబులం బొలుపొందు నాగ్నేయాస్త్రంబు ప్ర
యోగించిన హంసధ్వజకుమారుండు సప్తకులమహామేఘం
బులు పుట్టింపం జాలునట్టి పర్జన్యాస్త్రంబు ప్రయోగించుట
యు ధళధళాయమానంబు లైనమెఱుపులు పెళపెళ మని
యుఱుమునుఱుములును బెనుగుండ్లం బోనివడగండ్లను
మిక్కుటంబుగా దిక్కులు క్రిక్కిఱియం బాఱుమహాప్రవా
హంబులును నెడ నెడం బడుబలుపిడుగులునుం గలుగుట
యుఁ దురంగంబులు మాతంగంబులు శతాంగంబులు పదా
తిసంఘంబులును బక్కెరలు పల్లంబులు జోళ్లు ఛత్రంబులు
చామరంబులు వెల్లిం బడి పోవ మిట్టుపల్లంబును నొక్కటిగా
బహుప్రవాహంబు పాఱం దొడంగిన నింద్రనందనుండు
వాయవ్యాస్త్రంబుచే నయ్యస్త్రంబు మాయించిన హంస
ధ్వజకుమారుం డర్ధచంద్రబాణంబున నర్జునుని సారథి శిరంబు
ఖండించి దీప్తపావకసదృశంబు లైననిశితవిశిఖంబుల నాపాద
మస్తకము గ్రుచ్చి యార్చుటయు రథవాహంబులు కలంగం
బడి నలుదిక్కులు పఱచుచుఁ జీకాకుపడుటయు నర్జునుండు

—* శ్రీకృష్ణుఁ డర్జునునకుఁ బ్రత్యక్షమగుట. *—

దుస్తరం బైనయాసంకటంబు నిస్తరింపం జాలక, 'ఆపదుద్ధా
రకా! ఆదిదేవా! అనంతా! అనంతశయనా! అంబుజ
నాభా! అచ్యుతా! హరీ! శ్రీకృష్ణా! నిన్ను నమ్మినవాఁడ.

లక్కయింటం జిక్కు వడకుండఁ గౌరవసభాస్థలంబున ద్రౌప దికి మానభంగంబు గాకుండ నడవుల నిడుమలం బడునప్పు డాపదలం బొరయకుండ భీష్మద్రోణకృపాశ్వత్థామకర్ణాది యోధవీరులయస్త్రాగ్నిజ్వాలలం గ్రాఁగకుండ సైంధవవధం బునఁ బ్రతిజ్ఞాభంగంబు గాకుండ రక్షించి సకలసంకటం బులు నెడఁబాపితివి. త్రిలోకాధ్యక్షా పంకజాక్షా! యిప్పు డీసంకటంబు తొలంగించి రక్షింపవే రక్షింపవే' యని ప్రార్థించుటయు భక్తరక్షణవిచక్షణుం డగుకమలాక్షుండు తెలిదమ్మిరేకులం దెగడుచుఁ గరుణామృతంబు నెదచల్లు చల్లనిచూపులఁ జెన్నుమెఱయుకన్నులును బున్నమచం దురుం బురుడించునెమ్మొగంబున నందంబుమీఱుమందహా సంబును గలుములజవరాలికి నిజనివాసం బైనవెడందయు రంబున బాలసూర్యబింబవిడంబకం బైనకౌస్తుభంబును నద్భుతంబు లైనపరిమళంబులం గుప్పళించువనమాలికయు శార్ఙ్గకోదండమౌర్వీకిణాంకంబులును, ఆజానుదీర్ఘంబులు కంక ణకేయూరకటకాంగుళీయకాదినానాభూషణవిభూషితంబు లును సర్వాభీష్టప్రదాయకంబులును లోకరక్షాదీక్షితంబు లును శుభలక్షణలక్షితకరాంగుళీవిలసితంబులు నైనచతుర్భు జంబులును జిగురుటాకులం బోలి మౌనిమానసధ్యానయో గ్యంబులును వేదాంతవీథిసంచారయోగ్యంబులు నగు మృదులపాదంబులును గనుపట్ట నీలమేఘశ్యాములుండును పీతాంబరధరుండును గోటికందర్పలావణ్యనిధియును బ్రస

న్నముఖారవిందుండు నైనగోవిందుండు తత్‌క్షణంబ ప్రత్యక్షుంబయ్యె.

అంత ఫల్గునుండు సాష్టాంగవందనంబు గావించి కరంబులు మొగిచి కరుణారసంబు వెదచల్లుచల్లనిచూపులం గటాక్షించి యాదరంబున నిటలతటంబున ఘటియించి యానందబాష్పంబులు ఱెప్పల నుప్పతిల్ల రోమాంచకంచుకితగాత్రుండై గద్గదకంఠంబున నేమియుఁ బలుక నేరక యూరక యున్నయయ్యర్జునుని గాఢాలింగనంబు గావించి సారథ్యంబునకుం బూని యాముకుందుండు పగ్గంబులు బిగియం బట్టి మునికోలం గేలం గైకొని తురంగంబులకందంబు లప్పళించి తేరు మరలించి యర్జునునిం జూచి యవక్రపరాక్రమశాలి వైనశత్రునిం జయింపుము శీఘ్రంబు లెమ్ము జయంబు చేకొను మనుటయు గాండీవి మ్రొక్కి గాండీవంబు సజ్యంబు గావించి జ్యానాదంబుచే రోదసీకుహరంబు పూరింపుచు దేవదత్తం బొత్తుటయుఁ గమలాక్షుండును బ్రళయ

—* అర్జునసుధన్వుల ప్రతిజ్ఞలు. *—

సమయ జలధరగంభీరనిస్స్వనం బైనపాంచజన్యంబు పూరించె. ఇవ్విధంబున యుద్ధసన్నద్ధులును రథికసారథులు నై వచ్చు నాకృష్ణుల నిరువుర నుపలక్షించి సుధన్వుండు వదనారవిందంబున మందస్మితంబు దళుకొత్త 'శక్రనందనా! చక్రపాణి నీకు సహాయుండై యుండఁ బరాక్రమించుట కేమి భయంబు? ఉభయదళంబులు వృథా సమయ నేటికి? రిత్త

యంపపోకడకయ్యెం బెంతతడవు? ఇన్ని బాణంబులలో నిన్ను జయించెద నని ప్రతిన గావింపు మనినఁ బురందర నందనుండు రాజనందనా! మూఁడుబాణంబులచేత నీశిరం బు పడఁ గెడపెద నటు చేయం జాల నైతినేని తండ్రియుం దాతయు మొద లైనమాపూర్వులు పుణ్యవిహీనులై నరక కూపంబునఁ గూలుదురు గాక యని ప్రతిన గావించుటయు నీ వేయుమూఁడు బాణంబులు నే నడుమ ఖండించెద. ఇట్లు సేయ నైతి నేని నేనును మాపెద్దలును నాచరించిన సుకృతంబులు రాక్షసులపా లగుంగాక పూజావిరహితుం డైనదురాత్ముండును, వసిష్ఠసమానుం డైనబ్రాహ్మణునిం జంపిన బ్రహ్మఘాతుకుండును బొందుదుర్గతిఁ బొందం గలవాఁడ నని త్రివాచకంబుగాఁ బ్రతిన గావించి సుధన్వుండు సువర్ణ పుంఖంబులును గంకపత్రవిచిత్రితంబులు నగునా అమ్ము లొక్క ముష్టిం బట్టి వి ల్లాకర్ణాంతంబు గాఁ దిగిచి యదుకు లాధ్యక్షునివక్షస్థలం బుపలక్షించి యేయుటయు నాబా ణంబునకుం గట్టినబలుఱెక్కగాడ్పుల నయ్యరదంబు నన్నా ఱుమూరలకొలఁది పిఱిందికిం జని భూనభోఽంతరాళంబు లేకంబు గా దువ్వ గ్రమ్ముటవలన రథరథ్యకపిధ్వజంబుల తోడం గూడఁ గృష్ణార్జునులు గానంబడ రైరి. అప్పు డా సుడిగాలి విసలోనం దగిలి యారథంబు బొంగరంబు చందం బునఁ గుమ్మరిసారె తెఱంగునం దిరుగుచు నుండెఁ గాని నిలువ దయ్యె. అప్పుడు విశ్వంభరుండైన శ్రీకృష్ణదేవుండు

తనయుదరంబునందు నున్న బ్రహ్మాండకోటులబరువుతోడం గూడ నయ్యరదంబు చిక్కం ద్రొక్కి యెట్టకేలకుం గదల కుండఁగ నిలిపి 'యర్జునా! పెక్కుబవరంబులుం గని యున్నారము. ఇంత కడిందివీరు నెక్కడం గానము. ఇతండు సత్యవ్రతుండు. పితృభక్తుండు. అదియునుం గాక యేకపత్నీవ్రతుండు. అత్యంతకాముకులమై బహుస్త్రీలోలుర మైన నీకు నాకును వీనిం జయింపం గూడునే. నీప్రతిన యెట్లు నెఱవేఱం గలయది. చిత్తం బుత్తలంబగుచు నున్నయది? యనిన విని కిరీటి నవ్వుచు శ్రీకృష్ణా! నీకటాక్షంబు గలిగె నేని యసాధ్యం బేమి యున్నయది? అని పలికి గాండీవి జ్యానినాదంబు దిక్కులు వ్రక్కలిలం జేయఁ గాంచనపుంఖంబును గాలదండోపమానంబును నైనసాయకం బొక్కటి వింట సంధించి వానికంఠం బుపలక్షించి యేయునవసరంబున గోపాలదేవుండు మున్ను దాను గోవర్ధనాచలం బెత్తి గోగోపసంఘంబులం గాచినసుకృతఫలంబు నయ్యస్త్రంబున కొసంగిన నదియును గాండీవికోదండవినిర్ముక్తంబు ప్రళయకాలదండధరదండోపమానంబును నై దిక్కువిదిక్కులు ఘూర్ణిల్లం జేయుచు మెఱుంగుమొత్తంబులు నుమియుచుఁ గాలదండంబు కరణిఁ బఱతెంచిన నయ్యేకపత్నీవ్రతుండు నంతకంటె మిన్నైనతూపొక్కటి వింట సంధించి ప్రయోగించిన నదియును బక్షీంద్రుఁ డురగంబు ఖండించిన తెఱంగున దాని ఖండించె. తోడనే సుధన్వుండును నిప్పులు గుప్ప

ళించుశరంబు లపారంబుగాఁ గృష్ణార్జునులపయిం గప్పినఁ గిరీటి హాటకపుంఖంబును గోటిసూర్యప్రకాశంబు నగువే ఱొక్కసాయకంబు గాండీవంబునం బూన్చి యేయుటయు నచ్యుతుండు దాను మున్ను పరశురామావతారంబున సకల క్షత్రియుల జయించి చతుస్సముద్రముద్రితం బైనభూవల యంబు కశ్యపునకు ధారవోసినఫలం బయ్యంబకంబున కొసంగిన నదియును బ్రళయకాలానలంబుచందంబున జ్వలింపుచు దుర్వారవేగంబునం జనుదెంచుతఱి హంసధ్వజ కుమారుండు తాదృశం బైనబాణం బాకర్ణాంతంబుగాఁ దిగిచి యేసిన గాండీవికాండంబు రెండుఖండంబులై భూ మండలంబునం బడియె.

—* అర్జునుండు సుధన్వునితల ద్రుంచుట. *—

ఇవ్విధంబున శరద్వయంబు వమ్మగుటయుఁ బురుహూత నందనుండు డెందంబునం గ్రందుకొనుచలంబును మచ్చరం బును విచ్చలవిడిం బెచ్చు పెరుఁగఁ గల్పాంతమార్తాండమండ లంబు వేఁడిమిం గ్రేణి సేయు మూఁడవబాణంబు ధనుర్గు ణంబునం బూన్చుటయు నప్పురుషోత్తముండు నక్కాండం బునకుఁ బుంఖదేశంబున హిరణ్యగర్భుని మధ్యప్రదేశంబున సమవర్తిసహితుం డగురుద్రుని బాణాగ్రంబునం దన తేజో విశేషంబు నశేషంబు నునిచి తొల్లి శ్రీరామావతారంబునఁ బితృవాక్యపరిపాలనంబును సత్యవ్రతంబును నేకపత్నీ వ్రతం బును శరణాగతసంరక్షణంబును నశ్వమేధాదియాగంబులును

జేసినఫలంబు తత్సాయకంబునం దునిచె. అంతక మున్న రంభోర్వశీప్రముఖు లైనయచ్చరమచ్చెకంటు లమ్మహావీరుం డగుసుధన్వు నెదురుకొనుటకై కానుకలు గైకొని వచ్చిరి. ఇంద్రాదిదిక్పాలకులు విమానారూఢులై యతివేగంబున వచ్చి సుధన్వార్జునులప్రతినలు నిరువురజయసందేహసమరవిజృంభణంబును హర్షాద్భుతభయంబులం బొరలునంతరంగంబులం బొగడుచుం గనుంగొనుచు నుండిరి.

ఆసమయంబునం బార్థుండు లయకాలశిఖిశిఖాసంకాశం బైనయాశిలీముఖంబు సంధానక్రియాచాతుర్యంబున సంధించి యేయుటయు మంటికి మింటికి నేకంబుగా మంట లెగయ మిణుంగుఱులకుప్పలు గుప్పుగుప్పునం గుప్పుచు ఛటచ్ఛటశబ్దంబుల భూనభోఽంతరాళంబులం గ్రక్కతిలం బఱతెంచు నయ్యస్త్రంబు నరవడిం గనుంగొని సుధన్వుండు చండమార్తాండకిరణప్రకాశంబును దంభోళిసంకాశంబు నగు బాణం బొక్కటి వింట సంధించి ప్రయోగించుటయు నక్కాండం బతిరయంబునం బఱతెంచి యర్జునుం డేసిన బాణంబు నడిమికి రెండుతుండంబులు సేసిన నాశరంబు సగంబు తెగి పడియును వేఁడిమియును వేగంబును జెడక శ్రీవాసుదేవునిసంకల్పంబువలన నతిత్వరితంబుగాఁ బఱతెంచి చంద్రబింబోపమానంబును గిరీటకుండలాభిరామంబును వీరరసోన్నిద్రంబును విజృంభితసింహనాదంబు నైన సుధన్వునిశిరంబు ఖండించె.

తదనంతరంబ తత్కబంధంబు బిఱబిఱం దిరిగి రథగజ తురగపదాతిబృందంబులు చాపకట్టుపడం జేయుచు ధరాతలంబునం బడియె. ఫల్గునశరఖండితం బగునతనిశిరంబు గగనంబున కెగసి గజేంద్రవరదా! గరుడవాహనా! నీరజాక్షా! నిఖిలలోకాధ్యక్షా! దేవకీనందనా! దీనజనాభినందనా! నారాయణా! భక్తత్రాణపరాయణా! 'నమోనమో'యని దివ్యనామసంకీర్తనంబుసేయుచు నతివేగంబున వచ్చి శ్రీగోపాలదేవుని చరణపద్మంబులఁ దుమ్మెద కైవడి వ్రాలె. అప్పు డతనిదివ్యతేజంబు దశదిశలు ప్రకాశింపఁజేయుచుఁ గేశవునిదివ్యదేహంబునం గలసె. కంసమర్దనుండును దన్న స్తకంబు కేలంగైకొని హంసధ్వజునిమ్రోల వైచుటయు నమ్మహీధవుండు పుత్రశోకార్తుండై పెద్దయుం బ్రొద్దు వగచి యాశిరంబు గ్రమ్మఱ రుక్మిణీవల్లభునిపాదాబ్జంబులం గదియ వైచుటయు నద్దేవుండు దాని నెత్తి గగనంబున కెగుర వైచుటయుఁ దోడ నెయంతర్ధానంబు నొందె.

అంత సుధన్వునిపాటు గనుంగొని చింతావ్యాకులితమానసుండై హాకుమారకా హాకులోద్ధారకా! మహాగుణభూషణా మాతాపితృసంతోషణా! మేరునగధీరా వీరాదివీరా! హాసుకుమారశరీరా సుజనాధారా! బుధవిధేయా దానరాధేయా! నందనందనచరణారవిందవందనా! దీనజనా)నందనా! అయ్యయ్యో! నన్నును మీతల్లి (1)నగతికులం

(1) ననాథుల మూలము.

జేసి వాసుదేవుని సాయుజ్యంబు సెందితివే! నీ వుత్తమోత్తమంబైన దివ్యపదంబున కేగితివి గావున నీకు వగవం బని లేదు. నన్నుఁగన్నతండ్రీ! పరాక్రమోపార్జనుం డగునర్జునుని నిర్జించి వత్తు వని నీరాక కెదురుచూచుచునుండుమీ తల్లితో నే మనం గలవాఁడ. నీరాణి యగుప్రభావతి ముఖంబే మని చూడం గలవాఁడ. కుమారా! యనాథుల మగుమాజీవనంబునకు వగచెద మని పలవించు హంసధ్వజుని చెంతకుఁ జనుదెంచి సుధన్వున కగ్రజుం డైనసురథుండు తండ్రి నూరార్చుచు రాజేంద్రా! శూరుల కాహవమరణంబు మోదకరంబు గాని ఖేదకరంబు గాదు. నీవంటిధీరుం డిట్లు దైన్యంబు నొంద నగునే. నన్ననికిఁ బంపుము. వైరిసేనలం జుట్టుముట్టి కనుపుగొట్టెద. మాధవుని ప్రాపున సుధన్వుని వధించినవాసవతనూజునిం బాఱఁ దోలెద. కాక యెదిరించెనేని నాతమ్మునికి సహాయంబుగాఁ బనిచెద. దిక్కులఁ గీర్తి నించెద. అని యనేకవిధంబుల హంసధ్వజు నూరార్చి సురథుండు కైదువులు మెఱుంగు లీన జోదు లిరుగెలంకులం బలసి చనుదేర నరదంబు నెక్కి ద్విరదంబులు తురంగంబులు భటసంఘంబులు నసంఖ్యాతంబులు గాఁ జనుదేరఁ గుహానానృసింహుని కహకహాట్టహాసచందంబుగా నందంబు మీఱుచిందంబు పూరింపుచు సింహనాదమేదుర రోదోఽంతరాళుండై బయలు మెఱయుసుధన్వునిరాకఁ జూచి మధుసూదనుండు పార్థు నుద్దేశించి యర్జునా! దుర్జయ

—* సురథుం డర్జునునితో యుద్ధము సేయుట. *—

కాలభైరవుండునుం బలె మండుచు సుధన్వాగ్రజుండైన
సురథుండు సర్వసన్నాహం బగుసైన్యంబులతోడం గూడ
నిదె వచ్చె. వీని నీకె కాదు. బ్రహ్మవిష్ణురుద్రాదులకైన
నెదుర్కొనం గూడదు. తమ్ముని యుమ్మలికమ్మున రోషమ్మునం
జనుదెంచువీనిధాటికిం బ్రథమకబళంబుగా నేమిటికి? మన
మీవేళనుం దొలంగి యుండుదము. పురుషరూపంబు నై
కొన్నసత్యంబుకైవడి నరాకృతి వహించినధర్మంబుకరణి సా
కారం బైనసదాచారంబుచందంబున సద్గుణాభిరాముం డైన
యారాజకుమారుండు నీకు నసాధ్యుం డగుటకతనం బ్రద్యు
మ్నవృషకేతనమేఘవర్ణయౌవనాశ్వనీలధ్వజాదియోధుల ని
చ్చట నిలిపి మనము కొంతతడవునకు మగిడి వత్త మనిపలు
కుచుం బరబలంబుల మీఁదఁ దమబలంబులం బురికొల్పెడు
చందంబున నరదంబు తఱిమికొని మూఁడు యోజనంబు
లెడ గలుగం జనియె.

అప్పుడు సురథుండు రసణ మెఱయ నేగుదెంచి పిడు
గులు పడునడువున బెడిదంబు లైనశరంబులు జడిగొనం
గురియుచు నర్జునుసైన్యంబు సొచ్చి మారి మసంగిన భంగి
మంత్రించి పడవైచినగతి లయకాలదండధరుండు తాండవిం
చినదారి విజృంభించి గంభీరగుణారావంబుచే నంభోని
ధులు గలంగ భద్రగజసమూహంబులం జించి చెండాడుచు
వాయువేగమనోవేగంబు లగుతురంగంబులు గుదులుగ్రు

చ్చిన చందంబునం గూల నేయుచుఁ దేరులఁ దిలమాత్రశక లంబులు సేయుచు భటకదంబంబుల నంబకంబులం బడఁగె డపుచు ఖండంబు లైనశస్త్రాస్త్రకాండంబులును దుత్తుమురు లైనకత్తళంబులును దుమ్ము లైనకోలెమ్ములును బ్రోవు లైన ప్రేవులును బంకంబు లైనమాంసమజ్జమస్తిష్కంబులునుం గలిగి రణాంగణంబు ఘోరంబు గాఁ గనుపట్టం బరాక్ర మింపుచు యోజనత్రయవిస్తారంబుగాఁ బన్నిన సైన్యంబుల నెల్లఁ జించి చెండాడి శ్రీకృష్ణునిఁ బార్థునిం గనుంగొని సుర ఘుం డిట్లనియె. కృష్ణా! నీవు మూఁడవతారంబులం జేసిన సుకృతంబు నీబలంబును బార్థున కొసంగి సుధన్వునిం జం పింప నగునె? పురాణపురుషుండ వయ్యుఁ బడుచుఁదనంబు మాన వైతివి. కేనుపంక్తి నిమిత్తంబు గా ముత్తియంబులు వేలములు వేయుచందంబున గోవిందా! నీ విట్లు చేయం దగునే. నిన్ను ధర్మదయాసాంద్రుం డని మహామునులు గొ నియాడ విందు. నీ విందు సుధన్వుని మఱందిచేతం జంపించి పోవం జూచినం బోనిత్తునే? యని పలికి యలుక మొగం బునం దోలుక వేలకొలందు లగుకడిందిబాణంబులు పురంద రనందనునిపయి నిగిడించిన నతండు వాని నన్నిటిని ఖం డించి క్రొవ్వాఁడిబాణంబులచేఁ గోదండంబు ఖండించి గుఱ్ఱంబులం బడఁగెడపి సారథిని వధించి రథంబు వితథంబు గావించిన వాఁడునుం బోలి వోనిబంటుతనంబున వేఱొండు రథం బెక్కి సముజ్జ్వలం బైనకార్ముకంబు సజ్యంబు గావించి

కమలాక్షపార్థుల రథాశ్వకేతనసమేతంబుగా బాణవారాశిలోనం జిక్కుపడం జేసినం గ్రీడి వేడుక మెఱయ వాని తూపులు రూపఱం జేసి యొక్క మెఱుంగు నారసంబు నభిమంత్రించి వేయుటయు వానిరథంబు ఱెక్కలతోడి మేరుశిఖరంబుచందంబున సూర్యమండలంబుదాఁకం గొని పోయె. అన్నరునిధనుర్విద్యాకౌశలంబు వర్ణింపం దరంబె? సురథునీతీరపర్యంతంబు సురథు నీతీరునం గొని పోయిన సురపథంబున నిల్చి వాఁడు భువనభయంకరంబుగా నట్టహాసంబు సేసి భీకరం బయినసాయకంబు వింట నరిఁబోసి పార్థరథంబు గుఱిసేసి యేసిన నది బిఱబిఱం దిరిగి భూమిలోనం బూడుకొనుటయు మురభంజనుండు ధనంజయుని తోడం గూడ దుమికి తనబాహుదండంబులు చాఁచి యయ్యరదంబు నుబుకనెత్తం జాలక తొల్లి వరాహావతారంబున శైలకాననసమేతం బైనవసుంధరావలయంబు దంష్ట్రాగ్రంబున నుద్ధరించితి నప్పుడు నింత బరువు తోఁచ లే దని పార్థునితోఁ బలుకునవసరంబున నాంజనేయుండు తత్కేతనంబున నుండి డిగ్గ నుఱికి మహామేరుశైలసమానంబుగాఁ బెరిఁగి దీర్ఘతరం బైనవాలంబునం జుట్టి పట్టి యీడిగిలంబడ నీడ్చి యు న త్తేరు నెత్తం జాలఁ డయ్యె.

అంత సురథుండును గరుడవాహన శ్వేతవాహనుల మీఁద నర్బుదన్యర్బుదఖర్వమహాఖర్వశంఖసంఖ్యాతంబులు పుంఖానుపుంఖంబు లైనమార్గణంబులం గుప్పుటయు నా

జనార్దనుండు దాని సైరింపం జాలక యర్జునుం జూచి కిరీటీ! నీమేటితనం బెక్కడికిఁబోయె. అనిమొనలం గను చెదరని వీరాదివీరుండ వనికదా నిన్ను నమ్మి మాయన్న సమ్మతితే కుండియు నాచెలియలి నొసంగితి? ఇంకనైనఁ దెలివొంది కయ్యంబు సేయుము. (అనియె.)

* అదియునుం గాక సాటి లేనిమేటిపోటుబంట వని పరిభావమఱంది వనియును లాఘవం బెన్నక నీరథంబు గడప నొడఁబడి పార్థుని సారథి యను నామధేయంబు జగ ద్విఖ్యాతంబుగా ధరించితి. అయిన నేమయ్యె? ఇప్పు డవక్ర పరాక్రమం బగుచక్రంబు నొసంగుదునో? లేక నేను రథి కుండ నై శార్ఙ్గకోదండంబు మండలాకారంబుగా గుడుసు పడం దిగిచి యాశీవిషోపమానంబు లగునిశితవిశిఖపరంపరల వెంపర లాడి వైరిచమూనమూహంబులం గనుపుగొట్టెద. నీవు సారథ్యంబునకు నాయితంబు గమ్ము లెమ్ము లెమ్ము పగ్గం బులు గైకొమ్మనియె. *

అంత ఫల్గునుండు రోషారుణలోచనుండై బాణాసుర మర్దనుం గనుంగొని దేవా! నాపరాక్రమంబు చూడుము. అని పలికి నూఱులకొలందులు వేలసంఖ్యలు నయుతనియు తగణంబులు నైనయంబులం బ్రయోగించి వానితేరు తిల మాత్రంబులు నణుమాత్రంబులు బరమాణుకల్పంబులును

---

* * ఈపువ్వులనడుమ నున్నవాక్యము లొక్కప్రతిలోమాత్రమే కలవు.

దుర్ముఖూళియుం జేసి భూతలస్థునిం జేయుటయు సురథుండు విరథుండై మాధవాంజనేయులచేతఁ దెమలింపం గూడని పార్థునిరథంబు పెల్లగించి సంగడంబుచందంబునం బొడవుగా నెత్తి కంసకర్ణభంజనులం జూచి "కృష్ణులారా! మీయరథంబు భూమిం బడవైచి చూర్ణంబుగాఁ జేయుదునో సప్తసాగరంబుల కవ్వలితీరంబునఁ బడవైతునో హస్తినాపురంబున ధర్మజుని సన్నిధానంబునఁ బడఁ జిమ్ముదునో" యని పలుకుచు ఘాత చేసిన నాఖండలనందనుండు దంభోళిసంకాశంబు లైనయ యుదుబాణంబులు గాండీవంబునం దొడిగి సురథునివక్షంబు భేదించిన వాఁడును విసంజ్ఞుండై చే వదలి ధరణీతలంబునం బడియె. అంతలో రమాకాంతుం డెప్పటితెఱంగునఁ దే రాయత్తంబు సేసి పార్థుండును దాను నెక్కి దేవదత్తపాంచ జన్యంబులు పూరించుటయు సురథుండు సారథి తెచ్చినవే ఱొక్క తేరిమీఁదఁ దాను నవలీల నెక్కి నిరర్గళమార్గణా సారంబులు గురియుచుఁ బోటుపంతంబుమాట లాడం దొ డంగిన ధనంజయుండు సురథునిం జూచి యవశ్యంబును

—✻ అర్జునుఁడు సురథునిఁజంపుట. ✻—

భవదీయమస్తకంబు ఖండింతు నట్లు చేయ నైతినేని నాపూ ర్వజులకు ద్రోహంబు సేసినవాఁడ నగుదు ననిన సురథుండు పార్థునిం గనుంగొని నీశరీరం బవశ్యంబు ధరణీతలంబునం బడఁద్రోయుదు నట్లు చేయనైతి నేని నీచెప్పిన శపథంబె నాకును సరియనుచుఁ గిరీటిపై ననేకకోటిబాణంబులు నిగి

డించిన వానిం ద్రుంచి యతండు సురథునిపై శతసహస్ర సంఖ్యాతంబు లైనవిశిఖంబులు సంధించె. అంత నాసురథుండు రోషారుణలోచనుండై వివ్వచ్చువింటినారి ద్రెవ్వ నేయుటయుఁ బార్థుండు వే ఱొక్కనారి సవరించి రథంబు చెక్కలు గావించిన నతండు వే ఱొక్కశతాంగంబుపై నెక్కి యుద్ధతి మోహరించుటయుఁ బార్థుండు దాని బహుశకలంబులు గావించె. క్రమ్మఱ నొక్కరథం బెక్కినం దునిమె. మఱియు నొక్కశతాంగంబు నధిరోహించిన ఖండించె. ఇవ్విధంబున నూటయెనిమిది రథంబులు పొడిచేసిన సురథుండు విరథుం డయ్యుఁ గార్ముకంబు సారింపుచుఁ దూణీరంబునకుం గేలు సాచి బాణంబు నందుకొనునంతలో నర్ధచంద్రాశుగంబున నతనిబాహువు ఖండించె. అట్లు ఖండితబాహుఁ డయ్యు శౌర్యంబు వదలక సురథుండు కేలం గద యమర్చికొని త్రిప్పుచుం బఱతెంచి కిరీటి తేరిగుఱ్ఱంబులం జదియ మోఁది రెండు వేలయేనుంగులం బీనుంగులు గావించి యన్నియ రథంబుల మర్దనం బొనర్చి పదివేలవీరయోధుల మడియించి యన్నియ తురంగంబుల గీటడంగించి సింహనాదంబు సేసినం గిరీటి కృష్ణసర్పోపమానం బైనక్రొవ్వాఁడి మెఱుంగుఁ దూపు వింటం దొడిగి గదతోడం గూడ వామభుజంబు ఖండించిన రెండు భుజంబులు లే కుండియుం గొమ్ములు లేనియేనుంగు కైవడి నౌద్ధత్యంబునఁ బాదఘాతంబులచే రథ రథ్యసారథి మాతంగతురంగంబుల మర్దింపుచు వచ్చు నెడఁ

ఖాండవమధ్యమునందు రెండుబాణంబులచే రెండుపాదంబులు ఖండించిన, సురథుండు డొల్లివచ్చుట కనుంగొని యింద్రనందనుండు కనకపుంఖవిభ్రాజితంబును మయూరపత్రచిత్రితంబును ననేకసూర్యప్రకాశంబు నైనసాయకంబు సంధించి యభిమంత్రించి యేసిన, నది యతిరయంబునం బోయి సురథునిశిరంబు ఖండించిన, నాశిరంబు రాతిమీఁదం బడిన చందంబున బెట్టుగా మిట్టిపడి పార్థుని మస్తకంబు మీఁదం బడుటయుఁ, బిడుగుపడుచందంబున రిమ్మపట్టి కిరీటి వివశుండై భూతలంబునం బడియె. సురథుని మొండెంబు కరితురగరథసమూహంబుల నుగ్గునూచము చేయుచుఁ జేగుఱుకొండచందంబునఁ గుంభినీతలంబునం గూలె. అంత మూర్ఛ నొంది పుడమిపయిం బడినకౌంతేయునిం గనుంగొని, దనుజాంతకుండు నిజపాణిపల్లవంబుచే మేను నిమిరి సేదదేర్చినం, గిరీటి స్వస్థుండై నిలిచె.

—* శ్రీకృష్ణుఁడు గరుత్మంతునిఁ దలఁచుట. *—

అంత సురథుని శిరంబు నెత్తామరలమీఁద వ్రాలు మధుకరంబు తెఱంగున శ్రీహరిచరణారవిందంబుల మీఁద వ్రాలె. అప్పురుషోత్తముండు నయ్యుత్తమాంగంబు కేలం గైకొని పార్థునకుం జూపి "యితండు ప్రాణావసానసమయంబునందును సత్యంబు దప్పండు. శీలవంతుండును దాంతుండును సమరదుర్దాంతుండు నయిన యీయుత్తమశ్లోకుండు నిఖిలలోకవందనీయుం" డనుటయు, సంక్రందననందనుండు

పరమానందంబున నందుకొని తచ్ఛిరంబునకు వందనంబు గావించె. అంత మురాంతకుండును రాజతనూజుఁ గృతార్థుం జేయ నూహించి వైనతేయునిం దలంచిన నిబ్బరంపు మబ్బులోనం గబ్బి మీఱువిద్యుల్లత తెఱంగున విద్యోతమానంబు లైనఱెక్కలవలనఁ మిక్కుటంబుగాఁ బొడమిన ఝంఝామారుతంబుచేఁ గులపర్వతంబు లొడ్డగిల్లు నట్లుగా నెగసి వచ్చి సన్నిధానంబున నిలిచి దేవదాసుండ నగు నేను వచ్చితి; నేమి కార్యంబున నియమించెద; వని పలుకుటయు, నుపేంద్రుండు ఖగేంద్రునిం జూచి నీ వీశిరంబు గైకొని శీఘ్రంబుగా నరిగి ప్రయాగలోఁ ద్రివేణిమధ్యంబున వైవుము. సురథుం డుత్తమలోకంబు గాంచుఁ గాక యనిన నాగాంతకుండు నరకాంతకుని యానతి శిరసావహించి 'దేవా! భవదీయ దివ్యపాదారవిందంబు లొక్కసారి మదిం దలంచినంతనే యెట్టిమానవుం డైన ను గృతార్థుండై పరపదంబు నెందు. అట్టి మీభక్తునిం దలంచినవారికిఁ దీర్థయాత్రాఫలంబు సేకూరు ననునెడ భవదీయభక్తులకుఁ దీర్థయాత్ర లేమిటికి? అయినను మీయానతి యలంఘనీయంబు గావున నట్లె కావించెద' నని పలికి, యమ్మస్తకంబు గైకొని గరుత్మంతుడు నిజపక్షవిక్షేపంబులచే గిరుల నూటాడం జేయుచు వచ్చునెడ, సదాశివుండు పార్వతీసమేతంబుగా వృషభారూఢుండై యంబరంబునం జనువాఁడు, తనయొద్ది భృంగిరిటిం జూచి నీవు జవంబునం జని గరుడుం డెత్తుక

పోవు శిరంబుఁదీసికొని రమ్మని పంపుటయు భృంగిరిటి వైన
తేయునిం జేర వచ్చి యతనిఱెక్కలగాడ్పులో సుడివడి సుర
గాలిలోనం దవిలినచొక్కాకుచందంబునఁ బెద్దయుం బ్రొద్దు
తిరుగుడువడి యెట్టకేలకు విడివడి యతిరయంబునం బఱ
తెంచి 'దేవా మహాదేవ! యిక్కార్యంబు నా కశక్యం' బను
టయుఁ బార్వతీదేవి నాథుని విలోకించి నవ్వుచు నిట్లనియె.
అత్యంతవికారంబు లైనయంగంబులం గనుపట్టుభృంగి పర
మభృత్యుండు. పిశాచంబులు సఖులు. మంచంబుకోడు కై
దువు. ఇంటింటబిచ్చంబె కూడు. పునుకలే పేరుహారంబు.
ముదియెద్దు పడివాగె తేజి. ఇన్ని మంగళంబులు గలమీకు
సంగరజయం బబ్బుట కేమియాశ్చర్యం' బని పరిహాసంబు
లాడుశైలరాజకన్యకం గనుంగొని నవ్వి యవ్వృషభాం
కుండు తారకాసురవైరి నవలోకించి షణ్ముఖా! నీవు పోయి
తచ్ఛిరంబు గొనిర మ్మనుటయు నతండును గరుడుని వెనుకం
బఱచి కూడం జాలక తదీయపక్షవిక్షేపజాతంబు లైనవా
తూలంబులచేఁ ద్రిలోకంబులం దిరుగుచు నెట్టకేలకు గరు
డునిఁ గూడె. అంతలో భాగ్యవశంబునఁ బ్రయాగదోఁ
చుటయు వినతానందనుండు త్రివేణికామధ్యంబున సుర
ధునిశిరంబు వైచిన నీటిలోనం బడక మున్నె కుమార
స్వామి తూఱి యెత్తుకొని వచ్చి మహాదేవునిసన్నిధి నునిచె.
అతండు దానిం గరాంబుజంబునం బట్టుకొని హిమశైల
బాలికకుం జూపి దానశూరులు దయాపరులు సత్యవ్రత

పరాయణులు జితేంద్రియులు జితక్రోధులు మాతాపితృ భక్తులు నైన వారల శిరఃకపాలంబులు నేను హారంబుగా ధరియింతు. ఈయుత్తమశ్లోకునియుత్తమాంగంబు తన్నధ్యంబున నాయకరత్నంబుగాఁ దాల్చెద నని ధరియించె. అంత నాగాంతకుండు సత్వరంబుగాఁ జని మురాంతకున కవ్వృత్తాంతం బెఱింగించి తదనుమతంబున యథేచ్ఛముగాఁ జనియె ననిన విని జనమేజయుండు జైమినిం గనుంగొని తరువాతి వృత్తాంతంబు వినవలయు ననుటయు.

గద్య. ఇది శ్రీపాండ్యమండలాధీశ్వర శ్రీవిజయరంగచొక్కనాథమహీనాథకరుణాకటాక్షసంపాదితగజతురంగమాందోళికాప్రముఖనిఖిలసంపత్పారంపరీసమేధమాన సముఖమీనాక్షినాయకతనూభవ మీనాక్షీదేవీకటాక్షలబ్ధకవితాసాంప్రదాయ వేంకటకృష్ణప్పనాయకప్రణీతం బైనజైమినిభారతంబున నశ్వమేధపర్వ మ్మనువచనకావ్యంబునందు ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు.

జైమినిభారతము.

తృతీయాశ్వాసము.

క. శ్రీపాండ్యధరాభరణా!
భూపాలకమకుటరత్నపూజితచరణా!
రూపరతిస్మర నిర్వ్యా
జోపకృతీ! విజయరంగచొక్కనరపతీ!

అవధరింపుము జైమినిమునీంద్రుండు జనమేజయనరేంద్రునిం గనుంగొని, తదనంతరంబ హంసధ్వజుండు బలపరాక్రమసంపన్ను లయినకొడుకు లిరువురు సమరంబునం గూలుటయు సైన్యంబులు పరాజయంబు నొందుటయు నాకర్ణించి కోపాటోపదీపితుండై చెదరినబలంబుల నెల్లం గలయం గూర్చి సమరసముత్సాహదోహలంబు లైనపేరకాహళంబులును నిస్సాణంబులును భూనభోఽంతరంబుల బూరటిలం జేయ నిజభుజాపరాక్రమంబుచే మాధవు నారాధింపం దలంచి సింహనాదంబులు నట్టహాసంబులు నార్పులు పెడబొబ్బలు జంకెనలు గజఘీంకారంబులు శింజినీటంకారంబులు వీరహుంకారంబులు భుజాస్ఫాలనంబులు ధ్వజపటపటాత్కారంబులు రథచక్రఘోషంబులు హయహేషారవంబులు

రత్నభూషణంబులధగధగలు కైదువలధళధళలు నీటెల
నిగనిగలు నొక్కుమ్మడిం గ్రమ్మ సాగరంబు పొరలిన
తెఱంగున నాహవయజ్ఞంబునఁ బ్రాణంబు లాహుతులు
సేయం దలంచి సాహసంబున మోహరించి వచ్చునాహంస
ధ్వజుం గనుంగొని కంసవైరి కరుణాకలితమానసుండై దిగ్గ
నం దేరు డిగ్గి పీతాంబరంబు వలెవాటు జాఱ వనమాలికా
పరిమళంబులు మీఱ గంధసింధురగంభీరగమనంబున నె
దురు వచ్చుటయు నమ్మహీనాథుండును దోడనే యరదంబు
దుమికి భక్తివినయసంభ్రమంబులు మనంబునం బెనంగొనం
జనుదెంచి పాదారవిందంబుల వ్రాలిన శ్రీవల్లభుండు శుభ
లక్షణలక్షితంబులును శార్ఙ్గమౌర్వీకిణాంకితంబులును లక్ష్మీ
విరచితమకరికాపత్త్రాభిరామంబులును గరికరోపమానంబు
లు నైనతనభుజంబులం జాచి లేవనెత్తి యామండలేశ్వరుని
నిండుకౌఁగిటం జేర్చి భక్తవాత్సల్యంబునం గన్నుల బా
ష్పంబు లొలుక నూఱడించుచు 'రాజచంద్రా! జననమర
ణాదిసుఖదుఃఖంబులు బ్రహ్మాదుల కైనం దప్పవు. నీకుమారు
లిరువురు సమరయజ్ఞంబు సాంగంబుగా నేఱవేర్చి ప్రాణా
హుతులు గావించి మమ్ముం దృప్తి నొందించి మాసాయు
జ్యంబు నొందిరి. వారికై వగవం బని లేదు' అనిన విని
హంసధ్వజుండు "కంసాంతకా! దేవరపాదపద్మంబులు సే
వింపం గోరి కయ్యంబునకుం బూనితి. నామనోరథంబు ఫలి
యించె. ఇహపరసౌఖ్యంబులకు నిదానం బైనతావక

దర్శనంబు లభించె. ఇంక నాకు దుఃఖంబు గలుగదు" అనిన విని గోవిందుండు 'నరాధిపా! నీసఖ్యంబు మాకు దొరకె' నీ వాప్తబంధుండవు, పాండవులు నాకుం బ్రియు లగుట నీకు నుం దెలిసి యుండుఁ గావున నిఖిలసేనాసమన్వితుండవై యశ్వంబు రక్షించుచు నర్జునునితోఁ గూడ వచ్చి ధర్మనందనుని యాగంబు నిర్వహించి యాతనిచేఁ బూజితుండవై వచ్చుట మాకుం బ్రియం' బని సన్యసాచిసమేతంబుగాఁ దత్పురంబునకుం జని యతనిచేఁ బూజలు గాంచుచు నయిదు రాత్రులు వసియించి యంబుజనాభుండు హస్తినాపురంబునకుం జనియె. తదనంతరంబ విజయుండు హంసకేతనునితోడం గూడఁ దురంగంబు దరలించుకొని చనుచుండ నయ్యశ్వంబు పవనజవంబున నుత్తరాభిముఖంబుగాఁ జని చని యెండతాఁకునం గొట్టుపడి యొకవనాంతరంబు చొచ్చి నవరత్నఖచిత సోపానంబులును నమృతోపమానంబు లైన తేటనీళ్లును జెంగలువలు తెలిగలువలు తెలిదమ్ములుఁ జెందమ్ములు నందంబు మీఱ నొక్కసరోవరంబు సొచ్చి కంఠదఘ్నజలంబుల

—* యజ్ఞాశ్వము గోడిగయై పులి యగుట. *—

నిలిచి సలిలంబు గ్రోలి తనిసి వెలుపలికి వచ్చి యందఱు నరు దంది కనుంగొన గోడిగ యయ్యె. క్రీడి యది కనుంగొని విచారంబు నొందు నెడ నయ్యశ్వాంగన వేఱొక్క కొలనికిం జని జలంబులు గ్రోలి తోడనె బెబ్బులి యయ్యె

ననిన విని 'మునీంద్రా! య ట్లగుటకుం గారణం బేమి' యని యడిగిన జనమేజయునకు జైమిని యి ట్లనియె.

—* స్త్రీమండలవృత్తాంతము. *—

'తొల్లి దాక్షాయణి శంభు నుద్దేశించి నియమంబుతోఁ దపం బాచరించుచుండ దుర్మదాంధుఁ డైనయొక్కరక్కసుం డద్దేవిని జెనకం జూచిన హుంకారంబుచే వాని భస్మంబు గావించి యిది మొద లేజంతువు లీజలజాకరంబు సొచ్చినఁ దోడనే యాఁడుజన్మంబుఁ జెందుఁ గాక యని శపియించెఁ గావున నీగుఱ్ఱంబు గోడిగ యయ్యె. అది యట్లుండె మున్ను కృతయుగంబున నకృతవర్ణుం డనుమునివరుండు తీర్థయాత్ర సేయుచుఁ బుణ్యస్థలంబులు నదులు నదంబులు తటాకంబులు నవలోకించుచుఁ దత్సరోవరంబునకు వచ్చి యఘమర్షణస్నానంబు గావించునెడ నొక్కమొసలి యతనిపాదంబులు పట్టుకొని తివియుటయుఁ జెనంగి విడిపించుకొని నేఁడుమొద లేజంతువు లిందుఁ జొచ్చిన వ్యాఘ్రంబు లగుంగాక యని శాపం బొసంగె. అది కారణంబుగాఁ బెద్దపులి యయ్యె.' అవ్విధంబు గనుంగొని పార్థుండు ముందు తోఁచక శ్రీకృష్ణదేవుని మనంబున ధ్యానంబు సేయుటయు నాహరికరుణాకటాక్షంబుచే వ్యాఘ్రం బెప్పటిఘోటకంబ యయ్యె. అంత భేరీపటహాదివాద్యంబులు మ్రోయ రయంబున ననేకదేశంబులు క్రమించుచుం జని యాఁడుమండలంబునకుం జనినా

తద్దేశంబునకు రాణి నీలనిభవేణియు రాకేందుబింబ వదనయుఁ గుందకోరకసమానరదనయుఁ బల్లవాధరయుఁ గంబుకంధరయుఁ బర్వతోపమానవక్షోరుహాయు మల్లికా మృదుళబాహాయు నణుమధ్యయు నతిపుణ్యసాధ్వియు జలజనిభపాణియు సైకతశ్రోణియు రంభాసమోరుకాండయు ....రాజీవరక్తచరణయు రత్నమయసర్వాభరణయునై హావభావవిలాసవిభ్రమంబుల నింపుమీఱుచు.... ....పురుషునిమనం బెఱింగి శృంగారవిలాసంబులం బ్రొద్దులుపుచ్చుచు.................... ....సరసవాగ్విలాసంబులు నెరపుచుఁ బ్రమీల యనునామధేయంబు గాంచి నరులకు సురల కసురులకు సిద్ధులకు సాధ్యులకు నసాధ్యమైనధనుర్విద్యాకౌశలంబునం బోలు పొందుచు ధైర్యవీర్యసాహసంబు లుగ్రశాసనంబు లుక్కుమెఱయ లక్షయేనుంగులు నన్నియ గుఱ్ఱంబులు నన్నియ రథంబులును విషకన్యక లనం బరఁగినపదిలక్షల కన్నెలు గదాముసలముద్గరభిండిపాలతోమరశక్తిముసుండిశరశరాసన ఖడ్గఖేటకాద్యాయుధములతో గరిడిసాధనల నెప్పుడుఁ జరించుచుండ నఖండితవైభవంబున రాజ్యం బేలుచునుండు. తద్దేశంబునకు మార్గవశంబునం బోయిన పురుషులను జేరం బిలిచి యందలియిందుముఖు లమృతమధురాలాపంబుల.................................... ....నాహ్లాదంబు పుట్టించి వశీకరించి యొక్కొక్కపురుషుని

తోఁ బెక్కండ్రు వనితలు..............................
...................క్రీడించుచుండ నొక్కమాసంబులో
నాపురుషుండు..........................పరలోకంబున
కరుగు. వానితోఁగూడ రమించినయక్కాంత లందఱు
నగ్నిప్రవేశంబు సేయుదురు. అందొక్కయువతికి గర్భంబు
నిలుచు, అది కనియెనేని యాఁడుఁబడుచుం గాంచుఁ గాని
పుత్రునిం గాంచదు. ఇది యాదేశంబునందలి నడవడి.
జనమేజయనరేంద్రా! విజయభుజ విక్రమరక్షితం బైన
యశ్వరత్నం బవ్వీటిసమీపంబునకుం జని పచ్చిక మేయుచు
నుండునెడఁ గటివంకకనుబొమ్మలవంకలకుఁ గొంకిన చందం
బున గుడుసువడం దిగిచినసింగాణివిండ్లును, గలికిచూపుల
కలికి వెనుక డాఁగినవితంబున నంపపొదులలోనం బొదలుల
కోరికోలలును, వట్రువగబ్బిగుబ్బలు గనుంగొని భ్రమ
పడినచందంబున బిఱబిఱఁ దిరుగుచక్రంబులును, బెడంగుజ
డలయందంబునకు వణంకెడు చందంబునఁ దళతళ మని
కత్తులు మెఱయ వీరశృంగారరసంబు లంగనారూపంబు గైకొ
న్నకైవడి వీఁక మీఱు రాకేందుముఖులు తేజీలు దువాళింపు
చుఁ గోకిల లొక్కుమ్మడిఁ గాకలీస్వనంబు లొనరించుకరణి
వీరాలాపంబులు నార్పులు నట్టహాసంబులు పంతంబులు
మెఱయం బోరు దీరుటయు నందొక్కసుందరవదన గుఱ్ఱంబు
మీటి యధ్వరహరిం బట్టికొని వచ్చి తమయేలికసానిసమ్ము
ఖంబున (1) 'నిలిపి రాజరాజేశ్వరీ! యీహయంబు ధర్మజునిచే

విడువఁబడినది. హయరక్షణార్థంబుగాఁ బరాక్రమోపార్జ
నుం డగు నర్జునుండు చనుదెంచి యున్నవాఁ' డని పలుక
రించిన, నయ్యంగనామణి బంగరుగంగులం దుఱంగలించు
తురంగశాలలోనఁ గట్టుటకు నియమించి, యంతరంగంబున
నెంతయు సంతసం బెసంగ 'నేఁటితో నాకోరికలు నెఱ
వేఱె. సుఖంబులు సమకూరె. ....
సందియంబు లేదు. ఇందుకొఱకా పురందరనందనుం డిచ్చ
టికి వచ్చు?..
....
....ఇది
మొదలనుదినంబును..................................వానితో
డం గూడెద. నాపాలిదైవంబులక వేఁడెద' నని యొడఁబడని
కోరికలు పొడమ, నప్పుడఁతుక పదివన్నియ బంగారునకు
మెఱుంగుపెట్టినహారంగునఁ బైగోజవ్వాదికిఁ బువ్వుఁదావి
గట్టినరీతిఁ జిన్నారిజాబిల్లిమీఁద సుధారసంబు చిలికించిన
విధంబున రంగైనయంగంబున శృంగారింపఁ దొడంగి, యం
గజునిచక్రంబులం బోలెఁ దళుకుతళుక్కునఁ జెక్కులఁ గుల్కు
కళ్కురతనంబులకమ్మలు పెట్టి, చివురాకుఁగెమ్మోవి కెంపుల
సొంపు మీఱుసువాణిముత్యపుముంగర ధరియించి, వింత
వింతమణులకంఠసరములు కంటెయు నేవళంబును ముత్యాల
దండలు సందిటికడెంబులు ప్రత్తికాయతాయెతులు కంక
ణంబులు రవలగాజులు కడెంబులు మొలనూలు నొడ్డా

ణంబు నందెలు పాడగంబులు పాదసరములు మెట్టెలుఁ బిల్లాణులు వీరముద్రికలు మొదలగు నానావిధభూషణంబులఁ గైసేసి, తనయనురాగరసంబు వెల్లువ గట్టెనో? యన నందం బగుచందురకావిపావడపైఁ దన (మనో) మాలిన్యంబు వెలి కుటికిన తెఱంగున మన్వంపుఁ జున్న నివ్వటిల్లు రాయంచయంచుల మించుపైఠాణిదువ్వటంబు గట్టి, మట్టుమీఱిన మదనానలంబుతన్నుఁజుట్టికొనిన తెఱంగున నిండు తగటి ఱవికకుంకుమపూఁతపొంకంపుసిబ్బెంపుగుబ్బలగబ్బు మీఱ నిండుముస్తీదు చేసి, చిలుకతేజినజీరుని తేజితెఱంగునఁ గను పట్టుసురకతంపుఁబిడెంపు బాఁకు చేపట్టి, విరవాజిసరుల తావియుఁ బైగోజవ్వాజిపట్టెలవాసనయు దిక్కులగుమ్ము గుమ్మనిక్రమ్మ గిలుకుపావలు మెట్టి, నెమ్మిమై మేఘమండలంబు వెలువడుక్రొక్కారుమెఱుంగు తీవియంబోలె నంతిపురంబు వెలువడి యాప్తలైనచెలికత్తెలు వెంట రా బంగరుగు....మ్మలం బోలునండజయానలు వండలం జేరి కైదండ లొసంగ, నవరత్నఖచితం బగుబంగరు బెత్తంబుల మొత్తంబులు చెలంగఁ, గటికవారలు ‘రాజరాజేశ్వరీ! రాజపరమేశ్వరీ! అష్టదిగ్రాజమనోభయంకరీ! కేరళదేశాధీశ్వరీ! స్వామినీ! పరాకు, హెచ్చరిక, జతను, సావధానత’ అని హెచ్చరికలు దెలుప, నల్లనల్లన వచ్చి డాలు మీఱుపగడాలకంబంబులు దారవజ్రంబులబోదెలు జీవదంతంపుదంతెలు, ఈ ళంపునీళంపుదూలంబులు కెంపుటోడుబిల్లలపైకప్పడంబును

నానారత్నవిచిత్రంబులు బాలభానుప్రభాభాసమానంబులు గగనలక్ష్మీనివాసంబులు నైనతమ్మిరేకులఁ బోలుపొందుకనక కలశంబుల నిలసిల్లుద్వారంబులును జంద్రకాంతమయంబు లైనవజ్రమణిమయగజరాజిశోభితంబు లైనపార్శ్వంబులం గనుపట్టుసోపానంబులు హెచ్చురతులపచ్చరాదిన్నెయుఁ గలశంబులు తుండంబులఁ గైకొని యభిషేకంబు లొనర్చుదార వజ్రంపుటేనుంగు లిరుగడలం గడలుకొన మూర్తిభవించిన సామ్రాజ్యలక్ష్మివలె నొప్పుచు లక్ష్మివిగ్రహంబులం బోలు పొందుద్వారదేశంబులం గలిగి జాళువాసరిగకుట్టుపని పూవుల ప్రతిమలం బ్రతి లేనితెరలును, క్రొత్తముత్తెంబుల జల్లులమేలుకట్లును, నెమిలిఱెక్కల ఛాయలం బ్రతిక్షణం బును వింత లైనకాంతులు మంతు మీఱు రత్నగర్భ మైన పుడమి కన్నకరణి నున్నతివాసుల నొప్పుచు సుధర్మాస్థానంబు కరణిఁ బ్రభాశోభితం బైనవాటంబును, ప్రభావిజితమేరుకూటంబును నగుకొలువుకూటంబున.... బాలభానుకిరణంబులతో వాదంబులు సేయుపాదంబులును, బసిఁడిగట్టు పైతట్టువలెఁ గనుపట్టువిస్తారంబును గలిగి....గోమేధికపుష్యరాగమరకతముక్తాప్రముఖనిఖిలరత్నవిరాజితం బై గ్రహనక్షత్రనికర తారకానికరకోరకితం బైనయాకసంబు తెఱంగున (రమ్యంబు)ను నఖిలసురాసురపూజితంబు నైనసింహాసనంబునం గూర్చుండి సామదానభేదదండచతురోపాయ లగుమందయానలు సందడించి కొలువ నొక్కచక్కిఁ జక్కెరబొమ్మలు చక్కెరయు

క్క నలకన్న మిక్కుటం బైనచోకాటంబులు నైనదండకతారావళీప్రముఖప్రబంధంబులు విన్నపంబు సేయ మఱియొక్కదిక్కున రాకేందువదనలు మీమాంసావ్యాకరణాదిశాస్త్రంబు లనర్గళప్రవాహంబులు గా నుపన్యసింప, వేఱొక్కచాయఁ బల్లవాధరలు బ్రహ్మాండపురాణంబు విష్ణుపురాణంబు పద్మపురాణంబు మొద లగునష్టాదశపురాణంబుల కథలు వినిపింప, మఱొక్కదిక్కున నీలవేణులు చిత్తరుబొమ్మలవలె శిరఃకంపంబు సేయుచు జంత్రగాత్రంబులతోయి గీతప్రబంధంబులు ఘనయదేశీయంబులు వినికిసేయ నొకవంక మకరాంకవిజయపతాకలం బోలె రంభోర్వశీమేనకాదుల నెంత లేదనుబిరుదుపాత్రలు చర్చరి చారి మొద లగు పదియాఱునాట్యంబులు, నభినయంబులు గనుఁగొనిపింప నొక్క ప్రదేశంబునఁ గలకంఠకంఠులు పరిహాసంబులు వినోదంబులు గాఁ బ్రసంగంబులు సేయ నిరువంకల రవలకంకణంబులు ఘల్లుఘల్లనఁ బంకజాక్షులు కనకదండమండితంబులైనధవళచామరంబులు వీవఁ గత్తి కేడెంబు సురిచి కటారి సిడెము వంకి పట్టసబాణముసలముద్గరభిందిపాలములు బరిచి నేజా మొద లగుముప్పదిరెం డాయుధంబులును గుంచెకాళంజియుఁ జేయిపావడ యడపంబును గిండి సురటి యు నిలువుటద్దంబులు మొద లగుమహారాజచిహ్నంబులఁ బూనియూడిగంపుఁజెలువ లూడిగంబులు సేయ సాక్షాత్కరించిన వీరమోహినిచందంబున నిండోలగంబున నుండె.* (2)

(1) (2) నడుమనున్నగ్రంథ మొక్క ప్రతిలోమాత్రమే యున్నది.

అంతఁ గుంతీసుతమధ్యముండు కాంతాజనులు మఘవాజిం గొనిపోయి రని చారులు పలుకరించిన నవ్వీఁ దగిన రాయబారులం బనిచి గుఱ్ఱంబు విడువు మని మందలించిన యెడ, నమ్మండలేశ్వరి ముఖచంద్రమండలంబున వెన్నెలయునుంబోలె మందహాసంబు గందళింపఁ "గిరీటి మేటివీరుం డని వింటిమి. అతనిరణకలాకౌశలంబు పరీక్షింపక యెకవ్వడిం గడవ నీయము. నే నిదె సమరసన్నాహంబుగా నరుగుదెంచెద. పార్థుని రమ్మనుండు. పొం" డని బహుమానంబులు చేసి పంపిన, నియోగులు వేగంబె యరుగుదెంచి యవ్విజయునకు వివరించిరి. అంతఁ దురంగమాతంగశతాంగవీరభటమహోర్భటీసమేతంబుగాఁ బ్రమీల మోహరించి

—* ప్రమీలావిజయులయుద్ధము. *—

రథచక్రఘోషంబును గేతనపటాత్కారంబును గార్ముకజ్యానాదంబును లలితమధురసింహనాదంబును భూనభోఽంతరంబు దీఁటుకొన శతమఖతనయునిం గాంచి తనకులుకుఁజూపులంబోనివాలుతూపులు వింట సంధించి రథరథ్యకేతనసమేతంబుగా నించుటయుఁ, బార్థుండును నంగనతోడికయ్యంబునకు రోయుచుఁ దీఱనికతంబున మూఁడువాఁడితూపులు సంధించి యేయుటయు, నది తోడనే ఖండించి తీవ్రముఖంబులైనశిలీముఖంబులచే దశదిశాముఖంబులు గప్పి తక్కినబోటులు ఘోటకంబులు మీఁటి సామజంబులఁ బురికొల్పి రథంబులం దోలి చిటుకుటమ్ములచే గ్రుచ్చియు నీఁటెలం బొడి

చియుఁ బట్టిసంబుల నఱకియు శూలమ్ములం గ్రుమ్మియు వంకులం జిమ్మియు జముదాళ్లం బొడిచియు గదల నడిచియు ముసలంబుల మోదియు ముద్గరంబులఁ జిదిమియుఁ గిరుసు కత్తుల విదళించియుఁ జిఱుతకత్తియలం గొట్టియుఁ దార సిల్లిన నయ్యిరువాఁగును బూర్వపశ్చిమసముద్రంబులవలెం దాఁకి తుములంబుగా సమరంబు గావించు నెడఁ, బ్రమీల యింద్రనందనుం జూచి "కిరీటి! నమ్ము నీబోఁటికిం గెలువఁ గూడదు. నీకె కాదు. అనిమిషసిద్ధసాధ్యగరుడోరగాదు లేనియు నన్ను గెలువలేరు. నీకు గుఱ్ఱంబు గావలయునేని దురభిమానంబు మాని ప్రియంబున నన్ను వరియించిన

—* ప్రమీల యర్జునుని మోహించుట. *—

హయంబు నిత్తుం గాక లేక యున్న నిన్నుం బోనిత్తునే? నీయగ్రజుం డైనయుధిష్ఠిరుండు సోమపానంబు సేయ నిమ్ము. నీవు నాయధరామృతపానంబు సేయుము. అతండు కురుదేశం బేల నిమ్ము. నీవు నా.... దేశం బేలుము. ఈదేశంబునకు నీవె యొడయఁడ వయ్యెదవు." అనిన ధనంజయుండు దరహాసంబు నెమ్మొగమ్మునం గనుపట్ట "జవ్వనీ!.................. నిన్నుం గూడిననరుండు మాసమాత్రంబునఁ బంచత్వంబు నొంది యధోగతికిం జను. అంతట యువతిమండలం బేలువాఁ డెవ్వండు? ధర్మజునకు మరల హయంబు నొసఁగువా రెవ్వరు?" అనినం బ్రమీల నాలారుమొఱుంగుఁజూపులం జూచుచు "నీవు దైవయోగంబున మాదేశంబునకు వచ్చినవాఁడవు.

ఇంక నెచ్చటికిఁ బోనం గలవు? ఎట్లయిన నీప్రాణంబు లప హరింపక మానను. నామహోగ్రబాణంబులచే నీమేను జల్లెడ క్రంతలుగా గాయంబులం బడి వేదనం బొగలుచు వృథా ప్రాణంబు లప్పగింప నేల?" అనినఁ గన్నులఁ గెంపు నింపుచు నిలింపపతినందనుండు నారి నాఱమ్ములు సంధించి యేసిన, నవ్విలాసిని యన్నియు నారసమ్ముల నానిని నూపఱం జేసి రెండియు నేడునాఁడి బాణంబులు మేనం గీలించి మఱియు వేలకొలంది తూపులనాన గురిసిన, సురపతితనూభవుండు సమ్మోహనాంగిపై సమ్మోహనాస్త్రంబు వింట సంధించిన నవ్వాలుఁగంటి యయ్యస్త్రంబుతోడఁ గూడ గాండీవగుణంబు ఖండించిన, నరుండు కోదండంబున వేఱొండు నారిం గూర్చి యున్నారిం బరిమార్పక మాన నని కట్టలుకం గనుబోమ ముడిపాటు గదియించుటయు, నాకాశవాణి "అర్జునా! నిర్జరులకైన దీనిం గెలువ శక్యంబు గాదు. నీవు పదివేలయేండ్లు పోరినం జయంబు చేకూరదు. రిత్తయాయాసం బేమిటికి? ఒక్కనాఁటిరాత్రి దీని......దనియించి హయంబు గొని యక్షేమంబుగాఁ" జను మనిన నర్జునుండు

---* ప్రమీలార్జునుల పరిణయ సానిర్వృతి. *---

నవ్వాలు పిల్కు సరసంబున నునుచుటయు నయ్యంగన యతి త్వరితంబుగా వచ్చి యాలింగనంబు సేసి పురంబునకుం దోడుక పోయి యంతఃపురంబున నంగసుఖకేళింటం బువ్వుల పాన్పున......విలాసవినోదంబునం బ్రొద్దుగడిపి మఱునాఁడు

మత్తమాతంగతురంగ మణిభూషణావళులతోఁడం గూడ మఖ వాజి నర్పించి మొక్కుటయు నయ్యర్జునుండు సాదరం బుగా వీడ్కొని చనియె. అని చెప్పి మఱియు జైమినిమునీం ద్రుండు జనమేజయనరేంద్రునిం గనుంగొని యిట్లనియె.

—* వృక్షదేశవృత్తాంతము. *—

తదనంతరంబ యత్తురంగంబు వృక్షదేశంబునకుం జని యె. అందలివిశేషంబులు వినుము. అచ్చటి మానవపశు పక్షివృక్షసంఘంబులు ప్రాతఃకాలంబునం బుట్టి తోడనే యౌవనంబు నొంది మధ్యాహ్నకాలంబునం గాఁపురంబు సేసి సాయంకాలంబున మరణంబు నొందు. అనుదినంబు నివ్విధంబున జననమరణంబు లొందుచునుండు. ఇది యద్దే శాచారంబు. పార్థుం డవ్విశేషంబులు గని యచ్చెరు వొం దుచుఁ బోవునెడ స్వకర్మానురూపంబుగాఁ బుట్టిన యేకపా దులు ద్విపాదులు త్రిపాదులు ననేకపాదులు వికటపాదులు నైనజనులును, గుండేలు, ఎద్దు, ఎలుఁగు, వారనంబు, ఏనుఁ గు, జింక, గుఱ్ఱంబు, పంది, పశువు, పులి, మార్జాలము మొదలగు జంతువులనలెం గనుపట్టి ముఖంబులు గలిగిన ప్రజలును, ఒంటికొమ్ము రెండుకొమ్ములు మూఁడుకొమ్ములు నాలుగుకొమ్ములు వంకరకొమ్ములు నిడుదకొమ్ములు గలిగిన మానవులును గూబ కోకిల ఎండ్రకాయ మొదలగువాని వలె వికృతంబులు కపిలవర్ణంబులు విషమంబులు నైనకన్ను లం గనుపట్టు జనులునుం గలిగి వింతవింత లైనదేశంబు లతి

క్రమించి పోవుచు నత్తురంగం బగ్రభాగంబునఁ బిశాచని శాచరశాకినీడాకినీబేతాళాదుల కాలయంబును సింహశరభశార్దూలగండభేరుండవేదండగండకశశవరాహాది నానామృగసమూహంబులకు శరణ్యం బైనయరణ్యంబు ప్రవేశించె. అందుఁ బాపంబులు కాఁపురము సేయుతావును నశుభంబుల కాలయంబును జనలోకభయంకరంబు నగు దనుజపురం బొక్కటి గలదు. అప్పట్టణంబున మూఁడుకోట్ల దానవులు పార్శ్వంబులం గొలువ నిర్దయచిత్తుండును దంష్ట్రాకరాళవదనుండును గ్రూరకర్ముండును గేలునకుఁ బదివేల దిగ్గజంబుల సత్తువుగలవాఁడును భీషణాకారుండును నైన బకాసురతనయుండు భీషణుం డనునామధేయంబు గలవాఁడు రాజై యుండు. తత్సమీపంబునం దొక్కపర్వతగుహలోఁ బ్రాణిహింసాదీక్షితుండును భీషణాసురునకుఁ బురోహితుఁడును నైనబ్రహ్మరాక్షసుం డుండు. వాఁడు నిడుద లైనప్రేవులజందెంబులును నెత్తుటిపట్టెవర్ధనములును గపాలజపమాలికయుఁ బచ్చిచర్మం బనియెడి కాషాయవస్త్రంబును నేనుంగుతలకమండలువును గర్ణపవిత్రంబులును వెన్నెముకయూఁతకోలయుం గలిగి మేదోహోత యనునామధేయంబున వర్తించువాఁడు నర్జునుని యశ్వమేధాశ్వంబు వచ్చుటంజూచి భీషణాసురునిచెంగటికి వచ్చి దీవించి యిట్లని విన్నవించె. ‘‘దానవేంద్రా! మీతండ్రి యగుబకాసురుని బలాతిశయంబున భీముఁడు చంపె. వానితమ్ముం

డగునర్జునుం డశ్వమేధాశ్వంబు వెంబడి మనవీటిచెంగటికి వచ్చె. తండ్రినిజంపినపగ దీర్చికొనుట కిదియే సమయంబు. నీవు నరమేధం బనుయాగంబుసేయుము. నేనౌద్గాత్రంబు నవరించెద. నేఁజేయువ్రతంబులు వినుము. ఆషాఢమాసంబునఁ బౌర్ణమాసియందు సన్యాసుల రక్తంబు లనుజలంబులే యాహారంబుగాఁ బసంబుసేసితి. శ్రావణమాసంబున విధవలం దలదీయక రోఁ పండుటాకులకరణి మ్రింగి వ్రతంబు సలిపితి. భాద్రపదమాసంబునఁ బాశుపత వ్రతదీక్షాపరుల గుండెకాయలు కందమూలఫలంబులం బోలె నశనంబు సేయుచు నియమంబు నెఱవేర్చితి. ఆశ్వయుజమాసంబున బ్రహ్మచారులను ఫలాహారంబుసేయుచు నిష్ఠాసమన్వితుండనై యుంటిని. ఇవ్విధంబునఁ జాతుర్మాస్యవ్రతంబు సలిపి కార్తికమాసంబునఁ గన్నియల భక్షించిపారణసేసితి. ఈపురంబునఁ బెక్కండ్రు బ్రహ్మరాక్షసులు గలరు. వార లిత్తెఱంగున నియమంబు నడుపం జాలరు. పుణ్యకాలంబు వీటిం బుత్తురు. అది యట్లుండె నిప్పుడు బ్రహ్మరాక్షససహస్రభోజనంబుసేయ సంకల్పించి నరునిబలంబుల నెల్లదారవోయుదుము. అనిన విని భీషణుండు కొద్దిగా నవ్వుచు నీకుం గావలసినభోజనం బెద్ది. ఏమాత్రంబు భక్షింపఁ జాలుదువు. తెలియం బలుకు" మనియె.

తదనంతరంబ యాబ్రహ్మరాక్షసుండు బలపరాక్రమవంతు లున్నతాకారు లాజానుబాహులును మూర్ధాభిషి

క్తులునైన రాజకుమారుల వేయిమందిని గజతురగవీరయో
ధుల తలమెదళ్లు కూరలుగా మెసవంగలవాఁడ నింతమా
త్రంబు దయసేయవలయు ననిన దనుజనాయకుండు నవ్వి
చేతం జే యప్పళించి "బ్రహ్మరాక్షసోత్తమా! ప్రాణిహింసా
యజ్ఞంబు నేఁ జేయం బూనితి. తగినయాగోపకరణంబులు
సంపాదింపుము. పో మ్మని యనిపి భూమి గ్రక్కదల దిక్కు
లు పిక్కటిల్ల రణభేరిచఱవం బనిచి హుంకారాట్టహాస
సింహనాదభుజాస్ఫాలనభేరీభాంకారభయంకరంబుగా నాప్త
బలంబులతోఁ బురంబు వెలువడి శాత్రవశోషణుం డైనభీష
ణుండు భండనంబునకుం గడంగునప్పుడు జగడంబు సూచు
వేడుక మీఱ పొలదిండిపడంతులు బంతులుగా వెడలి
రెండుయోజనంబులు మూఁడుయోజనంబులు నాల్గుయోజ
నంబులు నిడివి యైనచన్నులును, దావాగ్నిదగ్ధంబు లైనకొం
డచఱులంబోలె భీకరంబు లగుమొగంబులును, ప్రళయకాల
మేఘమాలికలం బోనియాకారంబులునుం గలిగి భువన
భయంకరంబుగా ముచ్చట లాడుచు వచ్చి పర్వతశిఖరంబు
లెక్కి పాండవసైన్యంబుఁ జూచి యర్జునరథధ్వజంబున
మంతుమెఱయు హనుమంతునిం జూచి "వీఁడుగదా తోఁక
చిచ్చున లంక నివుఱు సేసినమర్కటంబు. సప్తమంత్రికుమా
రులఁ బంచసేనాగ్రగుల జంబుమాలి నక్షయకుమారుని మా
రిమసంగినక్రోఁతి. వీఁ డేమిటి కీడ వచ్చినాఁడు? వీఁడు దాన
వులవేరువిత్తు" అని కలంగంబడు సమయంబున నొక్కబలు

రక్కసి వారల నోడకుం డనిభయంబు దీర్చి తానొక్కతె యు నాకసంబున కెగసి నల్లమబ్బుకరణి మైపెంచి హుంకరింపుచు వేడెంబులువాఱుటయు మూఁడుయోజనంబుల నిడివి యైనదానిచన్నులచేతం గొట్టువడి యర్జునుసైన్యంబులు దైన్యంబునొందె; నంతఁ దక్కినరాక్షసవనితలు నవ్విధంబున నె కుచతాడనంబులఁ జతురంగబలంబులం గీటడంగించుటయుఁ గేతనస్థితుం డైనవాయుపుత్త్రుండు మహోగ్రకోపంబున గర్జించి వాలంబు పెంచి వారలకంఠంబులు బిగియించి పర్వతశిఖరంబులం గొట్టియుఁ బయోరాశిలోనన్వైచియుఁ బదిదిక్కులం ద్రిప్పి వైచియు ముష్టిఘాతంబుల మోఁకాటిపోటుల మోఁచేతికుమ్ముల నఱచేతిపెట్టులఁ బెడచేతిదెబ్బలఁ జెంపకొట్టులఁ బాదఘాతంబులం గెడపి యద్దానవభామలం దెగటార్చుచునుండె.

—* అర్జునుఁడు భీషణుం జంపుట. *—

అంత భీషణాసురుండు రథచక్రఘోషంబును ధనుర్గుణరావంబును దుందుభిధణంధణాత్కారంబులును రోదసీగహ్వరంబునం బ్రతిధ్వనులుసంపాదింప బిరుదకేతనప్రభలు రవిమండలంబు గబళింప నమరేంద్రనందనుం దాఁకుటయు నుభయబలంబులు రభసంబుగాఁ దారసంబయ్యె; నప్పుడు దానవేంద్రుం డింద్రనందనుమీఁద నైదుశరంబు లేయుటయుఁ గిరీటి మూఁడుబాణంబులు నాటించె. అసుర యాఱు తోమరంబు లడరించుటయు సురేంద్రసూనుం డయిదు

నారసంబులం ద్రుచ్చి యొక్కయర్ధచంద్రబాణంబునఁ గో దండంబు ఖండించిన, దైతేయుండు వేఱొక్కకార్ముకంబు సజ్యంబు గావించిన, సవ్యసాచి దానిగుణంబుతోఁ ద్రుంచె. రాత్రించరుండు చక్రంబుం బ్రయోగించిన, నరుండు నడు మన తునుమాడె. బకతనూభవుండు ఖడ్గంబు జడిపించిన, బకవైరితమ్ముండు మొసలివాఁకొలందికి ఖండించె. భీషణుండు భీకరశక్తి వైచుటయు, ఫల్గునుండు వానిం బదితునియలు గావించె. రాక్షసేశ్వరుండు పర్వతంబై చనుదెంచిన, నరుండు వజ్రాస్త్రంబేసె. పుణ్యజనుండు మహారణ్యంబై క్రమ్మిన, విష్వచ్ఛుండు చిచ్చుబాణం బేసె. క్రవ్యాదుండు నీల జీమూతం బగుటయు, భీమానుజుండు వాయవ్యాస్త్రం బేసె. మఱియు నసుర సింహ శార్దూల మృగ వృశ్చికాది రూపంబులం జనుదెంచిన, ధనంజయుండు నయ్యైబాణంబు లం జదిపె. అవ్వేళ నొక్కమునీంద్రుండు పార్థుకడకుం జేరి బహువిధంబు లగుకథాప్రసంగంబులు గార్యకలాపంబులుం బలుకుచు మోసంబు సేయం జూచిన, దానిం దానవమా యగాఁ దెలిసి విజయుండు గపటమౌనిం బరిమార్చె. అంత నప్పొలదిండి గదాదండంబు కేలం గైకొని కదియ వచ్చుట యుఁ, బాండుతనూభవుండు గల్పాగ్నికీలాకల్పంబును గనక పుంఖవిరాజితంబును గంకపత్రవిచిత్రితంబును నగుబాణం బొక్కటి యేర్పఱిచి, గాండీవంబు గుణసుపడం దిగిచి, యే యుటయు వజ్రాయుధంబుచే ఖండితం బైన శైలశృంగంబు

కరణి దైత్యునిశిరంబు పుడమిం గూలె. అవ్విధంబున దను
జుని వధియించి తత్పురంబునం గలసమస్తవస్తువులుఁ జేకొని
యవ్వలం బోవు నెడ, నయ్యశ్వంబు మణిపురంబుచాయకుం
జనియె.

అంతఁ బద్మరాగమణిమయాకారంబు లైనప్రాకారం
బులును బాతాళంబు నంటినయగడ్తలును నమరావతీ
పురంబున కంతటంతటం గనుపట్టుగోపురంబులును నింద్ర
సౌధం బైనవైజయంతంబుతోఁ బంతంబు లాడుసౌధంబు
లును నిజధర్మంబు దప్పనిచాతుర్వర్ణ్యజనంబులును శత్రు
చమూభయంకరంబు లగుచతురంగబలంబులును వివిధ
వస్తుసమృద్ధంబు లైనయంగడివీదులును బల్లవకుసుమఫలభరి
తంబు లైనయారామంబులును నానావాద్యఘోషితంబు
లైన దేవాలయంబులును గలిగి, యలకాపురంబు నదలిం
చుచు నమరావతి నెదిరించుచు నతులితైశ్వర్యధుర్యంబును
నాశ్చర్యకరంబును బభ్రువాహనభుజాపరిపాలితంబును నైన
మణిపురంబు గనుపట్టిన, నింద్రునిముద్దుపట్టి హంసధ్వజునిం
జూచి ముందటిపట్టణం బెవ్వరి దనుటయు నతండు "భవదీయ
కుమారుండును బాలభానుసమాన తేజుండును నగుబభ్రు
వాహనుం డేలుపట్టణం బిది. వైరివీరనరపాలకులకంఠంబు
లనియెడుకదళీకాండంబులకు నంపం బనం బ్రసిద్ధిగాంచి
బలపరాక్రమసంపన్నుం డైనయీకుమారునికి మావంటి
రాజులు వేవురు సహస్రహాటకభరితంబు లైనశకటంబులు

కానుకగా నిచ్చి పొడగన వత్తురు. నీవు తండ్రివని తాను కుమారుం డనియు మేర దప్పక యితం డూర కున్న లెస్స గాక యెదిరించి తురంగంబు పట్టించెనేని యెట్టువంటి వారి కేనియు నెదిరింప శక్యంబుగాదు." అనిపలుకు నవసరంబున, సుబుద్ధి యనం బరఁగిన బభ్రువాహనుని సేనాపతి వేడుకగా సర్వాళంబుగా వచ్చి మగుడునప్పు డత్తురంగంబు గాంచి పట్టుకొని వచ్చె. అప్పుడు సామవేదమయం బైనబింబం బునం గనుపట్టుచు నాదిత్యుండు పశ్చిమసముద్రంబునం గ్రుంకె. పక్షు లంతరిక్షంబున వివిధనాదంబులు సేయుచు గూండ్లుచేరం జనియె. తారకానికరంబు లింతంతటం దోఁచె. దిగంతంబు లంతంతకుం గొంచెంబు లయ్యె. చీఁకటులు వేఁకటు లయినకరణిం బెరిఁగె. ఇవ్విధంబున నర్కుం డస్త మించు సమయంబున సుబుద్ధి పురంబునకు వచ్చె. కెంపు గోడలు మగఱాలనెలకట్లు పగడాలకంబంబులు దంతపుఁ దలుపులు బంగారుసోపానంబులు ముత్యాలచూరుమొగ్గలు కుందనంపుబొమ్మలు, చీనాంబరంబులమేలుకట్లు, నగరుసాం బ్రాణిధూపంబులు గలిగి, పెంపొందుకొలువుకూటంబున మూర్ధాభిషిక్తు లైనమండలాధీశ్వరులు కొలువున్నకై సంద డింప, రెండవయాఖండలుండునుంబలె బభ్రువాహనుండు కనకరత్నమయంబు లైనకరదీపికాసహస్రంబులు పగలు వత్తులు వియత్తలంబు పట్టపగలింటికరణిం జేయ నిండోల గంబున నుండె.

ఆసమయంబున బంగరుపల్లంబులు పక్కెరలు మొముట్టు సింహపుఁదలాటంబు చామరంబులు కనకమయంబులైనకళ్లెంబులుం గలిగి శకసింధ్వావట్టకాంభోజాదిహయంబులం దెప్పించి కనుంగొనుచుండు నవసరంబున సుబుద్ధి భూజానికి మ్రొక్కి యశ్వరంగమశ్రేష్ఠంబు కానుకగా నర్పించె. అవ్విభుండు దానియాకారరేఖాలక్షణంబుల కాశ్చర్యంబు నొంది సమీపంబునకుఁ దెప్పించి మొగంబు నిమిరి లలాటంబునం గనుపట్టు కనకపట్టిక తీసి, రాజాధిరాజపరమేశ్వరాష్టదిగ్రాజమనోభయంకర రాజమార్తాండుం డైనయుధిష్ఠిరునిచే విసృష్టం బయ్యె. నిటలాక్షునెక్కటికయ్యంబునఁ గెలిచిన కిరీటి యిత్తురంగంబున కంగరక్షగాఁ జనుదెంచె. ధారుణి శూరులు గలరేని పట్టుదురుగాక. అనియెడుబిరుదుగద్యంబు చదువుకొని బభ్రువాహనుండు సుబుద్ధినిం జూచి సాదరంబుగా "మా పెద్దతండ్రియు నమానుషపరాక్రముండు నైనయుధిష్ఠిరుం డశ్వమేధంబు సేయ దీక్షించి విడువం జనుదెంచిన దీహయంబు. దీనికి మాతండ్రి సహాయంబుగావచ్చె: ముక్కంటి నొంటి పోట్లాటం గెలిచిన నెఱజోదు. ఇంద్రుని యర్ధాసనం బెక్కినమహామహుండు. కాలకేయాది దానవులం గీటడంగించిన త్రైలోక్యమల్లుండు. చిత్రాంగదానాయకుం డిచ్చటికి విజయంబు సేసె; ననిన నాభాగ్యం బెంతని వర్ణింతు! ప్రభాతకాలంబున మాతండ్రి సమ్ముఖంబునకుం బోవలయు. వలయు వస్తువ్రాతంబులు సమకూ

ర్పుము." అని యానతిచ్చి మంత్రుల నిజనివాసంబులకనిచి బభ్రువాహనమహీకాంతుం డంతఃపురంబునకుం జనియె. అంతఁ బ్రభాతకాలం బగుటయు, మణిపురాధీశ్వరుండు నిదుర మేల్కాంచి కాల్యకరణీయంబులు నిర్వర్తించి మణిభూషణాంబరగంధమాల్యాలంకృతుండై సామంతమంత్రిపురోహితదండనాయకులు గొలువ, శుభలక్షణవిరాజితమైన తేజి నెక్కి. కంచుకులు సాహోనినాదంబుల హెచ్చరికలు దెలుపఁ, బౌరపురంధ్రీనివహంబులు గుసుమాక్షతలు సల్ల, వందిమాగధవైతాళికులు పాఠకులు బిరుదుగద్యంబులం గైవారంబులు సేయ, శంఖభేరీమృదంగబిరుదకాహళంబులులియఁ, జతురంగవాహినీపరివృతుండై మేరుశైలంబు కైలాసగిరియుఁ, జెల్లగించి తేనిమాత్రంబె కాని యంతకంటెఁ దక్కువకాని బంగారు వెండి రాసులును, మలయశైలంబు తేనిదోషంబకాని యంతకంటె గణనకు మించిన గంధసారంబులును, గంధమాదనగిరి తేలేదనినమాత్రంబె కాని యంతకుఁ గడమలేని కర్పూరంపుఁ బెటికలును, రోహణాచలంబు తేకున్న మాత్రమె కాని యంతకంటె వెలితిపడని రత్ననికరంబులును, చంద్రికింగానుకలు దెచ్చి, మేలుమేలని సకలరాజులుం గొనియాడ బభ్రువాహనుం డశ్వరాజంబు గొనుచు వచ్చి యెక్కినగుఱ్ఱంబు డిగ్గి విప్వచ్చు చెంతకుం జేరి, క్రొత్తముత్తియంబులు పాదంబులకడుం బోసి సాష్టాంగదండప్రణామంబు సేసి నిన్న తప్పిదంబుగా మాటాడుట మా

యంబుఁ బట్టితెచ్చె; నీయపరాధంబు సహింపుము. బిడ్డలెంత నేరక నడిచినం దండ్రికి సహించు టుచితంబెకద. అని వెండియుఁ బాదంబులపయిం బడియె.

అంతఁ బాండవమధ్యముండు గంగానదీశాపంబువలన విపరీతకాలం బగుటం జేసి బుద్ధిభ్రంశంబు నొంది యాగ్రహంబుడుపలేక రత్నమయం బగునతని కిరీటంబు వీడినడం దన్నుటయు నందలిరాజులందఱు నాహాకారంబులు చేసిరి. అప్పుడు బభ్రువాహనుండు మొగంబున వికారంబు నొందక చేతులు గట్టుక యూరకున్న సాత్యకి తనయునిం గృపఁజూడు మనియె. కర్ణనందనుం డింత కోపం బేమిటి కనియె. హంసకేతనుం డింతగర్వం బేమిటి కనియె. నీలధ్వజుం డింక నైన మన్నింపు మనియె. ప్రద్యుమ్నుం డిది యేమి రిత్తగొడవ లనియె. కృతవర్మ యిది తగవు గా దపకీర్తి యనియె. అనుసాల్వుం డయుక్తం బనియె. యౌవనాశ్వుం డీచందంబు నీవంటివాని కర్హంబు గా దనియె. తక్కినరాజు లందఱు వేనవేలభంగుల విన్నవించినఁ బార్థుం డంతకంతకు నగ్గలం బగు కోపంబునఁ జుఱచుఱం జూచుచు "నోరి పందా! ముందఱఁ బఱతెంచు గుఱ్ఱంబు పట్టికొని యాపిఱుందన వచ్చునీదళంబులం గనుంగొని ప్రాణభీతిచేఁ గ[illegible]ంబునకుం బ్రాలుమాలి కాళ్లమీఁదం బడియెదవు. నీవు నాకు జనియించుట కల్ల. చిత్రాంగదావధూటికిం గోమటివానికిం బుట్టినవాఁడవు. నా కెదురుగా నుండక పొమ్మనిన నారాచకా[illegible] యుండు

పొక్కిపడుచు నన్ను నే నున్న నేమి సేసినం గో అంత లేదు. పరమపతివ్రతాతిలకంబును సీతాసమానచారిత్రయు నుభయకులపవిత్రయు నైనమాతల్లిన దూషించితివి గావున నే వినం జాల; నీ వేమి సేతువు, నావినయం బింతకుం దెచ్చెం; బెక్కు మాట లేమిటికి? ఎక్కటిపోరి నన్ జయించెదో. దళంబులు సహాయంబుగాం గొని పోరెదో. ఆయుత్తమ్ము గమ్ము, లెమ్ము. నేను క్షత్రియకుమారుండ నగుటయు, వైశ్యపుత్రుండ నగుటయుం, జూచెదవు. అని తెచ్చిన కానుకలు పురంబునకు మగుడ ననిచి, యశ్వంబు లాయంబునకుం గొని పొమ్మని మొగంబున గంటు వెట్టుకొని గిఱుక్కున మరలి రెండుగడియలదూరం బవ్వలికిం జని, సుబుద్ధి యను సేనాపతిం జూచి సైన్యంబుల నొక్కముఖంబుగా మోహరింపం జేయు మనుటయు, సైన్యపతియుం గనకకింకిణీఘంటికాకేతనపతాకాలంకృతంబు లైనయేడుకోటులరథంబులును, గీలుమదంబునం బొదలు భద్రగజంబు లర్బుదంబులును, జటులఘాటీనిరాఘాటంబులును, మనోహరంబులును నైన తెల్లగుఱ్ఱంబులు రెండర్బుదంబులును, సమరకర్కశులు బాహుబలధురీణులు నైనవీరభటులు మూండర్బుదంబులును, గ్రందుకొనం గాలచక్రాకారంబును నాహవభయంకరంబును నగుమోహరంబు సంఘటించె. అప్పుడు కపికేతనునిపాలికిం దోంచు ధూమకేతుచందంబున నీలమణిదండమండితం బైనమహాకారధ్వజమ్మునను గనకమయనిర్వక్రంబు లైనచక్రంబులును దిర

స్కృతవజ్రాయుధంబు లైనయాయుధంబులును మరకతమణి నిభాంగంబు లైనతురంగంబులునుం గలిగి సఫలితమనో రథం బైనరథంబు నెక్కి బభ్రువాహనుండు బాణబాణాసన తూణీరకరవాల ఖేటకకవచతలత్రాణశిరస్త్రాణంబులు మెఱయ భద్రగజంబులమీఁదం గమకించు సింగంపుఁగొదమ తెఱంగున నెదుఱుగా మోహరించి నిలిచె.

తదనంతరంబ యుభయబలంబు లొండొరులం దార్కొని పూర్వపశ్చిమసముద్రంబుల తెఱంగున నేనుంగు లేనుంగు లశ్వంబు లశ్వంబులును రథంబులు రథంబులు కాల్బంట్లు కాలుబంట్లును సేనాపతులు సేనాపతులును దొరలు దొరలునుం గాఁ దలపడి నెత్తురుటేఱులు మాంస పర్వతంబులు మేదోమస్తిష్కపంకంబునుం గలుగునట్లుగా ఖడ్గాఖడ్గి దండాదండి బాహాబాహి కచాకచి యుం గాఁ బెనంగునెడ బభ్రువాహనుండు తేరు కటియం దోలించి క్రీడి నుద్దేశించి "తండ్రివి గావున వందనంబు సేసెద. నేను వచ్చినయెడ మేర మీఱినమాట లాడితివి. నాపరాక్ర మంబు చూడం గోరి యవ్విధంబునఁ బలికిన నేమి. నీతలం పు నెఱవేర్చెద. ఇంక శంకింపఁ బని లేదు. కార్ముకంబుఁ గైకొనుము. నీవు గురుండవు గావున మున్నుగా బాణం బులు నాపయిం బ్రయోగింపుము." అని పలుకు నవసర మ్మున ననుసాల్వుం డక్కుమారు నెదిరించి కార్ముకంబు గుదు సుపడం దిగిచి తొమ్మిదియమ్ములు నిగిడించుటయు పురు సర

కుఁగొనక చిత్రాంగదానందనుండు చిలుకతెక్కలు గీలు క్రొలిపిన వాలికలక్రొక్కోలలు నూఱు ప్రయోగించిన, వాఁడవి నడిత్రోవ నేతునియలు గావించి శతసహస్రసంఖ్యాకంబులగుకంకపత్రంబు లేసె. ఈచందంబున సింహవిక్రములైనయయ్యిరువురు శిలీముఖనఖంబుల మేనులం గ్రుచ్చుచుఁ బూచినమోదుగుల తెఱంగున దురంబు సేయునవసరంబునఁ బాండుపౌత్రుండు నాలుగునారాచంబుల నశ్వంబులను నయిదుప్రదరంబుల సారథిశిరోధియు నేడువాఁడితూపులఁ గార్ముకంబును నెనిమిదివిశిఖంబుల రథంబునుం దుత్తుమురు గావించిన, ననుసాల్వుండు నూతనశతాంగారూఢుండును సజ్జీకృతకార్ముకుండు నై చండకాండంబులం బాండుపౌత్రునిం దూలించుటయు, నతండు రోషావేశంబున శస్త్రవర్షంబులు గురిసి క్రమ్మఱ విరథునిం గావించిన, ననుసాల్వుండు గద కరంబునం గైకొని యెదురుగా నడిచినఁ, దొమ్మిదిచిలుకుటమ్ము లురంబున నాటించిన, నతండు రిమ్మ వట్టి భూతలమ్మున వ్రాలె. అంతఁ బ్రద్యుమ్నుండు విద్యుల్లతాసంకాశంబైనబాణాసనంబు మండలాకారంబుగాఁ దిగిచి ప్రదరవర్షంబులు గురియుచు ననుసాల్వునకుం బ్రాపై యెదిరించిన, బభ్రువాహనుండు బాహువిజృంభణంబున లక్షలకొలందులగుతీక్ష్ణబాణంబులు ప్రయోగించిన, శ్రీకృష్ణకుమారుండనంగుం డనుపేరు యథార్థంబుగా నాచరింపంబడి యేదు వెరఁగినచందంబునం గనుపట్టి సమరవ్యాపారంబులఁ మఱచి

ముందు వెనుక దోఁచక తిరుగుడుపడుచు నుండుసమయం బునఁ బార్థకుమారుండు చతురంగబలంబులం గసిమసంగు టయుఁ, బ్రద్యుమ్నుండు గొంతతడవునకుం దెలివిఁజెంది బభ్రువాహనుదేహంబును దనయట్ల శరమయంబు గా వించి యతనిసైన్యంబులలోనం జొచ్చి, కఠోరంబులును గాలదండోపమానంబులును గనకపుంఖపుంఖితంబులును నైనకాండంబు లకాండప్రళయజలధరంబుగతిం గురిసిన, మృగ్గుమదావళంబులును, బడుమావఁతులును, గెడయుకాళ్ళు లును, దన్నుకొనుగుఱ్ఱంబులును, నఱనఱలైన యరదంబు లును, జచ్చినరథికసారథులును, బొలిసినవీరయోధులును, దుమురు లైనచక్రగదాకుంతతోమరముసలముద్గరపట్టసాది సాధనంబులును, జినిఁగినమైమఱువులును, ఛిద్రంబు లైన శిరస్త్రాణంబులును, బోడి యైనచిందమ్ములును గాలికిం బోవు చామరంబులును, జూర్ణంబు లైనభూషణంబులునుం గలిగి మృత్యువిహారస్థానంబునుం బోలె రణాంగణంబు దుర్నిరీక్ష్యం బయ్యె. అప్పుడు శాకినీఢాకినీభూతబేతాళకూష్మాండబ్రహ్మ రాక్షసప్రేతసంఘంబులు చొరఁబడి గజకళేబరంబుల హయ కంకాళంబుల వీరభటశరీరంబుల మంచిదిగా నేర్పఱిచి, చర్మ ములం దిత్తులుగా నొలిచి, జానుజఘనపార్శ్వకంఠాదిస్థానం బులం గలపలలంబు కపాలపాత్రంబుల వడ్డించి, పునుకగిన్ని యలఁ గ్రొత్తనెత్తురులు నించి, చుట్టంబులుం దామును బం తులుదీఱి యాకంఠపూర్తిగా మెసవి చిక్కెముకలు చప్ప

రించి లో నః న్నమొనడు పీల్చి, రక్తపూరంబులు గళగళ గ్రోలి తృప్తిఁ బొనిఁది యాడం దొడంగె. అం దొక్క ఢాకిని కిరీటకుండలాభిరామకమ్రంబు లైనరాజులశిరంబులు పదియుఁ బదియు నైదు మిడనిగటి కెగురవైచి యచ్చనగం డ్లాడె. ఒక్క శాకిని యేనుఁగుదంతంబు బిఱబిఱఁ ద్రిప్పుచుఁ జోపదంబుల నటింపం దొడంగె. వే ఱొక్క ప్రేతం బేనుఁగుచర్మంబు ముసుంగుచెఱఁగుగా నిడి యభినయింపుచు దేశీయనాట్యంబు సేసె. ఒక్క బేతాళుండు భుజంబులమేనిచట్టంబులు దగిలించికొని సరిబేసి యూంట లాడం దొడంగె. భూతగణంబులు కరతాళంబులు ఘటియింపఁ బూతనాగ్రహంబులు కపాలకుండలంబులు నదల శల్యహారంబులు పొదలఁ జకచకఝంకృతులతోఁ జిందులుద్రొక్కం దొడంగె. ఒక్క భైరవుండు గండు మిగిలి......................దశదిశలు గగ్గోలుగా నార్చుచు దవాళింపం దొడంగె. ఇవ్విధంబున నతిభయంకరంబగురణాంగణంబున నపక్రపరాక్రముం డగుచక్రికుమారుండు విజృంభించె.

అయ్యవసరంబున బభ్రువాహనుండు తెప్పిఱి రుక్మిణీనందనునకు నష్టంబుగా రథంబు నడిపించి లెక్కకు మిక్కుటంబు లైనయుక్కుటలుఁగులు చెక్కుటయు గూఁటిలో నొదిఁగిన గువ్వలచందంబునఁ గొంతతడ వుండి కార్ష్ణియుండు తన్నుం గప్పినయట్ల తీవ్రవిశిఖంబులచేఁ జిత్రాంగదాసుతుని గప్పిన నతండు గమకించి కృష్ణతనూభవురథంబుఁ బెక్కుశకలంబు

లుగా ఖండించిన జనార్దనతనూజుండు వేఱొకండునన [...]రథం బధి
రోహించిన నదియును ఖండించె. ఇవ్విధంబుం గని [...] నరగడియ
లో నిరువదియరదంబులు ద్రుంచిన మీఁదం దెలి[...]మండు కపికే
తనకుమారకునికరలాఘవంబుఁ గొనియాడమయం[...]రథం బెక్కిన
రథంబు తునుకలు సేసినఁ, బాంచ్యపతి వేఱొక్కరథం బెక్కి
నదియునుం ద్రుంచిన మఱియొక్కస్యందనం బధిరోహించె.
ఇత్తెఱంగున యాదవకుమారుండు త్రుంచినయరదంబులు
లెక్కపెట్టం దరంబు గా దయ్యె. అంత నయ్యిరువురు
దివ్యాస్త్రయుద్ధంబు సేసి తనివిసనక చక్రంబు గదయుఁ
గత్తి కేడెంబు గండగొడ్డలియుం బ్రాసంబు ముసలంబునుం
గైకొని యురువళ్లు మీఁఱుపరువళ్లు మెఱయ సాదనమెలఁకు
వలు చూపఱకు నయనానందంబు సేయఁ బ్రాసునం దూఁ
చినచందంబున నెక్కువతక్కువలు లేక పెనంగుచు మనో
గతంబులైనక్రోధాగ్నిజ్వాలలు వెలి కుఱికెనో యను తెఱం
గున గాయమ్ములం గ్రమ్మురుధిరమ్ములు కుంకుమరసమ్ములకరణి
నెమ్మేను లలంకరింపఁ గోదండంబు లూఁదికొని వింటికొప్పు
లం దమమోములు చేర్చికొని సొమ్మసిలి యుండిరి. అపుడు
బభ్రువాహనుండు గాండీవగుణధ్వని చెవులం బడుటయు
మూర్ఛ తెప్పిఱి శరశరాసనంబులు గైకొని తొల్లి కుశుండు
శ్రీరామచంద్రునితో నెదిరింపం గడంగినచందంబున గాండీ
వితో భండనంబు సేయం జనుదెంచె.

యుండిరి. ఇప్పుడు జలధిబంధనంబును దశముఖసంహారంబును జేసి బ్రహ్మరుద్రాదిదేవతాపూజితుండవై యేతెంచుటకతనఁ దద్వాక్యంబులు నిజంబు లని తోఁచె" ననిపలుకుసంబపలుకులకు శ్రీరఘువీరుండు సంతసించుచుఁ బురందరవైభవంబున నయోధ్యకు వేంచేసి పట్టాభిషిక్తుండై రాజ్యపరిపాలనంబు సేయుచునుండ, వృక్షంబులు సర్వకాలంబులందును గిసలయకుసుమఫలభరితంబు లయ్యె. ధేనువు లపారంబుగా క్షీరంబు లీయం దొడంగె. తగినపతి దొరకుటవలన ధరణీతరుణి నిశ్చలత్వంబు నొందె. తస్కరభయంబులు సున్న యయ్యె. పుత్రశోకంబులు లే వయ్యె. వైధవ్యంబులు రావయ్యె. ప్రాణులు రోగంబు లెఱుంగ రైరి. నెల మూఁడువానలు గురియ సాగె. ధాత్రీతలంబు దున్నకయె పండె. ధారణ పోఁకకుఁ బుట్టెఁడయ్యె. ఈతిబాధ లొక్కటి లేవయ్యె. ఇవ్విధంబున శ్రీరామచంద్రుఁడు గుణత్రయంబుతోడం గూడినపరతత్త్వంబుచందంబున ననుజత్రితయంబుతోఁ గూడ జలధివలయవేల్లితం బైనజగతీతలంబు నేలుచు సీతాసమేతంబుగా నిష్టోపభోగంబు లనుభవించుచుఁ దొమ్మిదివేలసంవత్సరంబులు ధాత్రీపాలనంబు సేసి "యపుత్రులకు లోకంబు లేదుగదా" యని యూహించి మనుజమాత్రునిచందంబునఁ బిత్రృణంబు దీఱునుపాయంబు యోజన సేయుచుఁ బుత్రార్థియై సంతాపంబునం గుందుచుండ, జానకి శ్రవణానక్షత్రచతుర్థపాదంబునఁ జరమలగ్నంబున జన

నిం బట్టణంబు వెడలింపం జాలుముహూర్తంబునఁ బ్రథమ గర్భంబు దాల్చె. అంత నాలవమాసంబునఁ గడపటిదినంబు ప్రభాతకాలంబున లక్ష్మణుండు సీతాదేవిం గొనిపోయి యడవిలో విడిచి వచ్చునట్లుగాఁ గల గని దిగ్గన లేచి మనంబునం గలంగుచు సంధ్యాదివిధులు నిర్వర్తించి గురుం డైన వసిష్ఠమహామునితో నిశాచతుర్థయామంబునం గన్నకల తెఱం గెఱింగించిన నమ్మునీంద్రుండు రఘూద్వహుం జూచి "భావికార్యంబు గాక మానదు. శీఘ్రంబుగా జనకపుత్రికిఁ బుంసవనాదికర్మంబు లాచరించి గర్భసంరక్షణంబు సేయం దగు. తమ్మునిం బంపి సత్వరంబుగా జనకుని రప్పింపుము. ఐదవమాసంబునందు శుక్లపక్షసప్తమీదినంబున నిరువురకుఁ జంద్రతారాబలంబులు పొసంగి యున్నయవి. నాఁటికి ధనుర్లగ్నంబున సీమంతపుంసవనంబులు సేయం దగినయవి." అని ముహూర్తనిర్ణయంబు సేసిన రఘువీరుండు జనకునిం దోడ్కొని వచ్చుటకు సౌమిత్రిం బనిచి వసిష్ఠవామదేవాదులు నిచినలగ్నంబునఁ జంద్రేండుగడియలదూరంబు చౌకంబుగా నింద్రనీలమయంబులును వజ్రఖచితంబులును వైదూర్యనిర్మితంబులును దప్తకాంచనఘటితంబులు నైన స్తంభంబులు నిలిపి పెండ్లిచవికె వేయించె.

తదనంతరంబ జనకమహీపతియు యుధాజిత్తు మొదలయినబంధువులు వచ్చుటం జేసి సప్తమీదినంబున వసిష్ఠమహాముని వామదేవాదులతోడం గూడ నాజ్యతిలచరు

హోమంబులు గావించి సీతాదేవికొప్పున ముఖపందిముం ప్రతితోఁ గూడ సూత్రవేష్టనంబు సేసి, గోధుమపూసలపేరు నక్షత్రకాంతిపూసలపేరు నాగవాక్యవిధానంబున నాజగదంబ గళంబున నిలిపి, శంఖభేరీమృదంగఘల్లరీముఖరజగంభీరధ్వనులు దిశామండలంబు నింప బ్రాహ్మణులకుఁ గనకరత్నాంబరగజతురగాదిదానంబులు గావించి, మహీసురులతోడం గూడ బాంధవులం బంతులు దీర్చి బంగరుపళ్లెరంబులం బహువిధాన్నంబులు భుజియింపం జేసి భూసురాశీర్వాదంబులు గైకొని మహోత్సవంబు సేయుటయు జనకమహారాజు తనకోరిక నెఱవేఱుటవలన నానందభరితమానసుండై యమ్మహోత్సవంబు చూచి తనయొక్క రాజ్యంబు నెల్ల నల్లునకొసంగి విశ్వామిత్రునితోఁ గూడఁ దపోవనంబునకుం జనినఁ, గాకుత్స్థుండు సర్వసర్వంసహాతలయుంబు నేకాతపత్రంబుగా నేలుచున్నయెడ నొక్కనాఁ డేకాంతంబున జానకీకాంత కాంతునితో ని ట్లనియె. “వల్లభా! నాయుల్లంబున నొక్కకాంక్ష యున్నది. నీవు నెఱవేర్పవలయు. గంగాతీరంబునం దపంబు సేయుతపస్విపల్లాంత్రతోడం గూడ వనంబుల విహరింపుచు నుండం గోరెద.” అనిన రామకాంత కుంపు గుండె జల్లన నీయొప్పులకుప్ప యింత యొప్పనికోరిక గోరు నే? యని వగలం బొగులుచుం దొల్లి పదునాల్గుసంవత్సరంబు లడవులలో నిడుములు పడినదియునుం జాలక యిప్పుడు నడవి గోరె. నేను దొలుతఁ గన్నదుస్స్వప్నం బను

లక్షికే కిది ఫలం బయ్యె నని నిశ్చయించి "కొమ్మా! యటుల కానిమ్ము, రేపటికి నిన్ను వనంబునకుం బనిచెద" నని యభ్యం తరమందిరంబున కయ్యంతి ననిచి యున్నసమయంబునఁ బ్రతిహారి యరుగుదెంచి 'పౌరవృత్తాంతంబులు దెలుపు టకుఁ జారులు వచ్చి యున్నవా' రనిన రఘువీరుండు వా రలం బిలిపించిన వంచకు వందనంబులు సేసి కేలు మోడ్చి సరుసగా నిలుచుటయు, "నేఁటి కెవ్వ యేనియు వింతలు గల వేని దెలుపుఁడు. నన్ను నాతోఁబుట్టుగుల జనకనందన నుద్దేశించి జను లేమనియెదరు? వెఱవక పలుకుం" డనినఁ జారులు భయకంపితు లయి "దేవా! తారకమంత్రంబునకు నీవర్థము. పంచమహాపాతకంబు లనియెడిచీఁకట్లకు దేవర నామాక్షరంబులు చండభానుకిరణంబులు. త్రిలోకపావనుండ వైననిన్నుం దలంచినయంత పాపంబులె పుణ్యంబు లగు. అట్టిదేవరతోడ దుష్టచిత్తులైనపౌరులుమాటలు పలుక నలి కెదము. అయినను స్వామివారల డుగుటం జేసి వినినమాట దాఁపక తెలిపెదము. "ఈపురంబున నొక్కచాకిత, మగండు తిరస్కారంబు సేసె నని యలిగి పుట్టినింటికిం బోయినం, దానితండ్రి 'కూఁతురా! జనంబులదేహంబులు సోఁకి మ యిలవడినకోకలు శుద్ధి సేసి ధారణయోగ్యంబులు సేయు నట్టియుత్తమకులంబునకు మయిల గల్పించితివి ఇంటిజగడం బింటిలోననె యడఁపక యింతదూరంబు వచ్చుట తగవు కాదు!—అనికూఁతుం దోడ్కొని యల్లునికడకు వచ్చిన

వాఁడు నెయ్యి వోసినయగ్నిచందంబున భగ్గున మండుచు "నిల్లు వెడలి నాలుగుదినంబులు వేఱొకచోట నుండి మగుడ నాకడకు వచ్చినపడంతి నేలుటకు రక్కసుండు గొనిపోయినసీతం దెచ్చికొనినరాఘవుండను గాను" అని యన్నీచుండు దుర్భాషలు పలికినఁ, జెవులు మూసికొని వానిమామ కొమరితం దోడుకొని యింటికిం బోయె. మలినాంబరంబులకు నిడఁగా మిగిలిన యెంగిలిగంజి ద్రావుచుఁ బొట్టవోసికొనునీచునియందు నిట్టిదుర్గుణంబులె కాని మంచిమాట లేమిటికిం బొడము! ఐన నీవృత్తాంతంబు దేవర కెఱింగింప వచ్చితి" మనిన మనుకులతిలకుండు మనంబు జల్లన మేను మ్రాన్పడఁ గొంతతడ వుండి ధైర్యం బవలంబించి చారులం బొమ్మని యారాత్రి నాలవజాము బ్రహ్మకల్పంబు గడపినకరణిం గడపె.

అనంతరంబ వేగుటయు భరతలక్ష్మణశత్రుఘ్నులు సత్వరంబుగా రామభూమీశ్వరుసమ్ముఖంబునకు వచ్చి చింతాక్రాంతుండును వివర్ణవదనుండును బాష్పాకులితనేత్రుండును నై రాహుగ్రస్తుం డైనపూర్ణచంద్రుండునుం బోలె కాంతివిరహితుండై యున్నయన్న నవలోకించినమాత్రంబున ఖిన్నులై తత్పాదంబులకు మ్రొక్కి పలుక వెఱచి మెల్లమెల్లన "జగద్వల్లభా! దేవరపాదసేవయె సకలపురుషార్థంబులకుఁ గారణంబు." అని యంచు నట్టె 'మా యెడం దయచూడ కుండుటకుఁ గారణం బేమి' యనిన

రఘువరుండు చారులవాక్యంబులు పలుకరించి దుష్టపురుషునిచే నిందితం బగువేదంబుకరణి క్షుద్రజనులచేఁ బరమసాధ్వి యగుసీత నిందం జెందె. అశనిపాతసంకాశం బైన లోకాపవాదంబునం గలుగుభయంబు డెందంబు బ్రక్కలింపం దొడంగె. జన్మమరణభయభీతుం డగుయోగిపురుషుండు మాయనుం బలె పరమసాధ్వి యైనసీతను బరిత్యజించెద. అనిన వినిభరతుండుభయకంపితస్వాంతుం డయి "అయ్యా! నీవంటివివేకి యి ట్లానతీయం దగునె. కపిలధేనువును సంపాదించి యంటునడె ననుచు నడవిలో విడువ నడచువాఁడునుం గలఁడె. తొలుత లంకాపురంబున దశముఖుని సంహరించినపిమ్మట ననలంబులోనం జొచ్చి బ్రహ్మపురందరబృందారకబృందంబులు వినుతింపం, గంధకుంఠనున్నయిన్నారీమణిం జూచి యీపతివ్రతాతిలకంబు తనకుం గోడ లైనకతంబునం బుణ్యలోకంబులు గలిగె. కాకున్నం బుత్రశోకంబున మృతిం బొందినవారలకు గతి గలుగనేర్చునె! అని దేవదానవరాక్షసవానరవీరులు వినుచునుండ మనతండ్రి యగుదశరథమహారాజు కొనియాడినట్టిశుభచరిత్రయు నిక్ష్వాకుకులపవిత్రయు సౌజన్యపాత్రయు నగుజనకపుత్రికను ఘోరమృగపక్షిగణాకీర్ణంబును నిశాచరవిహారస్థానం బైనకాననంబునఁ ద్యజించుటకంటెఁ బాపంబు లేదు. కావున నిట్లుచేయుట యనుచితం" బనిన లక్ష్మణుండు రోషారుణాలోచనుం డై "లోకమాత యగుసీత ని ట్లాడిన

నరాధమునిం బరిమొండెంబులు సేయనలయుం గాని యూయంబుఁ బరిత్యజింప నగునే యనుటయు శత్రుఘ్నుండును నట్లన పలికిన రాఘవుండు భరతాదులం జూచి "జానకి లోకపావని యగుట నేనెఱుంగుదు; నైన లోకాపవాదంబు పుట్టినయెడ నర్థంబు నైన ననుజుల నైన హితుల నైన దేహంబు నైనం దృణంబుగాఁ ద్యజింతు ననినయెడ నిది యేమి యెచ్చు. మనువంశసంభవులును మానధనులు నైన హరిశ్చంద్రాదులు తొల్లి కీర్తికొఱకుఁగా సర్వస్వంబునుం బరిత్యజించిరి. వారల వర్తనం బిప్పుడుం గొనియాడం బడుచున్నయది. కీర్తిహీనులు జీవన్మృతులుగా నెఱుంగుదు. తొంటి రాజర్షులు తనువు లైనం బరిత్యజించి కీర్తిసంపాదించిరి. అట్లగుటకతనఁ బావనచరిత్ర యైనసీత నుజ్జగించి కుప్పసం బూడ్చినసర్పంబు తెఱంగునఁ బ్రకాశించెద." అనినరఘువీరుని తెగువ గనుంగొని భయంబున మాఱాడ వెఱచి భరతశత్రుఘ్నులప్పటికిం దలంకి చనిరి.

తదనంతరంబ దుఃఖంబునం జిక్కినయన్నయొద్ద లక్ష్మణుం డొక్కరుండ నిలిచె. అప్పుడు కాకుత్థ్సుండు లక్ష్మణునిఁ జేరంబిలిచి "సీతను గంగాతీరంబున నడవిలో విడిచి రమ్ము. కాదేని ఖడ్గంబుచే నాశిరంబుఁ దెగవ్రేయుము. జానకిం గానలో విడిచిన పాతకంబు నాకుం గాని నీకుం బని లేదు." అనిన విని భుజగంబుకరణి నిట్టూర్పులు నిగిడించుచు గమనోన్ముఖుండై యన్నకు మ్రొక్కి యరదంబు

నెక్కి యనేకంబులైనయశకునంబులు గనుచు సీతాంగన యుండు నంతఃపురంబునకుం జనుదెంచి యయ్యంబ పాదారవిందంబులకుం బ్రణమిల్లి "తల్లీ! నీవల్లభుండు నీకోర్కి చెల్లింప దలంచె. విచ్చేయు" మనుటయు నాయమ్మ తా నొక్కసారి వేఁడినఁ జన విచ్చి పంపె. పెనిమిటికిం దన మీఁద నెంత ప్రేమయో యని సంతసించుచు శ్రీరాముని పాదుకలు మున్నుగాఁ గైకొని రత్నభూషణంబులును రజత కనకంబులు నంబరంబులు సుగంధంబులు నానావిధంబు లగుభక్ష్యంబులు హూనఁగించి రథంబుమీఁద నునిచి యత్తలకు మ్రొక్కి కౌసల్యతో ని ట్లనియె. "నాదుకోరికి నను కూర్చుటకు సుమిత్రానూనునిం గూడఁ బయనంబు చేసి గంగాతీరవాసిను లయినమువాసినులం జూచి రమ్మని మీకుమారుండు పనిచె" ననినఁ గోసలరాజతనూజ భూమిజం జూచి-"అమ్మా! కోమలాంగివి. ఘోరవనంబుల కెట్లు చని యెదవు. ఎండచే నెమ్మొగంబు గందు. తనులత వాడు. ఇదేమి కోరిక. మానుము"-అనుటయు సమస్తభయనివారకుండైన శ్రీరఘువీరుండు నామనంబున నుండుటకతన నంత రవంతయును రాదు. మీకరుణ గలిగి యుండె నశుభంబు లేశంబును లేదు. మనసుకొదవలు మాని నన్నుం బంపు" మనుటయు నయ్యమ్మ యేమియు ననక యూరకుండినఁ దక్కినవారల వీడ్కొని యన్వేలంది యుత్తరీయంబుఁ జక్కఁ జెక్కి పచ్చనిగుఱ్ఱంబులు పూన్చిన రథంబు నెక్కి కదలు

టయు సుమిత్రాసూనుండు గద్గదస్వరంబుతో సారథిం జూచి "యశ్వంబులు కన్నీరు నించి తలలు వంచుచున్న

—* లక్ష్మణుండు సీతాదేవిని వనంబునకుం గొనిపోవుట. *—

యవి. ఇది యేమి యనుటయు "దేవా! నేనశ్వహృదయంబు చక్కఁగా నెఱుంగుదు. సమరంబుల యందు నిరాఘాటంబుగా సంచరించు నీఘోటకంబు లిట్లుండుటచే నెద్దియేనియు నొకదుర్దశ రాఁగల దనితోఁచుచున్నయది. అయిన నా నేర్పుఁ జూడు" మని ఘుఱ్ఱంబుల కంఠంబులు దట్టి థే యని వాగె సడలించిన వాయువేగంబున నరదంబు పోవు నెడ వాయసంబును బాల భరద్వాజంబును గరుడుండును గగనంబునం గట్టె. కుందేలు నక్క మొదలగుమృగంబులు రథంబునకు నడ్డంబుగాఁ బఱపం దొడంగె. అయ్యుష్మకు దక్షిణనేత్రం బదరె. అప్పుడు సీతాదేవి రామానుజుం గనుంగొని "ఇట్టుగా దుర్నిమిత్తంబులు దోఁచుచున్నయవి. చేవెట్టి కలంచినగతి నాయుల్లంబు దురపిల్లుచున్నయది' కరుణాసముద్రుండును శౌర్యసముదీర్ణుండును నగుశ్రీరామభద్రునకు శుభంబు గలుగుం గాక. ఏవీరుండు ఖరదూషణాదిరాక్షసులం బదునాల్గువేల నొకముహూర్తంబున నుక్కడంచె; నేమేటి యలయించికొని పోవుమారీచమృగంబు మస్తకంబు ఖండించె; నేమహానుభావుండు గొండలు పఱపించి సముద్రంబున సేతువు గట్టించె; నేజగజెట్టి రావణకుంభకర్ణాదుల వధియించి లోకత్రయంబున సౌఖ్యంబు

సంపాదించె; నేదయానిధి విభీషణునకు శాశ్వతంబుగా లంకాసామ్రాజ్యం బొసంగె. శరణాగతసంరక్షణప్రతుం డును రాజేంద్రుండును ననంతకల్యాణగుణసాంద్రుండు నైనయా శ్రీ రామచంద్రుం డయోధ్యానగరంబు నేలుచు నాచంద్రతారకంబుగా సుఖంబున నుండుఁగాక." అని పలుకుచుఁ గొంత దవ్వు చని జానకీదేవి యుభయతీరంబులం బొడమినతరులతానికరంబుల పుష్పవాసనలం బరిమిళితంబులును బూర్వసముద్రపరిచూచితంబులును నై సప్తశతప్రవాహముఖంబులం గనుపట్టుచుఁ జక్రవాకపక్షమారుతసంచరద్వీచీకలాప మైనదివ్యాపగం గనుంగొని వకుళతిలకసహకారనమేరుప్రియకమేదురం బైనతటంబున జనకతనూజయు సుమిత్రాసుతుండును రథంబు డిగ్గి కువలయమనోహరంబును సత్కవిసేవితంబును సుధాప్రకాశంబు నై రాఘవుని కీర్తిం బోలుచున్నగంగం గనుంగొని సంతసంబునం గొనియాడుచు నావికుండు దెచ్చినయోడ నెక్కి యవ్వలిగట్టునకుం బోయి స్నానంబులు సేసి ధౌతపరిధానంబులు ధరియించి పాదచారంబునఁ జీమలకుం దూఱఁగూడనికాఱడవి తెరువుఁ బట్టి యకుంఠితంబు లైనకంఠీరవకఠోరఘోషంబులం ఘూర్ణిల్లు మదగజంబులు జంబుకంబులు వృకంబులు వాలుమెకంబులు మొద లగుమెకంబుల భయంకరఘోషంబులును నడవిఋూఁగలఝుంకృతులును నిలకోళ్లజీంకృతులును వనమహిషంబులభాంకృతులునుం జెవులు వ్రక్కలుసేయ భీక

రం బైనయక్కాననంబు నవలోకించి భూపుత్రి సుమిత్రా
పుత్రునితో ని ట్లను. "జీర్ణంబులు నీరసంబులు ఛాయావర్జి
తంబులు నైనవృక్షషండంబులచేఁ బ్రవేశింపఁగూడనియర
ణ్యంబు గనుపట్టుచున్నయది గాని పావనంబు లైనతపోవ
నంబులు గానరావు. వికటంబులు తీక్ష్ణకంటకంబులు నైన
బలుసు, తుమ్మ, చంద్ర, వెఱుతురు, కోరింద మొదలగు
పొదలు గనుపట్టుచున్నవి గాని పుణ్యపేటిక లయిన యతి
వరమఠవాటికలు గానరావు. కాఱుచిచ్చువలనం బెచ్చు
పెరిఁగిన పొగ లెగయుచున్నయవి గాని హోమధూమంబులు
గానరావు. (1)సింగంబులు చిఱుతపులులుం గనుపడుచున్న
యవి గాని మునిబాలకులు గానరారు. పాషాణకర్కశంబు
లైనకాపథంబులు గనుపట్టుచున్నయవి గాని నడయాడు
మార్గంబు గానరాదు. దశరథరాజనందను నెడఁబాయు
నోర్చిన ననుబోఁటిపాపకర్మురాలికి మంచిది యేల కాన
వచ్చు" నని సంతాపంబు నొందుసీతాసతి నవలోకించి
సౌమిత్రి మొగంబు వాంచి బాష్పపూరంబులు రాల్చుచుఁ
"తల్లీ! లోకాపవాదనిమిత్తంబుగా నిన్నుఁ గాంతారంబు
నొందించి ర మ్మని రాఘవుండు కృపావిహీనుండ నగు
నన్నుం బనిచె" ననియెడి తీవ్రభాషణంబు లశనిపాతంబు
రీతిఁ గర్ణరంధ్రంబులు సోఁకుటయు సురగాలిచేత వ్రాలిన
కుసుమవల్లియుంబోలె మూర్ఛఁ జెంది పుడమిం బడి యొడ
లెఱుంగక యున్నజనకపుత్రిం జూచి సౌమిత్రి పటాంచలం

బున విసరి యుపచారంబులు సేయఁ దెలివి నొందక యుండుటయుఁ "త్రికరణంబుగ శ్రీరామచంద్రుని చరణారవిందంబులయందు నిజభక్తి గలవాఁడ నేని జనకనందన బ్రతుకుంగాక" యని ప్రతిన సేయుటయుఁ గన్నులు తెఱచి యాయ

—* లక్ష్మణునియొద్ద సీతదుఃఖించుట. *—

న్నలమిన్న యన్నువపక్షియుంబలె విలపించుచు 'నన్నా! నీయన్నయు నీవును బదునాలుగేండ్లు నరణ్యంబునఁ గాపాడితిరి. ఇప్పు డిట్లు నట్టడవిలో దిగ విడువం దగునే? మఱిఁదులలో నీవు నాయెడ భక్తివిశ్వాసంబులు గలవాఁడవు. తొల్లి దండకావనంబున నేఁ దెమ్మనినపువ్వులు దెచ్చి యిచ్చి తనూభవునికైవడిం గాపాడినదయాపరుండ వగుసీ విట్టినిర్దయత్వంబున కొడిగట్టితివే! అపకీర్తికి వెఱవనిసుగ్రీవునకు విభీషణునకు నిట్టిచెయిదంబులు సెల్లుం గాని నీకుం జెల్లునే? తండ్రీ! యే మనంగలదాన! నాపాపకర్మంబు నాకు వనవాసంబునం గోరికగాఁ బరిణమించెఁ, గాకున్న నెల్ల కార్యంబులు పరామర్శించి చేయుమీయన్న నిష్కారణంబుగా నన్నుఁ గాఱడవిలోన విడిచి రమ్మనునె! మున్ను నానిమిత్తంబుగాఁ గొండవిల్కానికోదండంబు బెండువలె విఱిచివైచె. నాకొఱకుఁగా మారీచమృగంబు మస్తకంబు ఖండించె. నన్నుఁ దెచ్చుటకై పాథోనిధిం గపులచే బంధింపించి సేనలం దాఁటించె. నన్నుం జెందుటకై పదిమొగంబులరక్కసునిశిరంబులు ఖండించె. అట్టిగుణాభిరాముం

డును దయారసధాముండు నైనశ్రీరామచంద్రుండు కాఁకులు దూఱనికాఱడవిలో నన్ను విడిచి ర మ్మనియెనే! ఇది నానోముఫలంబు గాని నీ వేమిచేయుదువు! మీయన్న యానతి సేసితివి. మీప్రతినలు నెఱవేఱె. వేగంబు సాకేతనగరంబునకుఁ బొమ్ము. (2)అని మఱియు జనకనందిని సుమిత్రానందనుం గనుంగొని "తమ్ముఁడా! వసిష్ఠవిశ్వామిత్రులు జనకదశరథులుం జూచుచునుండ నాఁడు వివాహసమయంబునఁ జిప్పకూఁకటి యొప్పు మీఱుచు రత్నఖచితంబు లైన కర్ణభూషణంబులం బొలుపొందుచుఁ, దెలిదమ్మిరేకులం దెగడుకనుఁగవయు బింబాధరంబును మందహాసంబునం జెలువొందఁ, బూర్ణేందుసన్నిభం బైనరామదేవునిముఖాంబుజంబు ధ్యానంబు సేయుచు నుండంగలదాన; నన్నెడఁబాసిన విరహావేదన సైరింపం జాలక రాఘవుం డేతీవియలం గౌఁగిలించుకొనియెనో యయ్యడవితీఁగలలో నన్నుం ద్రోసి రమ్మనె; నాదురదృష్టంబు నేమందు? అత్తల కెల్లం గేలుమోడ్చితి ననుము. పూర్ణగర్భయు నిరపరాధయు నైనజానకిని నిష్కారణంబుగా నట్టడవిలో విడిచి వచ్చితి ననుము. వత్సా! నీకు మే లగుంగాక! శ్రీరామభద్రునకు భద్రంబగుంగాక! భరత శత్రుఘ్నుల నడిగితి ననుము." అని పలవించుభూమినందనం గనుంగొని లక్ష్మణుండు "సాధ్వీశిరోమణీ! దైవయోగం బిటు లుండె. ఏల వగచెదవు? అ ల్లవే

(1)-(2) నడుమ నున్న గ్రంథ మొకప్రతిలోఁ బోయినది.

తాపసాశ్రమంబులు గనిపించుచున్నయవి. భాగీరథియు భూమిదేవియు వనదేవతలు నిన్ను రక్షించుచుందురుగాక! నీయోర్పును నీపాతివ్రత్యంబును నిన్నుం గాపాడు" నని యూఱకం బలికి కన్నీరు ఱెప్పల నప్పళించుచుఁ బ్రదక్షిణంబు సేసి లక్ష్మణుం డలంఘనీయం బైనరాఘవుని శాసనంబునకుం దలంకుచుఁ దిరిగి తిరిగి చూచుచుఁ బశుబాలకుండు దోలుకొనిపోవ నంబారవంబు సేయుచు వత్సంబు విడువ నోపనిధేనువు తెఱంగున, బలవరించుచు జనకరాజనందిని చూచుచు నుండ, హుటాహుటి రథంబుఁ దోలుకొని రామానుజుండు దవ్వగా నరిగి యదృష్టిగోచరుం డగుచు నయోధ్యకుం జనియె. ధరణీపుత్రియు నరణ్యరోదనంబు సేయుచు మూర్ఛ నొంది పుడమిపై వ్రాలినం బక్షులు ఱెక్కలచే నీడ గల్పించుచు నంబరంబునం దిరిగె. చమరీమృగంబులు వాలంబుల నల్లనల్లన విసరె. సింహశరభశార్దూలాదులు చుట్టునుం బరివేష్టించి కాపాడుచు నుండె. మదపుటేనుంగులు కరశీకరంబులచే జలధూమ్రంబులు నించె. భానుండు కిరణంబుల వేఁడిమి సోఁకకుండ వెన్నెలకరణి నెండ గాసె. వాయుదేవుండు శైత్యమాంద్యసౌరభ్యంబులతో మెల్లమెల్లన విసరుచు సేద దేర్చె

—* వాల్మీకి సీతను దనయాశ్రమమునకుఁ గొనిపోవుట. *—

నయ్యవసరంబున వేదవేదాంగకోవిదుండును దత్త్వవిశారదుండును నైనవాల్మీకి నిఖిలవిద్యారహస్యంబులు దెలిసిన

శిష్యులు పెక్కండ్రు పరివేష్టింప యాగార్థంబుగా సమిధ లును యూపంబులును దర్భలు కుసుమంబులు కందమూ లంబులు సంపాదించుటకై యయ్యడవికిం జనుదెంచి యప్పు రమపావనిం గనుంగొని "అమ్మా! నీ వెవ్వతెవు? ఏకతం బున నేకతంబ యివ్వనంబున శోకించెదు." అను నమ్ముని యాదరణవాక్యంబులకు వేసవియెండం గొట్టువడినమ యూరి మేఘగర్జితంబునకుం బలె నాహ్లాదంబు నొంది వీడి యున్నధమ్మిల్లంబు చక్క నొత్తి గద్గదస్వనంబున "నయ్యా! యేను మిథిలాపతిపుత్త్రికను, నావల్లభుండగు శ్రీరాముండు లోకాపవాదభయంబునఁ గల్లనిజంబులు విచారింపక కాన లకు వెడల నడిచె. ప్రాణంబులు త్యజింపఁ జూచిన భ్రూ ణహత్యాదోషంబు వచ్చుచున్నయది గావున సాహసంబు సేయ నెంచినదానం గాను. ఏను జేసినపురాకృతకర్మంబున నిటువంటిదుర్దశ ప్రాప్తంబయ్యె. నిన్నుం జూచిన మజ్జన కునిం బోలె నున్నది. నన్ను రక్షింపు" మని చరణంబుల పయి వ్రాలిన వాల్మీకి దయాకులితమానసుండై "సాధ్వీ! శోకింపకుము. మీతండ్రి యగుజనకునకు నేను సఖుండ. నీవు శీఘ్రంబ బలపరాక్రమసంపన్నులు నుత్తమచరిత్రులు నైనపుత్త్రుల నిరువురం గనియెదవు. గర్భక్షోభంబుగాఁ దెగువ సేయం దలంతురే!" అని యూరార్చి జానకిం దోడ్కొని యాశ్రమంబునకుం జనియె.

—* కుశలవుల జన్మవృత్తాంతము. * —

తదనంతరంబ యావాల్మీకిమునీంద్రుండు మునిభామల రావించి యాసతీమణిగర్భంబునకు హాని రాకుండం గాపాడుం డని యాజ్ఞాపించిన వారలు జానకిని బర్ణశాలలోనికిం దోడ్కొని పోయి నివాతస్థలంబున దర్భలపయిం బఱచిన కృష్ణాజినంబుపై నునిచి పాదపద్మంబులం గాడినముండ్లం మెల్లనం దివిచి వెచ్చనికరంబులం బాదంబులం గాచి క్రొం చెంబుగాం గారనూనె పంకించి తలచిక్కు వాపి ముడిచి చెక్కుటద్దంబులం గాఱుకన్నీరు పయ్యెదచెఱంగున నొత్తి మొగంబు పుడికి పుడమిపయిం బొరలాడినకతంబున దుమ్మై యైన వలువ పరిహరించి పలుచనినారచీరలు గట్టి కందమూలంబులు నడవికూరలు లఘుతరంబుగా నారగింపం జేసి పూటపూటకు నుపచారంబు లొనరించుచుం బోషింప ననుదినంబును బుణ్యకథాప్రసంగంబులం బ్రొద్దులు గడపం దొమ్మిదినెల లతిక్రమించుటయు సౌమ్యగ్రహంబు లైదు సూర్యునిం గూడక యుచ్చకేంద్రస్థానంబుల వెలుంగుచు నున్న శుభలగ్నంబున జనకపుత్త్రిక యిరువురు కొమరులం గనియె. అప్పుడు దిక్కులు ప్రసన్నంబు లయ్యె. పరిమళమారుతంబులు వీచె. దివ్యదుందుభులు మొరసె. పుష్పవృష్టి గురిసె. అగ్ని ప్రదక్షిణార్చులం గనుపట్టె. అప్పుడు తాపసాంగనల వృత్తాంతం బెఱింగింప వటువులం బనుచుటయు వార "లక్క యమడబిడ్డలం గనియె" నని చెప్పిన వాల్మీకి వేగంబ

వచ్చి సీతాసుతులం జూచి సంతసంబున నుప్పొంగి సూర్యవై శ్వానరతేజస్కులైనకవలకుఁ గుశలవంబులచే నభిమంత్రించి రక్ష యొనర్చి జాతకర్మంబు నిర్వర్తించి కుశలవు లనునామకర ణంబు సేసి పెనిచిన వారలును ననుదినప్రవర్ధమానులై పెరిఁగి కరికలభంబులభంగి నొప్పుటయు, వాచంయమశ్రే ష్ఠుం డైనవాల్మీకి చౌలంబుసేసి యుపనయనమ్ముఁ గావించి య మ్మహోత్సవంబునకుఁ గామధేనువుం దలంచుటయుఁ, దోడనె వచ్చి జీలకఱ్ఱ సన్నబియ్యంపుటన్నంబులరాసులు నోలుపుఁ బప్పులతిప్పలు నేతిదోరువులు పిండివంటలకొండలు కూ రలరాసులు నానవాలకాలువలు పనసరసాలకదళీఖర్జూరాది ఫలసమూహంబులును నిర్మించిన బంగరుపళ్లెరంబుల నునిచి బంతులు సాగించి మునిసతులు వడ్డింప షడ్రసోపేతంబుగా నారగించి మునీంద్రు లాశీర్వాదంబులు గావించి కర్పూర తాంబూలంబులు బహుమానంబులు గైకొని పోవుటయు, సూర్యచంద్రులం బోలెఁ దేజోవిరాజితులైనయక్కుమా రులకు నాలుగువేదంబులు షడంగంబులు నానాపురాణం బులు నాగమంబులు నధికరింపఁ జేసి ధనుర్వేదంబు సాం గంబుగా నేర్పి దివ్యాస్త్రసంధానంబునాకర్షణంబు నుపసం హారంబును లాఘవలక్ష్యశుద్ధిం జిత్రత్వదృఢత్వంబులును దెలియం జేసి సంగీతశాస్త్రంబు సమర్థంబుగాఁ దెలిపి శ్రీమ ద్రామాయణం బుపదేశించుటయు, నేకసంధాగ్రహణం బున గ్రహియించి కుశలవులు వీణయుఁ దాళంబునుం

గైకొని నానారాగంబుల స్వరమైత్రియు విన్యాసవిశేషం బులు నారోహణావరోహణక్రమంబులు లయకాలంబునుం దెలిసి వీనులవిందుగా నమృతంపుసోనలు గురియ నొండిన మ్రాకులు చిగిరింప ఱాళ్లు కరంగ రామాయణంబు గా నంబు సేయుచు మునికుమారులతో నడవులకుం జని కంద మూలఫలంబులు తేనియలు కుసుమంబులు మధురోదకం బులు దెచ్చి యొసంగఁ గొడుకులం జూచి శోకంబు మాని సీతాంగన యాశ్రమంబున సుఖంబుండె.

—* శ్రీరాముఁ డశ్వమేధముచేయ హయంబును విడుచుట. *—

తదనంతరంబ శ్రీరామభద్రుం డయోధ్యానగరంబున రాజ్యపరిపాలనంబుసేయుచు బ్రహ్మకు నాలవమనుమఁ డైన రావణునిం జంపుటవలన నైనబ్రహ్మహత్యాదోషంబు నివా రింపం దలంచి హయమేధంబు సేయుతలంపున ననుజపురో హితమిత్రామాత్యసామంతరాజులు గొలువ నిండోలగం బునం గూర్చుండి వసిష్ఠవామదేవగాలవగార్గేయాదులం జూచి యశ్వమేధంబువలన బ్రహ్మహత్యాదోషంబు తొ లంగు ననుశ్రుతివచనంబు వినంబడుచున్నయది. ఆయా గంబు సేయువిధానంబు సవిస్తరంబుగా నెఱింగింపుఁ డనిన వసిష్ఠుండు "నరేంద్రా! అశ్వమేధంబు సేయుట బహుప్ర యాసంబు. గోక్షీరవర్ణంబైన శరీరంబును గుంగుమంబునుం బలెఁ గెంపుఁజాయ గులుకుకంఠంబును గనకవర్ణంబైనవాలం బును నల్లనిచెవియునుం గలయశ్వంబును శౌర్యనిధు లైనయో

ధులం గూర్చి యథేచ్ఛముగా విహరింప విడువవలయు. విద్యాతపోధను లైన ఋత్విజులు గావలయు. వారలకు నొక్కొక్కనికి నొక్కగజంబు నొక్కయరదంబు నలుగురు కాలుబంట్లు నూఱుగుఱ్ఱంబులు నన్ని ధేనువులు వేయిబారువుల ధనంబు నలుతుము ముత్యాలును దక్షిణలుగా నొసంగందగు. భార్య లేనివారలకు యాగంబున నధికారంబు లేదు. పత్నిసమేతంబుగా దీక్షించి యసిధారావ్రతంబుగా హయమేధంబు నెఱవేర్పవలయు." అనిన విని కులతిలకుండు బంగారుచే సీతారూపంబు గావించి మునులయనుమతి గైకొని యాచెప్పిన లక్షణంబులు గలహయంబును దనలాయంబున వెదకి తెప్పించి విహితదక్షిణ లొసంగి వేవురుఋత్విజులం గూర్చి జాతరూపసీతాసమేతుండై దీక్ష వహించి చామరరత్నకింకిణీచిత్రమాల్య పరిధానగంధకస్తూరికాద్యనులేపనపూజితం బైనవాజినిటలంబున "మిత్రకులాగ్రణియు, దివిజస్తుత్యపరాక్రముండును, వీరమాత యగుకౌసల్యాదేవికిం బుత్రుండు, నైనరఘువీరుండు విడిచిన యాగీయతురంగంబు నుర్వీతలంబులో శౌర్యసాహససమాను లైనరాజకుమారులు గలరేని పట్టి కట్టుం" డని లిఖించిన కాంచనపట్టంబు గట్టి వాద్యఘోషంబులతోఁ బ్రదక్షిణంబు సేసి మ్రొక్కుసమయంబున, నిత్యశత్రుఘ్నుం డైనశత్రుఘ్నుం డక్షౌహిణీత్రయంబుతో వచ్చి యన్నకు మ్రొక్కిన దీవించి కౌఁగిటం గదియించి హయసంరక్షణంబు సేయుము. అష్టదిక్పాల

కులు హరిహరబ్రహ్మాదులు విరోధించిరేనియు నిరోధించి జయంబు సేకొను" మని పంపుటయుఁ, గ్రతుఘోటంబు నిరాఘాటంబుగా నిఖిలదేశంబులు దాఁటిపోవునెడఁ గొందఱు నరేంద్రులెడసొచ్చి తదీయఫాలస్థితం బైన పత్రికం జూచి చేతులు మొగిడ్చి కొలిచి రా నయ్యశ్వంబు వాల్మీక్యాశ్రమ సమీపకాననంబునం బ్రవేశించె.

—* యాగీయాశ్వమునకై లవశత్రుఘ్నులు పోరాడుట. *—

ఆసమయంబున వల్మీకభవుండు వరుణపురంబున యాగంబు సేయించుటకై చనియుండె. అపుడు వేల్పుటేటి తటంబున శ్యామలంబులు కోమలంబులు నైనదూర్వాదళంబులు మేయుచు దర్శనీయం బైనయాగీయహయంబు సంచరింపం జూచినబ్రహ్మచారులును సజ్జీకృతకార్ముకుండై య య్యాశ్రమకాననంబు లేనగలు రక్షించుచుండులవునకుం జూపుటయు నతండును దానినిటలంబునం గట్టినహేమపట్టికను లిఖించిన బిరుదాక్షరంబులు చదివికొని "బళిబళీ! రాఘవునిం గన్నతల్లి కౌసల్య వీరమాత యఁట. కుశలవులం గన్నసీతాంగన గొడ్డువోయెఁ గాఁబోలు" నని పకపక నవ్వి యత్తురంగంబుపయిం దనయుత్తరీయంబు వైచి యీడ్చి తెచ్చి యాశ్రమసమీపంబున నున్నకదళీతరువునం గట్టి వేయుటయు, విప్రకుమారు లతనిం జూచి నిరర్థకవైరంబు లేమిటికి? దీని వెంబడి సైన్యంబు లల్లవె కనుంగొనుము. నావుడు సీతా తనయుండు మునితనయులం జూచి మీకు

రాజధర్మంబు తెలియదు. అని మొనం గినిసి పగఱం బరి
మార్చుట యొండె లేకయున్న సమరహతుండనై కైవల్యంబు
గాంచుటయొండె గాక వేఱె కలదా? యని పలుకునంతలో
నశ్వరక్షకులైనభటవీరులు కొందఱు వేగంబ పఱతెంచి
"యెవ్వండురా! ఘోటకంబుఁ బట్టినదుండగీఁ" డనిన, విని
సీతాకుమారుండు యజ్ఞతురంగంబును బట్టినవాఁడు లవుం
డేమిటికి రిత్త నొచ్చెదరు? పొండు పొం డనిన, నవ్వి యవ్వీ
రులు, బాలకా! పొమ్ము పొ మ్మని యనాదరణంబుగా సైంధ
వబంధమోక్షణంబు సేయ, లవుం డుండుం డనుచు వారల
కరంబులు శరంబులఁ దునియ నేసిన, నబ్బలంబులు మొరయు
ముద్గరచక్రతోమరంబులు ప్రయోగించిన (నతండు) గోదా
వరిలోఁ గ్రుంకినజనుండు పాపంబుల రూపణంచుచందంబు
నం జూర్ణంబులు చేసిన, నవ్వృత్తాంతంబు విని శత్రుఘ్నుండు
తేరుగదియం దోలించిన, లవుండు నిశ్శంకుండై మాహేశ్వ
రాస్త్రంబు వింటం దొడిగి శరపరంపరలచే విపక్షువక్షంబు
గవాక్షంబులుగాఁ జేయుటయు, మూర్ఛఁజెంది లవణాసు
రాంతకుండు క్రమ్మఱం దెలిసి లవునిఫాలతలంబున మూఁడు
వాఁడితూపులు సొనుపుటయుఁ, దామరమొగ్గలు వైచిన
చందంబున నొప్పక నవ్వుచు నయ్యమ్ములు దివిచివైచి కుశా
నుజుండు పినతండ్రిం జూచి రోషభీషణాకారుండై ధనుర్గుణా
రావంబున దిగంతరాళంబులు పగులం జేయుచు నొక్కవిశి
ఖంబునఁ గేతనంబును సూతుని నాలుగుసాయకంబులఁ

జక్రరక్షకుల నన్నియ బాణంబుల రథ్యంబులం ద్రుంచి యొక్కభల్లంబున హృదయంబు భేదించి యార్చుటయు, లక్ష్మణానుజుండు కన్నులం గెంపు గులుక నేయస్త్రంబుచే లవణాసురుం దునిమె నయ్యస్త్రంబు వింట సంధించి "వత్సా! యిది యమోఘం బైన బాణంబు. సంగ్రామంబునకుం దొలంగిపొమ్ము నీమీఁది యంతఃకరణంబునం బలికితి" ననిన సీతాకుమారుండు తన మనంబున మాయన్న కుశుం డుండెనేని యీయస్త్రంబు చూర్ణంబు సేయు; నైనను మాతల్లి యగుసీతాదేవి పాతివ్రత్యధర్మంబువలన నిబ్బాణంబు ఖండించెద నని ప్రతిన సేసి యెదురు నిలిచి శత్రుఘ్నుం డేసిన యస్త్రంబుపై వేఱొక్కయస్త్రంబు ప్రయోగించి ఖండించిన, సగంబు ఖండితం బై పుడమిం బడియె. మిగిలినసగంబు నెగసిచని విల్లు ఖండించి వక్షస్స్థలంబు దూఱి భూమిం గాఁడిన నిశ్చేష్టితుండు రక్తసిక్తాంగుండు నై లవుండు పుడమిం బడిన, భేరీశంఖమృదంగపటహఢక్కారావంబులు చెలంగ సింహనాదంబులు సేయుచు హతశేషు లైనసైనికులు తురంగంబు గొని పోయిన, శౌర్యనిధానుం డైనశత్రుఘ్నుండు కుశానుజుం గాంచి బాణఘాత సంతాపంబు మాన మేనం బొదివి యెత్తికొని యిక్కుమారుండు రాఘవప్రతిబింబంబు కరణి నున్నవాఁడు. అతనికిం జూపవలయు, నని పురంబునకుం దోడ్కొని పోవలయు నని తనువుసం దొరఁగురుధి

రంబులు సలిలపూరంబులం గడిగి రథంబున నబ్బాలు నిడి కొని యఘాశ్వంబేగు దెసకుం జనియె.

—* సీత లవునిఁ దలంచి విచారించుట. *—

అంత నక్కడ భూపుత్త్రి తనయాశ్రమగతంబున, "నక్కటా! లవుం డాఁకొనియొ నీవేళకువచ్చినవాఁడు కాఁ డని శోకంబు నంబొక్కుచునుండ, మునికుమారులు పఱతెంచి "అమ్మా! నీకొడుకు యఘతురంగంబును బట్టి మార్గంబున నరిబలంబులం గనుపుగొట్టి యొక్కమహారథికు నెదిరించిన నతండు విలు ద్రుంచి మూర్ఛ నొందించి పట్టికొని పోవుచు నున్న వాఁ" డనిన మేఘగర్జితంబునకుం భయపడుమరాళబాలిక పోలికఁ దనయునిం బేర్కొని బహువిధంబుల నడలు చునుండం, గుశుం డంతకమున్న మూలఫలంబులు సమి త్కుశపత్త్రపుష్పంబులునుం దెచ్చుటకై వనంబునకుం జనిన యెడ నెడమకన్నదరెం గావున మనంబున భయంబు నొంది తోడనె సమరవిజయసూచకంబు లగునిమిత్తంబులు గను పట్టిన నెద్దియేనియు నొక్కయుద్ధంబును దాన జయంబునుం గలుగు; నని సంభ్రమించుచు వచ్చి ధనంబు గోలుపోయిన చందంబునఁ జిన్నఁబోయినముఖంబుతోఁ జెన్ను దొఱంగి యున్నతల్లికి వందనంబుసేసి 'అమ్మా! నీమనంబున నింత యుమ్మలిక యేమిటికి? లవునిం గాన; నెందుఁబోయె నెఱిం గింపు" మనిన "నెచ్చట నుండియో యధ్వరాశ్వంబు వచ్చినం బట్టి కదళీతరువునం గట్టి పెక్కండ్రు వీరులతోడం

పెనంగి చతురంగంబులు సమయించినయెడ నొక్క పాతకుండు బిడ్డనివిల్లు ఖండించి పట్టుకొనిపోయె నఁట. అతని చేటు పాటు తెలియక పొగిలెద. శాత్రవునిం జయించి యనుజుని మరలించి నాదుఃఖం బార్పు" మనిన "నంబా! శోకంబు మానుము వైరిబలంబులం దునిమి తమ్మునిం దోడ్కొని వచ్చెద. బాణబాణాసనతూణీరచక్రగదాకుంతముసలముద్గరకవచంబులు దీవించి యొసంగు" మనినం "గుమారకా! కుశలంబుతో నిరంకుశంబుగా రిపులం గెలిచి రమ్ము. కుశకుమారకా! యెల్ల దేవతలు నిన్ను రక్షింపుదురు." అని దీవించినఁ దల్లిచరణపద్మంబులకుం బ్రణమిల్లి యాజగదంబ యొసంగినశరశరాసనకవచాదులు గైకొని సన్నాహంబై సమరకౌతూహలంబున భుజంబు లప్పళించుచుఁ గల్పాంతమేఘంబుకరణిం గర్జించుచు గమనవేగంబున వృక్షంబులు వేళ్లతోడం బెల్లగిల్ల శైలంబులు చూర్ణంబుగాఁ బదఘట్టనంబులం బుడమి గడగడ వడంక దిగంతంబులం జీఁకటులు గ్రమ్మ సజ్జీకృతకార్ముకుండును సంధీకృతబాణుండును సంభృతకవచుండును సమరసన్నద్ధుండు నై సరభసంబుగా సింగంపుఁగొదమ తెఱంగున వచ్చునవ్వీరునిం జూచి సైనికులు నిలువంజాలక నలుదిక్కులకుం బఱచిరి.

అంత శత్రుఘ్నుండు చెదరినసైనికులఁ గ్రమ్మఱం బురికొల్పి సారథిం గనుంగొని యుగాంతకాలంబున సంహారోన్ముఖుండై వచ్చుకాలరుద్రునిచందంబున నిక్కుమారుం డస

హేయశూరుండై మనపయి న్వచ్చుచున్నవాఁడు. వీనిం జూచి సైన్యంబులు దైన్యంబు నొంది కలంగంబాఱె. దిశావకాశంబులు ధూళిధూసరితంబు లయ్యె. కాకఘూకకంకగృధ్రంబులు రథికులశిరంబులమీఁద వ్రాలె. ధ్వజపతాకలు పొగయుచున్నయవి. ఉఱుమకయె యశనిపాతంబులు గలిగె. నక్కలు సేనాముఖంబునం బోవం దొడంగె. ఒఱలం గైదువులు దుస్సిన విఱిగి పడియెడు. ఇది మొదలుగాఁ గల విపరీతనిమిత్తంబులు గలిగె. కావున మనము పదిలంబుగాఁ గదనంబు సేయవలయు; నని సేనావాహుం డనుసేనాపతిం జూచి నీదుచాపవిద్యాకౌశలంబున నిక్కమారుఁ జీకాకు పఱిచి వేయుము. చంప వల దని యాజ్ఞాపించుటయుఁ గఱకు మీఱినసేనతోడం గూడ దారసిల్లి ములుకుటమ్ము లనేకంబులుగాఁ గురిసినఁ గుశుండు ప్రతిశరంబుల వెంబడించి సారథితురంగకేతనపతాకాఛత్రచామరబాణబాణాసనసమేతంబుగా రథంబు పొడి సేసి వానిహస్తంబులు మస్తకంబును భేదించి సింహనాదంబు సేసిన, నగుం డనువాఁడు తనయన్నపాటు గనుంగొని దిగ్గజోపమానం బైనగజంబు నెక్కి డీకొలుపుచుఁ గనకఘంటాఘణాఘణితం బైనశక్తిం బ్రయోగించుటయుఁ గుశుండు నైదు విశిఖంబులచే దానిం దునియలు సేసి పెచ్చుపెరుఁగు మచ్చరంబున నాలుగమ్ములు కార్ముకంబునం దొడిగి దంతావళంబు నాలుగుపాదంబులం దెగనేసిన నేనుఁగు పడుటకు మున్న నగుండు భీకరగదా

దండహస్తుండై పుడమికిం దుమికి యెదురు నడుచుటయు, గదాదండమండితం బైనవానిభుజాదండంబు ఖండించిన నతండు వేఱొక్కకరంబునఁ జక్రంబు సారింపుచుఁ జేర వచ్చుటయుఁ గుశుండు క్రూరనారాచంబున నాచక్రంబు తోడంగూడ బాహువు ద్రుంచిన భానునిం బట్టఁ దివురు స్వర్భానునిచందంబునఁ గలియవచ్చుటయు, లవాగ్రజుం డర్ధచంద్రబాణంబున వానిశిరఃకపాలంబు ఖండించిన (దాని) భండనంబునఁ దాండవంబు సలుపుభైరవుండు పానపాత్రంబుగాఁ గైకొనియె. అవ్విధంబున నగుండు పడుటయుఁ, గల గుండుపడి సైన్యంబులు పఱచిన వెనుదగిలి సీతాసుతుండు శతశరంబుల గజతురగస్యందనవీరభటకదంబకంబులఁ జిత్రవధం బొనర్ప, లక్ష్మణానుజుండు వాయువేగంబు లైనయాశుగంబుల నడరించినఁ, గుశుండు క్రోధకషాయితాక్షుండై సన్నతపర్వంబులును గనకపుంఖంబులును గంకపత్రంబులు నైనయంబకంబులు శతసహస్రసంఖ్యలు నిగిడించి రథ్యంబులం జంపి సారథిం గీటడఁగించి కేతనంబు ఖండించి ఛత్రంబు దునుమాడి తేరు చక్కడిచి వక్షస్థలం బగల్చుటయు, శత్రుఘ్నుండు గిరిశిఖరంబుననుండి జాఱి పడినభద్రదంతావళంబు తెఱంగున నేలం బడుటయు, హతశేషంబు లైనసైన్యంబులు దైన్యంబు నొంది నలుదిక్కులకుం బఱచె.

అంతలో లవుండు మూర్ఛ దెప్పిఱి యన్నకడకు వచ్చి మ్రొక్కి తదనుమతంబున యాగీయాశ్వంబు నొక్కమహీ

—* కుశలవులపాటవము రామునకు భటు లెఱింగించుట. *—

రుహంబునం గట్టినఁ బెనుగాలితోడం గూడినకార్చిచ్చుకైవడి సోదరునితోడం గుశుండు రణాంగణనిరంకుశుండై ప్రకాశించె. అంత హతావశిష్టులైనభటులు కొందఱయోధ్యాపురంబునకుం బఱచి హయమేధదీక్షితుండును యజ్ఞవేదికాసమాసీనుండును మునిజనపరివేష్టితుండును భరతలక్ష్మణసేవ్యమానుండును కురంగశృంగపాణియుఁ గృష్ణాజినాంబరధరుండును దండమేఖలాభరణుండును గనకసీతాసమేతుండును దిలసమిదాజ్యహోమధూమారుణలోచనుండు నైనశ్రీరామచంద్రునిం గాంచి ప్రణమిల్లి 'దేవా! నీయధ్వరాశ్వంబు నానాదిక్కులం దిరిగి యడవిలో నొక్కబ్రహ్మచారి యగు బాలకునిచేఁ గదళికాతరువునం గట్టఁ బడియె. అక్కుమారుని యాకారంబు మీయట్ల యున్నయది. వాఁడు మనసేనలం గనుపుగొట్టి మీకూర్మితమ్మునితో నెదిరించి పెద్దయుంబ్రొద్దు కదనంబు గావించి ఖండితకార్ముకుండై మూర్ఛఁ జెంది పట్టువడియె. అనంతరంబ యతనిపోలికగానుండు బాలకుం డొక్కఁడు కవచకార్ముకఖడ్గధరుండై లేడిగుంపులపై దుముకు బెబ్బులింబోలెఁ జేతులు కసి తీఱ సేనలం గసిమసంగి శత్రుఘ్నునిం గూల్చె" ననిన విని రఘువీరుండు "మీకు వెఱ్ఱి పట్టెనో భూతంబు సోఁకెనో? నాతమ్ముండు పగఱచేఁ బడుట యేమి?" యనుటయు "దేవా! నీపదసేవకులకు భ్రమకలుగునే? యీమాట నిక్కం" బనుటయు రామభూమీ

శ్వరుండు మనంబునం గళవళం బందుచు 'నా యెదుట నిలిచి యెన్నఁడు నా యుత్తరం బీయఁడు. లవణాసురుం డాఁకి యొక్కఁడె కయ్యంబునం గెలిచె. ఇట్టినా తమ్ముం డాజిలో నొక్కనడుగున కెదిరింపం జాలక పడియెనఁట! దైవం బెంత సేసె" ననుచు భానుకులతిలకుండు తెప్పల నుప్పతిల్లు బా

—* రాముఁడు సౌమిత్రిని యుద్ధమునకుఁ బంపుట. *—

ష్పంబులు కరపల్లవంబుల నప్పళించుచు లక్ష్మణు దెస మొగం బై "యాగదీక్షితుండ నైన నేను వరలరాదు. కావున హయం బుఁ బట్టిన బాలకులం గెలిచి శత్రుఘ్నునిం దోడ్కొని రమ్ము పొ" మ్మనుటయుఁ బూఁచినతరువులం బోలుపొందు గిరులచం దంబునఁ గనకకేతనసమేతంబులును మదధారాబంధురం బులు నగుసింధురంబులును జలనిధితరంగంబుల తెఱంగున గెరలు తురంగంబులును శరదభ్రవిభ్రమంబులును గల్పిత మనోరథంబులుం బలె నమందశౌర్యవిశంకటు లైనవీరభటు లును బ్రళయభైరవహుంకారశంకారవంబు లైనపటహాభాం కారంబులును మెఱయ రఘువీరునకుం బ్రణామంబు సేసి కల్పాంతకాలంబునం గట్టు దాఁటి మట్టుమీఱిననీరధులం బలె నిరవధికంబు లైనసేనాబృందంబులతో వచ్చి వాల్మీకి వనంబు సొచ్చి రణాంగణంబున విరిసిననీలకేశపాశంబును విధ్వస్తం బైనకవచంబును విఱిగినశరాసనంబును వీడినయుం బపాదులునుం గలిగి ధూళిధూసరితగాత్రుఁ డై పడియున్న శత్రుఘ్నునిం జూచి బాష్పాకులితలోచనుం డై సౌమిత్రి

సమరసముద్యుక్తుం డయ్యె; నని జైమినిమునీంద్రుం డానతిచ్చుటయు, జనమేజయనరేంద్రుండు తదనంతరకథావృత్తాంతశ్రవణకౌతూహలాయత్తచిత్తుం డై యుండె.

ఉ. వారణఘోటవీరభటవర్గనిరర్గళధూళిపాళిసం
పూరితవార్ధి! (ధావి)తరిపుప్రజసాధ్వసహేతుచక్రవా
ళోరుగుహాంతరాళబహుళోజ్జ్వలదోఃపరిఘప్రతాపవి
ద్యారవిమండలప్రకరధామధురా మధురాధినాయకా!

క. ముంగొంగుఁబసిఁడి చెంగటి
బంగరుమల యొద్దియమరపాదప మింటన్
రంగైనకామధేను వ
నంగ నిజాశ్రితులఁ బ్రోచునవ్యకృపాబ్ధీ!

భుజంగప్రయాతము. మదేభేంద్రయానా సమాజాబ్జబాణా
సదానంద (స)న్నీతిశాస్త్రప్రవీణా
ప్రదానాంబుసంపూర్ణఫాలాక్షుతూణా
సదాయత్తవిద్వత్ప్రశస్తప్రఘాణా!

గద్య. ఇది శ్రీపాండ్యమండలాధీశ్వర శ్రీవిజయరంగచొక్కనాథమహీనాథకరుణాకటాక్షసంపాదితగజతురంగమాందోళికాప్రముఖనిఖిలసంపత్పారంపరీసమేధమాన సముఖమీనాక్షినాయకతనూభవ మీనాక్షీదేవీకటాక్షలబ్ధకవితాసాంప్రదాయ వేంకటకృష్ణప్పనాయకప్రణీతం బైనజైమినిభారతంబున నశ్వమేధపర్వమ్మనువచనకావ్యంబునందుఁ దృతీయాశ్వాసము.

శ్రీరస్తు.

జైమినిభారతము.

చతుర్థాశ్వాసము.

క. శ్రీధరచరణాంబురుహా
సాధారణభక్తియుక్త! శరణాగతర
క్షాధౌరేయ వ్రతరఘు
నాథ! విజయరంగచొక్కనాథ మహీశా!

అవధరింపుము జైమినిమునీంద్రుండు జనమేజయ నరేంద్రున కిట్లనియె. అట్లు సమరసన్నద్ధుం డైనసౌమిత్రి నవలోకించి సీతాకుమారుం డైనకుశుండు నిజానుజుం డైన లవు నవలోకించి లెక్కకు మిక్కుటం బైనచతురంగబలం బులతో మహారథుం డెవ్వండో మనమీంద వచ్చె నింకం జేయందగినకార్యం బేమి? యన, లవుం "డన్నా! చెప్పం దగిన దేమియున్నది. శరపరంపరలచేం బరబలంబుల వెం పరలాడి వచ్చెద; నీవును రణంబునకుం దొడంగు" మని పలికి మున్ను శత్రుఘ్నునిచేతం దనధనువు విఱిగిపోవుట కతన నియమపురస్సరంబుగా నిటలంబున నంజలి ఘటి యించి సూర్యు నుద్దేశించి "సవితయుం ద్రిమూర్తిస్వరూపం బును సప్తసప్తియుం జండభానుండును బూషుండును సదా

—* సూర్యుఁడు లవునకు వి ల్లొసంగుట. *—

ప్రకాశుండును జలజమిత్రుండును ఋగ్వేదమయుండును మేషవృషభాద్యధీశ్వరుండును ద్యుమణియు హిరణ్మయుండును భాస్కరుండును గర్మసాక్షియు భవరోగవైద్యుండును భక్తశుభంకరుండును సహస్రకరుండును సురనికరపూజితుండును యతిజనప్రియుండును దివాకరుండును సంవత్సరకరుండును ననూరుసారథియు నంధకారభేదనుండును గిరీటమాలికాధరుండును నిశాకరసహాయుండును జగదాశ్రయుండు నయినసూర్యునకు వందనంబులు సేసెద" నని మంత్రంబు లుచ్చరించుచుఁ బ్రార్థించిన, సూర్యుండు ప్రత్యక్షుండై కనకరేఖావిరాజితంబును దివ్యరత్నఖచితంబును జయప్రదంబు నభేద్యంబును ద్రిభువనభయంకరజ్యానాదమేదురంబును నగునొక్కధనువు దయచేసి దీవించి వేంచేయుటయు, భాస్కరుం డిచ్చినవిల్లు గైకొని లవుం డగ్రజునిం జూచి యాధనుర్మహాత్త్వంబుఁ దెలిపె.

అత్తఱి సీతాకుమారకులు సుమిత్రాకుమారునిం దాఁకుటయు, గజఘటలు తురంగబృందంబులు రథసమూహంబులు భటవ్రాతంబులు లెక్కకు మిక్కుటంబుగాఁ బ్రళయకాలసముద్రంబుకరణి నపారం బైనసైన్యంబుఁ జొచ్చి శరవర్షంబులు వర్షించుటయు, ముహూర్తమాత్రంబులో నొక్కటియునరయోజనంబు దూరంబులోపలం దగిలినసైన్యంబులు తోలుకొత్తలం గీటడంగె; నయ్యద్భుతపరాక్రమంబు సూచి

లక్ష్మణుని సేనాపతి యగు కాలజితుండు పెక్కువేల *భ్రముల తోడం గూడఁ గుశునిం జుట్టుముట్టె. ఇవ్విధంబున సేన లవ రోధించుటయు లవుండు ప్రళయకాలకాలునిచందంబునం గనలుచు ననర్గళమార్గణాసారంబులచే నలువదిభ్రములసైన్యంబులం దెగటార్చి కత్తి కేడెంబును గదయుఁ జక్రంబును బ్రాసంబును సురియయుఁ బట్టసంబును గుంతంబును దోమరంబును శూలంబు మొదలైనకైదువులం బోరిపోరి పగతుర ప్రయోగించినయస్త్రశస్త్రంబులచే జర్జరీభూతంబును రక్తసిక్తంబు నగుగాత్రంబుతోఁ గుశునిం గానక నలుదిక్కులుం జూచుచు నున్నయప్పుడు రుధిరాక్షుం డనురాక్షసుండు లవణాసురునిమేనమామ యగువాఁడు లవణాసురసంహారానంతరంబ శత్రుఘ్నుని శరణుసొచ్చి రాఘవునకు సేవకుం డై వర్తించువాఁడు డెససొచ్చి పరాకుగాఁ జూచుచునుండు లవుని చేతికార్ముకం బొడిసికొని యాకసంబునకుం బఱచె.

—* లవుండు రుధిరాక్షునిఁ జంపుట. *—

అంత నక్కుశానుజుండు చాపంబు లేక చక్రంబు కేలం బూని చక్రపాణిచందంబున గురుకృపాలబ్ధం బైనవాయుమంత్రజపంబువలన గగనంబున కెగసి కొద్దిపక్షిపయిం

* నూఱువేలయేనుంగులు నొక్కయేనుఁగునకు వేయేసిరథంబులు నొక్కరథంబునకు నూఱేసిగుఱ్ఱంబులు నొక్కగుఱ్ఱంబునకు నూర్గురు పదాతులుఁ గూడినసంఖ్య భ్రమి యనం బరఁగు. (ఈభ్రమిలక్షణముగూడ మూలమునందే వ్రాయఁబడియున్నది.)

బాఱు జాతవేదగతెఱంగున దైత్యునిం దఱుముటయు, సైన్యంబులు వెగ్గలంబు లంది బాణరంధ్రంబులవెంబడి గజ కళేబరంబులు సొచ్చి యందుండి యాకాశంబు చూచు వారును, భగ్నంబు లైనరథంబులలోనం జొరఁబడి చప్పుడు సేయ కుండువారును, హయకబంధంబులమీఁదిపక్కెరలు తమమీఁదం ద్రోచుకొని యవల నుండువారును, వీరభట శరీరంబులు మీఁద వైచికొని యరిగలముఱుంగున నణంగి యుండువారును, నై యితం డెవ్వరిమీఁద నుఱుకునో యెవ్వరిశిరంబు ద్రుంచునో యని కళవళపడుచు నుండు నపుడు దశరథరాజుమంత్రి యగుసుమంత్రునికొడుకులు సింహుండును, జంద్రకాలుండును, ధార్మికుండును, మదనుం డును, శత్రుసూదనుండును, శరద్వంతుండును, జితశ్రముం డును, నదుండును, సువేగుండు, నతులుండు, ననువారలు పదుగురు జ్యాఘోషణంబులు భీషణంబులుగా నొకము హూర్తంబునఁ బదిబాణంబు లేసి లవునిచేతిచక్రంబు తుత్తు నుకలు సేసిన, సీతాతనూభవుండు భూతలంబునకు లంఘించి పరిఘాయుధంబులు గేలం గైకొని చిత్రంబుగాఁ ద్రిప్పుచుఁ జిటిక వేసినమాత్రంబులో దశరథరాజమంత్రికుమారు లైన దశమహారథుల గీటడఁగించె. అంతలో మదోద్ధతుం డైన రుధిరాక్షుండు గ్రమ్మఱం బాఱుతెంచి గదాదండంబుచే శిరంబు పగుల నడుచుటయు, లవుండు మూర్ఛ గ్రమ్మి విసం జ్ఞుండై కొంతతడవుండి యంతటం దెలిసి కుంతంబు ద్రిప్పు

చు సర్పంబుపయిం దారుశకుంతాధీశ్వరుండు గరుడుని
తెఱంగున దైత్యునిం జేరి కుత్తుక ద్రుంచి వాఁడు మూర్ఛి
లించి కొనిపోయినచాపంబు గ్రక్కుఱం బుచ్చికొని కడంగు
టయుఁ, బ్రసవానంతరంబున బాలకుని మోహజాలంబుఁ
జుట్టుకొనినతెఱంగునఁ జతురంగబలంబులు సీతాకుమా
రునిం జుట్టుకొనిన, నణంగినచంద్రునిప్పు తనయొద్దిమద్దిచెట్టు
నాద్యంతంబును గాల్చి పేర్చి కాఱడవిం దహించురీతిఁ
బెక్కుభంగుల సేనలం జక్కాడుచు నుండె. అప్పుడు
కుశుండు సింహనాదంబు సేసి లక్ష్మణు నెదుర్కొనిన, నతం

—* కుశలక్ష్మణులయుద్ధము. *—

డైదుతూపులచేఁ బేరురంబు వ్రక్కలించిన, సుక్కక యక్కు
మారుండు వాయవ్యాస్త్రంబు సంధించి నిలు నిలు మని
యదల్చి యేయుటయు, లక్ష్మణునియరదంబు సుడిగాలిలోనం
దవిలి కుమ్మరసారెగతి ముహూర్తమాత్రంబు తిరుగుచు
నుండఁ దద్వేగంబున నాలుగురథ్యంబులు నాలుగుదిక్కులం
బడి పంచత్వంబు నొందిన, లక్ష్మణుండు వేఱొక్కతేరెక్కి
కక్కసంబు లైనయుక్కుటలుగు లైదు ప్రయోగించి కుశుని
కవచంబును గిరీటంబును దునుముటయుఁ, గుబుసంబు వీడిన
నాగేంద్రునితెఱంగున మెఱయుచు లక్ష్మణు నుద్దేశించి
"రిత్తమోపుగా నున్నకిరీటకవచంబులు తీయించి భారంబు
మాన్పిననీవు పరమోపకారివి. నీసైన్యభారం బంతయుఁ
బోనం జేసి ప్రత్యుపకారంబు సేసెద' నని పలుకుచు నాథ

ర్వణశిరోమంత్రంబుల నాగ్నేయాస్త్రంబు నభిమంత్రించి ప్రయోగించుటయు, దగ్ధంబు లైనరథంబులును మండెడు నేనుంగులును గాలెడుతురంగంబులును నివుఱు లైనపదాతివర్గంబులును బొగలతోడం గలసి యెగసినఛత్త్రచామరాభరణంబులునుం గలిగి చమూసమూహంబులు దావానలంబులోఁ దవిలినమెకంబులరకంబున నలుదిక్కులకుం బఱచుటయు, దాశరథి వారుణాస్త్రంబున నివారణం బొనరించినం, గుశుండు వాయవ్యాస్త్రంబు వింట నొంటించి చాపవిద్యాకౌశలంబు మెఱయ నేయుటయుఁ, జండమారుతవేగంబునఁ బండుటాకు లెగయువడువున నాయోధనంబునం గలయాయోధనరు లాకసంబున కెగసి వీరలక్ష్మి విహరించుమణిమండపంబునకు మంజిష్ఠపట్టుమేలుకట్టు లెఱంగునం గనుపట్టుటయు, సేనలదురవస్థ గనుంగొని సేనాధీశ్వరుం డగుకాలజిత్తు కుఱుచకనుపులకోరికోలచేఁ గుశునురంబు నాటించి నవ్వుచు "నాబలపరాక్రమంబు లెఱుంగవు. బాలుండవు. నీ కేల యాలంబు? తొలంగు" మని పలుకునంతలోఁ గుశుం డలుక దొలఁక నొక్కవాలికతూపుచే వానినాలిక ద్రుంచి తోడన మహోగ్రనారాచంబున శిరంబు ఖండించె.

—* లక్ష్మణుండు మూర్ఛితుం డగుట. *—

అంతఁ గాలజిత్తుపాటు గనుంగొని సౌమిత్రి వేలకొలందు లాశుగంబులు నిగిడించిన నక్కుమారుం డన్నియుం

జూర్ణంబులు సేసి చక్రంబు వైచిన ఖండించి, శూలంబు ప్రయోగించినం ద్రుంచి, ముసలంబు విసరినం గసిమసంగి, భిందివాలంబు నిగిడించినం దునుమాడి, వాలును బలుక యుం బూనినఁ జిద్రుపలు సేసి, యెన్నికైదువు లెత్తిన నన్ని యు నఱికి, వాల్మీకి యొసంగినయైదుబాణంబులు గార్ముకం బునం గూర్చి యార్చుచు వైచిన, ఱెక్కలతోడి పెనుబాము లుంబలెఁ బఱతెంచి యురస్థలంబునం దూఱుటయు స్వల్ప కిరణంబులతో నస్తమించుసర్కబింబంబునుంబలె లక్ష్మణుండు రుధిరధారాభిషిక్తుండై పుడమిపయిం బడినఁ, గుశుండు కర వాలంబు పలుకయుం గైకొని, కరినికరంబుల నుఱికి, యిం ద్రుండు వజ్రధారచేఁ గులగిరులం గూల్చుచందంబునం గూల్చి, రణాంగణంబు బయలుపఱిచి తమ్మునిం గాంచి యిరువురుం గూడి చిచ్చుఁ గరువలియుం గలిసినట్లు సైన్యంబు నిరవశేషంబుగాఁ జలపట్టి మట్టంబు సేసి హర్షం బున నాశ్రమంబునకుం జనుదెంచిరి.

అంతకమున్న గంగాతీరంబున యాగశాలలో దీక్షఁ బూని వసిష్ఠాదిమునులతోఁ గూర్చున్నరఘూద్వహుండు భరతునిం జూచి 'అనఘా! శత్రుఘ్ను ననిలోనం గూల్చిన హయచోరకునిఁ ద్రుంచి లక్ష్మణుం డిదివఱకు నేమిటికి రాఁ డయ్యెనో! ఏవీరుండు విరోధించినయెడ ముల్లోకంబులు నొక్కమొత్తంబుగా నెత్తివచ్చిన నెదిరింపం జాల; వట్టిసుమి త్రతోలుపట్టితోఁ జలపట్టి పోరువారలుం గలరె! బుద్ధి తెలి

యక యత్తురంగంబుఁ బట్టినబాలకులు చలంబునం బోరి దురంబునం గూలిరో! కాక వారలతల్లి శోకంబునం బొగులుచుఁ బుత్రభిక్ష వేఁడికొనియెనో! యాగంబు నుపక్రమింప నింక మూఁడుదినంబు లున్నయది. నన్నును సుగ్రీవ విభీషణాదులను దలంపక లక్ష్మణుబాహుశౌర్యంబు నూహింపక సాహసంబున నాడింభకు లిట్టిదుండగంబులు సేయం దగునె! అచ్చటి వృత్తాంతంబు తెలియలేదు. వేగవంతులు బుద్ధిమంతులు నైన వేగరులం బంపి శీఘ్రంబుగా నచ్చటివార్త జెప్పింపు" మనుటయు భరతుండు లావు వెరవునుం గలదూతల నేవురం బయనంబుసేసి సముఖంబునకుం దోడితెచ్చిన, రాజేంద్రుండు చారుల నుపలక్షించి "బాలకులు నేరక యపరాధంబు సేసిరి, గావున వారల కభయం బొసంగి తోడ్కొని రమ్మనుఁడు. కాక చలపాదితనంబునం బోరి రేని సమ్మోహనాస్త్రంబున మోహింపఁ జేసి యిచ్చటికిం బట్టికొని తెమ్మనుఁడు. ఆచిన్నబాలకులు నన్నుం బోలియున్నారని వేగరులచే వింటి; నదియునుంగాక సీతముఖలక్షణంబు లవ్వటువుల మొగంబులం గల వని వింటిని. మీరును గలయం జూచి తెలిసి యడవి నేలతిరిగెదరు? మీయంబ పేరేమి? యని తెలియ నడిగి సౌమిత్రిం గూర్చు

—* సౌమిత్రిం గూర్చి రాముఁడు దుఃఖించుట. *—

కొని వారలం దోడ్కొని రం" డని పలుకుచునుండునంతలో గాయంబులం దొరఁగునెత్తురులు వెల్లువలు గట్ట హతశేష

సైనికులు పఱతెంచి దీక్షితుం డైనరామునిపాదంబుల వ్రాలి "ఓరఘుకులావతంసా! శత్రుఘ్నునిచందంబున లక్ష్ణుండును కుశునినిశితవిశిఖంబులఁ బంచత్వంబు నొందె. సమరతలంబునం గాలజిత్తుండును సుమంత్రునికుమారులు పదుగురును సౌమిత్రికన్న మున్న కుశునిసాయకంబులచే రక్తధారలు గుబులుకొన గైరికధారారంజితంబు లైనశైలంబులమాడ్కిఁ బూచినమోదుగులకైవడి జగతీతలంబునం గూలిరి. కోపావేశంబుఁ జూచునెడలం గుశుం డిచ్చటికిఁ వచ్చువాఁ డని తోఁచుచున్నయది. ఇంక నేటియాగంబు! ఆహవంబునకు నాయత్తంబుగ విచ్చేయుఁడు. చిచ్చంటికొనినపిమ్మటఁ జేటలం గ్రమ్మ శక్యంబు గాదు. తగినయుపాయం బిప్పుడు చేయవలయు" నని పలికినపలుకు లాలకించి రఘువీరుండు వెన్ను విఱిగినచందంబునఁ బరశుఖండితం బైనభూజంబుపోలిక మూర్ఛితుం డై భరతునిసమీపంబునఁ బడుటయు, నతండు విన్ననై యున్నయన్న నీక్షించి హిమాంబుపూరంబులచేఁ గన్ను లొత్తి కర్ణంబులం గంబు రాదుమారంబు లూఁది శైత్యోపచారంబులొనర్చుటయుఁ, బెద్దయుం బ్రొద్దునకు నొక్కింత తెప్పిఱి కాకుత్థ్సుండు జలధరగంభీరస్వనంబున వావిడిచి యేడ్చుచు 'నకటా! పదునాలుగేం డ్లాహారనిద్రలు మాని పెక్కుభంగుల నన్నుం గాపాడి దేవదానవు లాశ్చర్యంబు నొందు సమరంబున నింద్రజిత్తుం ద్రుంచి మహారథశ్రేష్ఠుండును గార్తవీర్యునికన్న

మిన్న యని పొగడఁ దగిననిన్ను మాణవకమాత్రుం డెట్లు నిర్జించె! మహావీరా! హా ప్రియానుజా! హా సుమిత్రాపుత్రా! నీవు లేనిజన్మం బేల! ఈరాజ్యం బేమిటికి! ప్రాణంబు వలనం బ్రయోజనం బేమి! తమ్ముల నెడఁబాసి యుండం జాల. వారలసమీపంబునకుం జనియెద. కార్ముకంబు న స్త్రంబులుం దెమ్ము తమ్ముఁడా! తామసంబు సేయవల' దని పలికిన, గేలు మొగిచి భరతుండు "దేవా! సంగ్రామరంగంబున భయభ్రాంతులై చారులు పఱతెంచి విన్నవించినగతిం దోఁచుచున్నయది గాని యిమ్మాట నిక్కంబు గాదు. లక్ష్మణశత్రుఘ్నులు మూర్ఛం బొందిరి గాఁబోలు! అమ్మహాభుజులకు మరణం బెక్కడిది! ఏను వారలకు సహాయంబుగాఁ జని దేవరప్రతాపాతిశయంబుచేఁ దురంగచోరకులం బట్టి బంధించికొని యశ్వంబునుం దెచ్చెద. నన్నుం బనుపు" మనిన, నినకులతిలకుండు నీకుం దోడుగాఁ బేరుగల వానరవీరులం బనిచెద. సుగ్రీవుండు విభీషణుండు నిరువుర మాయొద్ద నుండనిమ్ము. నరవానరరాక్షసబలసమన్వితుండ వై కదనంబునకుం జను మనియె.

—* భరతాదులు యుద్ధమునకు వచ్చుట. *—

అంత భరతుండు రఘుపతికిం బ్రణమిల్లి ధనుర్బాణతూణీరకవచశిరస్త్రాణంబులు ధరియించి రథం బెక్కి సేనాసమేతంబుగా వెడలె. అప్పుడు కైకేయీపుత్త్రుండు పవననందనుం బిలిచి నీవు ముందఱం జని సుమిత్రాతనయులచెం

వంబు తెలిసి రమ్మని పంచినం, బఱచి హనుమతుండు వార
లం గని తనసందిటం బొదివికొని వచ్చి భరతునిసన్నిధిం
బెట్టి కుశవిశిఖసంఘట్టనంబులం గడు నొచ్చిపడియున్న
లక్ష్మణుం జూచితె! ఇతండు తొలుత నింద్రజిత్తునియస్త్రం
బుల నింత నొప్పం, డని పలికిన హనుమంతునిపలుకులు
విని భరతుండు శోకవ్యాకులమానసుం డై యివ్వీరుల నింత
పరిభవించినవారలు బృందారకులు గాని దారకులు గా రని
యయ్యిరువురం దనయరదంబున నునిచికొని వచ్చుచున్నం
తలో, సైనికవీరులసింహనాదంబులు నట్టహాసంబులు పటహ
భాంకారంబులు నాలకించి కుశుండు కోపవశుం డై కోదండ
మౌర్వీఘంటారవంబులు సెలంగ నెదురు నడుచుసమయం
బున, వారలయుద్ధంబు చూడ శక్యంబు గా దనుభంగి సూ
ర్యుం డస్తమించె. పక్షికులంబులు కలకలంబులు సేయుచు
గూండ్లకు బారులు దీరె. మృగంబులు పల్వలంబుల నుద
కంబులు గ్రోలుటకు వెడలె. కాటుకరాసులకరణిం జీక
టులు దిక్కుటాహంబులం గప్పె. అప్పు డొకరొకరిమొ
గంబు గాననియంధకారంబున భరతసైన్యంబులు కుశల
వులం జుట్టుముట్టి గదాకుంతముసలతోమరముద్గరభిండివాల
క్షురికాదిసాధనంబులు వర్షించిన, లవుండు నన్నకు సహా
యంబుగా బాలభానుకిరణప్రకాశంబు లైననారసంబులు
ప్రయోగించి తిమిరంబులు విరియించుచు వాఁడిగోల్తలిచేఁ
గాత్రంబులు నఱికినకరణి ఖడ్గంబుచే నంతనంతంబులు తెగ

వ్రేయునప్పుడు మిణుంగురులు పుడమికి మింటికి నొక్కటిగా నెగసి దళంబుల దహింపం దొడంగె. కుశుండును గార్ముకజ్యానాదంబు రోదసీకుహరంబునం బర్వ జ్వలింపఁగలక్రోధానలంబునకు సూచకంబుగా ధూమరేఖ పర్వ ననంబోలుచు భ్రుకుటీమండలంబు ముఖచంద్రమండలంబునకు నలంకారంబుగాఁ జండమార్తాండకిరణంబులం గ్రేణి సేయుచు బాణంబులు నపారంబుగాఁ గురియుచు సైన్యంబు దైన్యంబు నొందించిన, వారింప శక్యంబు గాక చింతించు నవసరంబున హనుమంతుండు రామానుజునిం జూచి, వీరల యాకారంబులు రామునియట్ల యున్నయవి గావున సీతాతనూభవులు గావలయు. కాదేని యాదికూర్మంబునకు శేషునకు దిగ్గజంబులకుఁ గులాచలంబులకు భారంబు దోఁచు నట్లుగాఁ బీనుంగుపెంటలు సేసి బలంబులం దునుముట యెట్లని పలుకుచునుండఁ, గుశుండు లవునిం జూచి వీరలు పొంచుతెఱంగు గనుంగొనిన యుద్ధసరణిగాఁ దోఁచలేదు మ్రుచ్చులవలెఁ గనఁబడుచున్నవారు. నీవు హయంబు నేమఱక యుండుము. సైన్యంబుల నెల్ల నే నుక్కణఁగించెద; నని పలికి భరతున కభిముఖుండై నీసోదరులు పడినచోటికి నిన్ను దైవంబు దెచ్చె. లవాగ్రజునిముందఱం బడి యెందుఁ బోఁగల వని కైకేయీనందను నేడుకాండంబుల సుషేణు నన్నియతూపుల నంగదుని వేయిబాణంబుల నాంజనేయుని నూఱుసాయకంబుల నీలుని నేనూఱుమెఱుంగు

టమ్ముల గవయు నిన్నూఱుశరంబులఁ బననుఁ దొంబదినారసంబులఁ గుముదుని నన్నూఱుప్రదరంబుల జాంబవంతుని మూఁడువేలకంకపత్త్రంబుల నొప్పించి, హతుల మూర్ఛితులఁ బరాజితులం జేసి సింహనాదంబు సేయుటయు, దేవతలు పుష్పవర్షంబులు గురియించిరి. ఘోరతరం బైనసీతాకుమారునిసమరంబుఁ జూచు వేడుకచేఁ బొడవుగా నెక్కెనో యనఁ బొడువుగుబ్బలియుత్తమాంగంబునకు మణిమయకిరీటంబుకరణిం బ్రకాశించుచు మార్తాండమండలంబు తూర్పుదెసఁ జూపట్టె.

అప్పుడు భరతునిశాసనంబునఁ జతురంగబలంబు లొక్కమొగిం జుట్టుముట్టిన, లవుం డాబలంబుల విరియించి యాఱునారసంబుల భరతునికోదండంబు ఖండించినం, గుశుండుగ్రమార్గణాసారంబు లనర్గళంబుగాఁ బ్రయోగించిన, భరతుండు మూర్ఛితుం డై యరదంబుమీఁద నొఱగంబడుటయు మారుతకుమారుండు కట్టలుకం బెట్టుగా నట్టహాసంబు సేసి యొక్కమహీధరంబు పెకలించి వైచుటయు, దానిశకలంబులు సేసి కుశుండు బలప్రకరంబులు వికలంబులుగాఁ

—* భరతుఁడు మూర్ఛిల్లుట విని రాముఁ డరుదెంచుట. *—

బరిమార్చుటయు, హతశేషులు పఱతెంచి తద్వృత్తాంతంబు శ్రీరామభద్రునితోఁ దెలియంజెప్పిన, నమ్మహారథుండు విభీషణసుగ్రీవులతోడంగూడఁ జతురంగబలసమేతంబుగా నరుగుదెంచి యాహవరంగంబున సాహసధురీణులు సౌందర్య

రేఖాలంకృతులును శరచాపతూణీరధరులును నంగజప్రతి
మానులు నాత్మప్రతిబింబంబులు నైనయర్భకులం గనుంగొని
"మీకు జాతకర్మనామకరణాదు లెవ్వరు గావించిరి? ధను
ర్వేదం బెవ్వరిచే నభ్యసించితిరి? యుద్ధకౌశలం బెవ్వరు
నేర్పిరి? మీకుం దలిదండ్రు లెవ్వరు? ఎఱింగింపుం" డను
టయు లవాగ్రజుండు "సమరంబునకు వచ్చి మాపుట్టుపూ
ర్వంబు లేల యడిగెదరు? మీ తేటమాటలకు లోఁబడి వా
యంబు నిచ్చువారము గాము. అయిన మీయంతవార
లడిగినఁ జెప్పకుండుటయుం దగవు గాదు. మాకు జాత
కర్మంబు నామకరణంబుఁ జౌలంబు నుపనయనంబును వేద
శాస్త్రరహస్యంబులు విలువిద్యయు దివ్యాస్త్రసంపదయు
గదాఖడ్గకుంతతోమరాద్యాయుధనైపుణంబును, నఖిలపాప
హారంబును సకలమనోరథసాధనంబును గైవల్యప్రదంబును
నైనశ్రీరామాయణంబును, వాల్మీకిమునీంద్రుండు నిర్వ్యాజ
కృపాకటాక్షంబున నెఱింగించె. మాతల్లి సీతాదేవి యిక్కా
నలో మమ్ముఁ గాంచె; నని సీతానామస్మరణంబు సేయు
టయు, రఘునాథుండు రథంబుమీఁద నొఱగి ముహూర్త
మాత్రంబునకుఁ దెలివి సెంది సుగ్రీవునిం జూచి వీర లెవ్వరు
తెలియంజూడు మనిన, నినసందనుం డిక్కుమారులు పురా
ణపూరుషునిపోలికి నున్నారు. మీకుమారు లగుటకు సంది
యంబు లేదు. కాకున్న నిట్టిశౌర్యధైర్యసాహసంబులు
వుట్టునె? యని పలుకుచుండునంతలో నీలుం డొక్కమహా

శైలంబు పెకలించి వైచుటయు వార లన్నగంబు చూర్ణంబు సేసి కాలానలశిఖాసంకాశం బైనశరం బరిఁబోసి యేసిన నీలుండు గూలె. తోడన తద్రక్తబిందువు లెన్ని గల వన్నియు నీలు రై మార్కొనుటయు జానకీకుమారుం డందఱ నన్నిశరంబుల రూపుమాపి నరవానరరాక్షససైన్యంబుల నానాశస్త్రాస్త్రజాలంబులం గుదులుగ్రుచ్చిన, రాఘవుండు భ్రాతృజనులపాటును సైనికులచేటు నక్కుమారులపోటునుం జూచి హాలాహలకీలాకరాళంబు లైనమెఱుంగుటమ్ములు వింట సంధించి ప్రయోగించిన నది యక్కుమారులపయిం దాఁకక కేడించి చనుటయు, రఘువీరుండు మరల దివ్యబాణంబు లనేకంబు లేసినఁ, గవలు వాని నన్నింటి నాలుగేసి తునుకలు గావించిన రాఘవుండు వారలకరలాఘవంబు తనకు సమానం బని తెలిసి యుద్ధంబు సేయ నొల్లక యూరక యుండినం గుశుండు నిశితవిశిఖంబులచే మర్మంబులు

—* శ్రీరాముఁడు మూర్ఛిల్లుట. *—

నొప్పించిన మరణసమానం బైనమూర్ఛ నొంది రథంబుపై నొఱగంబడుటయు లవుండు లాఘవంబున నయ్యరదంబునకుఱికి యతనిం బొరలించి కిరీటకుండలహారకేయూరకటకాంగదాదిభూషణంబులును బీతాంబరంబు నొడిసికొని భరతలక్ష్మణశత్రుఘ్నులభూషణాంబరాదులు గైకొని రఘువీరుని ధరాతలంబున దొర్లించి యాదివ్యరథంబుపై నధివసించి యన్నయుం దమ్ముండునుం బోవునెడ నొక్కచోట

మిక్కుటమ్ము లైనయుక్కుటమ్ములచేఁ జాల నొచ్చి పడియున్న జాంబవంతుని హనుమంతునిం జూచి లవుండు నవ్వుచు మనయమ్మకు ముదంబుగా నీభల్లూకంబును వానరంబునుం గొనిపోవుద మని పలికిన నాంజనేయుండు భల్లూకవల్లభుం జూచి మెల్లన "కంటివే రామలక్ష్మణభరతశత్రుఘ్నులదురవస్థ! మనమెంతవారము! బ్రహ్మాదులకేనియు శుభాశుభంబులనుభవింపక తీరదు. వీరలం గికురువెట్టి పోవుద మంటిమేని లవుండు మిక్కిలి మొక్కలీఁడు. కావున మనకుఁ బ్రాణహాని యగుం గాని ప్రయోజనంబు లేదు. దైవానుకూల్యంబును జాలదు. జీవంబు లుండిన వలసినశుభంబులు పడయవచ్చు. పట్టుకొనిపోయినం బోవని" యని యూరకుండుటయు, బాలభానుప్రభాభాసమానంబును సముజ్జ్వలకేతనంబును సమీరసంచలత్పతాకంబును దివ్యసైంధవబంధురంబును నవరత్నఖచితంబును జలధరగంభీరస్వనంబును వాయువేగంబు నైన దాశరథిరథంబున జాంబవంతు హనుమంతునిం దీవియలఁ గట్టి యీడ్చికొంచి పర్ణశాలకుం జని యెదురుసూచుచున్న తల్లికి మ్రొక్కి "అమ్మా! నీకు వేడుకగా నీభల్లూకంబును వానరంబునుం బట్టికొని వచ్చితి మని ముందరం బెట్టి రామలక్ష్మణులు మొదలగు నన్నలువు రన్నదమ్ములపాటును విన్నవించుటయు జానకీదేవి విస్మయాక్రాంత యై "రఘువీరుని మీరలు జయించుట జంకపిల్లలు సింహంబును జయించిన తెఱంగుగా నున్నది. దీని నమ్మఁ గూడదు. అయి

నను దైవయోగంబు బెవ్వరికి నెఱుంగనగు! అక్కటా! యే నజ్ఞాతవాసంబు సేయుచు నాయునికి యొరు లెఱుంగ కుండఁగఁ దపంబు సేయుచు నుంటి. నన్ను బయలుపఱిచి తిరి", అని లవునిం జూచి వాల్మీకి యిచ్చటికి రాకము న్నె యభిమానధను లైనఋూజాంబవంతు హనుమంతుని నచ్చ టనే విడిచి ర" మ్మనుటయు నతం డట్ల కావించె.

—* వాల్మీకి శ్రీరామాదుల మూర్ఛదేర్చుట. *—

అంత నారదునలన నావృత్తాంతం బంతయు నెఱింగి వరుణలోకంబుననుండి వాల్మీకి సత్వరంబుగా నిజతపోవనం బునకు వచ్చి యాశ్రమద్వారంబున మూర్తిమంతంబు లైన దివ్యాస్త్రమంత్రంబులకైవడి నతులతేజోవిరాజమాను లైన జానకీసుతులం గాంచి దీవించి కౌఁగిలించికొని "మీకుఁ గయ్యంబు సంఘటిల్లె నని వింటి. రాఘవులదివ్యాస్త్రఘా తంబులచే గాయంబులు లేవు గదా!" యని పాణితలంబున మేనులు నిమురుచు "మీకేల యాలం బయ్యె? సవిస్తరం బుగా నెఱింగింపుఁ" డనినం గుశుండు హయంబుఁ బట్టుట యును, సౌమిత్రిభరతశత్రుఘ్నులపాటును, నరవానరరాక్షస వధంబును, రామవిభునినిధనంబునుం దెలిపిన, విని వాల్మీకి "యక్కటా! యిట్లు చేయుదురే! ఏమియు నెఱుంగని బాల కులు మీర" లని పలుకుచు రక్తమాంసమేదోమస్తిష్కమ యంబును భూతబేతాళపిశాచసంకులంబు నై దానవమాన వవానరదేహఖండంబులచేతం గనుపట్టుచు ఘోరతరం బైన

రణాంగణంబునకుం జని రఘువీరుల నలువురం జూచి కమండలూదకంబు కరంబునం గొని యభిమంత్రించి చల్లుటయు, వారలు సుఖనిద్రం జెంది మేల్కాంచిన తెఱంగున మూర్ఛలు దొఱంగి యుదయార్కబింబంబులచందంబునం బ్రకాశించుటయు, దివ్యదుందుభిధ్వానంబులు నప్సరోనాట్యంబులుం బుష్పవృష్టియుం గలిగె. దేవత లమృతవర్షంబు వర్షించుటచే నరవానరయాతుధానబలంబు లన్నియు నెప్పటియట్ల బ్రదికె. అంత మునిజనసేవ్యమానుం డైనవాల్మీకి మహామునికి రాఘవుండు తమ్ములుం దాను నమస్కారంబు

—* వాల్మీకి రాముని స్తుతించుట. *—

గావించిన నత్తపోధనుం డాశీర్వాదంబు సేసి "మహాత్మా! నీవు జగన్నాయకుండవు, సృష్టిస్థితిసంహారంబులు నీలీలావిహారంబులు; కులాలుండు చిఱుతకలశంబులు, గరగలు, కటాహంబులుం జేసినకరణి నీవు కొందఱ నధికులను గొందఱ నల్పులనుం గా సృజియించినాఁడవు; నీవు శ్రీమన్నారాయణుండవు; సీతాదేవి శ్రీమహాలక్ష్మి; మీలీలావినోదంబులు వేదసన్నుతంబులు; కొడుకు లెఱుంగక తప్పు సేసినం దండ్రి సహింపవలయుం గాని నిగ్రహింపఁజనదు. పుత్రులశౌర్యంబును దేజంబును విద్యయు జనకులకు సంతోషకరంబులు గదా! అతిబాల్యంబునఁ దాటకఁ బధించి హరునికోదండంబు ఖండించి భార్గవుగర్వంబు మాన్పి విరాధు వధించి ఖరదూషణమారీచకబంధాదులఁ దెగటార్చి వాలి నొక్క

కోలం గూల్చి లవణజలనిధిం బంధించి రావణకుంభకర్ణ ప్రముఖనిఖిలరాక్షససంఘంబుల నంతంబు నొందించి బ్రహ్మ రుద్రాదులు నుతింపఁ జటిలప్రతాపదీపితుండ వైననీయెదుటఁ బద్ధగర్వాదు లైన నిలువం జాల రనినయెడఁ జెక్కుగీఁటిన నేడువ నేరరు; ఉగ్రుద్రావుప్రాయంపుశిశువు లెదిరింపం జాలుదురె! నేను బాతాళంబునకు వరుణుని యాగంబు నెఱవేర్పం బోయియుండుటకతన నీతనూభవులు ని న్నెఱుంగనికతంబున నింత యపఖ్యాతి సంభవించె."

అనిన విని శ్రీరామచంద్రుండు సంతుష్టాంతరంగుం డై యబ్బాలకులం జూడనలెఁ బిలిపింపుం డనుటయు, వల్మీకసంభవుండు శిష్యులం బనిచి పిలిపించినఁ గుశలవులు గవదొనలు బిగియించి ఖడ్గంబులు వట్టి శరచాపంబులు వీణియలుం బూని వచ్చి గురుసమక్షంబున నిల్చి నమస్కరించి తదనుమతంబునఁ బంచపాతకహరంబును గాయత్రీమయంబును భుక్తిముక్తిఫలప్రదంబును సీతాచరిత్రంబును బవిత్రంబు నైనశ్రీరామాయణంబు నానారాగంబుల వర్ణవిన్యాసవిశేషంబులఁ దానమానంబులం దుంబురునారదులకరణి గానంబు సేయుటయు, రఘువంశాగ్రగణ్యుండు వారలం బునఃపునరాలింగనంబులు సేయుచు సీతావియోగసంతాపంబు మాని హర్షబాష్పంబులు గురియ గద్గదకంఠంబున సౌమిత్రితో "వీరలముఖసౌందర్యం బవయవసౌకుమార్యంబుఁ జూచిన జానకియట్ల యున్నయది కంటివే!" యనుట యు,

సౌమిత్రి "మిత్రకులాగ్రణీ! నీశాసనంబున నిర్భరగర్భపరిపూర్ణ యైనజానకీదేవిం గాఱడవిలోన నిర్దయత్వంబున విడిచి వచ్చిన నయ్యవ్వ యప్పుడే మూర్ఛిల్లి పంచత్వంబు నొందిన ట్లుండె" ననుటయు, వాల్మీకి "రఘునందనా! ఆసమయంబున నేను యాగయూపదారుహరణార్థంబుగా నావనంబునకుం జని యబలావిలాపంబు నాలకించి చేరం జని శోకాక్రాంతయు ధూళిధూసరితకేశభారవివర్ణవదనయు నైన వధూమణిం గనుంగొని నీ వెవ్వరిదానవు? ఏల శోకించెదవనిన, "నేను జనకరాజతనూజను (1)రఘూద్వహుం డను మద్భర్త లోకాపవాదనిమిత్తంబుగా నన్ను నడవులం ద్రోయించె" ననిన నూఱడించి యాశ్రమంబునకుం గొనిపోయి తపస్వినుల నియమించుటయు, వారలు గర్భసంరక్షణంబు సేయుచునుండఁ గతిపయదినంబులకు నొక్కశుభలగ్నంబున నిక్కుమారులం గనిన, నేను జాతకర్మాదివిధానంబు లాచరించి వేదవేదాంగంబులు ధనుర్వేదంబు చాపవిద్యాకౌశలంబును శ్రీమద్రామాయణంబును నేర్పితి;" ననిన రాఘవుండు "మహాత్మా! నీకృప యెవ్వరియందుఁ గలిగె వారలు కృతకృత్యు లై నీయనుగ్రహంబున నభివృద్ధిం బొందుదురు. మాపోఁటులం బేర్కొన నేల" యనియె. అప్పుడు వాల్మీకి

—* శ్రీరాముఁడు పుత్త్రులం గొని యయోధ్యకుఁ జనుట. *—

యర్భకులం జూచి కనుసన్న సేయుటయు వారలు తండ్రి పాదంబులకు మ్రొక్కి దండప్రణామంబులు గావించి "య

జ్ఞానులము, అపరాధులము, ఊహాపోహాపరిజ్ఞానంబు లెఱుఁగని మూఢబుద్ధులము, ఆత్మద్రోహులము మమ్ముం గటాక్షింపుము! మేము వైదేహీనందనులము.” అనిపలికి వెండియుం దండప్రణామంబు సేసి లేవకుండిన, శ్రీరామభద్రుండు కరుణాకలితహృదయుం డై తనదీర్ఘభుజంబులచే వారల లేవ నెత్తి, శిరంబులు మూర్కొని, యంకంబున నునిచి, సంతసంబున మన్నించి యధ్వరాశ్వంబుఁ దోడ్కొని సేనాసమేతంబుగా నయోధ్యకు వచ్చి వాల్మీకి నవలోకించి, సభామధ్యంబున ని ట్లనియె. “మునీంద్రా! నీపుత్రిక యగుసీత పరమసాధ్వి. నాఁడు దేవతలు రాక్షసులు వానరులుం జూడ నగ్నిప్రవేశంబు సేసె. అది ప్రజ లెఱుంగరు. కావున సందియంబు నొందెదరు. వీరలసందేహనివృత్తి సేయం గోరెద. ధరిత్రీనందినిం బిలిపింపు మనిన మహర్షివర్యుండు నిజాశ్రమంబునకు వచ్చి యందుఁ దపఃకృశశరీరయు వికీర్ణవేణికాభారయు బాష్పాకులితనేత్రయు నైనజనకపుత్రికం గాంచిన, నద్దేవి మునీంద్రునిపాదంబుల కెఱఁగి “ మహాత్మా! నాతనయు లెచ్చట నున్నారు? శాత్రవులబారిం బడిరో? పతి నెడఁబాయుటయుం గాక పుత్రశోకంబు నొందవలసియున్నదో? నన్ను బ్రహ్మదేవుండు శోకంబునకై సృజించెనో?” యని విలపింప నూరార్చి యమ్మునీంద్రుఁడు వత్సంబు నెడఁబాసినధేనువు కరణి “నేల యడలెదవు, దుఃఖార్త వైననీ వేమి పల్కిన నూకు నెగ్గు గాదు, నీకుమారు లిరువురు నయోధ్యాపురంబునం

దండ్రిచెంగట సుఖంబుగ నున్నవారలు; కాకుత్థ్సుండు నిన్నుం దోడ్కొని రమ్మని పంచె” ననిపలికి యరుగుదెమ్మని యమ్మానవతీమణిం దోడ్కొని యయోధ్యాపురంబునకు వచ్చుటయు, రఘూద్వహుండు పరమానందకందళితమానసుండై పుత్త్రులు గొలువ, భార్యాసమేతంబుగా హయమేధంబు సాంగంబుగా నెఱవేర్చి సంపూర్ణదక్షిణల ఋత్విజులం బ్రీతి నొందించి ధనకనకరత్నభూషణాంబరాదుల చేత నాశ్రితుల మిత్త్రుల భృత్యుల భూసురుల నృపుల నందఱం దనియించి రాజ్యపరిపాలనంబు సేయుచు సుఖంబున నుండె. ఏసరవిం గుశలవులతో శ్రీరామభద్రుండు రణంబు సేసె, నానీతి నర్జునుండు బభ్రువాహనునితో యుద్ధంబు సేసెను.

ఇవ్విధంబున బభ్రువాహనుం డర్జునునితోడం దారసిల్లునవసరంబున హంసకేతనుండు తనతనూభవులు గయ్యంబునం బడినయప్పుడు శ్రీకృష్ణుండు తనయందుఁ జేసిన సన్మానంబు మనంబునం దలంచి శౌరికిం బ్రియసఖుం డైన కిరీటికార్యంబునఁ బ్రాణంబు లీయ నిశ్చయించి, బభ్రువాహనునిం దాఁకి యతనిచక్రరక్షకు లగుయోధవరులవేయింటిని వేయిబాణంబుల ఖండించి వెండియుఁ గాలదండోపమానంబు లగుకాండంబులు నిగిడించి యరదంబు చక్కడిచి ప్రతివీరుండు ప్రయోగించుశిలీముఖంబులు విముఖంబులు గావించి తోడనే తనుఁ జుట్టుకొనిన యయిదక్షౌ

హిణులసైన్యంబు రథగజతురగపదాతిబృందంబులతోడం దెగటార్చి(2) ప్రళయకాలరుద్రుండునుంబలె మండుటయు, బభ్రువాహనుండు సత్వరంబుగా వేఱొక్కరథం బెక్కి హంసధ్వజుని మార్గాని, వేయిబాణంబులచే నరదంబు వేయితునుకలు గావించి, మఱియు నిశితవిశిఖంబులు పరఁగించి యారాజును మూర్ఛితుం జేసి మూర్ధాభిషిక్తు లైన రాజేంద్రుల రథరథ్యసూతసమేతంబుగా వేయిమంది నొక్క నిమిషంబునం దెగటార్చి యార్చుటయు, యావనాశ్వకుమారుం డైనసువేగుం డడ్డపడి తొమ్మిదిబాణంబులఁ గిరీటినందనునియురంబును మూఁడునారసంబుల నాతపత్రంబు ధనువును బతాకయుఁ దునిమి యతనియొద్ది వీరయోధుల వేయింటిని, వేయిబాణంబులం దెగటార్చి వెండియుం బది నూఱులప్రదరంబులు నిగిడించి బభ్రువాహనుని దేహంబు

—* సువేగబభ్రువాహనులయుద్ధము.*—

నిరంతరంబుగా గ్రుచ్చె. ఇవ్విధంబున సువేగుని శరవేగంబుఁ జూచిన దేవేంద్రపౌత్రుండు దావపావకంబునుంబలె విజృంభించి వానిబాహుగర్వంబు వారించుచుఁ బ్రచండకాండంబులు ప్రయోగించి తెల్లయేనుంగుతండంబులం ద్రుంచి మాతంగతురంగశతాంగభటకళేబరంబులచే రణభూభాగంబు గప్పి వెండియుం గ్రోధావేశంబునఁ గోదండంబునం దొక్కపాఱువాతియమ్ము దొడిగి యాకర్ణాంతంబుగాఁ దిగిచి

(1) (2) నడుమ నున్న గ్రంథ మొకప్రతిలో నష్టమైనది.

సువేగుని నడిమికి రెండుగా ఖండింపం దలంచి యేసినఁ, గత్తెరచేఁ గత్తిరించినచందంబునఁ బూర్వాధఃకాయంబులు సమంబుగాఁ దూఁచినట్లు తెగి తత్ఖండంబులు క్రిందం బడు నంతలో సువేగునికరలాఘవం బే మని వర్ణింప! నాల్గుబాణంబులు వింట సంధించి బభ్రువాహనువక్షస్స్థలంబు దుయ్య నేసిన మూర్ఛాకలితుం డై కన్వడిపట్టి ధరాతలంబునం బడియె. అవ్విధంబుఁ జూచి సిద్ధసాధ్యచారణసంఘంబులు వినుతించె. అనంతరంబ, యతిశీఘ్రంబుగా మూర్ఛ దెలిసి చిత్రాంగదాకుమారుండు ప్రళయకాలరుద్రుండునుంబలె రౌద్రరసోల్లాసభాసురుం డై కిరీటిచుట్టు నున్న యోధవీరులం బెక్కండ్ర నుక్కణఁగించె. అప్పుడు బభ్రువాహనునిచే భండనంబునం బడినరాజులం దత్పురంబునకుం గొనిపోయి చిత్రాంగదాసపత్ని యగునులూచి విశల్యకరణీప్రముఖంబు లైనయౌషధంబులచేఁ జికిత్స లొనరించి కాపాడుచు నుండె. అప్పుడు ధనంజయుండు కర్ణకుమారునిం జూచి మనసైన్యంబు నిరవశేషంబుగా సమయింపంబడియె, హంసధ్వజుండును యౌవనాశ్వుండును సువేగుండును నీలధ్వజుండును మొదలైనదొరలు పెక్కండ్రు పడిరి. ప్రద్యుమ్నుండు పట్టువడియె. అనుసాల్వుం డే మయ్యెనో యెఱుంగము. కుమారకా! కాలంబు విపరీతంబుగాఁ దోఁచుచున్నయది. నాదేహచ్ఛాయ శిరోవిహీనంబుగాఁ గనంబడియెడు. కన్నులఁ గోపాగ్నిజ్వాలలు మట్టుపడియె. మఱియును దుర్నిమిత్తంబు

లనేకంబులుగాఁ గనఁబడుచున్నవి. ఏమయిన నేమి, చావు నకుం దలంకం బనిలేదు. నీవును బాణసహస్రంబులచే జర్జరితాంగుండ వై మిగుల నొచ్చి యున్నవాఁడవు. నేను జీవితుండ నై యుండునప్పుడే నీవు దప్పి పొమ్ము; తిలోదకంబు లైన నిత్తువు. అకటకటా! యసిధారావ్రతంబుగాఁ బాండవాగ్రజుండు యాగంబునకు దీక్షించి నాభుజావిక్రమంబు నమ్మి, మహాక్రతువు నుపక్రమించినయత్నంబు విఫలం బయ్యె. ఖదిరబదరీపలాశబిల్వయూపకలాపంబు లోపంబు నొందె. చషాలకల్పనంబు మృష యయ్యె. అఱువదినలుగురు విప్రదంపతులు యజమానునకుఁ జేయం బూనిన కనకకలశపాత్రాభిషేచనవిధానంబు వృథయయ్యె. కనకమయం బైనశలాకాశతంబుచే విరచితంబును శార్దూలచర్మపయోజితంబును నైనధవళచ్ఛత్రసముల్లాసంబు భ్రంసంబయ్యె. యాగమండపాభ్యంతరంబున హర్షమాణు లైన బ్రహ్మర్షిమహర్షిపుంగవులమంగళాశీర్వాదంబులయర్థంబులు వ్యర్థంబు లయ్యె. అవభృథస్నానసమయంబున బంగరుశలాకలకరణి శృంగారంబులు దనర సర్వాభరణభూషిత లై యమూల్యంబు లైనగంధమాల్యాంబరంబులు ధరియించి పదేసియేండ్లబాలికలు కనకదండమండితంబు లైనచామరంబులు విసరువైభవమ్ము నష్టమయ్యె. రుక్మిణీసమేతుం డైనపుండరీకాక్షునకు నగ్రపూజ సేయవలయు ననుప్రసంగంబు భంగం బయ్యె. ఇంక నెంత వగచిన నేమికార్యంబు! నా

జన్మంబు వ్యర్థం బయ్యె. సంగరాంగణంబునం బగతుని తోడం దలపడి నాయోపినంతయుం బోరి మరణంబు నొందుట మేలు. నీవు కృష్ణయుధిష్ఠిరులపాలికిం జని యీవృత్తాంతంబు పలుకరింపు మనిన వృషధ్వజుండు కపిధ్వజుని తో నిట్లనియె. "అయ్యా! బహుభాషలు నేను బలుక నోడుదు. రవిబింబంబు ధరణీతలంబున వ్రాలిన సముద్రంబు లింకిన ధరణీతలంబు తలక్రిందైన మేరు వొఱగిన నేనియు వైరవీరులకు వెన్ను సూపువాఁడఁ గాను. దేవేంద్రాదిదేవత లెదిరించి రేనియు జయింపం గలయట్టి నాముందఱ నీశాత్రవు లేమాత్రంబు? నీప్రాపున నుండుటం జేసి నా కసాధ్యంబు లేదు. "ఏలినవాని కార్యంబున మిత్రకార్యంబున గోబ్రాహ్మణకార్యంబున నెవ్వాఁడు దేహంబు పరిత్యజించు నతనికిఁ గైవల్యం బెదురుగా వచ్చు నని ధర్మకోవిదులు పలుకరింతురు. నాపరాక్రమంబు గనుంగొను" మని మ్రొక్కి రథారూఢుం డై దుర్వారభుజాగర్వంబు నిర్వహింపం బూని యుభయసైన్యంబులు వినుతింప వృషకేతనుండు మలయకేతనునిం దాఁకె.

—* వృషకేతనబభ్రువాహనులయుద్ధము. *—

అంతఁ గిరీటినందనుండు వృషకేతను వీక్షించి యతని వక్షంబునందు మూఁడుబాణంబు లేసిన నది వెన్నున దుస్సి, పాతాళగంగాజలంబులు గ్రోలం బోవుచందంబునఁ బుడమి లోనం దూఱిన సూర్యపౌత్రుం డీషఁజనక మూఁడుశిలీ

ముఖంబు లురంబునం గ్రుచ్చిన బభ్రువాహనుండు సారథి రథరథ్య కేతనచ్ఛత్రసమేతంబుగా రథంబు దునుమాడినం గర్ణపుత్రుండు వేఱొక్కశతాంగంబు నెక్కి పరాక్రమించి నం బార్థనందనుండు దాని జక్కడిచె. వెండియు నొండు రథంబుమీఁద నెక్కిన, నవ్వీరుండు దాని ఖండించె. అవ్విధంబున వేయురథంబులు ఖండించిన రాధేయతనూభవుండు వేఱొక్కయరదంబు నెక్కి నానావిధశస్త్రాస్త్రంబులు గురిసిన నరనందనుండు సరిపోరు నెడ వృషకేతనుం డాగ్నేయపార్జన్యయామ్యసౌరాదిబాణపరంపరలు ప్రయోగించినం జిత్రాంగదాకుమారుండు నారాయణాస్త్రంబున నన్నియు ఖండించి కర్ణసూనునిం జూచి "మద్బాహాపరాక్రమంబునం బొలిసిన నీసేనలచందంబు గనుఁగొంటివె! వృత్రాసురుం డమరేంద్రు నెదిరించుచందంబున నీవు నాయెదుటం బడితివి. ఎందుఁ బోయెదవు." అని చిఱునగవు నెమ్మొగమ్మున నివ్వటిల్ల వాయవ్యాస్త్రంబు వింట సంధించి వృషకేతనునియురంబు దుయ్యనేయుటయు నతం డెగసి బ్రహ్మాండకటాహంబునం గొట్టువడి భూమిపయిం బడక జీర్ణపర్ణంబు సుడిగాలిలోనం దవిలినయట్లు ప్రాక్పశ్చిమదక్షిణోత్తరదిశాభాగంబులం జుట్టుముట్టి మూఁడుముహూర్తంబులలోఁ గ్రమ్మఱ యుద్ధరంగంబునకు వచ్చి వ్రాలి కర్ణపుత్రుండు కుదురుకొని, బభ్రువాహనునిపయి నుద్ధురాస్త్రంబు ప్రయోగించుటయు నతండు రథంబుతోడంగూడ రవిమండలపర్యంతంబు

నెగసి భగ్నరథుం డై దగ్ధపక్షుం డైనసంపాతిపక్షియుంబలె పుడమిపయిం బడిన నతని నవలోకించి వృషకేతనుండు "హంసధ్వజాదినృపాలురం బలువురం బొలియించితివి, మదీయశరాగ్ని దగ్ధుండ వై యప్పాతకంబుఁ బాపికొను" మని శిఖశిఖాసంకాశంబు లైన శిలీముఖంబు లనేకంబులు ప్రయోగించినం గవ్వడితనయుండు నవ్వుచు వాని ఖండించి గగనంబున కెగసి మందరనగంబుచందంబున వృషకేతనునరదంబుపయిం దుముకుటయు నయ్యరదంబు భూతలంబున నణంగి కనంబడ దయ్యె. వృషకేతుండు లాఘవంబున నవ్వలికిం దుమికినఁ గిరీటితనయుండు శరపంచకంబున నతనిమర్మంబులు నాటించి యార్చినం దరణిపౌత్రుండు పినతండ్రిం జూచి "మున్ను మీతోడం బోరునప్పు డరదంబు పుడమిలో నణంగిన రాధేయునంతయోధు నిన్నుం జూచి నిలువుమని వేఁడె; నే నట్లు పలికినవాఁడఁ గాను; నాప్రతాపంబు గనుంగొన నవధరింపు" మని పలుకునంతలో బభ్రువాహనుం డొక్కశరంబునఁ గర్ణజునిశిరంబు పగులనేసిన నరకుగొనక, యతండు పెక్కుశరంబు లొక్కమ్మడిం గురిసె. ఇవ్విధంబున నొకరి నొకరు చీరికింగొనక కొంతతడ వంబరంబునం, గొంతసేవు భూతలంబునం, గొంతవడి దిగంతంబులయందును రథంబు లెక్కియు విరథు లయ్యును నిమిషమాత్రంబు నిలువక తమశరీరంబులం గాఁడిపాఱినకాండంబులచే ఖండితంబు లైనమాంసఖండంబుల కై కాకకంకగృ

ద్ధ్రంబు లాకసంబున గుంపులుగూడ నయిదహోరాత్రం బులు నిరంతరసమరంబు సేసిరి. అంత నాబభ్రువాహనుం డర్బుదన్యర్బుదసంఖ్య లైనబాణంబులచే నొప్పించి "కర్ణ నందనా! యిన్నిదినంబులు నాతోడ నెదిరించి పోరినయప్పు డే మెచ్చుకొనవచ్చు; నింక నిన్నుం బోరిగొనక విడువ. ముకుందచరణారవిందంబులు డెందంబునం బాదుకొలుపు" మని పలుకుచు మెఱుంగులు దుఱంగలించు నర్ధచంద్రబా ణంబు నిగిడించినఁ గర్ణతనయుం డాబాణంబు మూఁడు తునుకలుగా ఖండించి యట్టహాసంబు సేయునంతలోఁ బార్థ సూనుండు గనకరేఖావిరాజితంబును గంకపత్త్రచిత్త్రితంబును గాలాగ్నికీలాసంకాశంబు నైనకాండంబు నాన్నృపకేతను కంఠంబు లక్ష్యంబుగాఁ బ్రయోగించినఁ గుండలాలంకృతం బును జంద్రమండలసన్నిభంబు నైన యాతనిముఖమండలం బెగసి పుండరీకాక్షునిఁ జేర్కొనుచు గాండీవిపదంబుల వ్రాలినం, దత్కబంధంబు చతురంగబలంబుల మడియించు చుఁ బుడమిమీఁదం బడియె.

అంతఁ గుంతీనందనుండు పూర్ణచంద్రోపమానంబును గిరీటకుండలాలంకృతంబు నైనకర్ణజునిశిరంబు కరంబులం బూ ని "హా! వీరమూర్ధన్య! హా! యుధిష్ఠిరసన్మాన్య! హా! కుమార కంఠీరవ! హా! వైరిభయంకరజ్యారావ! నిన్ను రిత్త చంపికొంటి. ప్రియనందనుండవు నర్కుని మనుమండవు నైననిన్నుఁ గైదు వులపాలుసేసి లోకబాంధవునితోడివిరోధంబు సంపాదించి

కొంటిని. అభిమన్యుననంతరంబున నన్వయంబు నీవలన నిల్చు నని నమ్మియుంటి. గుణనిధానుండ వైననిన్నుం గోలుపోయి కృష్ణయుధిష్ఠిరులచిత్తం బుత్తలంబు నొందించితి. మున్ను హయమేధాశ్వంబు సాధించి తెచ్చునప్పుడు భీమ సేనునకు సహాయంబుగాఁ జని వైరుల జయించి వాజిని హరించిననీ విప్పుడు నాకు సహాయంబుగా వచ్చి విపక్షుల చేతం బొలిసి యటవిక్షుపలపా లయితివే! కుమారకా! దిన మణి లేనిదినంబుకరణి, దీపంబు లేనియంధకారమందిరంబు చందంబున, లింగంబు లేనిపీఠంబుకరణి, నీవు లేనిజయంబు నిష్ఫలం" బని బహుప్రకారంబులం బలవించి తనయురం బున నతని శిరంబు నునిచికొని మూర్ఛితుండై పెద్దయుం బ్రొద్దునకుఁ దెలిసి వెండియుం బరిదేవనంబు సేయుధనం జయుం గనుంగొని బభ్రువాహనుం డిట్లనియె. ఏను వైశ్యు నకుం బుట్టినవాఁడఁ గావున సంగరం బనుసముద్రంబులో నరదం బనునావనెక్కి వీరయోధశిరోరత్నంబులు బేరంబు లాడుచుఁ గర్ణసూనునిశిరం బనియెడియనర్ఘం బైనరత్నంబు వెలకుం గైకొని నీకు నిచ్చితి. దీనిం బశుపతికి నర్పించి పాశుపతాస్త్రంబు గైకొని నన్ను మార్కొనం జూడు" మనిన విని, కిరీటి, కర్ణసూతిమస్తకంబు రథంబుపై నునిచి కన్నుల నిప్పు లుప్పతిలం జూచుచు, సరభసంబుగాఁ జాపం బు సజ్యంబు గావించి గుణంబు మ్రోయించుచు "నోరి దుర హంకారి! పెక్కుమాట లేమిటికిం బ్రేలెదవు. శూరుండ

—* అర్జునబభ్రువాహనులయుద్ధము *—

వైతివేని నాయెదుటం బౌరుషంబు సూపు" మని పలికి చిత్తజల్లుగా భల్లంబులు గురియుచుఁ గాలసర్పోపమానంబులును గనకపుంఖంబులును నై కుఱుచకనుపులం గనుపట్టు శిలీముఖంబులు బహుముఖంబులం బ్రయోగించుటయు బభ్రువాహనుండు తూలె. బలంబులు నలుగడలకుం బఱచె. అప్పుడు శిరంబులు లేని మొండెంబు లీడ్చికొని దెసలకుం బఱచువాహనంబులును నుగ్గునూచంబునుం బోడిపోడియు నై గగనంబున గాలికిం బోవురథంబులును దుండంబులు, గండంబులు, పాదంబులు, రదంబులుం దెగి రక్తసిక్తాంగంబు లై సమీరతాడితంబు లైనసాంధ్యమేఘంబులకైవడి దెసలకుం బరువెత్తు నేనుంగులును, భిన్నభిన్నంబు లై శిరఃపాణిపాదవక్షోమధ్యజంఘాజాన్వాద్యవయవంబులతోడం బొరలువీరభటులునుం గలిగి సంగరాంగణంబు రక్తమాంసకర్దమంబులం దుర్దమం బయ్యె. మఱియు, నక్కౌంతేయు దివ్యాస్త్రజ్వాలలు కాలానలంబు కైవడిం గెరలి బభ్రువాహనునిమణిపురంబునం దరికొని ప్రాకారంబుల నిరాకారంబులను, నట్టాలకంబులు నేలమట్టంబులను, నగారంబుల నిగ్గుఱులను, వీదుల బూదులను గావించుచు విజృంభించుటయుఁ, జిత్రాంగదానందనుండు నిజబాహాశక్తిచే జంభారిసుతుని సంరంభంబు స్తంభింపం జేసి మూఁడుబాణంబుల సారథి నొప్పించి, నాల్గుమార్గణంబుల ఘోటకంబుల గీటడఁగించి,

యేశమ్ములఁ గపిధ్వజంబు నాటించి, ఫాలాక్షఫాలాగ్నికీలా కరాళంబు లైనబాణజాలంబుల మర్మంబులు నొప్పించు చుటయు, గాసిం జెంది గంగాశాపంబు సన్నిహితం బగుట కతన, నాగ్నేయవారుణవాయవ్యగాంధర్వపైశాచసమ్మోహనాస్త్రంబులలో నొక్కటియుం దోఁచకుండుటవలన, వివర్ణత్వంబు నొందినవదనంబుతో నస్తమయసమయసూర్యుని చందంబునం బ్రతిక్షణంబును క్షీణం బగు తేజంబుతోడం గుందుపౌరందరిం జూచి మణిపురాధీశ్వరుండు నవ్వుచు "నయ్యా! పతివ్రతామతల్లి యైనమాతల్లిని సభామధ్యంబునం దొల్లి యప్రియవచనంబులు పలికినపాతకంబునకుం గాలంబు సేరవచ్చె. ఇవ్వేళఁ దల్లిని దండ్రిని నన్నదమ్ములఁ జుట్టంబుల నెవ్వరిఁ దలంచినం బ్రయోజనంబు లేదు. సనాతనుండును భవదీయరథసూతుండు నైనశ్రీకృష్ణునిధ్యానంబు సేయు" మని పలుకునవసరంబున, నీరదంబులు నెత్తురులు గురిసె. మొఱపటాలు ఉవ్వుచు ఝంఝామారుతంబులు వీచె. దిగంతంబులు గావిరి గప్పె. పొగ లేక యాయుధంబులు మండె. ఇవ్విధంబున నర్జునవినాశసూచకంబు లైన యుత్పాతంబు లనేకంబులు గనంబడుచునుండ బభ్రువాహనుండు మండుచు నవరత్నఖచితంబును, గంకపత్రవిభ్రాజమానంబును, స్వర్ణరేఖాంకితంబును, సన్నతపర్వంబును, గాలదండోపమానంబును, నర్జునప్రాణాపహరణకారణంబును, జ్వాలానామకంబు నైనశరంబు వింటం బూన్చి యాకర్ణాం

తంబుగాఁ దివిచి కిరీటికంఠంబు లక్ష్యంబు సేసి ప్రయోగిం చుటయు, నది పూర్వవైరానుబంధంబున మథ్యమానసాగర సముద్భూతకాలకూటంబుకరణి చటచ్ఛటాశబ్దంబుల మింట నంటుమంటలు మిణుంగురులు పొగలు సెగలు రగులుకొన జగంబులు దిగులుపడం జేయుచుఁ బఱతెంచినం గని,

—* అర్జునుఁడు శిరంబు దెగి పడుట. *—

ఫల్గునుండు లేశమాత్రం బేనియు మనంబున భయంబు నొందక నానావిధంబు లైనదివ్యాస్త్రంబులు ప్రయోగింప, వాని నెల్లం గబళీకరించుచు దశదిశాభాగంబులు ఘూర్ణిల్లం జనుదెంచి, కంబుకంఠంబును, గమలదళనేత్రంబులును, గనకరత్నకిరీటకుండలాభిరామంబును, గైరవమిత్రబింబోపమానముఖంబు నైనకవ్వడిశిరంబును (1) ఖండింప, నది 'కమలనాభ! కనకాంబరధర! కౌస్తుభోద్భాసితాంగ! కమలామనోహరా! కైటభాంతకా! నిన్నే నమ్మినవాఁడ' నని కీర్తించుచుఁ గార్తికమాసంబున శుక్లపక్షంబునం దేకాదశీభౌమవాసరంబున నుత్తరానక్షత్రంబున ధరణీతలంబునం బడియె. తద్దేహంబు వృషకేతనుని దేహసమీపంబునం గెడసె. అప్పు డాకర్ణపురందరనందనుల శిరంబులు, రత్నకుండలకిరీటప్రభాదీప్యమానంబు లై రెండుసూర్యబింబంబులుం బలెఁ బ్రకాశించె. (2)

---

(1)-(2) నడుమనున్న వాక్యము లొకప్రతిలో వ్యత్యస్తములుగా నసమగ్రములుగా నున్నవి.

ఇవ్విధంబున బభ్రువాహనుం డాహవంబున వృషధ్వజ కపిధ్వజుల వధియించి జయోత్సాహంబునం బొదలుచు మగిడి వచ్చునపుడు పురంబునఁ బన్నీరు చిలికించి కప్పురం పురంగవల్లికలు దీర్చి పట్టాంబరంబుల మేలుకట్లు గట్టి తోరణంబులు సవరించి వారాంగనానాట్యయోగ్యంబు లైన యంత్రవిశేషంబు లమర్చి యగురుసాంబ్రాణిధూపవాసనలు గుబులుకొనంజేసి పూర్ణకలశంబులు దధిదూర్వాక్షత మంగళద్రవ్యంబులు సంఘటించి వాద్యఘోషంబులు సెలంగ జయజయనాదంబులతోఁ బౌరజనంబు లెదుర్కొన జయోల్లాసంబున వచ్చువైభవంబులు, సౌధాగ్రంబున నుండి కనుంగొని, చిత్రాంగద, చెంగట నున్నసఖీజనముల నవలోకించి పట్టణంబున నేమియుత్సవం బని యడిగి, నీకుమా

—* అర్జునమరణంబునకుఁ జిత్రాంగద చింతించుట. *—

రుం డైనబభ్రువాహనుం డర్జునుని సంహరించి జయంబు సేకొని వచ్చుచున్నవాఁ డనిన విని(1)యక్కులకాంత కంఠీరవరవంబు వినినగజరాజకన్యకయుంబోలెఁ, గఠోరమేఘగర్జనంబు వినినకలహంసితెఱంగున, బోయవాని వింటినారిధ్వని వినినచిన్నారిలేడివితంబున, బిడాలనిర్ఘోషంబు వినినబాలమూషికయందంబున(2) హృదయంబు ప్రక్కలై మూర్ఛిల్లి పుడమిం ద్రెళ్లినం, జూచి యులూచి, దుఃఖావేశంబున మోము నురంబును మోఁదికొనుచుఁ బరిదేవనంబు సేసినం

(1)-(2) [illegible]

దత్సఖీజనంబులు నేడువం దొడంగిన నంతిపురంబు రోదన ధ్వనులచేతం ఘూర్ణిల్లుటయు నక్కోలాహలంబు నాలకించి బభ్రువాహనుండు చిన్నవోయినమొగంబుతో నంతఃపురం బునకుం బోయి ధారుణిం బడినహారంబులును, ఖండితంబు లైనకటకంబులును, విఱిగినమంజీరంబులును, బోరగిలం బడ వైచిన దూర్వాక్షతలాజపాత్రంబులు, నాఱిననీరాజనంబు లును, విరియంబడినకురులతో నేడ్చుసఖీజనంబులునుం గలిగి దుఃఖాక్రాంతం బైనయంతఃపురంబునం జింతా క్రాంత లై మూర్ఛిల్లిన తల్లులం జూచి "తల్లులారా! యిం తవంతనొంద నేమిటికి? ఏను శత్రుసంహారంబు సేసి జయ రమాసమేతుండ నై వచ్చినయెడ న న్నభినందింపకుండు టకుం గారణం బేమి?" యనిన విని చిత్రాంగద "కుమార కా! నీవే నాపగదాయ వైతివి. వృక్షశాఖవలనం జనియిం చిన యగ్నియే, యావృక్షంబు దహించినతెఱంగున, నీవు పుత్రుండ వై జనియించి తండ్రి యగునర్జునుని సంహరించి తివి. కావున నింక విధవకు భూషణంబు లేల? కుమారకా! నీచే నంతంబు నొందిన కౌంతేయునిచెంగటికి నన్నుం దోడ్కొని పొమ్ము. అగ్నిప్రవేశంబు సేసి యమరలోకం బున నర్జునునాననంబు నవలోకించెద" ననిన విని యులూచి చిత్రాంగదం జూచి "నాయుద్యానవనంబులో నేను గూరి మిం బెంచునట్టి యైదుదాడిమితరువు లున్నయట్ల యుండి నిన్నటిరేయి నిష్కారణంబుగా దహింపంబడియె. ఆదుర్ని

మిత్రంబుఁ గనుంగొని మనప్రాణవల్లభుం డైనకిరీటి మరణంబు నిశ్చయించితి" ననియె. అప్పుడు చిత్రాంగద, బభ్రువాహనునిఁ జూచి, తండ్రిఁ జంపినమహాపాతకంబు సంభవించె. బుద్ధిపూర్వకంబుగా నింతపాపము వచ్చె; నింక నేటి యుత్సాహంబు! ఏమిటిజయంబు! సమరస్థలంబునకు మమ్ముఁ బిలిచికొని పొమ్మనిన, బభ్రువాహనుండు, భయాకులితమానసుం డై మొగంబు వెలవెలఁ బాఱఁ, దల్లులం దోడ్కొని (1) పోవునప్పు డప్పుడంతుకలు, బెబ్బులిఘోషంబు వినిన ధేనువులచందంబున హా! యని యుల్లంబులు తల్లడిల్ల ఖండితంబు లగుకదళీకాండంబులచందంబున భూమండలిని వ్రాలి, పరిచారికాజనంబు లగుమగువలు లేవనెత్త, నెత్తమ్ములఁ బోలినకన్నుల బాష్పధారాపూరంబులు కాల్వ లై పాఱఁ

—* చిత్రాంగద, యులూచియు యుద్ధభూమి కేగుట. *—

బెదవు లెండఁ బొరలి యేడ్చుచు, లేచి ముప్పిరిగొనుమోహంబున, బయ్యెదలు జాఱి జీరాడ, ముత్యాలపేరులు కుచకుంభంబులం బుటంబు లెగసి దుముకులాడ, నసదుగాను లల్లాడఁ, గప్పుకొప్పులు వీడ, నడుగుఁదమ్ములు తడఁబడ, డెందంబులఁ బొగులుచుఁ గ్రందుకొనుఖేదంబున సమరాంగణంబునకుఁ జనిరి.

తదనంతరంబ చిత్రాంగదయు భుజంగరాజతనూభవయును ఫల్గునునిపాదంబులపయిం బడి యురంబులను శిరంబులను మోఁదుకొనుచు వికీర్ణకేశపాశ లై, "హా! మహావీర!

హా! పురందరనందన! నివాతకవచకాలకేయాంతక! దేవతాసమూహంబులను దలిమి యాఖండలుని జయించి ఖాండవవనంబు నగ్నిదేవుని కాహుతిఁజేసిన నీశౌర్యం బెందుఁ జనె! ఎక్కటికయ్యంబున ముక్కంటితోడఁ బెనంగి మెప్పించి పాశుపతాద్యస్త్రంబులఁ గైకొన్న నీవిక్రమం బెందణంగె! కాలకేయనివాతకవచాదిదైతేయుల నుక్కణంగించి జయంబుగైకొనిన మహాప్రతాపం బేమూలడాఁగె! భీష్మద్రోణకర్ణ కృపాశ్వత్థామ దుర్యోధనదుశ్శాసన వికర్ణాదుల జయించి, యేకవీరుఁడ వై గోగణంబు మరల్చిన బాహుబలం బేచక్కికిం జనియె! అన్న యగుధర్మరాజుచే రాజసూయాధ్వరంబుం జేయింపం బూని, యిలాన్వితకింపురుషభద్రాశ్వకేతుమాలకురువర్షంబుల దేవతాయోగ్యంబులైనదివ్యవస్తువాహనంబుల నపారంబుగాఁ దెచ్చినభుజావిజృంభణం బెక్కడఁ బోయె! యాదవబలంబుల నరకుసేయక సుభద్ర నరదంబుపై నుంచుకొని వచ్చినయామగఁటిమి యేదిక్కునకుం బోయె! చక్కెరవిలుతుని ధిక్కరించుచక్కందనంబు గలనీచొక్కటపునెమ్మేను దుమ్మునఁ గ్రమ్మియున్నయది! ఇంద్రనీలకవాటంబుకరణి వాటం బైననీయురస్స్థటంబున నిశితవిశిఖంబులు నాఁటియున్నయవి! చంద్రబింబోపమానంబును మందస్మితసుందరంబు నైననీవదనారవిందంబు ఖండితంబయ్యును గలకల నగుచుఁ జెన్నుఁ దొలఁగక యున్నయది!" అని బహుప్రకారంబులఁ బల

పించి, తత్సమీపంబునఁ గర్ణనందనునిశిరంబుఁ గాంచి, వక్షంబునఁ జేర్చుకొని "తండ్రీ! కుమారకంఠీరవా! కర్ణకుమారకా! నీకుఁ బినతండ్రి యైనధనంజయుని నూడు దీర్చుకొనక యిట్లుండఁ దగునె" యని పలికి బభ్రువాహనునిఁ జూచి, "తనూభవా! దానశూరుఁ డైనకర్ణకుమారునిం జంపితి; పిందున నీ కేమి కీర్తి గలిగె? అశ్వరాశ్వంబు వెంబడి హస్తినాపురంబునకుం జని కుంతీద్రౌపదీసుభద్రలం దక్కునుం గల బాంధవుల నవలోకించి, యశ్వమేధావభృథస్నానంబుఁ జేసి మానవల్లభుం డైనసత్యసాచితో విహరింపవలయు నను కోరిక లంకురించుచునుండ వానిని ఖండించితివి. నీజనకునిం జంపిన తెఱంగున జనకుల మగుమమ్ముఁ బరిమార్చి మాకాంతునిచెంతకుఁ బనుపుము. ఇట్లు చేసితి వేని తల్లినిమాత్రంబు జంపిన పరశురామునికన్న మిన్నఁ గాంచితి వని కొనియాడుదురు. ప్రియుఁడు పరలోకగతుం డైనపిమ్మట ననుగమనంబుఁ జేయుట సతుల కుచితకృత్యంబు, గావున, నందులకుఁ దగినయత్నంబు సేయుము. అగ్నిముఖంబునఁ బ్రవేశించి పతివిరహాగ్నిసంతాపంబుఁ బాసెద" మని పలుకుచున్న తల్లుల నవలోకించి బభ్రువాహనుండు "అంబలారా! మున్ను మన సేనాపతి యెఱుఁగక హయంబుఁ బట్టిన, నది నేను విచారించి తురంగంబును ధనకనకవస్తువాహనరత్నభూషణాంబరంబులఁ గానుకగాఁ గొనుచుం జని, సాష్టాంగదండప్రణామంబుఁ గావించి, తురంగంబు మరల నొప్పగించుటయు, నాద

రింపక సభామధ్యంబునఁ దుష్టవాక్యంబులఁ బలుకరిం చిన సహించి యుండితి; నంతట నిలువక మాతృనిందా కరంబు లైన నీచవాక్యంబు లాడుటకతనం గోపంబు వొడ మె. అందువలనఁ బితృహత్య సంభవించె. ఇమ్మహాపాత కంబుఁ బాపుకొనుటకు, వనంబునకుం జని, కృచ్ఛ్రచాంద్రా యణాదివ్రతంబులు, యజ్ఞదానాధ్యయనాదిసత్కర్మంబులుం జేయుచు నుపవాసంబులచే మేనుశోషింపఁ జేసెద. మున్ను నేను జనియించినలగ్నంబునఁ బితృస్థానంబు క్రూరగ్రహ దృష్టితంబు నశుభవీక్షితంబు నై యుండెం గావునఁ బితృ ఘాతుకుం డని యెఱిఁగి యులూచి నన్నుం జంపక పెను చుటవలనఁ గదా యిట్టిపాతకంబు సంభవించె. ఇంక నిమిషమాత్రం బేనియు శరీరంబు నిలుపుకొనం జాల. అగ్నిముఖంబున నాహుతి గావించి పాతకవిముక్తుండ నయ్యెద" ననిన, విని యులూచి, తనయునిఁ జూచి కుమా రకా! పదరకుము. మాతండ్రి యైనశేషునిసగర మృత సంజీవనమణి గలదు. పన్నగాంతకుం డైనగరుత్మంతునిఘాత చేఁ బ్రతిదినంబును మృతిం బొందెడుపన్నగులయెడ దయ చేసి పన్నగాభరణుండు నాపన్నరక్షకుండు నైననీలకంఠుండు నాగకులసంరక్షణార్థంబుగా నారత్నంబు మాతండ్రికిఁ దయ సేసె. కుళికవాసుకిశంఖకర్కోటకతక్షకాదినాగంబులు మణి ప్రభామండితంబు లైనఫణామండలంబులతో దానిం గాపా

—* ఉలూచి మృతసంజీవనమణికై నాగలోకమునకుఁ బుండరీకు నంపుట. *—

చుచు నుండుదురు. కావున బలిమిచేతఁ గైకొనం గూడదు. సామవచనంబుల వేఁడినఁ దేవచ్చు. అందులకు మావాకిటిప్రధాని యగుపుండరీకుండు తక్క వే ఱొక్కరుండు దే నోపం డని వానిఁ బిలిచి తనతాటంకమంగళసూత్రంబులు వానిచేతి కిచ్చి ఫణిలోకస్వామితోఁ దనదుర్దశఁ దెలిపి యమ్మణిం జేకొని ర మ్మని వీడ్కొలిపె.

అంతం, బుండరీకుండు, విజయవృషకేతులశరీరంబులు వికారంబు నొందకుండ మూర్కొని, వారిం గాపాడుకొని యుండుం డని బభ్రువాహనుతో నెచ్చరించి, మహీతలంబు సొచ్చి, మరకతమణిమయంబు లైనచందనవృక్షంబులం బొలుపొందురసాతలంబు నతిక్రమించి, భోగవతీతీరంబున నభిరామం బైనయారామంబునఁ బొలుపొందు హాటకేశ్వరు నాలయంబున నటనంబులు సేయునాగకన్యకలగానంబులచే నాదమేదురం బైనపాతాళతలంబునకుం జని, యచ్చట, భోగవతీనామిక యగుపాతాళగంగలో స్నానంబుసేసి, నిత్యకృత్యంబులు నిర్వర్తించి, సువర్ణమయంబు లైనపంకజంబులచే హాటకేశ్వరుఁ బూజించి, ఫాలంబున నంజలి గీలించి, యద్దేవుని వీడుకొని రాజమందిరంబునకుం జని, యచ్చట నవరత్నఖచితంబును నలినమిత్రాడంబరవిడంబకంబు ననేకసహస్రస్తంభశోభితంబు నగునాస్థానమండపంబున

వాసుకికర్కోటకతక్షకైలాపుత్రకాళీయధృతరాష్ట్రాది మహా నాగేంద్రులు పరివేష్టింప నవరత్నస్థగిత సింహాసనంబున సుఖాసీనుండును శ్రీమన్నారాయణస్మరణ నిర్ధూతనిఖిలమాయావిశేషుండు నైనశేషునిం గనుంగొని సవినయంబుగాఁ బ్రణామంబు సేసి, యులూచి పంచినకుందనంపుమెఱుఁగుఁ గమ్మలును దాళిబొట్టునుఁ జూపి, "యర్జునుండు ధర్మజుమఖ వాజిసంరక్షణార్థంబుగా వచ్చునెడ బభ్రువాహను మార్కొని హతుఁ డయ్యెఁ గావునఁ దనకుఁ బతిదానంబుఁ జేయు మని యామె వేఁడుకొనియె. ధరణీతలంబు ఫణామండలంబునం దాల్చి సమస్తజీవకోటులకుం బరమసుఖంబు గావించెదవు. ఫాలనేత్రునివింటికి గుణంబ వై త్రిపురజయం బొసంగి, వేల్పులఁ బ్రోచితివి. పన్నగనాయకా! నీవిహారంబు లన్నియుం బరోపకారంబులు, గావున, నీనగరియందు మహానాగసంరక్షితం బైనమృతసంజీవనమణిం దయసేసినఁ బార్థుండు బ్రతుకఁగలం" డనిన విని శేషుం డి ట్లనియె.

హరిభక్తిపరాయణుం డైనయర్జునుని జయింప నాదినారాయణునికిం దక్క నెవ్వరితరంబు. ఇతండు సమరంబున మృతుం డయ్యె ననుట యద్భుతం బయ్యెడి, ననిన విని పుండరీకుండు "భుజంగవల్లభా! విజయుని మార్కొనుపాటి మేటిమగలు ముజ్జగంబుల లే రనుట నిజంబు; పుత్రశోకోపహత యగుగంగానదీశాపంబున నతని కిత్తెఱంగు వాటిల్లె" ననిన దయార్ద్రహృదయుం డై యనంతుండు మృతసంజీవన

మఱియు నమృతకుంభంబు నొసంగి సమగహతుఁ డైనసవ్య సాచిం బ్రతికించి జగత్త్రయంబున నతులితం బైనకీర్తి వహింపవలయు, నని నిశ్చయించి ధృతరాష్ట్రుం డనుఫణిపతిం బిలిచి "సంపాదించిన వస్తువులలో దాతయైనపురుషున కీయరాని వస్తువు లేదు." అనిన విని, యాభుజంగం బి ట్లనియె. "దేవా! యొక్కవిన్నపంబు వినుము. మర్త్యు లసత్యవాదులు. కృతఘ్నులు, వారియెడ సత్క్రియలు ఫలింపవు. నాగకులంబున కెల్ల జీవనహేతువు లైనయావస్తువుల నొసంగితిమేని మనకు నీరుపామునకు విశేషం బెయ్యది? గరుడుండు ప్రతిదినంబును దఱుముకొని తెఱుగు. ఊరజోగులు మంత్రబలంబునం బట్టి యాడింతురు. పడంతులు పడగల నున్నరత్నంబుల నొలుచుకొనియెదరు. మున్ను మతంగమహామునిశాపంబువలన వైనతేయుం డిచ్చటికి రాకున్నవాఁడు. ఇవ్విధం బెఱింగెనేని రత్నంబు నమృతకలశంబు నపహరించికొని పోవుఁ గాని మనకేల యీయనిచ్చు. రాజు మదగజంబువంటివాఁడు. మంత్రి మెత్తనియంకుశంబువంటివాఁడు. అతండు మేరమీఱి నడచినయెడ గ్రమంబున మరలింపవలయుం గాని మీఱనీయందగదు." అనిన విని శేషుండు ధృతరాష్ట్రునిం జూచి "మున్ను చతుర్ముఖుండు లేఁగదూడలం గోపబాలకుల నటమటించినయెడ వెన్నుఁడు బ్రహ్మసృష్టికిం బ్రతిసృష్టి నొనర్చె. అఘటనఘటనావిహారుం డైనయాకేశవునకు నసాధ్యం బెద్ది? అతండు చేపట్టినం

బూరిపుడుక వజ్రాయుధం బగు. శ్రీమన్నారాయణునికరుణ లేకున్న మహామేరు వైనం దృణం బగు. అద్దేవునికృపా కటాక్షంబునం గాదె మన మందఱము బ్రతికియున్నారము.” అనిన విని ధృతరాష్ట్రుండు శేషునిం జూచి “యావనజ నాభుండె వాసవతనయునిం బ్రతికింపంగలం డనినయెడ సంజీవనమణియు సుధాకలశంబు నేమిటికి? నిరర్థకంబుగా నిచ్చుటవలన ఫణికులంబునకు హాని సంభవించుటయే గాని ప్రయోజనంబు లే” దనుటయుఁ, గుండలీంద్రుండు పుండరీకునిం జూచి “మాకులంబువారు సంజీవనమణియు సుధాపాత్రంబు నీయరు. శ్రీహరికృప గలిగిన యర్జునున కేమిఁకొదవ. ఆ దేవుండు తానె బ్రతికించు” ననిన విని పుండరీకుండు విఫలమనోరథుం డై వచ్చినత్రోవఁ బట్టి చని సంగరాంగణంబునకు వచ్చి, యచ్చట గంధతైలానసిక్తంబులుఁ గనకదండమండితంబులుఁ గర్పూరప్రదీప్తంబులు నైన కరదీపికా సహస్రంబులు ప్రకాశింపఁ గొలువున్న బభ్రువాహనుని, నతనిచెంగట నర్జునుశిరంబు నంకతలంబున నునిచికొని దీనవాక్యంబులఁ బలవించుచున్న యులూచిచిత్రాంగదల నవలోకించి, విషాదంబు దోఁప ని ట్లనియె. “తల్లీ! నీ జనకుం డైనశేషుండు సంజీవనరత్నం బీయక లోభంబునం బలికిన రోసి వచ్చితి; మీర లింకఁ బుత్రసహితం బైనయగ్నిం బ్రవేశింపుం” డనిన విని బభ్రువాహనుండు క్రోధారుణ లోచనుం డై కనుబొమలు ముడిపాటు ఘటిల్లించి, క్ష్మా

కంబుఁ గరంబునం గైకొని "వృథా! శేషఫణి గర్వించి న న్నెంచక సభలో నిరాకరణవచనంబులం బలికెనే! దుర్మంత్రు లైనవాసుకితక్షకకర్కోటకధృతరాష్ట్రాదుల దుర్బుద్ధులు విని జీవరత్నం బీయం డాయెనే? ఈక్షణంబ పాతాళక్షోణికిం జని, సాక్షాత్కారంబుగా నిటలాక్షుండు (వారికి) సహాయుం డయ్యెనేని నాగలోకంబును నిశ్శేషంబు గావించి మృత సంజీవనమణియు సుధారసంబునుం దెచ్చెద నగవకుండుం"

---* బభ్రువాహనుండు సర్పములతోఁడ యుద్ధంబున కేగుట. *---

డని పలికి, మాతంగతురంగశతాంగవీరభటసమేతుం డై పుండరీకుండు మార్గంబు సూపఁ బాతాళంబునఁ బాతా ళంబునకుం జని శంఖభేరీమృదంగనిస్సాణాదివాద్యఘోషం బులు దిక్కులు పిక్కటిల్లం గడంగుటయు శేషుండు తక్షక వాసుకి కర్కోటకధృతరాష్ట్రాదులం జూచి, "బభ్రువాహ నుండు పితృమరణవ్యథాకులితమానసుం డై మనమీఁదికిం జనుదెంచె. చిలువకులంబుల నిరవశేషంబు సేయక విడు వండు. ధృతరాష్ట్రునిదుర్నీతి నాచరించుటవలన నాగకులం బున కింతయాపద యొదవె. ఇంక నేమిసేయంగలవారము? మీరు నపారబలసమేతంబుగాఁ బోరికిం జనుండు." అనిన విని కుండలిమండలీంద్రునియాజ్ఞ శిరంబున ధరియించి వా సుకితక్షకశంఖకర్కోటకమూషకాదకాళీయప్రభృతు లైన సర్పకులాధ్యక్షులు రత్నకుండలకిరీటహారకేయూరమాల్య చందనదుకూలాదులు ధరియించి, కరితురగరథభటసమూ

హంబులతో వెడలి కదనంబునకుం దలపడుటయుఁ గల్పాం
తకాలంబున ఘూర్ణిల్లు పూర్వపశ్చిమసముద్రంబులకైవడిం
గనుపట్టె. నాగకుమారులు, కరితురగరథారూఢులై పం
చయోజనవిస్తీర్ణం బైననరసుతునిసేనలోనం జొచ్చి విష
జ్వాలామాలికల దహించుటయు, విజయసుతుం డవష్టంభ
విజృంభితుం డై, మయూరాస్త్రంబు ప్రయోగించుటయు,
నపారంబు లైనమయూరంబులు వెడలి యిన్నూఱు ము
న్నూఱు నన్నూఱు పడగలు గలిగిన ఫణులఫణంబుల
నుఱుమాడుటయు, వానిశిరంబులనుండి ప్రళయకాలంబు
నందలి యుల్కాపాతంబులకరణి శిరోరత్నంబులు రాలం
దొడంగె. ఇత్తెఱంగునఁ గేకిలోకంబు కాకోదరంబులం
జీకాకుపడం జంచువులం జీరి నఖంబులం జించి ఱెక్కలం
గొట్టియుఁ బ్రేవులు ప్రోవులుపడ నాలికలు పేలికలవిధం
బునం దూలఁ దూలించుటయు నవ్విధంబుఁ గనుంగొని
యక్కుమారకంఠీరవుండు తోడనె మధుబాణంబుఁ బ్రయో
గించినఁ దేనియవాన గురిసె. ఆవెంబడిఁ బిపీలికాస్త్రం
బేయుటయు నందువలన నుక్కుముఖంబులచీమలు పెక్కులు
వెలువడి పాములశరీరంబులు దొలిచి తూటలువాఱం
జేయుటయుఁ జిలువదళంబులు తలబీకనకాయలు యథా
యథలు కకావికలు నై మొనగట్టం జాలక శేషాహిఁ జెంగ
టికిం బఱచిన, వారలం గనుంగొని భుజంగపుంగవుండు
"ధృతరాష్ట్రా! నీదుర్మంత్రంబువలన నింతయాపద సంభవిం

—* బభ్రువాహనుఁడు సంజీవనమణిఁ దెచ్చుట. *—

చెను. ఇప్పుడు నీకుయుక్తి యెక్కడికిం బోయె" నని నిరసించి యాక్షణంబె బభ్రువాహనునకుఁ గర్పూరమయం బైనదివ్య కవచంబును, శతశలాకాఛత్రంబును, రత్నకుండలాభరణంబులును, గంధమాల్యదుకూలాదులు నుపాయనంబులు ఘటించి గాండీవికిం దగిన కట్నంబులు బంగరుపెట్టియలం జతనంబు సేయించి మృతసంజీవనమణియు నమృతకుంభంబునుం గొనుచుఁ దక్షకకర్కోటకాదులు గొలువఁ బాతాళగహ్వరంబు వెలువడి, బభ్రువాహనుని సంధించికొని యతని తోడంగూడ మణిపురంబునకు వచ్చె.

—* నాగకుమారు లర్జునుతల నపహరించుట. *—

అప్పుడు శేషుండు సభలోఁ దన్నవమానించుటవలన ధృతరాష్ట్రుండు దుఃఖితుం డై గృహంబునకుం జని దుర్బుద్ధి దుస్స్వభావు లనునామధేయంబులు గలకుమారులం బిలిచి బభ్రువాహనునిచే నైనపరాభవంబు దెలిపి "నేను ధృతరాష్ట్ర నామధేయుండఁ గావునఁ బాండవులకు మనకు మొదల నుండి యెడతెగనివైరంబు మీ రెఱింగినయదియే కదా? ఇప్పు డాఖండలసుతుండు బ్రదుకకుండు నుపాయంబు చింతింపుం" డనుటయు, వారలు తండ్రి నవలోకించి "శిరంబు దాఁచితి మేని కిరీటిం బ్రతికింప సంజీవనమణియు శేషుండునుం గాదు శ్రీకృష్ణుండేనియుఁ జాలండు. అంతట నయ్యశ్వంబు నశ్వంచేనియు హరించు. ధృష్టసంనుండు యుద్ధవిహీ-

నుం డై చెడు. అంతట నీపగ దీఱు. కావున నర్జునుశిరంబు
మే మపహరింతుము. నీవు మనంబునం గుందవలవ" దనిన
ధృతరాష్ట్రుండు సంతుష్టాంతరంగుం డై యుత్తరంబు సేయుం
డని తనపుత్రులం బనిచి తా నెఱుంగనియట్లు శేషాహి వెం
బడిం జనియె. ఆక్షణంబ ధృతరాష్ట్రునికొడుకులు మాయా
రూపంబుల వచ్చి విజయునిశిరంబు నపహరించుకొని గరుడ
సంచారవర్జితం బైనబకదాల్భ్యవనంబున దాఁచిరి. అప్పు
డులూచియుఁ జిత్రాంగదయు గాండీవిమస్తకంబు గానక నలు
దిక్కులుఁ బరికించి వదనోదరంబులు మోఁదికొనుచు వసుధా
తలంబునం బొరలాడుటయు నక్కోలాహలం బాలకించి
బభ్రువాహనుం డరుదెంచి యర్జునుశిరంబు గానక మూర్ఛా
క్రాంతుఁ డై పుడమిం బడియె. ఆరాత్రి కరినగరంబునఁ గుం
తీదేవి దుస్స్వప్నంబుం గని దిగ్గన లేచి దిగులుసెంది కన్నుల
బాష్పకణంబు లొలుక వెన్నుండును యుధిష్ఠిరుండు నున్న
యెడకుం జనుదెంచి గద్గదకంఠంబుతోఁ "కంసమర్దనా!
నేఁడు నాకలలోన నీమఱంది యగునర్జునుండు నూనియ
మేన నలందికొని తైలకూపంబున మునింగినట్లును గోమ
యంబు శరీరంబునం బూసికొని రక్తమాల్యంబులు ధరి
యించి యొంటె నెక్కి దక్షిణాభిముఖుం డై పోవునట్లునుగాఁ
గలఁ గంటి. నాస్వప్నంబు దప్పదు. కిరీటికిం గీడు వచ్చుట
నిజంబు. అంతరంగంబు గలంగుచు నున్నయది. నీవు దయ
సేయుట కిది సమయం బని రోదనంబు సేయుటయు, నాప

—* శ్రీకృష్ణుండు మొదలగువా రర్జునునిదగ్గఱకు వచ్చుట. *—

ద్వ్యాంధవుం డైనయచ్యుతుండు వెఱవకు మని యూఱ డించి స్మరణమాత్రసన్నిహితుం డైనపక్షిరాజుమీఁదఁ గుంతీ యశోదాదేవకీభీమసేనులతోడం గూడ నధిరోహించి ముహూర్తమాత్రంబున మణిపురంబునకుం జని యచ్చట *ఖండితంబు లైనవేదండశరీరంబులును భిన్నభిన్నంబు లైనతురంగదేహంబులును జెక్కుచెక్కు లైనయరదంబులును జల్లెడక్రంతలుపడి దొర్లినసుభటకాయంబులును జూర్ణంబు లైనభూషణంబులును* నుఱుము లైన గదాఖడ్గముసలాద్యాయుధంబులును ఛిన్నంబు లైనయాతపత్రంబులును శీర్ణంబు లైన కేతనంబులును నిధనంబు నొందినమహారథికులును గలిగి దుర్నిరీక్ష్యం బైనయుద్ధరంగంబునఁ బక్షికులపుంగవునిం దిగి పద్మాక్షుండును భీమసేనుండును గుంతియు దేవకీయశోదలును నిరుత్సాహంబుగా నరిగి శిరోవిరహితం బైనగాండీవికాయంబుఁ గనుంగొని రోదనధ్వనులు రోదసీకుహరంబునఁ బర్వ మూర్ఛల మునుంగుచు నుండునంతఁ (1)గుంతి నిధనంబు నొందిన ధనంజయుం గనుంగొని వదనంబు కరపల్లవంబుల మోఁదికొనుచుఁ గన్నులనీరు చెక్కుల జాఱ.... వెల్లువలువాఱ నపారశోకసాగరంబున మునింగి చెన్ను దొఱంగి డెందంబు కరంగి మూర్ఛ నణంగి యొక్కింతసేపునకుఁ దెలిసి "హా! సుకుమారా! హా! వరగుణాధారా! హా!

* ఈపువ్వులనడుమనున్న వాక్యము లొక్కప్రతిలోమాత్రమే కలవు.

—* కుంతి యర్జునుమరణంబునకు విలపించుట. *—

విద్యావినయవిహారా! హా! కులకలశపారావారకుముదబాంధవా! నోమరానినోములు నోమి, చేయరానితపంబులు సేసి యుండరానియుపవాసంబు లుండి యనేకదానంబు లొసర్చి నియమవ్రతంబున నిన్నుఁ గాంచి నాఁటఁబెంచువానిఁ బూఁటఁబెంచి దాది అోమ్మున దూఁదిపాన్పున నుంచి యభివృద్ధి నొందించి కడపట బభ్రువాహనునియస్త్రాగ్నిజ్వాలల పాలు సేయవలసెనే! నీభుజాబలంబు మంటం గలసెనే! ఎండకన్ను నీడకన్నెఱుంగనట్టి పుట్టుభోగికినిట్టి వెతలు గంగాశాపంబునఁ బుట్టెనా! ధూళిధూసరితగాత్రుండవై శిరంబు లేక చేష్టలు దక్కి ధరాతలంబునఁ బడియున్న నిన్నుఁ జూచి కడుపుదహించికొనియె; నన్న! నన్నుఁగన్నకన్న! నిన్నుఁ గన్నది మొదలుగా నడవులం దిరిగియు నిడుమలం బడియు వెతలఁ జెందితినె కాని సుఖంబున నుండ నోఁచనైతి. నాముద్దులకొడుకా! యెటులోర్తురా! నీవంటిన్యాయానువర్తికి నీవంటి ధర్మమూర్తికి నీరీతి ధాత వ్రాయఁదగునె! నన్నుఁ గన్నతండ్రీ! యరవిందదళంబులం బోలుకన్నులు నరుణబింబాధరంబు నంకురితమందహాసంబు నైననీముఖంబుఁ గనుఁగొనకయున్నను జక్కెరపానకంబులఁ బోలునీచక్కనిపల్కులు వీనులవిందుగా వినకయున్నను....నిమిషమాత్రం బేనియుఁ బ్రాణంబు నిలువఁ జాలదురా! ఈశోకసాగరం బెటువలె నీఁదుదురా! ఎన్నివిధంబులఁ బిల్చినఁ బలుకవేమిరా!

దేవదేవుం డైన శ్రీకృష్ణుండు ప్రాపై యుండ నీకితరభయంబు లే దని యెంచి కన్నులపండువుగా నీమేను గందుఁగదయ్యా! (ఇపుడు) భానుకిరణంబుల నీమేను గందుఁగదయ్యా! ఇంక నిన్నేలాగున మఱతు! నాకెవ్వరు దిక్కు! న న్నెవ్వ రాదరించువారు! కమ్మనిమాటల నెమ్మి మీఱ నమ్మా యని న న్నెవ్వరు పిలుచువారు! తనయా! సద్గుణసంజాతనయా! దైవంబు తనమనంబునకు నిన్ను బరువుగా నెన్నెనో! చతుస్సముద్రముద్రితమహీపతులయతులమణికిరీటంబుల దాపిన పద్మరాగంబులడంబుల కెంపుసొంపుసంపదలం బొదలుపదంబులు గలిగిన మహారాజ వైననీకుం బండి యుండుటకుఁ జేరెడు పఱపు లేదయ్యెనే! అయ్యయ్యో! నందనా! హరిచరణారవిందవందనా!" యని తనయునికి నీపాటునచ్చెఁ దనయునికి నిఁక నేమిటి కని దైవమా యనుచు దైవమాయను దెలియవశమా యనుచు వగచి వగచి పేరెలుంగునఁ గుమారునిం బిలిచి పిలిచి యడలుచునుండు సమయంబున(2) శ్రీకాంతుండు కౌంతేయునిచెంగటికిం జని, "ధనంజయా! కుంతియు, యశోదయు, దేవకియు నిన్నుం గాననిదుఃఖంబునఁ బొగులుచునుండ నివ్విధంబున రాకయుందువె! ఎందుఁ బోయితివి! ప్రాణసఖుండ నైననన్నుం గన్నులు దెఱచి చూడ వదేమి" యని పలవించు శ్రీకృష్ణునిం జూచి భీమసే

(1)-(2) [illegible] వి.

నుండి ట్లనియె. దేవా! (నీవు) రమ్మని పిలుచుటం జేసి విజయుం డవశ్యంబును బ్రతుకును. మీచరణారవిందమ్ములు నమ్మినవారల కావంతయేనియు వంత రాదు. అని పలుకుచున్నంత సూర్యోదయం బగుటయు, బభ్రువాహనుండు తల్లులుఁ దానును మూర్ఛ దెలిసి కదనంబునం జిక్కిన ప్రద్యుమ్నునిచే శ్రీకృష్ణుని భీమసేనుని దేవకీయశోదాకుంతీదేవులను నెఱింగి భయభక్తివినయసంభ్రమంబులతో శ్రీకృష్ణునకు మ్రొక్కి భీమసేనునకు వందనంబు సేసి కుంతీదేవకీయశోదలకుం బ్రణమిల్లి కృతాంజలి యై యుండె. అప్పుడు పన్నగాధీశ్వరుండు పద్మనాభునిసన్నిధిం జేరి "దేవా! సంజీ

—* శ్రీకృష్ణుఁ డర్జునుని బ్రదికించుట. *—

వనరత్నంబు వచ్చియున్నయది. మీచెలికానిశిరంబు నపహరించిననీచమతులం బట్టి తొల్లి రాహుకేతువులం దునిమిన మాడ్కిఁ దెగటార్పుము. ధర్మజుకులంబు నిలుపుము. ఇంతటికి హేతు వర్జునుని బ్రతికించుట; శిరంబు లేక బ్రతికింపం గూడదు గావున దేవరదివ్యదృష్టిచే నరునిశిరం బున్నతా వెఱింగి రప్పింపు" మనుటయు, బ్రహ్మమయుం డైనపురుషోత్తముండు ప్రతిన సేయం దలంచి, "నేను త్రిలోకవిఖ్యాతం బైననైష్ఠికబ్రహ్మచర్యవ్రతంబునం బెంపొందినవాఁడ నైతినేని, సత్యంబు దప్పనివాఁడ నైతినేని నరునిశిరంబు వచ్చుంగాక! తచ్చోరకులశిరంబులు వ్రయ్యలగుంగాక!" యని పలికిన యాక్షణంబ వాసవసుతునిశిరంబు వచ్చె. ధృతరాష్ట్ర

సూనులశిరంబులు శతశకలంబు లయ్యె. అంతఁ గిరీటివృష
కేతనులశిరంబుల శరీరంబులతోడం గూర్చి సంజీవనరత్నం
బురంబున నునుచుటయు నయస్కాంతసంయోగంబున
లోహంబునుం బలె వారలతలలు నట్టలు నేకంబులై తోడన
ప్రాణంబులు వచ్చె.

తదనంతరంబ సంజీవనరత్నవైభవంబున వృషకేతుండు
లేచి శ్రీహరిం గీర్తించుచు సమీపస్థితుం డైనవైరి నదలించు
టయు, ముకుందుండు ముదంబునం గౌఁగిలించె. అర్జు
నుండు నట్లె లేచుటయు, నెండఁ గొట్టువడినసస్యంబులు
వానచేతం దేఱినచందంబునఁ బాండవసైన్యంబులు కిరీటి
నవలోకించి హర్షంబు నొందె. అయ్యవసరంబున భేర్యాది
రవంబులును వందిజనస్తోత్రంబులును బృందారకులపువ్వుల
వానలు దివ్యదుందుభిధ్వానంబులును జెలంగె. కుంతీదేవి
యుఁ బునర్జన్మంబు నొందినపుత్రునిం గనుంగొని కౌఁగి
లించె. అంతఁ బ్రద్యుమ్నుండు దర్లింపఁ జతురంగబలం

—* శ్రీకృష్ణాదులు మణిపురంబున కేగుట. *—

బులు నేల యీనినతెఱంగునఁ బట్టణంబు సేరం జనునెడఁ
బద్మనాభుండును ఫల్గునుండును రాజమార్గంబునం జనుదెం
చునెడ, నన్నగరనారీశిరోమణులు నివాళించి చల్లుదివ్య
మణులం జూచి కుబేరుండు సైతంబు శిరఃకంపంబు సేయు
చు నచ్చెరు వొందె. అట్లు రమణీయం బైనమణిపురంబున
బభ్రువాహనునిమందిరంబునకుం జని దివ్యరత్నసభాస్థానం

బున మేరుశిఖరోపమానంబు లైనసింహాసనంబుల శ్రీకృష్ణుండును గాండీవియుం గూర్చున్న యవసరంబున, హంసధ్వజాదిమహీపాలకులు నుచితపీఠంబులం గూరుచుండిరి. అపుడు తల వంచికొనియున్న నరునిం జూచి శేషాహి యిట్లనియె. "అర్జునా! జయపరాజయంబు లనిత్యంబులు. అందులకై వగవం బని లేదు. విశేషించియు క్షత్త్రియులకు సర్వత్ర జయంబు గల్గినను బుత్త్రునిచేతఁ బరాజయంబు నొందుట మోదావహంబు గాని ఖేదావహంబు గాదు. నీకూర్మిపట్టి యైనబభ్రువాహనుని పౌత్త్రంబు గని మెచ్చక యిటువలె లజ్జించుట యుక్తంబు గాదు. అదియునుంగాక నీకు గంగాశాపనిమిత్తంబుగ నిట్టియాపద సంభవించె. చిత్తంబున నుత్తలంబు నొందక ముకుందచరణారవిందభక్తివైభవసంపాదితం బైనభవదీయనందనునిరాజ్యభోగంబు లనుభవింపుము. నీకళత్త్రంబు లైనచిత్రాంగదయు నులూచియు డెందంబుల నానందంబు నొందునట్లుగా నూఱడింపుము. ని న్నెదిరించుటవలన లజ్జితుం డైనకుమారునిం గౌఁగిలించికొని యాదరింపుము." అని పలికి యహివల్లభుం డంబుజనాభునిం గనుంగొని "దేవా! కవ్వడిమనంబునం దలి నొవ్వు దీఱ బోధించి దేవకీయశోదలుఁ గుంతియుఁ జిత్రాంగదయు నులూచియు మొద లగువారలమనంబులకు హర్షంబులు గలుగం జేసి భవదీయచరణారవిందసేవానిరతుండును బితృభక్తుండును భ్రాతృవత్సలుండును మాన

ధనుండును యశోనిధియు నైనబభ్రువాహనుండు జనకునిం జంపినపాతకంబునకుం బ్రాయశ్చిత్తంబుగా హిమవంతంబున కరిగి తనశరీరంబు పరిత్యజింపం దలంచి యున్నవాఁడు, గావునఁ దగుతెఱంగునం దెలియంబలుకవలయు" ననినయెడ నపుడు బభ్రువాహనునిం జూచి "కుమారకా! యాచార్యునిం బితామహుఁ దోఁబుట్టువులను వధించియు నచ్యుతునికటాక్షంబునలనఁ గలుషంబు లందక మేము సుఖంబున నున్నవారము. నీవేటికి వెఱచెదవు? మీతండ్రియు బ్రతికె. నీవు క్షత్రధర్మంబు చెల్లించుకొంటివి. నాల్గుయుగంబుల నేదేవుని నామస్మరణంబుఁ గావించినమాత్రంబునఁ బాపంబులు నాశంబగు నద్దేవదేవుం డైవనగు దేవకీనందనుని నమ్మియున్నమనకు శోకంబును బాపభయంబును దైన్యంబును (బొందఁ) బనిలేదు." అని బహువిధంబులం దెలియంబలుకు భీమసేనునివాక్యంబులు విని చిత్రాంగదానందనుండు విషాదంబు మాని ప్రసన్నముఖుం డగుటయు, రాజాధిరాజు లందఱు నతనిగుణంబులు నానావిధంబుల నుతియించిరి. అంత మురాంతకుండు కౌంతేయమధ్యముండును భీమసేనాదులతోడం గూడ నపరిమితంబు లైనభోగంబు లనుభవించుచు సంగీతసాహిత్యనాట్యప్రముఖవిద్యావినోదంబులం బ్రొద్దు గడపుచు మణిపురంబున నయిదుదినంబులు వసియించిరి. ఆసమయంబునఁ గృష్ణుండు పురందరనందనునిం జూచి "నీనందనుని

మందిరంబున నయిదుదినంబు లుంటిమి. అఖిలశ్రమంబులు దీఱె. మనతల్లులను గోడండ్రను ధనకనకవస్తువాహనసమూహంబులను భీమసేనునివెంబడింగూర్చి యజాతశత్రునికడకుం బంపుదము. వీరలు ధర్మజుచే యజ్ఞం బుపక్రమింపం జేసి తద్విధానంబు నడపించెదరు. ఇంకమీఁద నింతకంటె బలవంతు లైనరాజులు పెక్కండ్రు గలరు. కావున హయరక్షణంబునకు ని న్నొంటిగా నంపం జాలను. నేనుం గూడ వచ్చెద" నని పలికి దేవకిమొదలైనసతీనివహంబులను ధనరాసులం గూర్చి భీమసేనునివెంబడి హస్తిపురంబునకుం బనిచె. అనంతుండు చిత్రాంగదాకుమారునిచే బహుమానంబు గాంచి కృష్ణార్జునుల వీడ్కొని పాతాళంబునకుం జనియె.

—* తామ్రధ్వజుండు పాండవాశ్వంబును బట్టించుట. *—

తదనంతరంబ గోవిందునియనుమతిచేఁ దరలింపంబడిన యధ్వరాశ్వంబు నానాజనపదంబులు గడచి క్రమంబున మయూరధ్వజుం డనువసుంధరావరునిచేఁ బరిపాలితం బైన రత్నపురంబు సేరంబోవు నవసరంబున నామయూరధ్వజుండు తాను నశ్వమేధంబు సేయ సంకల్పించి పుత్రుం డైనతామ్రధ్వజునిఁ దురంగరక్షణంబునకుం బంపిన దైవయోగంబున నారెండుగుఱ్ఱంబులు నొండొంటి నెదుర్కొని కయ్యంబునకుఁ గడంగి భీషణంబు లైనహేషారవంబులు సేయుచు మోము మోమునం జేర్చి పూర్వఖురాగ్రంబుల

భూతలంబు ద్రవ్వి దుమ్ము లెగయించుచు నొక టొకటిం జుట్టుకొని కందంబులం గబళించి విదళించునెడ మయూరధ్వజునిహయంబు లోఁబడుటయుఁ బాండవహయంబు పైకొని దంతంబులం గళంబు గబళించి..................గడంగుటయుఁ, దామ్రధ్వజుండు క్రోధతామ్రాక్షుండై నకులధ్వజనామకుండైన సేనానాయకుం జూచి యీహయం బెవ్వరిది విచారింపు మనిన, నతండు సత్వరంబుగా నాఘోటకంబు దాఁటకుండఁ జతురంగంబులఁ జుట్టు నిలిపి వేడెంబులు వెట్టు నావాజిం బట్టికొని చుంచువు బిగియంబట్టి నుదుట నున్న హేమపట్టిక గలయుం జూచి చదివి యవ్విధంబు తామ్రధ్వజునితో విన్నవించుటయు, నతండు నవ్వుచు "మనదొరయగుమయూరధ్వజుం డేడశ్వమేధంబులు సేసె. ఇంక నెనిమిదవయాగంబు సేయుంగాక" యని యత్తురంగంబుఁ బట్టి కట్టించి నకులధ్వజునిం "జూచి సేనాగ్రణీ! పాండవసైన్యంబున వృషకేతుండును గాండీవియుం దక్కఁ జేవ గలమగలు లే రని నిన్నరేయి నారదుండు వలికె. నేఁటికి నరనారాయణులతోడి సమరంబు మనకు దొరకె." అనిన విని దళవాయి యతనిం జూచి "పాండవసైన్యంబున బభ్రువాహనుం డొక్కరుండు శూరుం డంటిమేని వాఁడును దేవరనాటకశాలవధూటులకుఁ బుష్పాంజలులు సేయం దగుముత్తియంబు లొసంగువాఁడు. తక్కినవార లెవ్వ రున్నా" రని వీరాలాపంబులు పలుకుచు సైన్యంబు నర్ధచంద్రవ్యూహంబుగాఁ

బన్నించి. తానునుం గట్టాయితంబై విక్రమాటోపవిజృంభితుం డైనతామ్రధ్వజుని ముంగల నిలుచుటయు, నారాయణుండు నరునిం జూచి మహాయోధవీరులకు మరణకారణం బైనరణంబు నేఁటికిఁ బ్రాపించె. ఎదుటివారలు కాలాంతకరుద్రులకు సమానులుగాని సామాన్యులు గారు. అని పలికి ప్రద్యుమ్నునిం జూచి మనబలంబులనెల్ల గృధ్రవ్యూహంబుగాఁ బన్నింపు మని నియమించి దారకుండు తెచ్చిన తన యరదంబు నెక్కి దిక్కులు పిక్కటిల్లం బాంచజన్యంబు పూరించె. అమ్మహావ్యూహంబున ననుసాళ్వుండు కంఠంబును హంసధ్వజుండు వక్షంబును బ్రద్యుమ్నానిరుద్ధులు పక్షంబులును సాత్యకికృతవర్మలు చరణంబులును బభ్రువాహనుండును సత్యభామాతనయు లగుచిత్రభాను చారుచిత్రులు ముఖంబును జంచువులును నపరిమితసేనాసమేతుం డైన గాండీవి యుదరంబును నతనినలు గెలంకులఁ బుండరీకాక్షుండును వృషకేతుండును యౌవనాశ్వుండును మేఘవర్ణుండునుం గా నభేద్యం బైనవ్యూహంబుఁ బన్ని యెదిర్చినం గనుంగొని తామ్రధ్వజుండు గరుడధ్వజునిం జూచి "నారాయణా! నీవు శూరుండును బౌరుషవంతుండునుం బలె శంఖచక్రగదాద్యాయుధంబులు పూని నన్నెదిర్చితివి. నాహయంబుఁ బట్టింపవలసదె?" యనిపలికి యట్టికవలనం గన్నుల విస్ఫులింగంబులు దొలుకఁ నిజరథంబు నేరం దెచ్చె.

—* ప్రద్యుమ్నాదివీరులు తామ్రధ్వజునితోఁ బోరాడుట. *—

తదనంతరంబు తామ్రకేతుండు గాండీవి మొగ్గరంబు డగ్గఱి, యర్ధచంద్రబాణంబు లనేకంబులుగాఁ బ్రయోగించి రక్తమాంసంబులు నలుదిక్కుల వెదచల్లి, కార్ముకజ్యానాదం బనియెడు మంత్రంబుచే శాకినీడాకినీప్రముఖంబు లైనభూత గణంబులఁ బిలిపించి రణధరామండలంబు మెండుకొనం జేసి యేడువాఁడిబాణంబుల వాసుదేవువక్షంబు వ్రక్కలించి యేనింట సూతుని నుక్కడరించి నాల్గునారసంబుల శైన్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకంబుల గ్రుచ్చి యర్జును డెబ్బది బాణంబుల సాత్యకిం దొంబదిశరంబులఁ గృతవర్మ నెనిమిది సాయకంబులఁ బ్రద్యుమ్నుని వేయుమార్గణంబుల ననిరు ద్ధుని లక్షవిశిఖంబుల ముంచి వెండియుం దనివోక హంస ధ్వజయౌవనాశ్వప్రముఖు లైనమహీపతుల నుక్కణంచి పట్ట పగలింటి సూర్యునిపగిదిం బ్రతాపించి సింహనాదంబు గావించుటయుఁ, దనమీఁదం గురిసిన బాణవర్షంబు నివారించి యనిరుద్ధుండు మహోద్ధతుం డై యనేకసహస్రసంఖ్యం బు లైనమాశుగంబులు గురియించి యెదిరించినవీరులమదం బణంచుచుఁ బ్రచండకాలానలజ్వాలికాభీలంబు లైనయమ్ము లొక్కుమ్మడిం గుమ్మరించుచు నలుదిక్కుల నెత్తురుటేఱులు పాఱించి మూఁడక్షౌహిణులు సమయింపంజేసి శింజినీనాదంబును సింహనాదంబునుం జెలంగఁ బగతునిం జూచి "ఏమిరా! యింకమీఁదనైనం దురంగంబు విడువవేని

బంటుతనంబున గెంటక నాయెదుట నొంటికయ్యంబునకు నిలువు" మనినఁ, దామ్రధ్వజుండు, తామ్రాధరంబున నించుక చిఱునగ వంకురింపఁ "బువ్వులవిలుకాని కొడుకవు గదా! యనిరుద్ధా! నిన్నుఁ దొల్లి బాణుండు నిరుద్ధుం జేసి నప్పు డుషాకన్యమంగళసూత్రవైభవంబునఁ దల దప్పె. నేఁటి కింక నిన్నుఁ బోనిచ్చువాఁడం గాను" అనిన విని యనిరుద్ధుండు మహోద్ధతి మెఱయ బడబానలశిఖాసఖంబు లైనవిశిఖంబు లడరించి వక్షస్థలంబు వ్రక్కలించి యొక్క నెలవంకబాణంబున సూతునితల డులిచి తేరితురంగంబుల నాల్గింటం గూల్చి యార్చిన సుచిత్రనామకుం డైన యా తామ్రధ్వజుండు కత్తియుఁ గేడెంబునుం బూని తేరు డిగ్గ నుఱికినఁ, బ్రద్యుమ్నకుమారుండును, గరవాలంబును బలకయుం బూని భూమికి దిగిన, నయ్యిరువురు సింగంపుఁగొదమలతెఱంగునం గెరలి ఖడ్గాఖడ్గిం బోరాడుచుఁ గ్రమ్ముచుఁ గ్రుమ్ముచు లో వెలిం జిమ్ముచుఁ గృపాణంబులఁ డోకించుచు నొండొరులం జోకించుచు మర్మంబు లదరంట వ్రేయుచుఁ జండించి వెనుకకుం బాయుచు బిసబిస లెసంగ నసిలతల విసరుచు మేలు! బళీ! యేది మాయన్న! యని కొసరుచుఁ గత్తెరయడుగులగతిం జిత్తరపాతరలవలె నటించుచుఁ గేడెంబుల డంబుగా ఘటించుచుఁ బేరెంబులువాఱుచు బీరంబులు మీఱు నెట్టమంటిగట్టున గోరాడినమదపుటేనుంగుల చందంబున నెత్తుటం జొత్తిల్లిన గాత్రంబులం గనుపట్టుచు నొండొ

రులవ్రేటులచే ఖేటకకృపాణంబులు తునుకలగుటయుఁ బిఱుతివియని బంటుతనంబున బాహుయుద్ధంబునకుం జొచ్చి యాజగజెట్లు దగదొట్టక ముష్టీముష్టి బాహాబాహిఁ గచాకచిం గడంగి, పెద్దయుం బ్రొద్దు పోరాడినయెడ ననిరుద్ధుండు దగ నిలుపం జాలక జగతీతలంబునం బడి మూర్ఛనొందుటయు, సుచిత్రుండు గగనంబు పగుల నార్చుచు వేఱొక్కయరదం బెక్కి ప్రద్యుమ్నునురంబు నైదుశరంబులఁ గరంబు నొప్పించుటయుఁ, గర్ణనందనుండు సుచిత్రునిగాత్రంబున నాఱుశరంబులు గ్రుచ్చి విరథునిం జేయ, నతండు వేఱొక్కరథం బెక్కి విలు గుణధ్వని సేయ నయ్యరదంబునుం దునిమె. ఇవ్విధంబున మున్నూఱురథంబులు ముహూర్తమాత్రంబులో శకలంబులు గావింప వేఱొక్కతే రెక్కి నిశితవిశిఖంబులు కర్ణపుత్రునిపయిం బ్రయోగించిన రోగంబు తనువునం బుట్టిన మాడ్కి దుర్దశం జెందె. అన్నృపకేతనుని పాటు గనుంగొని యనుసాళ్వుం డెదిరించుటయు, నతని నైదింటను యావనాశ్వ నొక్కయుక్కటమ్మునఁ గృతవర్మని రెండుకాండంబుల స్రుక్కించుటయు, సాత్యకి మార్గాని యారాజు తేరివాజులం దునిమి శంఖంబు పూరించిన నానాదం బాలకమున్న తామ్రధ్వజుండు క్రూరనారాచపరంపరలచే సాత్యకివక్షంబు విక్షోభంబుసేసిన మూర్ఛాపరవశుండై, శైనేయుండు, లోచనంబులు మోడ్చి, యరదంబుమీఁద వ్రాలినఁ జిత్రాంగదకుమారుండు వజ్రోపమానంబులైన

వాఁడిబాణంబు లైదు వానియురంబున నాటించుటయుఁ దామ్రకేతుండు చిఱునవ్వు మొగంబు నలంకరింప "బభ్రువాహనా! మాకు నెప్పు డప్పనంబుగా నీయం దగిన ముత్తియంబులు పెటికలం బట్టి తెప్పించితే" యని పలుకుచుఁ గల్పాగ్నికీలాసఖంబు లైనవిశిఖంబులవాన గురిసి విముఖునిం జేసి, యంత నిలువక మహోగ్రబాణంబులచే మరాళకేతునిఁ బరాజితునిం జేసి ప్రళయకాల తాండవోద్దండ ఖండపరశుండునుంబలెఁ బాండవసైన్యంబు ఖండించుచు నుండెను.

ఇవ్విధంబున వైరిసేనాధూమకేతుం డైన తామ్రకేతుని భుజావిజృంభణంబు గనుంగొని పాండవసైన్యంబులు దైన్యంబు నొంది చచ్చియు నొచ్చియు విచ్చియుఁ జెల్లాచెదరుగాఁ బఱచునెడఁ దురంగమాతంగవీరభటాంగంబులం దొరఁగురక్తం బనుజలంబును గేశంబు లనునాఁచుతీవియలు బాణకృపాణకుంతతోమరంబు లనియెడి మీనంబులును ధవళాతపత్త్రంబు లనియెడి నురుగులును యోధవీరులముఖంబు లనియెడి పద్మంబులును ఖండింపంబడిన వేదండతండంబు లనియెడి గట్లును ధ్వజంబు లనియెడి వేతసకుంజంబులును రథంబు లనియెడి యోడలునుం గలిగి రక్తనదీప్రవాహంబు ప్రవహించె.

అపుడు కిరీటిచెంగటివీరులు వాలంపగములం బొదువంబడి యేదువెఱఁగినచందంబునఁ జేయి కాలు గదలింపం

గూడమి నాలంబునకుఁ జాలం బురికొనం జాలక, సవ్య సాచిం జూచి బంధువధజనితం బగుపాతకంబు నివారింపం గోరి, యశ్వమేధంబు సేయ సమకట్టి మమ్ముఁ దామ్రధ్వజు వారికిఁ బోరిగొఱియలం జేసితివి. ఇందున నీకేమిప్రయోజనంబు? అని దూఱినం గ్రీడి యోడకుండుం డని వారల నూఱడించి తేరు వైరిసమ్ముఖంబు సేసి మెఱుంగువాలంప గుంపులచేఁ దామ్రధ్వజునికాయంబు గాయంబులు చేసి విరథునిం గావించుటయు నబ్బిరుదుమగండు వేఱొక్క యరదం బెక్కి, కవ్వడి! యెక్కడఁ బోయెదవు! యాగసైంధవంబుతో నిను గూడ బంధించి కొనిపోయెద ననిపలుకుచుఁ గులశైలంబు వర్షధారలం గప్పుకాలమేఘంబుచందంబునఁ గంకపత్రవిచిత్రితంబు లైననిశితవిశిఖంబులం బరఁగించుటయు, వానివేగంబున నర్జునురథంబు యోజనమాత్రంబు వెనుకకుం జనిన మగిడించి యతివేగంబున వచ్చి తన సేనలం బొలియించుతామ్రధ్వజుని యరదంబు తారాపథంబున కెగయఁ గ్రూరనారాచంబులు పఱపి దేవదత్తంబు పూరించె. ఇవ్విధంబున నంతంతకు మంతున కెక్కుపతంబులును, బిఱుతివియనిచలంబులును, నగ్గలికలు మెఱయ నేడహోరాత్రంబులు చిత్రవిహారంబులం బోరిరి. ఆసమయంబునఁ దామ్రధ్వజుని తేరు తిలమాత్రశకలంబులుగాఁ ఖండించి, యగ్గాండీవి, వెండియు వాఁ డెక్కినరథం [illegible] జేసి యక్షౌహిణి

బలంబుఁ బరిమార్చె. తామ్రధ్వజునిచేఁ గౌంతేయుని బలంబు నట్లు నిధనంబు నొందె. అంత మహాబలపరాక్రమధురీణుం డైన తామ్రధ్వజుండు మాంసఖండంబుఁ రెక్కొని పోవుసాళువంబుచందంబున నకిరీటితోడంగూడఁ దద్రథంబు నొక్కకరంబున నెత్తికొని యాకసంబునకు దాఁటి భూతలంబునకుం ద్రిప్పి వైచుటయు, విశ్వచ్ఛుండు చచ్చెఁ జచ్చె నని సైనికు లాహారవంబులు సేసిరి. అప్పుడప్పురుషోత్తముండు, నిజకరాబ్జంబునం బడకుండఁ బట్టికొనుటయుఁ దామ్రకేతుం డలుక దొలుక గదాధరునిం జూచి "యర్జునితోఁ బోరునపుడు దొమ్మికిం దలపడితివి. ఇది వీరధర్మంబు గా" దని పలుకుచు దంభోళిసన్నిభం బైనయొక్కశరమ్ము వింట సంధించి యాకర్ణాంతంబుగాఁ దివియునంతలో మురాంతకుండు వానిరథంబునకు దాఁటి తద్వక్షస్థలంబు దన్ని, తనచేత గదాదండంబు ద్రిప్పి, వానినడునెత్తి గాతు కలఁగఁ గొట్టి లంఘించుటయు, నతండును జలింపక, నిజస్యందనంబు చిత్రగతుల నటింపం జేయుచుఁ, జతురంగబలంబుల బారిసమరుటయు, ముకుందుండు నర్జునుం జేర్కొని, మనయోధయూథంబులు యథాయథలుగాఁ గలంగె. ప్రద్యుమ్నాదియోధవీరులు మూర్ఛ దెప్పిఱం జాలక యున్నారు గావున మన మిరువురము వీనితోడం దలపడి పోరవలయు నని శార్ఙ్గకోదండం బెక్కు వెట్టి దిక్కులు

గ్రక్కదల గుణధ్వని గావించుటయు, గాండీవియుఁ దనకోదండంబు నధిజ్యంబు గావించి మౌర్వీరావంబున భూనభోఽంతరంబులు పూరించె. ఇవ్విధంబునం గృష్ణార్జును లిరుగెలంకులం బిడుగులంబోని బెడిదంపుటంపజలపరంపర వాడుటయుఁ, దామ్రధ్వజుండు సరకుగొనక యిరువురచాపంబులు మౌర్వి నెడలం జేయుటయు, నింద్రనందనుం డుపేంద్రునిం జూచి యీయల్పునిమీఁద నీ వాయుధంబు నెత్త నేమిటికి? ముహూర్తమాత్రంబున వీనిం బరిమార్చెద. నీవు నాకు సారథి వై యుండినం జాలు ననిన వనజనాభుం డియ్యకొని యుగ్యంబుల పగ్గంబులు గేలం బూని చిత్రంబుగా సారథ్యంబు సేయుటయుఁ, దామ్రధ్వజుండు క్రోధతామ్రాక్షుం డై పదితూపులం గృష్ణుని నఱువదిశరంబుల నర్జునుని నాటించి గొడుగు తెగవేయుటయు, వాసవతనయుండు వానియరదంబు నూఱు శకలంబులు సేసె. దానం గలంగక యారాజనందనుండు మదపుటేనుంగు నెక్కి యుక్కుటమ్ము లొక్కుమ్మడిం గురిసినఁ దూపులతెక్కలవలనం బొడమిన సుడిగాలిలోనం దవిలి నరునియరదంబు గాలిచక్రంబుచందంబున బిఱబిఱం దిరుగుసమయంబునఁ బ్రద్యుమ్నాదియోధవీరులు మూర్ఛ దెప్పిఱి నిశితశరపరంపరల నొవ్వ నేయుటయుఁ, దామ్రకేతుం డవక్రపరాక్రమంబున నవ్వీరవరుల నారాచధారాపూరంబుల ముంచి మగుడ మూర్ఛ నొందించె.

—* తామ్రధ్వజుండు యాగహయంబుఁ గొని
పురంబునకుఁ బోవుట. *—

(1) తదనంతరంబ కంసమర్దనుండు కోపాటోపదీపితుండై సహస్రధారాఘోరం బైనసుదర్శనంబుఁ గేలం బూని నక్షత్రతారాగ్రహసహితం బైనగగనంబును శైలకాననసమేతం బైనభూతలంబును గంపింప రథంబు డిగ్గనుఱికి యెదుర వచ్చుటయుఁ, దామ్రధ్వజుండు నవ్వుచు, "శ్రీకృష్ణా! వృష్ణికులభూషణా! (2)యీనాఁటికిఁ గౌంతేయునిఁ గావం బూని నీవు చేసినసుకృతంబు నిచ్చివేసితివి. ఇవు డీదేహంబే యీయం జూచెదవు. మంచిది కానిమ్ము. నిన్ను నీమఱందిని నీహయంబులతోడంగూడఁ బట్టి కట్టి కొనిపోయెద నని యేనుంగు డిగ్గి శ్రీకృష్ణదేవునికరాంబుజంబు మెలివెట్టి చక్రంబు నులిమికొనునంతలో రమాకాంతుండు పేరెలుంగ గత్తి "యర్జునా! నాచేతిచక్రంబు నాఁచుకొని పోవుచున్నవాఁడు. వీని నీక్రూరనారాచధారాపరంపరల వెంపరలాడి విడిపింపు" మనుటయుఁ, గౌంతేయుండు శత నిశితవిశిఖంబుల వానిపార్శ్వంబు నొప్పించిన లెక్కగొనక తామ్రధ్వజుండు కృష్ణార్జునుల నిరువుర రెండుచేతులం బట్టి బిగియించి మూర్ఛ నొందించి భూమిం బడవైచి రెండు యాగహయంబులం బట్టికొని పురంబునకుం జని నిజజన

(1)-(2) నడుమ నున్నవాక్యములు రెండుప్రతులలోను వేఱువేఱుగా నుండుటచే నిం దొకప్రతి ననుసరించి ముద్రింపఁబడినవి.

కుం డైనమయూరధ్వజునిచెంతకుం బోయి మ్రొక్కి నిలిచి సేనాపతి యైననకులధ్వజునిదిక్కు గనుంగొనిన, నతండు, మయూరధ్వజునితో "నీకుమారుండు కృష్ణార్జునులం గెలిచి సవనహయంబులం బట్టికొని తెచ్చె" ననిన విని యతండు కోపంబునం గన్నులం గెంపు గదురం గొడుకు నవలోకించి "నీవు శ్రీకృష్ణార్జునులం గొనిరాక తురంగంబుమాత్రమె తెచ్చితివి. ఇంతపడుచుందనంబు గలదె! యజ్ఞమయుండును యజ్ఞకర్తయు యజ్ఞభోక్తయు యజ్ఞఫలప్రదాతయు నైనశ్రీవాసుదేవుండు లేనిజన్నం బేమిటికి? ఎవ్వరినుద్దేశించి యాగంబు సేయంగలవారము?" అని భార్యయుం దానును బరితాపంబు నొందుచు నడలుచు నున్నసమయంబున నర్కుం డస్తగిరిశిఖరంబునకు నలంకారం బై నిలిచె. పాండవసైనికుల వదనంబులు పంకజంబులంబోలె ముకుళితంబు లయ్యె. గాయంబులవలనం బొడమినరక్తరాగంబు సంధ్యారాగంబుతో నైక్యంబుం జెందె. నిద్రయు నంధకారంబును గ్రమక్రమంబున వృద్ధి సెందె. జారులమోదంబుం గన్నులును గైరవంబులును వికాసంబు నొందె. అవ్వేళ మూర్ఛం దెలిసి లేచి నరుండు శ్రీహరిని నిరీక్షించి "యింతతడవు కయ్యంబు సేసినయోధ సవనతురంగంబుం గొని యెట్లోవం బోయెనో నా కెఱింగింపు మతని రణంబున గెలిచి యజ్ఞవాహంబుం గొని వచ్చెద" ననిన నవ్వి యవ్వెన్నుండు "కపికేతనా! తామ్రకేతనుండు మనల నిరువుర గెలిచి మూర్ఛం బుచ్చి

హయంబు గొనుచు రత్నపురంబునకుం జని తనతండ్రి కొసంగె. ఇంక మనము గాదు, త్రిమూర్తు లొక్కటై వచ్చినం గెలువ దరంబు గాదు. వాఁడు మదీయభక్తాగ్రగణ్యుండు. దానకర్మాత్రాధీశ్వరుండు. వానిసాహసౌదార్యంబులు చూడవలయునేని నావెంబడిం జనుదెమ్మని తోడు

—* శ్రీకృష్ణుఁడు మాయారూపంబున నర్జునునితో రత్నపురంబు సేరుట. *—

కొని పోయి బలంబులఁ బురంబుసమీపంబున నునిచి, ప్రాఁతముదుకనీర్కావిబ్రహ్మకమ్మిధోవతియు నందుపైఁ జినిఁగిన యుత్తరీయంబును నుదుట గోపిచందనంపుటూర్ధ్వపుండ్రంబును వక్షస్థలంబునఁ బద్రాక్షమాలికయుఁ గర్ణరంధ్రంబుల నులివాఁడినశ్రీతులసియు భుజంబున యాయావరపుగోనెసంచియుఁ గక్షభాగంబులఁ గృష్ణాజినంబు దేవతార్చనకక్షపాలయు దక్షిణహస్తంబునఁ బుప్పివెదురుఁతకోలయు గూనివీఁపునఁ జినిఁగినగొడుగుతునుకయు వణంకెడిబడుగుదేహంబునుం గలిగి వృద్ధబ్రాహ్మణరూపంబునఁ దనకూర్మిసఖుం డైనయర్జునుని బ్రహ్మచారి వై శిష్యుఁడవుగ రమ్మని పూర్వరాత్రంబున రత్నపురంబునకుం జనియె.

తదనంతరంబు, శ్రీకృష్ణదేవుం డర్జునునితోడం గూడ నారత్నపురంబు సొచ్చి యగురుసాంబ్రాణిధూపసమ్మిళితంబును గుంకుమకర్పూర కస్తూరి కాదిపాణింధమంబును నానావిధకుసుమమాలికాసముద్గీర్ణసౌరభంబును నైన యొక్క

వీథిం జను నెడ నంపం బైన యిందుకాంతసౌధంబున నొక్క మందయానతోడం గూడం గ్రీడించుచు నొక్కవిటుం డాకుటిలకుంతలం జూచి నీకురులకుం గృష్ణత్వంబు గలిగె, మేలు బళీ! యని మెచ్చుటయు, నాకలకంఠి ప్రాణేశుని కేలు కేలునం దెమలించి నీకరంబులు శంఖచక్రాంకితంబు లై యున్నయవి గావున నీవు పురుషోత్తముండ వని పలుకుటయు, నమ్మాటలు విని సరసిజాక్షుం డస్తనుం గనుంగొని "యీయాశ్చర్యంబు వింటివే! కేళికాలంబునందును మదీయ నామసంకీర్తనంబు సేయుచు నున్నవారు. ఇచ్చటివారల చిత్తంబులు మత్పదాయత్తంబులు వీరలవచనంబులు మదీయ దివ్యనామరచనంబులు. ఈజనులకృత్యంబులు మత్కైంకర్య నిత్యంబులు. ఈపట్టణంబు భూలోకవైకుంఠంబు. అనిపొగడుచు నరుండునుం దాను నారాత్రి యెల్లం బట్టణవీథులం దిరిగి వేకువజామున సర్వదానదికిం జని యందలి నిర్మలంబు లగునుదకంబుల స్నానసంధ్యావందనాదికృత్యంబులు నిర్వర్తించి, సూర్యోపాస్తిం జేసి తత్సమీపంబున రాజహంసకూజితంబులచేత ద్విగుణీకృతంబు లైనకింకిణీరవంబులచే నలంకృతం బైనఘోటకంబుచే నొప్పుయజ్ఞవాటంబునకుం జని యయ్యాస్థానంబును నందలి ఋత్విక్కులను వత్సభాసదులను వారలచే నుచ్చరితంబు లైనఋగ్యజుస్సామమంత్రంబులను వానిచే నావహింపంబడి దివ్యవిమానంబులతో వచ్చు నింద్రాదిదేవతలను యజ్ఞశాలామధ్యంబున దీక్షాప

రుండును బత్నీసమేతుండును దర్భాసనాసీనుండును సకలసామంతమహీకాంతకిరీటఘటితమణిప్రభానీరాజితపదుండునైన మయూరకేతనుం గాంచి యాకపటభూసురు లిద్దఱు "రాజోత్తమా! భద్రమ" స్తని యాశీర్వాదంబు సేసిన నన్నరవరుండు ప్రత్యుత్థానంబు సేసి నమస్కరించి "ధరణీసురోత్తమా! నేను వందనంబు సేయకమున్నె మీరాశీర్వాదంబు సేయుట శపియించుట గాని దీవించుట గాదు. ఎందుండి యెందుఁ బోవుచు నిందులకు విజయంబు సేసితిరి? నావలనం గాఁగలకార్యం బెయ్యది?" అనిన నాకపటభూసురుండు పరమానందకందళితహృదయుండై "రాజకులావతంసా! మేము కార్యార్థులమై వచ్చినవారము గావున ముందుగా నాశీర్వాదంబు సేయుటయు వెనుక నీవు వందనంబు సేయుటయు నెగ్గు గాదు." అనిన విని జననాయకుం "డనఘా! "అభ్యాగత స్స్వయం విష్ణుః" అనఁబడును గనుక నీవు సాక్షాజ్జనార్దనుండ వని తోఁచుచున్నది. దొడ్డు కొంచెం బనక వేఁడుము. దేహవంచనయు మనోవంచనయు ద్రవ్యవంచనయు లేక యొసంగెద" ననిన విని యమ్మహీసురుండు "రాజశేఖరా! ధర్మపురంబున వాసంబు సేయుదును. కృష్ణశర్మ యనువాఁడను. ఇతండు నాకు శిష్యుండు. ఇతనితోడం గూడ నేను మత్కుమారునిం దోడ్కొని నీపురోహితుండైన సుశీలుని యింటఁ గన్నె యున్న దని విని మత్కుమారునకు వివాహంబుగా నడుగవలయు ననుతలంపున వచ్చుచున్న యెడ

నతిభయంకరం బైనయరణ్యమధ్యంబున నాఁకలి గొని కోపోద్దీపితం బైనయొక్కసింహంబు మదీయపుత్రునిం గదిసి యతని గళంబు పట్టికొనుటయు, విడిపింపం దరంబుగాక వేఱొక్కయుపాయంబునుం గానక శ్రీనృసింహ శ్రీనృసింహ యని నూటయెనిమిదిమాఱులు జపియించిన నద్దేవుండు ప్రత్యక్షం బయ్యె నాపుత్రుం గావలేఁ డయ్యె. ఇవ్విధంబున నాపన్నుం డైనకుమారునిం జూచి యత్యంతపరితాపంబు నొందుచున్న నన్నుం గనుంగొని యామృగరాజంబు వాలంబు సారించుచు నాపుత్రునిగాత్రంబు నఖంబుల గ్రుచ్చుచు దంష్ట్రాంకురంబుల నప్పళించుచు మనుష్యభాషణంబుల నన్నుద్దేశించి భూసురా! నాచేతం దగిలినజంతువును గృతాంతుం డేనియు విడిపింప నోపఁడు. అట్టియెడ నీవెంత వాఁడవు? నాకన్న బలవంతుఁడు జగంబున లేఁడు. శిష్యుండును నీవును గృహంబునకుం బొం డని నిరాశగాఁ బలికిన నేను నాపరానిక్లేశంబున నాశిశువుఁ బాసి పోవం గా ల్లాడక పుత్రహీనుల కూర్ధ్వగతి లే దని వినియుండుటం జేసి మచ్ఛరీరకబళంబు గొని నాసుతునిశరీరంబు మగుడ నొసంగు మనిన విని యక్కంఠీరవం బకుంఠితోత్కంఠ మెఱయ నన్నుం గూర్చి యి ట్లనియె. నావంటి దుష్టజంతువులము మృత్యువునకు భృత్యులము గావున నిట్టియల్పాయుష్కులం గాని నీవంటి దీర్ఘాయుష్కులం బట్ట నొల్లము. నీవు పట్టి కొఱకై యింతగాఁ బట్టి పెనంగం బని లేదు. మరలి పొమ్ము

నిన, నే నామృగరాజంబునుం జూచి, యోయీ పంచాననా! నేఁ జేసినసుకృతంబు లన్నియు నీకు నిచ్చెద నిప్పాపని నొప్పింపక నాకు నొప్పింపు మని వేఁడుకొనిన నియ్యకొనక "మాకు నీవలనం గావలసినప్రయోజనం బొక్కటియు లేదు. మయూరధ్వజునివలనం గాఁదగినకార్యంబు గలదు." అని పలికె నక్కార్యంబు నీ వంగీకరించెద వేని యెఱింగించెద."

అనిన వినియా భూసురోత్తమునకు రాజసత్తముం డిట్లని యె. ఆసింహంబు సాక్షాన్నృసింహదేవుండె గాని సామాన్యసింహంబు కాదు. మదీయదేశకాననంబున గిరులం జరించు సింహవ్యాఘ్రవరాహమహిషదర్వీకరాదిజంతువులు ప్రాణిహింసఁ జేయ వెఱచు; నైననేమి, నీయడిగినపదార్థంబు నెల్లఁ దామసింపక యొసంగెద. నామాట వృథ గాదు. నీవు కావలసినదాని నడుగుము. అనిన విని భూసురాగ్రేసరుం డానృపాగ్రణిం జూచి "దుర్బలస్య బలం రాజా" యనువచనం బున్నది కావున మముబోఁటియర్థులకు మిముబోఁటిదాతల వేఁడుటకు సంశయింపఁ బని లేదు. నాయార్తిని హరింపుము. ఆసింహము నీదేహంబులో సగంబు నిచ్చిన నాకుమారుని విడిచెద ననిన నేను నాసింహంబు నవలోకించి బహుజనసంరక్షకు లైనమహారాజుల దేహంబులఁ గోసి యిమ్మనుట మాబోఁటివిప్రుల కుచితం బగునె? అనిన విని యాకంఠీరవంబు నన్నుం జూచి "భూసురేంద్రా! యన్నరేంద్రుని సామాన్యునిఁగాఁ దలంప

కుము. దీనజనరక్షకుండు, నాత్మవిద్యావిశారదుండు, నుత్తమోత్తముండు, నుదారుండును సత్యసంధుండునైనమయూరధ్వజమహారాజునకు దొడ్డ కొంచెంబు లేదు, కావున నతని నడుగవలసినకార్యంబునకు నీవు సంశయంబు నొందవలదు. అతని నడిగిన నుత్తరక్షణంబున నీకోరికను ఫలింపంజేయు; నది యట్లుండె. నీశరీరంబుఁ గుమారునికిఁ బదులొసంగెద నంటివి. జరచే ముదిసి తపంబుల శోషించి యుపవాసంబులఁ గృశించి బలహీనం బగునీబడుగుదేహంబు మాకేమిటికి? ఆరాజదేహంబు సకలరసంబులం దృప్తి నొంది సర్వసుఖంబులచేతఁ దనిసి నవనీతంపుముద్దయుం బలె నానోటికిం బ్రియుండు నని సింహంబె నన్నుం బొమ్మనె. దశరథనందనుండు, మృతుఁడైనబాలునిఁ బ్రదికించినతెఱంగున నాపుత్త్రునిం బ్రతికింపుము. కాదేని నీకుఁ గొదవ కాని మాకేమి? అనుటయు మయూరకేతనుం డామాటల విని యాభూసురకుమారునకు బదులుగఁ దనశరీరం బీయఁ దలంచి మంత్రిహితపురోహితబంధుమిత్త్రాదులం జూచి, రాజులకు రణంబున నేనియు గోబ్రాహ్మణనిమిత్తం బేనియు శరీరంబుఁ ద్యజించు టుచితధర్మంబు. తొల్లి శిబికర్ణజీమూతవాహనాదులు పరార్థంబుగా నిజశరీరంబులఁ ద్యజించి స్వర్గసుఖంబులఁ జెందిరి. కావున నేనీవిప్రోత్తమునకై నాశరీరంబు నొసఁగి కృతకృత్యుండ నయ్యెద. దీనికి విఘాతంబుగాఁ బలుకవల దని కుమారుఁ డగుతామ్రకేతుని రాజ్యా

భిషిక్తునిఁ గాఁ బ్రతిష్ఠించి నర్మదానటిఁ గృతస్నానుం డై యనేకదానంబులఁ జేసి యావిప్రపుంగవునిం బిలిచి సలిల ధారాపూర్వకంబుగా మదీయదేహంబులో సగం బొసం గుటవలన శ్రీకృష్ణదేవుండును బ్రీతుం డగుంగాక! యని భూసురునిచేత ధారవోసి శంకారహితుం డై యజ్ఞవేదికా స్థలంబున దర్భాసనంబునఁ గూరుచుండి బృందారకబృంద వందితుం డైనముకుందుచరణారవిందంబుల హృదయార విందంబునం దిరంబుగా నిలిపి, మొగలిరేకుం బోలిన అం పంబు శిరంబున మోపి తెగువ సేయం బూనునంతలోనఁ బుణ్యచారిత్రయు, సౌభాగ్యవతియుఁ, బతివ్రతాశిరోమణి యుఁ, బరమసాధ్వియు నైనయతనిభార్య కుముద్వతీదేవి యి వ్విధం బెఱిఁగి సత్వరంబుగాఁ జనుదెంచి, "పురుషునియర్ధశరీ రంబు భార్య యని వేదవచనంబు కలదు, కావున మదీయ దేహంబు బ్రాహ్మణార్థంబుగా నర్పించెద, నిలువు" మనిన విని యాకపటభూసురుండు, మహీపాలునిఁ జూచి "పురుషుని వామాంకంబు స్త్రీభాగంబు కావున మయూరకేతనువామ భాగంబు తేవల" దని యాసింహంబు పలికె, నట్టియెడ నిష్యంగనశరీరం బొప్పుకొనునె! యనుటయు నమ్మహా రాజసుతుం డగుతామ్రకేతుండు నమ్మహీసురునకు నమస్క రించి యి ట్లనియె.

"మహీసురోత్తమా! తనయాత్మయె పుత్త్రుం డై జని యించు నని వేదవచనంబు కలదు. కావున మజ్జనకుని దేహం

బునకుఁ బ్రతినిధిగా నాశరీరంబు నిచ్చి నేను ఋణత్రయ
ముక్తుండ నై తండ్రి సేసినప్రతినఁ జెల్లించి శ్రీరామభద్రుం
డును భీష్ముండునుం జెందినకీర్తిం జెందెద" ననిన నక్కేతనభూ
సురోత్తముండు "రాజనందనా! సింగంబు పలికినమాట
వినుము. ఆరాజు దేహంబును దత్కళత్రంబును సుతుండునుం
గోసి యిచ్చిన నందులో దక్షిణాంగంబుఁ గొని తె మ్మని
నన్నుం బనిచెఁ గావున నవ్వచనంబును సత్యంబుఁ గావిం
పం జనుదు" ననిన నారాజు దరహసితవదనుం డై తనభార్య
నుఁ గుమారునిఁ గనుంగొని యాభూసురుండు పలికినట్లు
గావింపుం డని తనచేత నున్నఅంపంబు వారలచేతి కొసం
గుటయు నారాజపత్ని యైనకుముద్వతియు నందనుం డైన
తామ్రకేతుండునుం గైకొని, యతిధీర యగుకుముద్వతీసతి
కుమారునిచిత్తం బుత్తలంబు మానం బలికి యిరువురు రెండు
పార్శ్వంబుల నిలిచి యతికర్కశం బైనయాఅంపంబు భూ
పాలకునిశిరంబునం జేర్చి, "రఘుపతీ! శ్రీమన్నారాయణా!
హరిహరీ! శ్రీకృష్ణా! పురుషోత్తమా! యని కోయు నెడ మేరు
గిరిశిఖరంబునుండి దొఱఁగుగైరికధాతుఝురంబుల తెఱఁగున
రక్తపూరంబు లపారంబుగాఁ గురియ భూజను లాహాకారం
బులఁ గావించిరి. ధీరజనులు కొనియాడిరి. దేవతలు ప్రశం
సించి, రవ్వు, దమ్మహీపాలుండు చిత్తంబును వాసుదేవపదా
యత్తంబుఁ జేసి ధీరుఁ డై యుండు నెడ నతనియెడమకంట
నీరు గ్రమ్ముటయు నమ్మహీసురుం డది గనుంగొని కోపాటో

పంబునఁ గరంబులు విదల్చి వేణుదండంబును ధరాతలంబు నం బడవైచి లేచి యిటునటు గంతులు వైచుచు "నపుత్రతవలన నూర్ధ్వలోకంబులు లేకపోయినం బోసనిమ్ము. ఏడ్చుచు నాసంగినదానంబు నే నొల్ల" నని శిష్యునికరంబుఁ బట్టి యీడ్చుకొని పోవుటయు నమ్మహీపాలునిసతిమణి తన ప్రాణేశుమస్తకంబుఁ గదియంబట్టి "యక్కటా! నీశరీరంబు వ్యర్థంబుగాఁ గోయించి తాను నొల్లక యవ్విప్రుండు లేని నేరంబులుఁ బెట్టి యలిగి పోవుచున్నవాఁడు. ఇంక నెట్లు" లనిన నమ్మహీరమణుండు, చనుచున్నమహీసురుఁ జేరఁబిలిచి "మహాత్మా! నీ వేమిటికిఁ గోపంబుఁ జెంది పోయెదవు. నీవంటిసత్పాత్రంబున కీశరీరంబులోన దక్షిణభాగం బుపకారంబునకు వచ్చె. వామాంశం బగుటా నుపయోగంబునకు రాకపోయితిఁ గదా! యని కంట బాష్పంబులు గ్రమ్మ నడలుచున్నయది. వేదనచేతఁ దొఱఁగెడిబాష్పంబు లంటివేని రెండుకన్నులం బొడమవలదె? నాయెడ దయ సేసి నీభాగంబుఁ గొని పొ" మ్మనుటయు, నర్జునునితోడఁ గూడ శ్రీకృష్ణుండు ప్రత్యక్షం బై నిలిచి యమ్మహీపాలకుఁ గౌఁగిలించికొని "రాజకులచంద్రా! నీధైర్యస్థైర్యసాహసౌదార్యంబులకు మెచ్చితి, నీసుతుండును సతిమణియుఁ గొలువ యాగీయహయంబుల రెంటినుంచుకొని యాగద్వయంబును నీవె చేయుము. కర్తను గర్తను నై నేన సర్వంబు నిర్వహించెద. నీకుమారుఁడు మమ్ము నిపురఁ దా నొక్కరుండె యుద్ధంబున

జయించె. నీవు దేహంబు నొసంగి మమ్ము జయించితివి. ఈ రాజకులంబులలోన నీసాటివీరవితరణగుణంబులు గలమేటి లేఁ" డనియె. అప్పు డప్పుడమిఱేఁడును దామోదరునికరారవిందస్పర్శనంబున గాయంబు మాని సంతసంబున నద్దేవుని చరణపద్మంబులకు సాష్టాంగదండప్రణామంబులు సేసి "దేవా! కర్మఫలప్రదుండవు, సకలయాగసమారాధ్యుండవు, యజ్ఞమయుండవు నైననిన్నుఁ గనుఁగొంటిని. ఎండగొట్టిన దప్పిఁ గొనినవానికి విమలోదకంబులచేత దప్పితీఱువలయును గాని మంచుతుంపరలం దీఱునె? పునరావృత్తిరహిత మోక్షసామ్రాజ్యప్రదుఁడ వైననిన్నుఁ బ్రత్యక్షంబుగాఁ గనుంగొనియుఁ జాలక కర్మారంభంబు సేయం బూనిన నన్నుఁ జూచి విద్వజ్జనులు నవ్వరె! ద్రవ్యంబుఁ గుమ్మరించి నట్టికొప్పెరఁ దెచ్చిన వెట్టివానివిధంబున దూరంబున మీస్వరూపం బెఱుంగంజాలక నాకుమారుఁ డవివేకి యై రిత్తహయంబుఁ బట్టి తెచ్చె. దేహంబు లస్థిరంబు లని తెలియక యీహరిఁ బట్టి తెచ్చె, నందువలన శ్రీహరి వగునీసందర్శనంబు కలిగె. నేను ధన్యుఁడ నైతిని. ప్రళయసాగరంబున శ్రుతిచోరకుఁ డగు దైత్యుని సంహరించుటకు మీనరూపంబ వైననీకుఁ బ్రణామంబు. కూర్మరూపధరుండ వై జలధిమథనంబుఁ గావించి సురల కమృతంబు నొసంగిననీకు వందనంబు. లీలావరాహమూర్తి వై భూమి నుద్ధరించిననీకు నమస్కారంబు. స్తంభంబునఁ బుట్టి ప్రహ్లాదుఁ గాచిన నర

సింహా! నీకు దండంబు. వామనమూర్తి వై మూఁడడుగుల ముల్లోకంబుల నాక్రమించినత్రివిక్రమా! నీకుఁ బ్రణతి నొనర్చెద. క్షత్రియకులధూమకేతు వైనభృగురామా! నీకు మ్రొక్కెద. దశకంఠకంఠలుంఠకనారాచధారాచకితరక్షస్స్తోమా! రఘురామా! నీకు నమోవాకంబు. ప్రలంబదానవశైలవజ్రాయుధా! హలాయుధా! నీకు జోహారు. త్రిపురసంహారహేతుబౌద్ధా! యనిరుద్ధా! నీకుఁ గేలుమోడ్చెద. మ్లేచ్ఛనికరవిచ్ఛేదనప్రచండమండలాగ్రధారాసంపాదితకీర్తీ! కలికిమూర్తీ! నీపదాబ్జంబులకు నమ్రుండ నైతి" నని బహువిధంబులఁ బ్రస్తుతించి సమస్తవస్తుజాతంబు లమ్మాధవున కర్పించి సంప్రీతుఁ జేసి పురందరనందను నట్ల పూజించి కౌఁగిలించి బంధుజనసమన్వితుం డై శ్రీకృష్ణార్జునుల నిజపురంబునకుఁ దోడ్కొని పోయె. అంత గోవిందుండు గాండీవికి మయూరధ్వజునిభక్తి దెలుపవలసి బలసమన్వితంబుగా దివసత్రయం బం దధివసించె. అనిన జనమేజయుండు జైమినిమునితోఁ దరువాతివృత్తాంతం బెఱింగింపు మనుటయు.

శా. ఆలంకామిహికాచలప్రకటశౌర్యాగాధగాఢాశతో
ద్వేల...స్త్వయశోశశోభితసరిత్రిఖండ! ఖండాధిక
న్వాలాపామృతసేచనోల్లసితవిద్వత్కర్ణ! కర్ణాటల
క్ష్మీశీలైకధురీణ! కీనస్పృహరాజిలంఘితాశాస్తరా!

క. కల్పకసమదానకళా
కల్పకనిజబాహుదండ గండరగండా!

కల్పకసత్కవివినుతా
కల్పకసత్కీర్తిసాంద్ర! కదనమృగేంద్రా!

పంచచామరము. ఘనాఘనౌఘనాదనాదికాహళీహళాహళీ
ఘనప్రభావిభాసితద్యుగర్భదుర్భరార్భటీ
కనద్ధరావరాహకేతుకాండచండవాహినీ
వినోదనోదనగ్నభగ్నవీరవైరిమండలా!

గద్య. ఇది శ్రీమత్పాండ్యమండలాధీశ్వర శ్రీవిజయరంగచొక్కనాథమహీనాథకరుణాకటాక్షసంపాదితగజతురంగమాందోళికాప్రముఖనిఖిలసంపత్పారంపరీసమేధమాన సముఖమీనాక్షీనాయకతనూభవ మీనాక్షీదేవీకటాక్షలబ్ధకవితాసాంప్రదాయక వేంకటకృష్ణప్పనాయకప్రణీతం బైన జైమినిభారతంబున నశ్వమేధపర్వ మ్మనువచనకావ్యంబునందుఁ జతుర్థాశ్వాసము.

శ్రీరస్తు.

జైమినిభారతము.

పంచమాశ్వాసము.

క. శ్రీమధురాపురనాథా!
...మధురాధరగభీర...నిజబోధా!
భూమీనుతభూరికళా
స్తోమాంకా! విజయరంగచొక్కనృపాంకా!

ప్రవధరింపుము. జైమినిమునీంద్రుండు జనమేజయనరేంద్రునిఁ గనుఁగొని యిట్లనియె. అవ్విధంబున రత్ననగరంబునఁ గృష్ణార్జును లారాజుచేతఁ బూజలఁ గొనుచు మూఁడుదినంబు లుండి, నాలవనాఁడు సముత్తుంగమాతంగతురంగశతాంగవీరభటపరంపరలతో, మయూరకేతనుండు గొలిచి రా యాగతురంగంబులఁ గదలింప నవియు నానాదేశంబులు నదంబులు నదులు జనపదంబులు నతిక్రమించి క్రమక్రమంబున సారస్వతపురంబునకుం జేర నరిగె. ఆరాజు రాష్ట్రంబున నెల్లకాలంబును గృతయుగంబునందునుం బలె ధర్మంబు నాల్గుపాదంబుల నడచు. ఏసత్యసంధుని దేశంబునందలి ప్రజలు కలవరించి యేనియు బొంక, రేవదా

న్యుండు చేయుదానధారాప్రవాహంబులచేత మేదినీతలంబు ముక్కాఱును బండు, నేసుశీలుండు "బ్రాహ్మణో మమ దైవతం" బని నిశ్చయించి విప్రసంతర్పణము నెడవిడువక చేయు; నట్టిపరమధార్మికుం డైనవీరవర్మ తనచారులచేఁ గపిధ్వజ

—* వీరవర్మ గుఱ్ఱంబును బట్టుట. *—

మయూరధ్వజులయాగీయఘోటకంబులు తన దేశంబునకు వచ్చె నని విని వానివెంటనిఁ బట్టికొనఁ జెంగటివారలం బంచుటయు, వారలు నట్లుగావింప, యౌవనాశ్వానుసాల్వ హంసధ్వజమయూరధ్వజాది మహారాజసేనాసందోహస మున్నతంబును, నపరిమితతురగకరిరథభటపటలచటులంబును నై కల్లోలినీవల్లభునివిధంబున వెల్లివిరిసియుఁ బాండవ సైన్యంబుల కెల్ల నధిష్ఠాతయు సమరకర్కశుండును విక్రమజితశ్వేతవాహనుండు నైనబభ్రువాహనుం డెదుటఁ సైన్యం బులం గదిసి తులితభిదురంబు లైనప్రదరంబుల దరంబుగా నెదురం బ్రయోగించి సేనాంగంబుల భంగంబు నొందించుటయు, నవ్వీరవర్మకుమారులు కుపలుండును సులతుండు ననువారలు దివ్యరథంబుల నధిరోహించి బభ్రువాహనుఁ దాఁకి దండధరదండోపమానంబు లైనచండకాండంబులఁ దండతండంబులుగా నొండొండ నిగిడించుటయు, నుభయసైన్యంబులకు ముష్టీముష్టి బాహాబాహి కచాకచి ఖడ్గాఖడ్గి దండాదండిగా భండనం బయ్యె. అప్పుడు, పదివేల మహారథులతోడం గూడ వీరవర్మకుమారులు బభ్రువాహ

నునిం గిట్టి పెట్టినదండె తీయక నిశితశరనికరంబుల నొప్పించుటయు, నింద్రునిమనుమఁడు మండుచుఁ, జండాంశుకిరణకాండసదృశంబు లైనశరప్రకాండంబులు వర్షించుటయు, నగ్నిలోనం బడిన శలభంబులకైవడి వీరవర్మసైన్యంబులు మ్రగ్గిలం బాఱె; నప్పు డతనియల్లుం డగునంతకుండు విఱిగిన దళంబులం బురికొల్పి శతసహస్రాయుతనియుత కోట్యర్బుద న్యర్బుద ఖర్వ మహాఖర్వ శంఖసంఖ్యలను, బుంఖానుపుంఖంబులు నగుకంకపత్రంబుల నిగిడించిన వ్రాలు నేనుంగులును గూలుగుఱ్ఱంబులును దూలురథంబులును గీలుదప్పినబొమ్మలగతిఁ బడువీరభటులును మూర్ఛల మునుంగుయోధులును, మునింగిన మహారథులును మోహంబునొందినమహీపతులునుం గలిగి దీనదశం బొందినసేనల నవలోకించి, కిరీటి కైటభాంతకునిఁ జూచి "వీఁ డెవ్వఁడో దురంతపరాక్రముఁ డంతకుని తెఱఁగున మనబలంబుల నంతంబు నొందించు చున్నవాఁడు. నాకుఁ జూడ వీని మనుష్యుం డనం గూడ" దనిన విని వనమాలి కిరీటిం జూచి "ఈ

—* కృష్ణుం డర్జునునకు యమువృత్తాంతంబుఁ జెప్పుట. *—

రాజకూఁతు రగుమాలిని యనువధూటికి యముఁడు మగఁడు. కావున (నతండు) మానునిమిత్తంబుగా మనతో నెదిరించి పోరుచున్నవాఁడు ఆకన్య జమునిఁ బెండ్లియాడిన తెఱఁగు వినుము. వీరవర్మకుమారి మాలిని లోకైకసౌంద్యశాలిని మన్వంపుజవ్వనంబున నివ్వటిల్లుటయు, నప్పువ్వుఁ

బోఁ జూచి యవ్విభుండు 'తల్లీ! నీ వెవ్వరిం బెండ్లియాడె దవు? సమ్మతుం డైనపురుషునిం దెలుపుము. కల్యాణంబుఁ జేసెద' ననుటయు, మాలిని జనకునితో ని ట్లనియె. "పృథివిలోనం బుట్టినజనునకుఁ జావు నిజంబు, వానితో ననుగమనంబు నొనర్చి యమలోకంబునకుఁ జని యముని శాసనంబునం బుణ్యపాపఫలంబుల ననుభవించి బహుజన్మంబుల నెత్తుటకంటె యమునిం బెండ్లియాడి సుఖంబున నుండుట మేలు. అందులకుఁ దగినయుపాయం బొనరింపు" మని పలికి. మాలిని నానాఁటికి వైవస్వతునిమీఁది మోహంబు రెట్టింప, విరహవేదనం జెందుట యెఱింగి, యారాజు భూసురులతోఁ డఁగూడ యమస్తోత్రంబు నుడువుచు బహుకాలంబు యము నుద్దేశించి తపంబు సేయుచునుండ, నక్కన్నెయు వ్రతనియమంబులఁ బూని సూర్యనందను నారాధించుచు నుండె. అంత నారదుం డవ్వృత్తాంతంబు నెఱిఁగి యంతకునిపాలికిఁ జని యతనిచే నభ్యాగతపూజావిధానంబులఁ బూజితుం డై "దక్షిణదిశాధ్యక్షు! చిత్రపురంబున వీరవర్మపుత్త్రిక మాలిని బహుతపశ్శాలిని, నీకుఁ గళత్రంబు గా వలచి వ్రతనియమంబులచేత నిన్ను నారాధించుచున్నయది. బంగరుతీఁగె రంగు నీనుమేనును, విజితభృంగకులకంబు లైనయలకంబులును, నిద్దంపుటద్దంపుటెక్కు లైనచెక్కులును, బింబఫలంబునకుఁ బ్రతిబింబం బైనయధరబింబంబును, గలువరేకుల చెన్ను లైనకన్నులును, గంబువిజయోత్కంఠం బైనకంఠం

బును, జక్కవలకుం గవ యైనచన్నుఁగవయును, బల్లవశ్రీక
రంబు లైనకరంబులును, గలదు లే దనువివాదంబులచే సా
ధ్యం బైనమధ్యంబును, గిరినితంబవిడంబం బైననితంబం
బును గదళికలం గేరు నూరువులును, మకరవిజయజంఘాలం
బైనజంఘాయుగళంబును, దమ్ములకుం దమ్ము లైనపాదంబులుఁ
గలిగి, మోదంబున నియ్యెడ మోహంబు మించి పావ
నంబు లైనహోమనియమంబుల జపతపంబుల నాచరించుచు
నిన్నె యాసించి యున్నయది. ఆచేడియం బెండ్లియాడితి
వేని, నీకు సమానుండు వేఱొకండు లేఁడు." అనిన విని
నవ్వి యవ్విబుధవర్యుండు మానికులధుర్యునిం జూచి "నీవు
ముందుగఁ జని యారాకొమారునితో మారాక నెఱిఁగిం
పుము. నేను వైశాఖశుద్ధపూర్ణిమాదినంబున భూలోకంబు
నకు వచ్చెద" ననిన నారదుండు చని యత్తెఱఁ గెఱిఁగింప
వీరవర్మయు మోదంబు నొంది వివాహంబునకుఁ దగినయ
త్నంబుఁ జేయుచునుండె.

తదనంతరంబ, యముండు తనదళవాయి యైనరాజ
యక్ష్మునిం బిలిచి, మనము చిత్రపురికిఁ బోవవలయు నీవు
బలంబుల నెల్లఁ బయనంబు సేయు మనుటయు, వ్యాధు
లకుఁ బ్రధానుం డైనరాజయక్ష్మ, యారాజు దేశంబున బ్రా
హ్మణపూజకులే గాని బ్రహ్మహింసకులు లేరు నే నెట్లు రాఁ
గలవాఁడ నని మొగంబు వెలవెలంబాఱఁ బెదవులఁ దడ
వుచు నలుదెసలుఁ జూచె. నూటయెనిమిదివ్రణంబులకు

నధీశ్వరుం డైనరాజవ్రణుం, డచట గురుపూజకులే గాని గురుదూషకులు లేరు మాకు నడయాడంగూడ దని దిగులుం బొందె. త్రయోదశసన్నిపాతంబులకు నధిష్ఠాత యైనజ్వరుండు, తద్దేశంబున నయవంతులే గాని బాలహింసకులు లేరు కావున నేను రా వెఱతు నని తల్లడించె. ఏకవింశంతిమోహంబులకు నధిపతి యైనమోహుం, డారాష్ట్రంబున దేవద్రవ్యాపహారకులు లేరు నాకు రాఁగూడ దని మూలమూలకు డాఁగె. మఱియు మున్నూఱు భేదంబులం బొలుపొందుం శూలరోగంబు, విశ్వాసఘాతుకుఁడు విషదాతయుం గన్యకాగామియు స్వోదరపోషకుండు నారాజుభూమిలో లేరు కావున నేను రా నోడుదు నని వెనుక కొదిఁగె. వేఁటకాండ్ర చేతఁ బట్టఁబడినపక్షుల విడిపించునట్టి పుణ్యపురుషు లారాష్ట్రంబునఁ దఱచుగాఁ గలుగుటవలనఁ దాను బొలయం గూడ దని పైత్యరోగంబు పయనంబునకు వెనుకదీసె. వాపీకూపతటాకాదిభేదనంబులఁ జేయు పాపాత్ము లందు లేరు జీర్ణంబు లగుచెఱువులు దొరువులు బాగుచేయించునట్టి ధన్యులా సీమలో మెండుగాఁ గలరు కావున నేను రా నోప నని గ్రహణి తనగృహంబునకుం జనియె. మాషదానంబులు తిలదానంబులుసేయు ధర్మపరులే కాని సాధుజనబాధకులు లేరు కావున నాసంచారంబు కూడదని వాతరోగంబు వెలికిలంబడియె. ఉదకదానపరులే కాని భ్రూణహత్యాపరులు వానిరాజ్యంబున లేరు కావున నేను రా వెఱతు నని

మహోదరంబు ముందువెనుకలు చూచె. కటియావుల దానంబుసేయువారే గాని దాతల నిందించువార లాభూమిలో లేరని యుపస్కారం బవ్వలి కరిగె. ఇవ్విధంబున సకలరోగంబులు గుసగుసలం బోవుచుఁ బయనంబు కదల వెఱచె.

అంత సమవర్తి వారలం జూచి మీరలు పాతకులకు భయంకరులు, పుణ్యపురుషుల కమృతస్వరూపులు, కావున మీ రెవ్వరి నంటవలదు. కామరూపంబులు గలవారలు గనుక మనుష్యరూపధరులై మావెంబడి నరుగుదెం డని పలికి యముండు సౌమ్యాకారంబునం జూపట్టుచు సకలభూషణభూషితుండును దివ్యవిమానాంబరధరుండునై నరాకారంబునఁ జిత్రవర్ణనగరంబునకు వచ్చిన జమునిం గనుంగొని ప్రణమిల్లి యర్ఘ్యపాద్యాదివిధులం బూజించిన సూర్యకుమారుం డారాజకుమారికం బరిణయంబై నీకు నభీష్టం బెయ్యది యడుగు మనిన, నా ధరణీశ్వరుం డల్లునిం జూచి, "ఇతరవరంబుల నే నొల్లను, దేహావసానసమయంబున దేవకీనందనునిపాదారవిందంబులు దర్శించునట్టి భాగ్యంబులు గలుగవలయు, నివ్వరంబు దయసేయు" మనుటయు, నంతపర్యంతం బంతకుండు నీచెంతనె యుండెద నని ప్రతిన గావించెం గావున మామతోడఁ గూడి యముండు మనతో సంగరంబుసేయ వచ్చె. ఈక్షణంబ యనేకాక్షౌహిణీక్షయకరం బైనయుద్ధంబు సిద్ధంబు గాఁగలదు. అర్జునా! నీవు వేడుకచూడు, బభ్రువాహను ననుసాల్వుఁ గర్ణకుమారుఁ బ్రద్యు

మ్ము ననిరుద్ధు మయూరధ్వజు మఱియును దక్కిన యోధుల సన్నద్ధులం జేసి సముపవలయు నని పలికె.

—* అర్జునవీరవర్మలయుద్ధము. *—

తదనంతరంబ శ్రీకృష్ణదేవుండు గాండీవియరదం బెక్కి పగ్గంబులు మునికోలయుం బూని సారథ్యంబునకు నుపక్రమించిన, నావీరవర్మ, వారిజలోచనుం జూచి "వాసుదేవా! వాసవనందనుండు నీవు నాశౌర్యంబుం జూచెదరు గాక!" యని పలుకుచు నారాయణుని నూఱునారసంబులం గప్పిడి నేడుబాణంబుల మయూరధ్వజాదుల నైదుసాయకంబులం గంఠగతప్రాణులం జేసిన, బీభత్సుండు వీరవర్మనుర్మంబులు దూఱిపాఱ సానలందీఱిననారసంబులు నాటించినం బిఱుతివియక యమ్మేదినీశ్వరుండు తెఱవు గాంచి కంజనయన ధనంజయుల శితశిలీముఖంబులం జిక్కుపఱచి ప్రళయజలధరంబుం బోలి గర్జించుటయు, నర్జునుం డూర్జితవిక్రమంబున నిర్జరులు వెఱఁగంద వానిశరీరంబు నిశితశరంబుల జర్జరితంబుగాఁ బర్జన్యునివిధంబున శరవర్షంబులు గురిసి, వీరవర్మునివక్షస్థలంబు క్షురపంచకంబున నొంచిన, నించుకేనియుం జలింపక, యర్జును నఱువదింట, నచ్యుతుని నూట, నన్నియశరంబుల నాంజనేయునిఁ దేరివారువంబులఁ, దక్కిన వీరులఁ దెరలించి మొనలఁ గలఁగఁజేసిన, బాండవవాహినీసమూహంబు మోహంబుఁజెంద, నప్పు డప్పురుషోత్తముండు గాండీవిఁ జూచి "యకాలతిమిరంబుఁ గల్పించి సైంధవుఁ ద్రుంచి

నట్లునుఁ గర్ణుని తేరు ధరిత్రీతలంబునం గ్రుంగఁ ద్రొక్కించి జయించినట్లును వీని యెడ వంచనోపాయంబులు చెల్లవ"ని, బలవంతు హనుమంతునిఁ బంచిన, నతండు కాలపాశం బును బోలు వాలపాశంబున వానిరథంబు బిగియించి తొల్లి మందులకొండఁ బెల్లగించినచందంబున నెత్తుకొని యాకసంబునకుఁ బఱచిన, నాక్షోణీవల్లభుండు వాయునంద నుని వంచించి యరదంబు డిగ్గి యవనీతలంబునకు వచ్చి నరుని తోడం గూడ నారాయణునిఁ బట్టికొని గగనంబున కెగసి యాంజనేయునిఁ జూచి "యిద్దేవుండు పార్థుని మీఁదిదయ వలన క్షీరసముద్రంబును శ్వేతద్వీపంబును విసర్జించి వచ్చి యున్నాఁడు, కావున నచ్చట విరహతాపంబునఁ బొరలు శ్రీమహాలక్ష్మికిఁ బ్రియం బగునట్లు కలశాంబుధిలో శ్వేత ద్వీపంబున శేషతల్పంబునఁ బడవైచెదఁ జూడుము. నీవు నారథంబు విడువు"మని నరనారాయణుల నిరువురం జంక నిఱికి యవ్వాయుతనయునిఁ బిడికిటం బొడిచిన గ్రుడ్లు వెలి కుఱికి మిడుకుచుఁ బుడమిపయిం బడి కదల మెదల నేరకున్న మధుసూదనుండు వానిమనోరథంబు సఫలంబు సేసినఁ గాని తమయాపద తొలంగ దనుతలంపున నతనిచంకనుండి మెల్లన వీడి యవ్వీరవర్యునితల నిజపదారవిందంబున గుప్పునం దన్నిన, మహీతలంబునం బడి మూర్ఛం జెంది క్రమ్మఱఁ దెప్పిఱి శ్రీకృష్ణార్జునులఁ గదియ వచ్చి "బవరంబున దేవదా నవు లేనియు నన్నుఁ గదియఁజాలరు. విశేషించి, శ్రీకృష్ణా!

నీచరణారవిందంబు నాశిరంబున సోఁకెఁ గావునఁ జిరంజీవి నైతి వనిన, విని యచ్యుతుండు ప్రీతుం డై యర్జునునితోఁ, "వీఁడు దుర్జయుండు, సత్త్వసంపన్నుండు, ధనుర్విద్యావిశారదుండు, మయూరధ్వజాదియోధవీరుల జయించిన మద్భక్తియుక్తుం" డనిన విని క్రీడియుం గొనియాడె. అంత వీరవర్మ హరిని నరునిం జూచి మీరు లోకరక్షకు లగునరనారాయణమూర్తులరు; మిమ్ము నెదిరింప ముల్లోకంబులు నోపవు; నే నెంతవాఁడ; నని పలికి వి ల్లెక్కుడించి గోపికావల్లభుచరణపల్లవంబులకు సాష్టాంగదండప్రణామంబుఁ జేసి పార్థునిఁ గౌఁగిలించుకొనియె. అప్పుడు యుద్ధంబునఁ బడినవారల నెల్ల నంతకుండు బ్రతికించినఁ దద్బలంబులతోడఁ గూడఁ గృష్ణార్జునులు వానిపురంబున కరిగి యెదుదినంబులు వసియించిరి. అంత నవ్వీరవర్మ డెబ్బదివేల తెల్లయేనుఁగులఁ గృష్ణవర్ణంబు లైనతురంగంబులు తొంబదివేల నష్టవిధంబు లైన ముక్తామణిరాసుల ననేకంబు లగుదాసదాసీనివహంబుల నిచ్చి తనకుఁ గల సమస్తరాజ్యంబుఁ దామరనాభునకు సమర్పించి తానునుఁ గొలుచుచు నవనహయంబులం దరలించినఁ గొన్నిదినంబులకు నారెండుగుఱ్ఱంబులు నాయాదేశంబులఁ గడచి చని, యేనుంగుల మ్రింగఁజాలినమీనంబులును, గండశైలంబులఁ గబళింపఁజాలు మకరంబులుం గలిగి యతిభయంకరం బైనసింధునదంబుఁ జివ్వనఁ దాఁటుటయుఁ, గిరీటి వీరవర్మఁ జూచి హయంబులు రెండును నదం

బున కవ్వలికిఁ దాఁటి చనె; నింక నుపాయం బేమి యనిన నతండు దృఢతరంబు లైనయోడలఁ దెప్పించి సేనాసమూహంబుల దాఁటించుటయుఁ, గుంతలదేశంబుఁ జేరఁ జని యచ్చట నశ్వంబులఁ గానక బభ్రువాహనాదు లైనదొరలు జిచ్చునడి యున్నయెడ రెండవమార్తాండమండలంబన నఖండితదేహుం డైననారదమౌని కనుపట్టి, వారలనందనంబుల నభినందించి వాసవకుమారునిఁ జూచి "నీహయంబు కుంతలనగరంబుఁ జేరె. పరభయంకరుం డైనయాచంద్రహాసనృపాలుని పరాక్రమంబు లెక్కించునెడ మీవెంబడి వచ్చురాజు లెల్లం బదియూఱవపాలు సరిపోవఁజాలరు. వానిచరిత్రంబు చిత్రంబు, వినిపింప వేళ గాదు, యాగహయంబు దూరంబు చనుఁ గావున వేగంబ వెంబడిఁ బొం" డనుటయుఁ, బార్థుండు "నారదమునీంద్రా! సజ్జనులచరిత్రం బాకర్ణించుట జన్మఫలంబు గావునఁ జంద్రహాసమహీపాలునిచరిత్రంబు శ్రవణానందంబుగా నానతీయవలయును."

—* చంద్రహాసోపాఖ్యానము. *—

అనిన విని, హరితత్త్వబోధనావిశారదుం డైననారదుండు పురందరనందనుం జూచి "తొల్లి కేరళదేశాధీశ్వరుండు పెద్దకాలంబు కొడుకులు లేకయుండి వ్రతంబులు దానంబులు జపంబులు తపంబులు ననేకంబులు గావించి బహుకాలంబునకు హరిభక్తు లగుబ్రాహ్మణులప్రసాదంబున నొక్కకుమారునిం గనియె. వాఁడు సౌభాగ్యలక్షణసం

సన్నుండును దేజోవిరాజమానుండును జంద్రకందర్పసదృశరూపరేఖాకలావిలాసభాసురుండు నయ్యెఁ దండ్రిగండంబున మూలానక్షత్రంబున జనియించె. అంతఁ గొన్నిదినంబులకు నారాజు వైరిరాజులతోఁ బోఁజుదీరి యాజి గావించి వెనుదివియక శాత్రవులు ప్రయోగించినయాయుధంబులచే భిన్నభిన్నాంగుఁడై సంగరాంగణంబునం బడి యింద్రసదనంబునకుం జనియె. అట్లు గండదోషంబునఁ దండ్రిమరణంబు నొందుటయుఁ, దల్లి యతనితో నగ్నిప్రవేశంబు సేసె. శత్రువులచే రాజ్యంబు గోలుపోయి మంత్రులు యథాయథలుగాఁ జనిరి. ఇట్లు మాతాపితృవిహీనుండును రాజ్యభ్రష్టుండు నైనయబ్బాలకుం దోడ్కొని కొందఱు దాదులు కౌంతలపురంబునకు వచ్చి, యబ్బాలకుని బెంచుచుండి రెండుమూఁడేండ్లలోన నాదాదులును బరలోకంబునకుం జనిన ననాథుం డైనయమ్మహీనాథకుమారునిం జూచి పౌరనారీజనులు కరుణచే, నొక్కపుణ్యవతి జలకంబులార్చె; నొక్కసీమంతిని హితంబును మితంబునుగా నాహారంబు వెట్టె; నొక్కసతీమణి వానికటితటంబున బంగరు చిఱుంగుల మొల్లియ గట్టె; మఱియొక్కపురంధ్రీరత్నంబు కూఁకటి కూడదువ్వి కొండె వైచి సిగబందు చుట్టె; వే ఱొక్కసతివ్రత యబ్బాలకు నెత్తికొని ముద్దాడుచు దీవించె. ఇవ్విధంబున వారిజాక్షులు గారామునఁ బెంచుచునుండ నైదేండ్లప్రాయం బగుటయు, నారాచకొమారుం డందంద మాట

లాడుచుం దుష్టబుద్ధి యనం బరఁగిన యారాజుమంత్రి
గృహంబునకుం జనిన, వానికొలువులో దైవజ్ఞు లైనమహా
మునులు శుభలక్షణలక్షితుం డైనయబ్బాలు వీక్షించి,
హర్షించి, 'యీముద్దులబిడ్డం డెవ్వరివాఁడో వీనిలక్షణంబు
గనుంగొనిన భూమండలం బేలంగలం' డనిన విని దుష్ట
బుద్ధి యీర్ష్యాసూయాపరవశుం డై యమ్మునులమాటలు
వినియు విననిచందంబున నూరకుండి వారలం బోవంబనిచి
యబ్బాలకునిం గాంచి "ఋషులవాక్యంబు తప్పు" దని
తలంచి పెచ్చుపెరిఁగినమచ్చరంబు మెండుకొనఁ జండా
లురం బిలిచి, "యీకొండికవానిం దోడ్కొనిపోయి నట్టడ
విలో శిరంబు ఖండించి రం" డని పంచినఁ, గాలకింకరులం
బోని యమ్మాలలు, మద్యంబులు ద్రావి మదోన్మాదం
బున దాఁటుచు, హరిభక్తాగ్రగణ్యుం డతిపుణ్యుండు
సుకుమారుండు నైనయారాజకుమారునిం దోడుకొని గండక
పుండరీకమాతంగకురంగమహిషవరాహఖడ్గగవయగంధసిం
ధురసింహశరభాదిమృగగణశరణ్యం బైనయరణ్యంబు సొచ్చి,
యం దొక్కశిలాఫలకంబున నమ్ముద్దులబాలకుం గూర్చుండ
నిడి, కత్తులు దూసి, మద్యపానమదోన్మత్తతం బేరెమ్ములు
వాఱుటయుఁ, బ్రహ్లాదునికైనవడి నారాకొమారుండు హృద
యంబున బెదరక వరద! వాసుదేవ! వైకుంఠవాస! వనమా
లికాభరణ! వారణాపదుద్ధరణ! వారిజాక్షా! యనిదివ్య
నామసంకీర్తనంబు సేయుచు ధీరుండై యున్నయెడం గృపా

ణంబు జళిపించి మూరాచపట్టిని గొట్టం దలంచి హరికటా
క్షుంబువలనం జేయూడక యుండఱు నేకవాక్యంబుగా నీచిన్ని
పాపనిం జంపు మని మూపాపాత్ముండు పంచిన మన మే
గతిం జేయం గలవార మని చంపక యక్కుమారునిపాదంబు
చిటికెనవ్రేలు కోసికొనిపోయి దుర్మంత్రి యగుదుష్టబుద్ధి
ముందరం బెట్టి, మ్రొక్కిన, నతండును బ్రమోదంబు
నొందె. అమ్మహామునులవాక్యంబులు దబ్బఱ సేసితిం గదా
యని యుబ్బుచు నుండె.

అంత నక్కుమారుండు, నుద్దండవేదండకపుండరీక
మండలహిండితం బైనయమ్మహారణ్యంబున నంగుళిచ్ఛేదన
వేదనం బొరలుచుం బట్టపగలింటియెండ తాఁకునఁ గొట్టు
వడి యాఁకట సొటసొట వోవుచు వదనకమలంబు వాడఁ
జిప్పకూఁకటి యల్లన నాడఁ గన్నుల నశ్రుజాలంబులు జా
ఱఁ, గమలాక్షా! దీనరక్షావిచక్షణా! లక్ష్మీపతీ! క్షమాపతీ!
ఆపన్నశరణ్యా! అనాథనాథా! అంబుజోదరా! ఆదినారా
యణా! నీవే దిక్కని వెక్కి వెక్కి యేడ్చుచు వేఁడియిసుక
లోనం బొక్కుచు స్రుక్కుచు నున్నయెడ నావనదేవతలు
నందలి మృగంబులుఁ బక్షులు హితోపచారంబులు సేయు
చు రక్షించుచునుండె అవ్వేళ మృగాకీర్ణ ప్రాంతరం బైన
కాంతారంబున నచ్చటిచెంచులకుం బోయలకు నధీశ్వరుండు,
పరిపూజితలక్ష్మీశ్వరుండును బుళిందనామధేయుండును నక్రాం
తలునిద్దుర్మంత్రికి విధేయుండు నగునొక్కపాళెగాండ్రదొర

వేఁటాడుచు దైవవశంబున నవ్వనంబు సొచ్చి యచ్చోటికి వచ్చి యశ్రుధారాపరిపూరితనేత్రుండు నుపవాసశోషిత గాత్రుండు నై కమలమిత్రునిం బోలు తేజంబున విరాజిల్లుచుఁ జరణాంగుళిఖండనవేదనం జాలఁ గుందియు ముకుందా! గోవిందా! అరవిందనయనా! ఇందిరారమణా! నందనందనా! యనుచు శ్రీహరిం దలంచుచున్నయాచిన్నరా

—* చంద్రహాసుఁడు బుళిందునకుదొరకుట. *—

కొమరునిం జూచి యాపుళిందకుండు దాను శ్రీహరి భక్తుండు గావునఁ గరుణాతరంగితమానసుం డై కన్నీరు నించుచు "నిక్కుమారుం డెక్కడివాఁడో? అక్కటా! యక్కటికంబు లేక యీచక్కనిబాలు నిక్కరణిం జేసినయక్కువు లెవ్వరో! యని వగచుచు గుఱ్ఱంబు డిగ్గి దగ్గఱకు వచ్చి వెఱవకు మని బుజ్జగించుచు "నే నపుత్రకుండను గాన శ్రీహరిసేవామహత్త్వంబున నిప్పుడు నాకుఁ గొడుకు గలిగె. కన్యకాపుత్రుండును, గుండుండును, గోళకుండును, నంగీకృతుండును, గన్యాదానకాలంబునఁ బ్రథమపుత్రుండు తన కొడుకు కని నిశ్చయింపఁబడినవాఁడును, గ్రయలబ్ధుండును, దల్లిదండ్రులచే ధారాపూర్వకంబుగా నీయంబడినవాఁడును, నెద్దియేనియు నొక్కయాపదవలనఁ దనకుఁ దానేచేరినవాఁడును, దేవరన్యాయంబున జనియించినవాఁడును, దనకు ధర్మపత్నియందు జనించినవాఁడు, నిప్పదుగురుఁ బుత్రు లనం బరఁగుదురు. అందులో, వీఁడు, తనకుఁ దానె చేరెం గావున

స్వయంప్రాప్తుం డనం బరఁగు" నని తనయునిం గా నం
గీకరించి యబ్బాలునిశోకంబు నివారించి తురంగంబుపై
నిడికొని తనయేలెడుచందనావతీపురంబునకుం జని, వెంబడిఁ
వచ్చిన బంధుపరివారంబులఁ బరిజనంబుల నర్హప్రకారం
బున నింప్లకుం బనిచి యంతిపురంబున కరిగి, దైవజ్ఞులు నుపా
స్యులు నైనజోస్యులం బిలిపించి, వారియనుమతిని శుభ
లగ్నంబునఁ దనపట్టపురాణి యగుమేధావినీరమణిం బిలి
పించి "యశోదాకుమారునికరుణవలన నీకుం గుమారుండు
గలిగెఁ గైకొమ్మా" యని చేతి కిచ్చుటయు, నచ్చిగురుఁబోణి
మచ్చిక హెచ్చ గ్రుచ్చి కౌఁగిలించికొని, స్తన్యంబులు సేఁపు
టవలనఁ బరిపులకితగాత్ర యై యక్కుమారు నాపాద
మస్తకంబు నిమిరి వామపాదంబునఁ జిటికెనవ్రేలు లేమికి
మనంబునం బురపురం బొక్కుచుఁ, శ్రీహరీ! యవ్యాజ
కృపాలహరీ! నరహరీ! నీవు కృప నొసంగిన యిక్కుమారు
నకు నంగవైకల్యంబు రాఁ దగునే? యని యంతరంగంబునం
దలంచినయంత నయ్యింతిపాతివ్రత్యమాహాత్త్యంబువలన
నెప్పటియట్ల చిటికెనవ్రేలు మొలచిన నానందంబు నొందె.
ఆపుళిందకుం డయ్యిందువదనతోడంగూడఁ గొడుకు నంక
తలంబున నునిచికొని చంద్రుని నవ్వునట్టిమొగంబు గలు
గుటం జేసి చంద్రహాసుం డనునామకరణం బొనర్చి దాది
యొమ్మున దూదిపాన్పునం బెనిచె.

అంత, శుక్లపక్షంబున విదియచందురుండునుంబలె నక్కుమారుం డభివృద్ధిం బొంద నమ్మహీమండలంబున నెల మూఁడువానలు గురిసె. సకలసస్యసమూహంబులు దున్నకయ పండె. ధేనువులు నపారంబుగా క్షీరంబులు గురిసె. క్షామక్షోభంబులు విరిసె. బాంధవకులం బానందంబున మెఱసె. అంత నద్ధరాకాంతుండు నందనునకు నుపనయనంబు గావించి వేదవేదాంగంబులును దద్రహస్యంబులును మన్వాదినీతిశాస్త్రంబులును ధనుర్వేదంబును విలువిద్యయందలి లాఘవ లక్ష్యశుద్ధి చిత్రత్వ దృఢత్వంబులును దివ్యాస్త్రజాలంబులును గత్తి, జముదాడి, వంకి, బాణా, పట్టా, సురియ, గద, గుదియ మొదలగు భద్రాయుధంబుల సాధనలును, అశ్వారోహణగజారోహణరథారోహణపదలాఘవవిచక్షణత్వంబునుం దెలియంజేసి సకలజనులు నానందంబు నొంద నప్పుళిందకుండు యౌవరాజ్యపట్టాభిషేకం బొనర్చినఁ గందర్పకోటివిలాసుం డైనచంద్రహాసుండు ధరణీచక్రంబు నవక్రపరాక్రమంబున శత్రునిచందంబునం బరిపాలించుచు, రుక్మాంగదునితెఱంగున శ్రీవిష్ణుభక్తిపరాయణుం డై తనదేశంబునందలిజనులెల్ల నేకాదశీవ్రతంబు విష్ణుపంచమీవ్రతంబు శ్రీజయంతీవ్రతంబును మొదలైనవైష్ణవవ్రతంబులను యథావిధిగా నాచరింపం జేయుచు నట్లు చేయనివారల దండించు. పదియాఱేండ్ల నూఁగుమీసంపుఁ గొమరుఁబ్రాయంబునఁ దండ్రిచే ననుమతిఁ బడసి తురంగ

మాతంగశతాంగవీరభటపటలీచటులం బైనసేనాసమూహంబులతో సరుదులు గెలిచి, బిరుదులు గైకొని, యట నంగవంగకళింగకాశ్మీరకర్ణాటకదూశకైవర్తకాదినానాదేశంబులు గెలిచి తుంగంబు లగు మత్తమాతంగంబులును వేగజితకురంగంబు లైనతురంగంబులును జిరత్నంబు లైన రత్నంబులును గిరిశిఖరంబులకన్న వాసు లైనహేమంపు రాసులును మొదలగుసంపదలు గైకొని నిలింపపతిసాంపున భూతలంబు గంపింప సేనాపరంపరలతోడం గూడ నానందం బైనచందనావతీపట్టణంబునకు వచ్చి తల్లిదండ్రుల పాదంబులకు వందనంబులు గావించి నిజభుజోపార్జితంబులు నార్జితంబులు నైనధనకనకరత్ననికరంబులచే బొక్కసంబు గ్రిక్కిఱియం జేసి, మాతాపితృశుశ్రూషణంబును బంధుమిత్రామాత్యాశ్రితపోషణంబును విద్వత్కవిసంతోషణంబునుం జేయుచు నున్నకుమారునిం గనుంగొని కనుంగవ చెంగలింప నప్పుళిందభూపతి యొక్కనాఁడు తనయునిం గరంబున నిమురుచు "నన్నా! మనము కుంతలాధీశ్వరునిం గొలిచినవారము. అచ్చట మనకుం బ్రాపకు లతనిమంత్రి యగుదుష్టబుద్ధియుఁ దత్పురోహితుం డగుగాలవుండును. కనుకఁ గనకటంకంబులు పదివేలు నైదువేలు రెండువేలు వేర్వేఱ యమ్మువ్వురకు మూటలు గట్టి ముద్రవేయించి పంపు మనినఁ జంద్రహాసుం డట్లే యగుం గాక యని బొక్కసంబునకు వచ్చి యొంటెలమీఁద వేసడంబులమీఁద బలీ

వర్ధంబులమీఁద రాజునకు మంత్రికి ధనంబు లపారంబుగాఁ బెఱికలఁ బెట్టించి తండ్రి చెప్పినక్రమంబున ముడుపులు గట్టించి యామూఁడువగలముడుపులును బురోహితులకి మ్మని పంపుటయుఁ, దీర్పరులు నేర్పరు లైననియోగులు కొంతలంబున కేగి రాజునకు మంత్రికిఁ బురోహితునకుం బ్రణమిల్లి చంద్రహాసుం డిచ్చినపత్రిక నొసంగి యెప్పుడు నీకుందగిన యప్పనంబుకన్నఁ బదియింత లధికంబు దెచ్చితిమి. కైకొని రాజునకి మ్మని యమ్మంత్రికి నొప్పగించి తక్కిన యమ్మూఁడువగల ముడుపులను నొక్క బంగరుపళ్లెరంబున నునిచి తత్పురోహితుం డగుగాలవునకు నిచ్చినఁ, దద్వృత్తాంతం బంతయు దుర్మంత్రి యైనదుష్టబుద్ధి యాలకించి మనపుళిందున కింతసంపద గలుగుటకుఁ గారణం బేమి? యని యసూయామలీమసం బైనమానసంబునఁ గుంతలాధిపునిం జేరి చంద్రహాసుని తెఱంగు విన్నపంబు సేసి యతనితండ్రి యగుపుళిందునిం బట్టుటకు రాజుచే ననుమతిఁ గైకొని పవనజవం బైనతురంగంబు నెక్కి యపారదళంబులతో నాఱు యోజనంబులదూరం బొక్కదినంబులోనం జని చందనావతీపురంబు ముందరం గాంచి తనయొద్ది యోధవరులఁ గల యం గనుంగొని మున్ను సింహశరభశార్దూలాదిమృగసంకులం బైనయాయడవిలోని దైనయిది యిప్పు డమరావతీపురంబు నిరసించుచు నిలింపపతిసంపదలం బోలి సంపదల పెంపు వలిర్చుచు నున్నయది. అని పలుకుచు నరుదేరఁ

బుళిందకుండు ప్రియసుతునితోడం గూడ నెదుర్కొని మ్రొక్కి తోడ్కొనివచ్చి నిజమందిరంబున విడిదిపట్టు గావించె.

అంత నానావిధంబులును మనోహరంబులు నగువస్త్రవ్రాతంబు లర్పించిన నాదుష్టబుద్ధి కపటంబు మనంబున నుంచి వెలుపల వాత్సల్యంబు దోఁప నవ్వుచుఁ జంద్రహాసుం గనుంగొని "పుళిందకా! పున్నమచందురునిం బోలె నయనానందుం డైనసీనందనుండు సౌభాగ్యలక్ష్మీసమేతుం డై యొప్పుచున్నవాఁడు. ఇతండు నీ కేచందంబునం గలిగె" ననినఁ, బుళిందుండు దుర్మంత్రి నవలోకించి "మృగయావినోదంబుగా వనంబునకుం జని కుంతలపురంబునకు రెండామడ దూరంబున దురవగాహం బైనగహనంబునఁ బాదాంగుళిచ్ఛేదవేదనాదోదూయమానమానసుం డై శ్రీహరిం దలంచుచున్న యీచిన్నవానిం గనుంగొని శ్రీవిష్ణుభక్తునింగా నెఱింగి తోడ్కొనివచ్చి కన్నకొడుకుకన్న మిన్నగా నెన్నిక కెక్కం బెంచితిని. నాఁటి కైదేండ్లబాలుం" డనిన విని తా మున్ను చేసినయకృత్యంబు మనంబునం దలంచి యాచిన్నవాఁడు వీఁడె యని నిశ్చయించి మాలబంట్లపయిం బండ్లు గీఁటుచు నసూయాకోపంబులు మనంబున నణంచికొని యిచ్చట నితని నేమేనియుఁ జెనకఁ దలంచితిమేని మనకే దోషంబు వచ్చుఁ గావున నుపాయంబున వీనిం గొంతలపురంబునకుం బంపి యచ్చట మత్సుతుం డైనమదనునిచే

విషంబు పెట్టించి చంపించెద" నని యూహించి తనతన యునిపేర స్వహస్తలిఖితంబుగ నొక్కపత్రిక వ్రాసి ముద్ర వైచి చంద్రహాసునిచేతి కిచ్చి వినయంబును నెనరునుం దోఁచునట్లుగాఁ జేరంబిలిచి యీపత్రికంగొని నీ వొక్కరుం డవు కౌంతలంబునకుం జని నాపుత్త్రునకు నిమ్ము. అచ్చట నీకు సకలశోభనంబులు గలుగు ననినఁ, జంద్రహాసుండు మ్రొక్కి యక్కమ్మఁ గైకొని మనోమారుతవేగం బైనతురం గంబు నెక్కి నిమిషమాత్రంబునఁ గౌంతలంబునకుం జని తత్పురప్రాంతంబునందుఁ జంచచ్చంచరీకఝుంకారసంకులం బైన యొక్కయుద్యానవనంబు మధ్యంబున హృద్యం బైన పద్మాకరంబు పొడఁగని రాయంచ జక్కవ బెగ్గురులగఱుల కరుఃలిచే నెగయుపుప్పొడుల నప్పళించిన విప్పగు నల్లగలు వలు నుల్లసిల్లు తేనెసోనల నానినచలిగాలిమొలకలవలనం బథిశ్రమంబు దీఱఁ దురంగంబును సాహిణివశంబు సేసి పల్లవ పుష్పఫలభరితం బైనసహకారవృక్షంబునీడ బడలిక దీఱం బవ్వళించి నిదురించుచునుండ నాకౌంతలమహీకాంతుని కూఁతురు చంపకమాలినియు దుష్టబుద్ధితనయ విషయయు మన్మథు నారాధింపంగోరి సఖీజనులతోడం గూడ నవ్వనంబు నకు వచ్చి పల్లవితంబులు కుసుమితంబులు ఫలితంబులు నగుపొన్నలు పొగడలు గోరంటలు సేమంతులు చూతం బులు పారిజాతంబులు జాజులు విరజాజులు మల్లెలు మొల్లలు పోఁకమ్రాఁకులు మొదలగుతరులతానికరంబులనుమం

బులు గోయుచు విరిగుత్తుల నొండొరుల వ్రేయుచు నొ
య్యారంపునడలచే వనమయూరంబుల గర్వంబులు డించు
చుఁ బూలరెమ్మలు వంచుచుఁ బూలకై మదించుచు సఖులఁ
జేరం బిలుచుచు సరసంపుఁబలుంగులచే మత్తకోకిలంబుల
మదంబు లడంచుచుఁ బువ్వుఁదీవియల వంచుచు మేని
మెఱుంగుల వనంబెల్ల నింపుచు నిటలంబుల నటించుకుటి
లాలకంబులచేఁ దుమ్మెదలం గదుముచుఁ బల్లవంబులం జిదు
ముచుఁ గోసినవిరులు పయ్యెదలలో నదుముచుఁ దళుకు
వాలారుచూపుతూపుల బాలకురంగహృదయంబుల నాటు
చుఁ దేనియవాఁకలం దాఁటుచు దనూసౌరభంబులచేఁ
గుసుమసౌరభంబులు మాటుచుఁ బువ్వులు గోసి కమలాక
రంబు డాసి వేడుక మీఱ జలక్రీడ లాడి విగళితహారమణి
గణంబులచేఁ గమలాకరంబు రత్నాకరంబుగాఁ జేయుచుఁ
దత్తటంబునం దువ్వటంబులు గట్టి సొమ్ములు పెట్టి కుంకుమ
కస్తూరిక లలంది యవ్వేలందులు మన్మథపూజ సేయుచు
నుండిరి.

అయ్యవసరంబున నమ్మంత్రికుమారిక యక్కొలనిగ
ట్టునఁ దియ్యమామిడిచెట్టునీడ నిదురించుచున్నచంద్రహా
సునిం గాంచి యందియలు మొలనూలు మువ్వలు రవల
మెట్టెలు మ్రోయకుండ మెల్లమెల్లనం జని యక్కుమార
వరునిరూపరేఖాసౌందర్యకలావిలాసంబులకుం జొక్కి చక్కె
రవిలుతుని బారికిం జిక్కి చేరం జని యడపపుసంచిత్రాటం

గట్టియున్నకమ్మ విడిచి చూచి తండ్రిచేయివ్రాలుగాఁ దెలిసి యవ్వాక్యాణ మాద్యంతంబునుం జదివికొని నిజజనకునివిష మబుద్ధికిం బరితాపంబు నొందుచు “రూపరేఖావిజితసమా కుమారుం డైనయీరాకొమారునకు విషము నొసంగి యని వ్రాసినాఁడు. ఇంతనిర్దయుండు జగంబునం గలండే” యని వగచి విషము నొసంగి యని వ్రాసినయక్షరంబుల* నడుమ యకారంబువ్రాసి యెప్పటియట్లు ముద్రవైచి యడపపు సంచిత్రాటంగట్టి పెన్నిధిం జూచి విడువంజాలని పేదవడు వున నవల నడుగిడం జాలక కొంతతడవు చూచుచు నుండి పరాధీన గావున దీనమానస యై యెఱుంగనియట్ల రాజ పుత్త్రికడకుం జని తదనుమతిం బడసి నిజగృహంబునకుం జనియె. అంతఁ జంద్రహాసుండు నిదుర మేల్కొని, సరసీ జలంబులం బ్రక్షాళితపాణిపాదవదనుం డై నడగని నెక్కి వడిగ నప్పురంబునకు వచ్చి యెడనెడ శుభశకునంబులు పొడగనుచుఁ బ్రధానివాకిటికిం జని పణిహారిచేఁ దనరాక మంత్రికుమారున కెఱింగించుటయు, నతండు పుళిందకుని సుతుండు చద్రహాసుండు వచ్చినాఁ డనిన విని ససంభ్రమం బుగా నెదుర్కొని గాఢాలింగనంబు గావించి సంతసంబున నేకాంతప్రదేశంబునకుం జని పుళిందునిసేమం బడుగుచుఁ

---

* “నడుమ యకారంబు వ్రాసి” యనుటకు మాఱు, ముకారము యకారంబుగ దిద్ది యనుట లెస్సగా నుండును.

దంత్రిముద్రవైచినపత్రిక నొసంగినఁ గైకొని "శ్రీమత్సకల గుణసమృద్ధుఁ డైనదుష్టబుద్ధికుమారుం డగుమదనుని దీవించి పుత్తెంచిన శుభప్రయోజనంబు. పుళిందునిముద్దుపట్టి, కులస్థానపౌరుషంబులు గలమేటి, యెల్లప్పుడు మనకుమహాహితుండు, వీనిం గనుంగొనినయాక్షణంబున సందేహంబు మాని, విషయ నొసంగి నావచ్చునంతలో నెల్లకార్యంబులు చక్కఁబెట్టునది" యను నక్కఱ చదివికొని సంతసించి నాసహోదరికిఁ దగినవరుండు దొరకె మేలు మే లనుచు, మౌహూర్తికుల రావించి యారాత్రి శుభలగ్నంబు గలుగుట వలన వివాహంబు గావించి మహేంద్రవైభవంబున సముచితవిధానంబు లాచరించుచు నుండె. అక్కడ దుష్టబుద్ధి, చంద్రహాసుం డింతకుఁ గొంతలంబుసేరి మత్కుమారునిచే నీయంబడిన విషంబువలన నిహతుం డౌఁగదా! నాతలంపు నెఱవేఱె. మునులవాక్యంబు లబద్ధంబు లయ్యె: నని సంతసించుచుఁ బుళిందకునిం బట్టి సంకెలవేయించి యతనిపట్టణంబు చూఱలాడించి మూఁడవనాఁటి వేకువజామున నతిత్వరితంబుగ బెస్తల జంకించుచు బంగరుపల్లకి నెక్కి కొంతలపురీప్రాంతంబునకు వచ్చునెడ నొక్కకృష్ణసర్పం బడ్డంబుగా, వచ్చి మానుషభాషణంబుల నిట్లనియె. "నే నీపట్టణంబులో బహునిక్షేపంబులు రక్షించుచుంటి. వానికిం గర్త యగువాఁడు వచ్చె: నింక నేను బోయి వచ్చెద" నని పలికి రసాతలంబునకుం జనియె. అంత నయ్యమాత్యుండు పాముపలి

కినమాట పాటిసేయక పురంబు సొచ్చి చూతపల్లవతోరణా
లంకృతంబులును, రంభాస్తంభసంభృతగేహాళీద్వారంబులు
ను, జందనోదకసంసిక్తభూతలంబును, నగురుధూపధూపితం
బునైన రాజవీథియుఁ దననగరునుం గాంచి పట్టణాలంకర
ణంబునకు హేతు వేమి యని యడిగి చంద్రహాసునకు విష
యను వివాహంబు సేయుటగా నెఱింగి వీఁపు నెటుక్కుమనఁ
దటుక్కున గృహంబు సొచ్చి 'యే నేమి వ్రాసితిని దానేమి
చేసె' నంచుఁ బండ్లు గొఱుకుచుఁ గుమారుని బిలిపించి
"యోరీ దురాత్మకా! నేఁటివఱకు నాయానతి దాఁటవు.
ఇప్పు డేమి గావించితి" వనిన మదనుండు కరంబులు మోడ్చి
స్వహస్తలిఖితం బైనపత్రికఁ జూపుటయు నతండు నావక్క
ణంబు సూచి యచ్చెరు వందుచునుండ, మదనుండు తండ్రి
నవలోకించి "దేవరయానతి శిరంబునం బూని ప్రాణపదం
బైనముద్దుచెల్లెలిని నొసంగితిని. ఇతని కెప్పు డెడరు వచ్చు
నప్పుడు ప్రాణంబులు విడువం గలవాఁడ నని ప్రతిన
గొంటి" ననుటయుఁ దనయుని విశ్వసింపక కపటంబు మనం
బున నణంచి కుమారికయు నల్లుండు వచ్చి దండంబు
వెట్టినఁ గైతవంబుగా దీవించి బాలహారిణమ్ములఁ జూచిన
క్రొల్పులివితంబున మనంబున హుఙ్మని మ్రొయుచుఁ గైత
వోపచారంబుల వారల నాదరించి నాగవల్లి చేయించి
యారాత్రి నిద్దుర పట్టక మఱునాఁటివేకువఁ "గూఁతురుఁ
గొడుకు నాకులంబు చెఱిచిరి. ఇంకమీఁదటం జంద్రహాసుం

డెచ్చరిక పడియెనేని ప్రమాదంబు వచ్చు" నని డెందంబు
నం దలపోసి యెత్తెఱంగున నైన వీనిఁ జంపి యమ్మహాముని
లవాక్యం బసిద్ధంబుసేసెద' నని నిశ్చయించి బ్రహ్మఘ్నుండు
గోఘ్నుండు శిశుఘ్నుండు గురుఘ్నుండు మాతృఘ్నుండు
పితృఘ్నుండు మిత్రఘ్నుండు యజ్ఞఘ్నుండు బంధుఘ్నుండు
స్త్రీఘ్నుండు ననం బరఁగిన పదుగురు క్రొండెగాండ్రం బిలి
పించి "నాఁటికి మీరు సేసిననేరంబు సైఁచితి. నేఁటి కేని
యు నాశాసనక్రమంబున నడువుండు. సంధ్యారాగసమ
యంబునఁ బురంబునకు బయట నరణ్యసమీపంబున నున్న
కరాళకాళికోవెలలో మీరలు డాఁగి యుండుఁడు. ఆసమ
యంబున నొంటిగాఁ గాళికను సేవింప నెవ్వఁడు వచ్చునో
వానిం బట్టుకొని రెండుతుండెంబులుగా నఱికివైవుండు.
ముందువెనుకలు చూడం బనిలేదు. ఇట్లు చేసితిరేని నాకు
నడుచురాజ్యంబులో నర్ధరాజ్యంబు నిత్తు. మత్ప్రియపుత్త్రుం
డైనమదనునితోడె. సందేహింపకుం" డనిపంపుటయు, నా
చండాలు రియ్యకొని మద్యపానంబుసేసి క్రొత్తగా సానలు
దీఱిన కత్తులు గేలం గైకొని మూఁడవజామునఁ గాళికాసద
నంబునకుం జని యడంగి యుండిరి. ఆసమయంబున దుష్ట
బుద్ధి చంద్రహాసుని రావించి నెనరు దోఁప నిట్లనియె.
అల్లుఁడా! నీకు శుభంబు గలుగునట్లుగా మత్కులధర్మంబు
దెలిపెద. మాయింటఁ బెండిలియైన యల్లుండు సంధ్యా
రాగసమయంబునఁ బురసమీపచండికాసదనంబునకుం జని

సేవసేసి రావలయును. ఇది తరతరంబుల నడచు కులాచారంబు. నీవు నట్లాచరింపుము.” అనిన విని చంద్రహాసుం డట్లయగుంగాక యని సమ్మతించె. అంతఁ గుంతలదేశాధీశ్వరుండు నిజశరీరపతనారిష్టంబులు గని పురోహితుం డగు గాలవు రావించి నమస్కరించి కనకపీఠంబున నునిచి ‘మునీంద్రా! నాశరీరచ్ఛాయ శిరంబు లేకయె కనంబడియెడు నిది యరిష్టం బని యుండు. రాజ్యంబుమీఁదియాసం దొలంగితి. హరిచరణసరోరుహంబులు భజియించి ధన్యుండ నయ్యెద. అరిష్టలక్షణంబులు వినంగోరెద; నెఱింగింపు” మనవుడు గాలవుం డి ట్లనియె.

—* అరిష్టలక్షణంబులు. *—

రాజేంద్రా! తొల్లి దత్తాత్రేయుం డలర్కునకు నెఱింగించె. నెఱింగించె నీకుఁ జిత్తసమాధానంబు గలుగునట్లుగాఁ దత్త్వంబు దెలిపెద. ధ్రువు వసిష్ఠు నరుంధతిని జూచి నఁ దెలియకుండినవరునకు సంవత్సరంబులోపల, నగ్నియందుఁ గిరణంబులు సూర్యబింబంబునఁ గిరణరాహిత్యంబుం గనువాఁడు పదునొకండునెలలలోపల, బక్కవాఁడు బలిసినను బలిసినవాఁ డున్నట్లుండి బక్కచిక్కినను నెనిమిదినెలల లోపల, నడుచునపుడు వ్రేళ్లేనియు గుదికాళ్లేనియు ఖండితంబు లైనట్లు లడుగుజాడం గనంబడియెనేని యేడునెలల లోపలఁ, గాకి గ్రద్ద గూబ శిరంబున సోఁకెనేని యాఱునెలల లోపల, నభ్యంగసమయంబున మేనిచర్మం బదరెనేని య

యిదునెలలలోపలఁ, దననీడ వేఱొక్కలాగున నుండెనేని నాలుగునెలలలోపల, యమునిదిక్కున మేఘరహితం బైన గగనంబున మెఱుపు గనంబడియెనేని మూఁడునెలలలోపలఁ, దనబింబం బర్ధంబునఁ దల లేక కనంబడియెనేని రెన్నెల్లలోపలఁ దనశరీరంబున నిర్వ్యాజంబుగా శవగంధంబు గలిగెనేని పక్షంబులోపల, జలకమాడినఁ దడి తొడన నశించెనేనియు హృదయమధ్యంబున నలందినచందనంబు శీఘ్రంబ యెండెనేనియు నీరు గ్రోలిన దాహంబు నిలువదేనియు నయిదుదినంబులలోపల యమసదనంబునకు వేంచేయుట నిశ్చయంబు. మనుజులలోచనంబులలోఁ దనరూపంబు గానరాదేని వీనులలో వ్రేళ్లు సొనిపినయెడఁ బ్రాణఘోషంబు వినంబడదేని శీఘ్రంబ శరీరహాని సంభవించు. తననీడఁ దాను భక్షించునట్లును గేశంబులు నముకయుఁ దినినయట్లును దిగంబరుం డైన జైనసన్యాసి నవ్వుచు దగ్గఱ గంతులు వేసినట్లును, నాపాదమస్తకంబుఁ దైలంబు నలందికొని భూతలంబునం బడి నిద్రించినట్లును భయంకరాకారు లైన బంటురౌతులు వెంటఁ బడినట్లును గుదియలవారు పొడిచినట్లును నల్లనిశూద్రులు తఱిమి ఱాళ్లు వ్రేయునట్లును నీలిచీర గట్టికొనిన కాంత దక్షిణాభిముఖంబుగాఁ బోవ దాని వెంబడిఁ బోవునట్లును స్వప్నంబు గన్నవారికి మరణంబు ధ్రువంబు. అరిష్టంబులు సంభవించినయప్పుడు జపహోమసురార్చనాదులు చేయించి సర్వసంగంబులు నిరసించి యుం

ద్రియ వికారంబులు జయించి నదీజలంబు సముద్రజలంబు నం జేర్చినయట్లు జీవునిఁ బరమపురుషుం డైననారాయణుం జేర్చి తత్త్వరహస్యకోవిదు లైనపురుషులు ధన్యు లగుదురు. అని గాలవమునీంద్రుండు పలుకుటయుఁ, గుంతలాధీశ్వరుండు గుబుసంబు నూడ్చు మహానాగంబు తెఱంగున రాజ్యభోగంబులు విడువం దలంచి మంత్రికుమారుం డైనమదనునిం బిలిపించిన, నతండు వచ్చి మ్రొక్కి "యేమికార్యంబున నియోగించెద" ననిన మీయల్లుం డగుచంద్రహాసు నీక్షణంబ పిలిపింపుము. మత్కుమారిక యగు చంపకమాలినిం బరిణయంబు సేసెద ననుటయు, నట్లె యని ముకుళితహస్తుం డై యతివేగంబునం దనగృహంబునకుం జనియె.

—* చంద్రహాసునకుఁ గుంతలరాజ్యపట్టాభిషేకము. *—

అట్టియెడ సంధ్యారాగసమయంబునఁ జండికాపూజనంబునకుం దగిన పూజాద్రవ్యంబులు గైకొని యొంటిగాఁ బోవునట్టి మఱంది ననలోకించి మదనుండు "రాజనందనా! కుంతలనాథుండు నిన్నీక్షణంబ తోడితె మ్మనె" ననవుడు నతండు "మామయనతిఁ జేకొని శాంభవీపూజనంబునకుఁ బూజాద్రవ్యంబులు గొనుచుం జనియెద. చండికాపూజానంతరంబ వచ్చెద" ననిన మదనుండు "దేవపూజనంబు నీకు బదులుగా నేను జేసి వచ్చెద నీవు రాజసమ్ముఖంబునకుఁ బొ" మ్మని యతనిచేత నున్నగంధపుష్పాక్షతాదిపూజాద్రవ్యంబులు గైకొని తా నెక్కినగుఱ్ఱంబును ఛత్త్రచామరాదులు

నతనికి నొసంగి పంపిన, నాచంద్రహాసుండు సత్వరంబుగాఁ జని ప్రణమిల్లి నిలుచుటయుఁ, గుంతలవిభుండు గాలవసంయమీంద్రుని శాసనంబునఁ జంద్రహాసునకుం జంపకమాలినిం బెండ్లి సేసి తనసింహాసనంబున నునిచి పట్టంబు గట్టి సమస్తరాజ్యంబు నతని కొసంగి విరక్తుఁడై తొల్లి యనుభవించిన భోగంబులఁ దలంచి యేవగించుచుఁ దపోవనంబునకుం జనియె.

అప్పు డమ్మంత్రికుమారుండు నగరప్రాంతంబునఁ గాంతారసమీపంబున రుద్రకాంతాసదనంబునకుం జనుటయు నమ్మహాధ్వాంతంబున నక్కోవెలలోన డాఁగియున్న పరశుహస్తులు పైఁబడి యాయుధంబులం గ్రుమ్మి పడవైచిరి. ఇక్కడఁ జంద్రహాసుండు చంపకమాలిని వివాహంబై కుంతలరాజ్యసింహాసనారోహణంబున మహోత్సాహంబు నొంది వందిసందోహంబులు కైవారంబులుసేయ వేలకొలందు లగు వేత్రపాణులు సాహోనినాదంబుల నెచ్చరికలు దెలుపుచు ముందటం గ్రందుకొను సంపదలు తొలంగింప మెఱుంగుల పరంపరలంబోలె శతముఖసహస్రముఖంబులుం గలదివ్వటీలు పెక్కువేలు నిప్పటిల్లఁ జంద్రజ్యోతులు ననేకసహస్రంబులు ప్రకాశింపఁ జంపకమాలినీసమేతంబుగా శచీసమేతుండైన మాఖండలుండునుంబలెఁ దెల్లయేనుంగు నెక్కి యక్కజంబైనవిభవంబునఁ బురప్రవేశంబుగాఁ జనుదెంచి మంత్రిగృహంబువాకిట మదావళంబు డిగ్గి యంతకమున్న చారు

లచే నిజవృత్తాంతంబు విని కలంగి యెదురు వచ్చినమామ గారికిం బ్రణమిల్లి మదనుండు కాళికాగృహంబునకుం దనకు బదులు వోవుటయుం దాను రాజసముఖంబునకుం జనుదెంచుటయు మొదలగువృత్తాంతంబు నాద్యంతంబు సవిస్తరంబుగా నెఱింగించిన నమ్మంత్రి నిప్పులు ద్రొక్కిన గతిం బొక్కిపడి ముఖవికారం బణంచికొని కైతవప్రియం బున నల్లునియుల్లంబు పల్లవింపం జేసి నగరికిం బోనం బనిచి యయ్యమాత్యవర్యుం డత్యాహితంబునం దలయుం జీరయు వీడం గాళికాగృహంబునకుం బఱచి ఖండితశిరస్కుం డైన కొడుకుం గని సంతాపంబు నొంది "శ్రీవిష్ణుభక్తునకు ద్రోహంబు దలంచినపాపాత్ములయత్నంబులు ఫలియించునె" యని యాదేవిబలిపీఠంబునం బెట్టుగాం దాకి భగ్నశిర స్కుం డై ప్రాణంబు లెడంబాసె. అంత వేగుజా మగుట యుం జండికం బూజసేయ నర్చకుండు వచ్చి కోవెలవాకిటం బడియున్న మంత్రినిం దత్కుమారునిం జూచి యెట్లు పొలిసిరో! ఏమిదుర్నిమిత్తంబో! యని మొత్తుకొనుచుం బఱతెంచి చంద్రహాసున కెఱింగించుటయు నతండు పాదచారియై కాళికాగేహాళీప్రాంతంబునం బడియున్న సచివుం దత్కుమా రునిం గాంచి శోకసంతప్తుండై వీరల బ్రతికింపకపోయితి నేని నా కపకీర్తి పాయ దనుచుం జతురస్రంబుగా బాహుమాత్ర ప్రమాణంబున నారుద్రాణిసన్నిధిని హోమకుండంబు త్రవ్వించి పావకునిం బ్రజ్వలింపం జేసి శర్కరాతిలపాయస

—* చంద్రహాసుఁడు దుష్టబుద్ధిని మదనుని బ్రదికించుట. *—

ఘృతంబులతోఁ గూర్చి తనమేనిమాంసఖండంబులు ఖండించి వేల్చి "దేవీ! నీవు శ్రీవిష్ణుదేవుని చిచ్ఛక్తివి, గావున నీకుం బ్రియంబుగా శిరంబు పూర్ణాహుతి గావించెద" నని ఖడ్గంబు జళిపించునంతలో నవ్వైష్ణవశక్తి యప్పుడమితేని కరంబు వట్టికొని 'వీరప్రతాపా! నీసాహసంబునకు మెచ్చితి వలయువరంబు గోరు' మనుటయు, "మంత్రిని నతని కుమారుని ముందుగా బ్రదికింపుము. నాకు నారాయణ చరణారవిందంబుల దృఢభక్తి నొసంగు" మనిన నాభద్రకాళియు, నట్లె యగు, నదియునుం గాక బలపరాక్రమసమున్నతు లైనసుతు లిరువురు నీకుం గలిగెద' రని చంద్రహాసుని డాయం బిలిచి హస్తమస్తకసంయోగంబు గావించి భగవంతుం డైనరమాకాంతుని స్వరూపరూపగుణవిభూతివిశేషంబులు, జీవాత్మపరమాత్మస్వరూపంబులును, సంసారనివృత్తిప్రకారంబును, మోక్షస్వరూపంబును దత్త్వవిజ్ఞానంబునుం దెలిపి చండికయంతర్ధానంబు నొందుటయు, నయ్యమాత్యుండును దత్సుతుండును నిదుర మేల్కనినచందంబున సమాగతప్రాణులైరి. తోడనె యాచంద్రహాసునిపయిం బుష్పవృష్టి గురిసె. దేవతలు గొనియాడిరి. అంత నాచంద్రహాసరాజేంద్రుఁడు నమాత్యునిం దత్కుమారునిం దోడ్కొని పురంబునకు వచ్చి యాదరించి గృహంబున నునిచి, తల్లిదండ్రు లైన మేధావినిం బుళిందునిం బిలిపించి, వినయంబున మ్రొక్కి

యథేష్టభోగంబులు సమర్పించి, చంపకమాలినియందును విషయ యనుయోషామణియందును బద్ధాత్ముండు మకరధ్వజుండు ననునిరువురుకుమారులం గాంచి బహుయాగంబులాచరించి ముకుందచరణారవిందన్యస్తమానసుం డై మున్నూఱుసంవత్సరంబులనుండి రాజ్యపరిపాలనంబు సేయుచున్నవాఁడు.

అని నారదమునీంద్రుం, డర్జునా! యివ్విధంబున నీశ్వాస్యమూయాపరుం డైనయాదుష్టమతి నరకంబునం బడకయుండుటకుఁ గారణంబు గలదు వినుము. మున్ను తాను భజియించుసాలగ్రామంబు శ్రీతులసీదళంబులతోఁ డంగూడ మ్రింగియుండె. అది కారణంబుగా నతని కిహంబున దైవానుకూల్యంబు తప్పెం గాని పరలోకబాధ లేదాయె. సాలగ్రామతీర్థంబు శిరంబునఁ జల్లికొనిన మానవులకు నేఁబదికోట్ల యోజనంబులవిస్తారం బైనభూమండలంబునం గలపుణ్యతీర్థంబు లెల్ల నాడినఫలంబు లభించు. సాలగ్రామంబు ధరియించుటవలనఁ జతుర్దశలోకంబులు ధరియించినపుణ్యంబు దొరకు. సాలగ్రామదానంబున భూచక్రదానఫలంబు గలుగు. సాలగ్రామపూజవలన సకలదేవతలఁ బూజించినసుకృతంబు చేకూరు. సాలగ్రామవర్ణనంబువలన సకలవేదపారాయణఫలంబు సిద్ధించు. సాలగ్రామంబు సన్న్యాసియు నను నీ రెండును శ్రీవిష్ణుదేవునకు స్థావరంబు చరంబు నైనదేహంబు లని బ్రహ్మ కొనియాడుచుండు.

అంతకంటె శ్రీతులసి యధికం బని పెద్దలు మందలింతురు. శ్రీకృష్ణదేవుండు శిరంబున నెమిలిపించెమును గర్ణంబుల మకరకుండలంబులను నురంబునఁ గౌస్తుభంబును ధరియించు నంతకంటె శ్రీతులసీదళం బతిశయం బని ధరియించుచునుండు. ఇక్కతవిన్నవారల కభీష్టంబులు చేకూరు నని పలికి నారదమహాముని దేవలోకంబునకుం జనియె. అంత నర్జునుండు విస్మయంబు నొంది తోడిరాజులతోఁ జంద్రహాసునిం గొని యోడుచుఁ గొంతలంబు చేరంబోయిన నారాజకుమారులు

—* చంద్రహాసుని కొడుకులు మఘాశ్వంబులం బట్టుట. *—

బలపరాక్రమసంపన్ను లయిన మకరధ్వజపద్మాక్షులును మున్నాడి పఱతెంచిన జన్నంపుఁదేజులఁ బట్టికొనిపోయి తండ్రిసముఖంబునఁ బెట్టినఁ, జంద్రహాసుండు గనుంగొని "యివి ధర్మనందనుని మఘాశ్వంబులు. వీనిసంరక్షించుటకుఁ గిరీటి వచ్చుచున్నవాఁడు. అతని మున్నాడి యిత్తురంగంబులు పాఱి వచ్చె. కుమారులారా! మీరలు పదియేడుదినంబు లీరెండుగుఱ్ఱంబులను రక్షించుచుండుఁడు. ఇంతలో వారలు రాకుండిరేని ధర్మసుతుని యాగంబు కొదవపడకుండునట్లుగా మనమే పంపుదము." అని పలుకుచుండు నంతలోఁ బార్థునిమెలగోలుమ్రోఁకలకలకలంబు భూనభోఽంతరంబులు, దిక్కులు వ్రక్కలింప వినంబడుటయుఁ జంద్రహాసుండు ముఖచంద్రహాసచంద్రికలు గ్రందుకొనఁ గొడుకులం జూచి మీరలు సకలసైన్యసమేతంబుగా మోహరింపుం డనుటయు, వారలు తత్పురంబు బయలువెడలి

యర్ధచంద్రవ్యూహంబుగా మోహరించి యుండునెడ శ్రీకృష్ణ దేవుం డింద్రనందనునితో "వీఁడు చంద్రహాసుం డనుమహారాజు; పరమవైష్ణవుండు; ఇతండు విద్యచేత విజ్ఞానంబుచేత వృద్ధుం డగు నైనను సమరాంగణంబున యౌవనస్థుండు సుమ్ము." అని పలుకునవసరంబునఁ జంద్రహాసుండు నిజసేనలఁ దలకడచి వచ్చి యర్జునునియరదంబున శంఖచక్రగదాపద్మహస్తుండును కౌస్తుభమాలికాకిరీటకేయూరమకరకుండలమేఖలాదామమంజీరాది దివ్యభూషణభూషితుండును, సనకసనందనాదిమహామునిధ్యానగమ్యుండును నైన శ్రీగోపాలదేవునిం గని భక్తిభయవినయసంభ్రమంబులు మెఱయ శరశరాసనంబులు పాఱవైచి మాణిక్యరథంబు డిగ్గ నుఱికి "యదునందనా! శ్రీకృష్ణా! యని సాష్టాంగదండప్రణామంబు గావించి లేవకుండిన శ్రీవాసుదేవుండు తాను నరదంబు డిగ్గి నిడుదభుజంబులు సాఁచి లేవనెత్తి కౌఁగిలించికొని సవ్యసాచిం జూచి "నా కితండు నిజభక్తుండు, త్రికరణంబుగా నన్ను నమ్మినవాఁడు. బ్రహ్మరుద్రాదులకేనియు నజేయుండు. ఇతనితోడ సమరంబు వలదు. కౌఁగిలించికొ"మ్మనుటయుఁ, గౌంతేయుండును "నాకురువంశంబు నేఁటికిఁ బావనం బయ్యె. నాజన్నంబు సఫలం బయ్యె;" నని చంద్రహాసునిం గౌఁగిలించికొనియె. అంతఁ, గుంతలేశ్వరుని యాజ్ఞవలనఁ దత్కుమారుం డైనమకరధ్వజుం డశ్వమేధాశ్వంబుల వెంటఁ గొని వచ్చి శ్రీహరిసన్నిధియందు నిలిచి కృష్ణార్జును

లకు నమస్కరించిన, నయ్యవసరంబున రాజసమాజంబుల తోఁ దేజస్వి యైనచంద్రహాసుండు సుధారసనిరాసంబు లైన వాగ్విలాసంబుల నుపచరించి వాసుదేవునిఁ దనపురంబునకుం దోడ్కొనిపోయి యచ్చట దుష్టబుద్ధిమదనులఁ, జంపకమాలినీవిషయులఁ, బద్మాక్షమకరధ్వజుల, మఱియునుం దక్కినబంధుజనులఁ గానిపించి శ్రీకృష్ణపదారవిందభజనాయత్తచిత్తుం డై తనకుం గలరాజ్యం బంతయు ముకుందునకొసంగి, యనంతరంబ, గాలవమహామునిం బిలిపింప నతండు సచ్చిదానందమయుం డైనశ్రీకృష్ణదేవునివిగ్రహంబుఁ గనుంగొని పులకాంకితగాత్రుండును హర్షాశ్రుజడీకృతనేత్రుండు నై ముహూర్తమాత్రంబు తన్మయుం డై యూరకుండె. అంత రుక్మిణీకాంతుండు కుంతలేశ్వరుం డొనర్చునర్చనల సంతసిల్లుచు దివసత్రయం బతనిపట్టణంబున వసియించి నాలవనాఁడు చంద్రహాసుండు తనకు ము న్నర్పించినరాజ్యంబు తత్పుత్రు లైనపద్మాక్షమకరధ్వజుల కొసంగి పట్టంబుగట్టినఁ జంద్రహాసుండు నందనులం జూచి "యానందనందనునిచరణారవిందంబులు భజించి మోక్షానందంబు నొందుఁడు. నాయట్ల కీర్తిఁ జెందుఁ" డనుచు దీవించి, బుద్ధిసెప్పి, వారలచే వీడ్కొని చతురంగబలంబులు గొలువ సవ్యసాచికిం దోడై వెడలె.

అంత నమ్మఘాశ్వంబులు నానాభూములు సీమలు జనపదంబులు నదంబులు హ్రదంబులుఁ గ్రమించుచుఁ జను

చుండఁ దత్తద్దేశాధీశులు మెప్పైనకప్పంబులు గొని భక్తియుక్తులై సేవింప విక్రమోపార్జనుం డైనయర్జునుఁడు హరియును హరుల వెంబడిం జను నెడ నవి యుత్తరసముద్రతీరంబునకుం జని యందఱుం గనుంగొనుచుండ సాగరమధ్యంబునకు దాఁటుటయు, నమ్మహీపాలు రందఱు నివ్వెఱఁగంది నిశ్చేష్టితులై యంబుధిసాధించువిధంబు తెలియక విహ్వలత్వంబు నొంద శ్రీకృష్ణుండు మయూరధ్వజు నర్జునుం బ్రద్యుమ్ను హంసధ్వజు బభ్రువాహనునిం బిలిచి "మీరథంబులకు దశదిశాభాగంబుల గిరివనసముద్రాది దుర్గంబుల నడ్డంబు లేదు గావున మీ రేవురు నావెంబడి రం" డని సకలదళంబుల నచ్చట నిలిపి యంబుజాక్షుండు రథారూఢుం డై సముద్రంబు సొచ్చి వెదకి యొక్కదీవియందు జీర్ణశరీరుండును శ్మశ్రుజటాపటలభూషితుండును భానుసహస్రతేజుండు నై చివికినవటపత్త్రంబులు గొన్ని శిరంబునకు నడ్డంబుగా వైచికొని యన

—* శ్రీకృష్ణాదులు బకదాల్భ్యుని జూచుట. *—

వరతహరిధ్యానానందసాగరమగ్నుండును వరతపఃప్రాగల్భ్యుండు నగుబకదాల్భ్యుం గనుంగొని యేవురుమహారథులతోఁ గూడ రథంబులు డిగ్గి నమస్కరించుటయు, నమ్మహాముని శ్రీకృష్ణునిం గనుంగొని, యివ్వెన్నుని కెన్ని వింతలు! ఇమ్మూల కింతసందడి నెందులకుం గొనివచ్చె? అని యసహ్యపడుచునుండ నరుండు మెల్లన నత్తపోధనునిం జేరి కేలు మొగిచి "మీశరీరంబున వింతలు గనుపట్టు

చునున్నయవి. సందుసందులఁ బుట్టలు పెట్టె. అందున నూఱువేయుం బడగలుగలసర్పంబులు దర్పంబున నటియించుచున్నయవి. మోఁకాళ్ల మోఁచేతుల మహావృక్షంబులు పుట్టె. కర్ణంబుల గూండ్లు కట్టుకొని యనేకపక్షిసహస్రంబులు సంచారంబులు సేయుచున్నయవి. మీఁదు జీర్ణంబులగువటపత్త్రంబులు గొన్ని తలమీఁద వైచికొని యున్నవారలు. ఇది యేమి?" యని యడుగుటయు, నమ్మహాముని నవ్వుచు "క్షణభంగురం బైనశరీరంబు నీటిబుగ్గచందంబున నెప్పు డెవ్వేళ నవిసిపోవునో తెలియదు. సంగంబులు దుఃఖప్రదంబులు, గృహారామక్షేత్రంబులు నశ్వరంబులు. అల్పకాలంపుబ్రదుకున కింతమాత్రంబు చాలదే యని మఱ్ఱాకు శిరంబున కడ్డంబుగా నునిచికొని యున్నవాఁడ." అనిన విని యర్జునుం డాశ్చర్యభరితమానసుం డై 'తపోధనా! మీకెన్ని సంవత్సరంబు లయ్యె నానతీయవలయు' ననుటయు, నమ్మహాముని పార్థునిం జూచి నేను జనియించినతరువాత మృతులైనరోమశులకు లెక్క లేదు. మార్కండేయుల నెన్నఁదరంబు గాదు. నేను బుద్ధియెఱిఁగిన వెనుక నిరువది బ్రహ్మపట్టంబు లయ్యె. మున్నొకసమయంబున సప్తసాగరంబులేకీభూతంబు లై మహాప్రవాహంబుగా నచ్చునప్పు డిచ్చటికి భూలోకంబు భువర్లోకంబు సువర్లోకంబునుం దేలి యాడుచు వచ్చె. అప్పు డొక్క మఱ్ఱిచె ట్టిచ్చట నుండె. దానికి సహస్రశాఖలు గలవు. శాఖకు వేయేసిబ్రహ్మాండంబులు వ్రే

లుచునుండె. ఆమఱ్ఱిచెట్టు కొనచివురాకునందు నొక్కచక్కని చిన్నబాలకుండు పవ్వళించి కోమలంబైనపాదాంగుష్ఠంబు ముఖారవిందంబున నిడి చీకుచు వెడవెడ నేడ్చుచు నవ్వుచు నుండె. వానిధర్మంబున నాప్రళయకాల మహామారుతంబునం గొట్టువడక యాసముద్రంబు నుదుల లోనం దగులక సంచరించితి. ఆసుద్దు లిప్పు డేమిటికి? అర్జునా! నీయొద్ద దీర్ఘబాహుండును నీలమేఘశ్యామలగాత్రుండును గమలనేత్రుండును గౌస్తుభవనమాలికాకనకాంబరధరుండును నైనయితండు నీకు బావ గదా? మీఁకోడం గూడఁ దిరిగి తిరిగి యూచంపెం బయ్యె. రమ్ము పొమ్మనువారు లేక యొంటిగా సర్వంబునుం దానయై హాయిగా నున్నవానికి నాభియం దొక్క కమలంబు గలిగె. దానియందు నాలుగుమొగంబులకొడు కొక్కఁడు గలిగె. వానికిం గలిగె నీచరాచరజగంబులు. అది చాలక నాఁటి చిన్నవాఁడు యదుకులంబునం బుట్టి పదియాఱువేలనూటయెనమండ్రం బెండ్లియై మీవంటివారితో వియ్యంబు లంది యూసంసారం బేమిటికిఁ దెచ్చికొనియె? అని నవ్వుచు "నోయీ! త్రైలోక్యకుటుంబీ! యిందు రావోయి!" యని శ్రీకృష్ణుం జేరం బిలిచి కౌఁగిటం జేర్చుటయు, నాశౌరి యమ్మునికి నమస్కరించి "యిరువదిబ్రహ్మకల్పంబులు చూచిన పెద్దవు. విష్ణుభక్తాగ్రేసరుండవు. కావున నీవే విష్ణుదేవుండవు. నీవరుగుదెంచి ధర్మపుత్రునియాగంబు సఫలంబుగా నెఱవేర్ప

వలయు" ననుటయు, దాల్భ్యుండు 'దేవా! నన్నీరీతిఁ బ్రస్తుతించి గర్వం బను వెఱ్ఱి పట్టింపకుము. నీచందంబునకు వెఱతు. తొల్లి నాగర్వంబును బ్రహ్మగర్వంబును జెఱచిన పుణ్యపురుషుండవు గావె? అక్కథ నీసఖులు వినం జెప్పవ నని పలుకం దొడంగె.

—* బకదాల్భ్యుఁడు విష్ణుమహిమ సెప్పుట. *—

అర్జునా! తొంటిబ్రహ్మకల్పంబున నొక్కచతుర్ముఖబ్రహ్మదేవుండు నాయెదుట నిలిచి "మునీంద్రా! చింపిముత్తాకుచాఁటున నేమిటికిఁ దపంబు సేసెదవు? వలయువాంఛితంబుల నిచ్చెద. తపంబు చాలింపు" మనిన నతనిం గనుంగొని, నే నిరువదుండ్రు బ్రహ్మలం గంటి. వారిలో నీవు కడపటివాఁడవు. నీ వేమివరం బిచ్చెదవు నే నేమి గైకొనియెద? నని నవ్వుచుండ నప్పుడు మాయిరువురనడుమ ధరణీచక్రంబు గ్రక్కలించికొని యొక్క యుత్పాతమారుతంబు పుట్టి మమ్ము నిరువుర నెత్తికొని వేఱొక్కబ్రహ్మాండంబులోఁ బండుటాకులవలెం బాఱవైచుటయు నందొక్క యెనిమిదిముఖంబులబ్రహ్మ మీర లెవ్వ రెచ్చటినుండి వచ్చితి రనిన, నేను జతుర్ముఖబ్రహ్మను, సత్యలోకంబున నుండుదు, నిమ్మౌని నాశిష్యుం డనుటయు, నాయష్టముఖవిరించి నవ్వుచు 'నోరి! నాలుగుముఖంబులవాఁడవు. నీ వేమి! బ్రహ్మపట్టం బేమి! శిష్యుఁ డేమి' పాండిత్యంబులు మాని మాకు దాసుల రై యుండుం డనియె. అట్టియెడ నచ్చట మునుపటికంటెఁ బదింత

నధికంబుగ నొక్కమహామారుతంబు పుట్టి, మమ్ము మువ్వుర నెత్తికొని మఱియొక్క బ్రహ్మాండంబునం జొక్కాకులుంబలెం బడవేయుటయు, నచ్చట, నత్యున్నతాకారులు నతివదాన్యులు నైనమహాపురుషులు మమ్ము మువ్వురం జూచి "మీర లెచ్చటి నుండువార" లనిన, నయ్యష్టముఖబ్రహ్మ "నేను జగద్విధాతను, బద్మసంభవుండ" ననుటయు వారు మమ్ము మువ్వురం దోడ్కొనిపోయి పదియాఱుముఖంబుల బ్రహ్మసముఖంబున నిలుపుటయు, నతండు తనసముఖమువారిం జూచి యిమ్మువ్వుర మనయూడిగంబులలో నిలుపుం డని పలుకుచుండ, నర్జునా! యమ్మహాశ్చర్యం బే మని పలుకుదు! నచ్చటం దొంటికంటె శతగుణంబుగా వేఱొండు చండమారుతం బుదయించి, మమ్ము నలువుర నెత్తికొని ముప్పదిరెండుమోముల తమ్మిచూలిసమ్ముఖంబునం బడవైచుటయు, నతండు నట్ల పలుక, నం దొక్కచక్రవాతంబు పుట్టి, మమ్ము నేవుర నెత్తికొనిపోయి యఱువదినాలుగుమోములయంబుజభవుని చెంతం ద్రోచె; నిట్లు క్రమక్రమంబున బహుపద్మసంభవుల తోడంగూడం జనిచని కడపట సనకసనందనాదిమహాముని సేవితుండును సహస్రముఖుండును దుర్నిరీక్ష్య తేజోరాశియు నైన యొక్కసహస్రముఖపరమేష్ఠిం గన నతండు మమ్ముం గనుంగొని ప్రత్యుత్థానంబు సేసి యర్ఘ్యపాద్యాదు లొసంగి స్వాగతం బడిగి మీకృపాకటాక్షంబున నీలోకంబున నధికారంబు సేయుచు నున్నవాఁడ. నేనును నాశరీరంబును

మత్పరిజనంబులును మీయధీనంబులు. నా కేమికైంకర్యంబు నియమించెదరు? అనినఁ దొంటిపద్మసంభవు లందఱు గర్వంబు లుడిగి మదంబులు మాని బ్రహ్మాత్వాహంకారం బులు దొఱంగి దండప్రణామంబులు సేసి "దేవా! నీవు సాక్షా దధోక్షజుండవు. నీయైశ్వర్యం బపారంబు. నీమహిమ నీకు సహిత మెఱుంగం దరంబు గాదు. మహాసముద్రంబున ఫేనబుద్బుదంబులు పుట్టుచందంబున నీయం దనేకకోటి బ్రహ్మాండంబులు పుట్టుచుం గిట్టుచు నుండు;" నని వినుతించు టయు, సహస్రముఖుం డైనయవ్విరించి వారల నాదరించి యాకమలసంభవుల నయ్యైపదంబుల నిలిపి నన్ను నిచ్చ టికిఁ బనిచె. నాఁటిబడలికలు దీర్చికొనుచు నిచ్చట నున్నాఁడ. కన్నడే! గర్వం బెవ్వరికిం గాదు. అనినఁ గృష్ణార్జును లమ్మునిం బ్రార్థించి నవరత్నమయం బైనపల్లకి యం దునిచి తోడ్కొని యచ్చటనున్నయాగహయంబుల మరలించికొని నాగరంబు వెలువడి సమస్తరాజలోకంబు సంతసింపం జతురంగసేనాసమేతు లై యవ్వలం దరలిరి.

—* అర్జునుని రాకవిని సైంధవుని పుత్త్రుండు మృతుం డగుట. *—

తదనంతరంబ యాగహయంబులు సింధుదేశంబు సొ చ్చుటయుఁ, దద్దేశాధిపతి యగుసైంధవునికుమారుండు కొలు వున నుండి మహారథికులతోడం గూడ గాండీవి యాగహ యంబులవెంబడి వచ్చె నని చారులవలన విని నమాత్రం బున గుండియ లవిసి దిగులునం బ్రాణంబులు పరిత్యజించె.

అంత దుర్యోధనుసోదరి యైనదుస్సల మృతుం డగుతనయు నిం గనుంగొని పదంబులు తొట్రుపడ నేడ్చుచు నగరంబు వెలువడి వచ్చి శ్రీకృష్ణునిపదంబులపయిం బడి "హాకృష్ణా! ద్వారకానాయకా! అనాథనాథా! పార్థుండు మున్ను నా పెనిమిటిం జంపి యిప్పుడు నాబిడ్డనిం జంపె. అన్యాయ మన్యాయము! నన్నుం గావవే" యని మొఱ్ఱయిడుటయు, నర్జునుం డరదంబు డిగ్గి యయ్యమ్మకుం బ్రణమిల్లి "పుత్రశోకంబునం దల్లడింపకుము. మనపాల శ్రీహరి గలం" డని పలుకుచు నంబుజనాభునిం దోడ్కొని యప్పట్టణంబునకు వచ్చిన, నచ్యుతుండు కొలువులోనం గతజీవుం డై పడియున్న సైంధవకుమారునిం దన కరారవిందంబున నిమిరిన, నతండు దిగ్గన లేచి నమస్కారంబు గావించిన, సభవార లందఱుం బ్రమోదమానమానసు లై "ద్రుపదరాజనందనయభిమానంబు గాచినభయత్రాతవు! ఆర్తి నొందిన గజేంద్రునిం గాచినదయానిధివి గదా! గదాధరా! యని వినుతించిరె." అంత సైంధవకుమారుండు కృష్ణార్జునులకు మ్రొక్కి నృత్తగీతవాద్యంబులతో మహోత్సవంబుగా వారలం బూజించె. అంతఁ గౌంతేయుండు తోఁబుట్టు వగుదుస్సలకుం దత్పుత్రునకును మత్తదంతావళంబు లనేకసహస్రంబులు, బహులక్షతురంగంబులు, నసంఖ్యాతరథంబులు నపరిమితధనకనకరత్నభూషణాంబరంబులు నొసంగి ధర్మతనయునియజ్ఞంబుఁ జూడ రం డని ప్రార్థించి వారలు వెడలినయనంతరంబు

—* కృష్ణార్జునులు హస్తినాపురమునకు మరలుట. *—

సంవత్సరంబు సమాప్తప్రాయం బగుటం జేసి వారువంబుల స్వేచ్ఛావిహారంబులు మాన్చి, హస్తినాపురి కభిముఖుండయ్యె. అప్పుడు శ్రీకృష్ణుండు రాజులం గనుంగొని ధర్మపుత్త్రుం డసిపత్త్రవ్రతంబులు సలుపుచు బడలియున్నవాఁడు. నేను మున్నుగాఁ జని మీపరిణామస్థితులు దెలియం జేసెద. తురంగంబులం గూర్చుకొని మీరు సాయంకాలంబునకు రం డని పలికి యాకంసాంతకుండు కరిపురంబు చేరం జని యచ్చట గంగాతీరంబున రత్నకాంచనప్రభాదేదీప్యమాన సభాంతరంబున మహామునిసమేతుం డైన ధర్మతనయుం గనుంగొని ప్రణమిల్లి "జననాథా! నీప్రతాపంబున ఘోటకం బనాఘాటంబుగా సంచరించి వచ్చె. దిక్కులరాజుల నెల్లం గెలిచి నీయనుజుండు కప్పంబులు గొని వచ్చె" నని హంసధ్వజుం డాదిగాఁ గలరాజన్యుల జన్యప్రకారంబు దెలియం జెప్పి యచ్చట నున్నమునిజనులకు నమస్కారంబును గుశలప్రశ్నంబులునుం గావించి కుంతి మొదలగు గురువనితాజనంబులకుం బ్రణమిల్లి తనకు మ్రొక్కినభీముని మాద్రేయుల సుభద్రాద్రౌపదుల నాదరించి, వృకోదరసహితంబుగా నిజమందిరంబునకుం జని రుక్మిణీసత్యభామాదియోషారత్నంబుల యుల్లంబులు పల్లవింప నించుకనడి వినోదించి తోరణవితానాదులచేఁ బురంబు సింగారింప నియమించి పౌరులు పురోహితులు, సామంతదండనాథులు, తద్వధూజనంబులు,

వారసుందరీబృందంబులు ధర్మరాజానుమతంబున బయలు వెడలయుటయు, భీమాదియోధవరులతోడంగూడ సవ్యసాచి వుండు చతురంగంబులు గొలువ బకదాల్భ్యు నెదుర్కొనుటకుఁ గదలి వికసితకుసుమసౌరభసంభరితం బైనపురోద్యానసమీపంబున నర్ధచంద్రవ్యూహంబు పన్నించి నిలిచె. అంతఁ బద్మినీకాంతుండు పశ్చిమపర్వతంబుచెంత నిలిచె. అపుడు గంధతైలావసిక్తంబు లగుకరదీపికాసహస్రంబులు వెలుంగ నభినవశృంగారభూషితాంగు లగురాజపుంగవులు గొలువ, మంథానమథ్యమానమహార్ణవఘుమఘుమితఘోషగంభీరం బైన సేనాకోలాహలంబుతోడ జలధరగర్భనిర్భేదనారంభవిజృంభమాణమాణిక్యధ్వజంబులు చెలంగఁ, బ్రచండమారుతపూరితకులాచలదరీఝుంకృతిజృంభమాణగంభీరనిస్వనంబులఁ బురుడించు నిస్సాణరవంబులతోడ ననర్ఘ్యమణిమయశిబికాధిరూఢుం డైనబకదాల్భ్యమహామునీంద్రు వెంబడి నశ్వమేధాశ్వంబుల ముందిడుకొని, గాండీవధన్వి యెదుట నున్న పుండరీకాక్షుతోడ సంధించికొనియె. పౌరపురంధ్రీమణు లింద్రనందనునిమీఁదఁ జల్లుపకాక్షికంబులవలన భూమి రత్నగర్భ యయ్యె. వారలు చల్లెడు పూవులవలన గంధవతి యయ్యె. భీమసేనమౌంత్రే సముఖ్యులు బకదాల్భ్యమునీంద్రుపాదపద్మంబులకుఁ బ్రణమిల్లి ఫల్గునసేనాప్రకరంబులతోడం గలసి పట్టణంబునకుం జనిరి.

—* కృష్ణుండు ధృతరాష్ట్రునకు నచ్చినరాజుల నెఱింగించుట. *—

తదనంతరంబ, మహీపాలకు లందఱు విచిత్రంబు లైన కానుకలు గొనుచు వ్రతదీక్షాపరుం డైనధర్మనందనునిపాదారవిందంబులకుం బ్రణమిల్లిరి. అప్పుడు విదురసంజయకృపాచార్యప్రముఖమిత్రబాంధవసుహృజ్జనులతోడం గూడఁ గొలువై యున్నధృతరాష్ట్రునిచెంతకుం జని మహీపాలకుల నెల్ల సముఖంబు సేయించి పుండరీకాక్షుండు వారల వేర్వేఱ యిట్లని యెఱింగించె. ఇతండు శౌర్యసమున్నతుం డైననీలధ్వజుండు, స్వాహావధూవల్లభుం డైనవైశ్వానరుం, డీతని యల్లుండు. ఇతండు చిత్రాంగదాకుమారుం డైన బభ్రువాహనుండు. రణంబున సాత్యకిప్రద్యుమ్నవృష కేతన కపి కేతనుల జయించి సంజీవనరత్నంబుఁ దెచ్చి నుగుడ బ్రతికించె. ఇతండు చంద్రహాసభూపాలుండు. ఇతనిచరిత్రంబు విచిత్రంబు. ఇతం డలిగెనేని దేవదానవులు వడవడ వడంకుదురు. ఇతండు మయూరకేతనుండు. ఈరాజునౌదార్యంబు శౌర్యంబును వర్ణింప నాతరంబుగాదు. వృద్ధబ్రాహ్మణరూపంబునం బోయి నేను వేఁడినయెడఁ దనశరీరంబు సగంబు గోసి యిచ్చె. ఇతండు హంసధ్వజుండు; ఈరాజుకొమరులను బవరంబున గెలుచుట కై నేను బూర్వంబు సేసినపుణ్యంబు లన్నియు వెచ్చపెట్టితి. వారలశిరఃకపాలంబులు రుద్రుండు హారనాయకంబులుగా ధరియించె. ఇతండు వీరవర్మ: సర్వప్రాణి సంహారకర్త యైనయముం డీతనియల్లుండు. వీర లందఱు నొక్కరికన్న నొక్క రధికులు. వీరల నెల్ల నీకుమారుం

లైనయర్జునుండు నిర్జించె. నీభాగ్యంబునకుం గొఱంత యే మి? అని వినిపించుచుండ ఫల్గునుండు ధృతరాష్ట్రునకు నమస్కరించి తల్లికి మ్రొక్కుటయు (నామె) బహుళాస్త్రశస్త్రవ్రణాకిణాంకితంబు లగునతనియంగంబుల నిమురుచు మ్రొక్కినకర్ణనందనుం గౌఁగిలించికొనియె.

తదనంతరంబ, ద్రౌపది శుభముహూర్తంబున హాటకపుటికలో నానావిధంబు లైనవిత్తనంబులు గొనుచు మురారి యయ్యశ్వము ననువర్తించి పిఱందిదెస నరుదేర నానాపృథివీపాలకులు దూరంబున నిలువ యమనందనుండు నధ్వరభూమి శుద్ధిగా నాఁబువృషభంబులఁ బూన్చినబంగరునాఁగలి గైకొని మహామునులు మంత్రంబులు పఠించుచు వెంబడిరా యాగస్థలంబు దున్నె. అంత దీక్షితుం డగుధర్మనందనుని రత్నకుంభసంభృతంబులును, గంధద్రవ్యపరిమళమిళితంబులు నానావిధౌషధియుక్తంబులు నైనపుణ్యసలిలంబులచేఁ గుంతియు దేవకియు యశోదయు సాదరంబుగా నభిషేకంబు గావించిరి. ఋత్విజులు నెనమన్నూటతొమ్మిది కుండనంపు టిటికలు గరుడాకారంబుగా నమర్చి యిట్లు లోకటొకటికి నినుమడిసంఖ్యగా గరుడాకారంబున నైదు వేదికలమర్చి శాస్త్రోక్తంబుగా నిష్టకాచయనంబు సేసి యష్టద్వారసమన్వితంబు నష్టాపదేష్టకామయంబును వివిధవిచిత్రతోరణధ్వజాలంకృతంబునుం గా యాగశాల గట్టించి బదరీబిల్వపలాశయూపంబు లిరువదియొక్కటి వరుసగా నిలిపి

—* ధర్మరా జశ్వమేధం బొనరించుట. *—

స్రుక్స్రువంబులు నులూఖలజుహూవు మొదలైనయజ్ఞ
పాత్రంబు లలంకరించిరి. వింశతిబ్రహ్మకల్పజీవి యైన బక
దాల్భ్యుండు బ్రహ్మయు, వేదవేదాంగరహస్యనిస్సంశ
యుం డైనసాత్యవతేయుం డధ్వర్యువు, వసిష్ఠవామదేవరో
మశగాలవకపిలసుమంతభాగురిభరద్వాజజమదగ్నిరైభ్య
కౌండిన్యగౌతములు ఋత్విజులును గా, నరుణిపులహ
పులస్త్యోపమన్యువిశ్వామిత్రమధుచ్ఛందవిభండకధౌమ్యవా
యుభక్షకుల రక్షోఘ్నమంత్రపాఠకులుగా నియమించి ధర్మ
నందనుండు, మృగశృంగధరుండును గృష్ణాజినాంబరుండు
ను, గుశాసనాసీనుండు నై యున్నసమయంబునం బరాశర
నందనుండు, రాజలోకంబు నవలోకించి, మీరలు కళత్ర
సమేతంబుగాం జాహ్నవీపవిత్రోదకంబుల ధర్మరాజు నభిషే
కింపవలయు ననియె. అంతట ననసూయయు నత్రియు,
నరుంధతియు వసిష్ఠుండును, రుక్మిణియు శ్రీకృష్ణుండును, హి
డింబయు భీమసేనుండును, సుభద్రయు నర్జునుండును, మా
యావతియుఁ బ్రద్యుమ్నుండును, ఉషాకన్యయు ననిరుద్ధుం
డును, బ్రభద్రయు వృషకేతుండును, ప్రభావతియు యౌవ
నాశ్వుండును, సునందయు నీలకేతుండును, ధమ్మిల్లయు
ననుసాల్వుండును, మొదలుగాఁగల యాఱువదినలువురు
దంపతులు పంచపల్లవసముంచితంబు లైనకలశంబులు గొను
చు మందమందగమనంబులం గదలి ముందట గీతవాద్య

నృత్యంబులు మొరయ గజాధిరూఢు లై విప్రకన్యలు చల్లు మౌక్తికంబులు మెఱయఁ, గుంతీదేవకీయశోదలం బురస్కరించికొని యరుగుసమయంబునఁ గలహఘటనావిశారదుం డైననారదుండు సత్యభామాగృహంబునకుం జని పూజలు గైకొని యిట్లనియె. "భామామణీ! మగండు నీదెసం గూర్మి గలవాఁ డని మిగుల గర్వించి యుండుదువు. నేఁడు పెద్దతనం బు రుక్మిణీదేవి కిచ్చె. అది యె ట్లంటివేని మూర్ధాభిషిక్తు లైనక్షత్రియోత్తములు పట్టంపురాణులతోడంగూడఁ జుట్టును గొలువ, ఛత్రచామరంబులు మెఱయ భ్రాజిష్ణుం డైన శ్రీకృష్ణదేవునితోడంగూడ రుక్మిణీదేవి కలశాభిషేకంబు సేయుట కై జాహ్నవికిం జనియె. నీచనవు వ్యర్థం బయ్యె" ననిన సాత్రాజితి కలహాశనమునిం జూచి యేకాంతంబు నందును బ్రాణేశ్వరుండు నన్ను మఱచునే యని తనకేళీ సౌధంబున నున్నమురారిం జూపిన సురముని విస్మితుం డై విష్ణుదేవునివ్యాపకత్వంబుఁ గొనియాడుచు యథేచ్ఛముగాఁ జనియె.

—* అశ్వమేధవిధి *—

అనంతరంబ, యఱువదినలుగురు దంపతులు, కొంగు ముళ్లతోడంగూడఁ గుసుమగంధబంధురహేమకుంభసంభరితగంగాతరంగిణీపవిత్రోదకంబులు దెచ్చి ఋత్విజులు వేదమంత్రంబులు చదువ హేమకటాహంబులం బోసి ధర్మతనయున (కభిషేక మాచరింపఁ బూతాత్ముం డగునతండు)

మఘూశ్వంబునకు నభిషేకంబునేసి, మహామునుల నెల్లఁ గన కాసనంబుల నిడి గంధమాల్యాంబరభూషణంబు లర్పించి, యథోక్తదక్షిణ లొసంగి యయ్యశ్వంబును యూపస్తంభం బునం గట్టిన, దానిని బాంచాలియుఁ దానును బూజ సేసి వలగొని, యగ్నిశిఖాముఖంబున గంధర్వలోకంబునకుం జను మనిన నయ్యశ్వంబు మోర యల్లార్చుచుఁ దనయభి ప్రాయంబు నభినయించిన, నశ్వహృదయజ్ఞుం డైననకు లుండు ధర్మజునిం జూచి "క్రతుఫలప్రదాయకుం డైనశ్రీహరి తనముఖంబున నున్నవాఁడు; స్వర్గఫలం బేమి హెచ్చు!" అనియశ్వంబు దెలుపుచున్న దన శ్రీకృష్ణసహితంబుగా ఋ షులు సంతోషించిరి. అంత నగ్గంధర్వరత్నంబును మం త్రంబుల విశసనంబు గావించిన సౌమ్యుం డైనధౌమ్యుండు వాజిదక్షిణకర్ణంబు మెలివెట్టినఁ బాలు వెడలె. భీమసే నుండు పురోహితునియనుమతిని గృపాణంబు గొని యశ్వ శీర్షంబు ఖండించిన నది తేజోరూపంబున నెగసి సూర్యునిం గలసె. మురహరుండు నత్తురంగకళేబరంబు విశసనంబు సేసినఁ దత్తేజంబు శ్రీహరిలోనం గలసె. తన్మాంసరాశి కర్పూరరాశియైన మునులు గనుంగొని "కుంతీతనయాగ్రణీ! నీభాగ్యంబునకుం గొఱంత యెయ్యది! అపఘనసారంబు ఘనసారం బయ్యె" నని సన్నుతులు సేయ నక్కర్పూరంబు ప్రథమాహుతిగా నాచార్యుండు నింద్రు నుద్దేశించి చేసిన నయ్యింద్రుండు చేయి చాఁచి యాహుతిం గైకొనియె.

అష్ట దేవత లందఱు వేదవ్యాసు లొసంగునాహుతులు సాకారంబుగా వచ్చి కైకొనిరి. త్రైలోక్యంబును దృప్తిం బొందె. పురోడాశప్రాశనంబును సోమపానంబునుం జేసి ఋత్విజు లానందించిరి. ధర్మనందనుండు పూర్ణాహుతిగా వించి యవభృథస్నానంబు నాచరించె. అయ్యశ్వమేధ యాజిని రాజీవాక్షుండు నందంద కౌఁగిటం జేర్చి యభినం దించె. అంత ననసూయ మొదలగువధూజనులు నీరాజనం బులు సేసిరి. అజాతశత్రుండు బకదాల్భ్యునకు రత్నమయ వృషభంబును వ్యాసునకు సకలభూమండలంబు దక్షిణగా నొసంగిన నతండు క్రమ్మఱ నాభూమి విక్రయించి యాధ నంబు దీనుల కొసంగె. ఒక్కయరదంబు నొక్క మదగజం బును నూఱుగుఱ్ఱంబులు నూఱుధేనువులు నాలుగుసోలల ముత్తియంబులు నలువురుసైన్యపతుల నొక్కొక్క ఋత్విజు నకు దక్షిణగా నొసంగి సభాసదు లైనద్విజులకు నపారం బుగా దక్షిణ లొసంగి కోటిసువర్ణంబులు పదివేలగుఱ్ఱంబులు నూ ఱేనుంగులు నొక్కవరుస సొమ్ములు వచ్చినరాజుల కెల్ల వేర్వేఱ యొసంగి, యాదవులకెల్ల నందులకు రెట్టి ప్రత్యే కంబుగా బహుమానంబు సేసి, రుక్మిణీప్రముఖు లైనగోపాల దేవునివనితామణులకు నపరిమితరత్నభూషణంబు లొ సంగి, భీమార్జునమాద్రీపుత్రుల మన్నించి, యుధిష్ఠిరుండు నవరత్నఖచితసింహాసనంబున శ్రీకృష్ణదేవుని రుక్మిణీసమేతం బుగా నునిచి, యాతనిదివ్యశ్రీపాదంబులు బంగరుపళ్లెరంబు

లోఁ బన్నిటం గడిగి, తడి యొత్తి, గంధపుష్పదివ్యభూషణాంబరంబుల నలంకరించి, యయ్యశ్వమేధక్రతుఫలంబు సమస్తంబును దత్కరంబున దారవోసె. అప్పుడు పుష్పవృష్టియు దివ్యదుందుభిధ్వానంబును గలిగె. మఘుపూర్తి గనుంగొని దేవతలు మునులు రాజర్షులు మహాపురుషులు హర్షం

—* భీముని పాకమహిమ. *—

బునం గొనియాడిరి. అప్పుడు భీమసేనుండు తనపాకచాతుర్యంబు నందఱకు నెఱింగింపంగోరి విందుసేసి బిరుసు మెత్తనయు ననుఁబ్రాయియుఁ జిమిడికయుం గాక గరగరిక యగు కలమాన్నంబును, బద్ధకేసరచ్ఛాయ ననుకరించుపప్పును, దివ్యగంధబంధురంబు లైనగోదుమపిండివంటలును, నానారుచుల విచిత్రంబు లైనశాకపాకంబులును, భక్ష్యభోజ్యలేహ్యచోష్యపానీయంబులు మొద లగుసమస్తంబును నిమిషమాత్రంబున నసుర్చి పసిఁడిపళ్లెరంబుల నించి ఋషుల రాజుల బంధులను బంతులు దీర్చి సర్వాలంకారభూషిత లైనయోషాసహస్రంబులచే వడ్డన చేయించుటయుఁ, "జింపినారచీర లేమిసేసెడి వని మనంబున నెన్నకుఁడు; ఇవి ఖండశర్కరామయంబు లైనపఁడెఁగలు. తెగినజంటెంబు లివి యేల యనకుఁడు; ఇవి వింత లైనగోదుమపూజంతికలు. ఔదుంబరఫలంబు లివి యని యెన్నకుఁడు; నమలి చూడుఁడు, మేలిపూర్ణంబు లిడిన కుడుములు. తెల్లనరుఁగు లేమిటి కంటికొనియెడు నని దూఱకుఁడు; ఇవి వా

వనారుచిరంబు లైనవేణియలు” అని యొడంబడం జెప్పు మం బడంతుకలు వడ్డింప మహామునులు భుజియించి గంధో దకధౌతహస్తాంబుజు లై కర్పూరవీటికాసుగంధమాల్యం బులం దనిసి యనిలజునిం బలువితంబులం బ్రశంసించుచు మూగశాలం గూర్చుండియుండిరి. ఆసమయంబున నిరువురు బ్రాహ్మణులు తమలోనం గోలాహలంబుగాం గలహించుచు వచ్చి ధర్మనందనుం గనుంగొని యాశీర్వదించి మావివా

—* కృష్ణధర్మరాజులు బ్రాహ్మణవివాదము వినుట.

దంబుం దీర్పవలయు ననిన నతం డరుణిపులహాబకదాల్భ్యాది మహామునులు నీగోపాలదేవుండును విన మీవాదంబులు దెలుపుం డనవుడు, వారిలో నొక్కరుం డిట్లనియె. “నాపేరు యజ్ఞశర్మ. ఈతనినామధేయంబు విష్ణుశర్మ. ఇతనికి నేనొక్క క్షేత్రంబు నమ్మితిని. ఇతం డాక్షేత్రంబు దున్నించునపు డొక్కనిక్షేపంబు గానంబడియె. ఆనిక్షేపంబు న న్నెత్తు కొమ్మనిన నాకు నిమిత్తంబు లే దంటిని. అందుల కితండు మల్లాడుచు నున్నవాండు. మీర లితనికిం దెలియం బలుక వలెంపుం” డనినయనంతరంబ విష్ణుశర్మ యి ట్లనియె. “ఇతండు నాకుం గ్రయంబు సేయునప్పుడు నిక్షేపంబుతోడంగూడం గొనినవాండం గాను. నాకుం గార్యంబేమి? ఇతండు ధర్మం బుగంగని వెట్టినవాండు. తనద్రవ్యంబు నా కేమిటికి? మీర తగవు దీర్పుం” డనుటయు, శ్రీకృష్ణదేవుండు నవ్వుచు ని ట్లనియె. విప్రవరులారా! మీర లిరువురు మూండు నెలలకు

మగుడ రండు; అపుడు తగవు తీర్చెదఁ బొందు. వృథా
నంబు వల దనిన, వారలిరువురుఁ దద్ధనంబు నగరికి నప్ప
చనుటయు, ధర్మనందనుండు శ్రీకృష్ణదేవుం గనుంగొని
దాల్భ్యవ్యాసకణ్వవసిష్ఠాదిమహామును లుండఁ
తేఱుగడసేయక యేల యూరక పొం డంటి వనిన, వ
దుం డి ట్లనియె. "నీసముఖంబున నానాసౌఖ్యగోష్ఠివి
బులం బ్రొద్దు గడపునెడ ని దేమిటి వృథాసంవాదం
పొం డంటిని. మాసత్రయానంతరమునఁ గలియుగంబ
ప్రాప్తం బగు; అప్పటికి వీరల కీబుద్ధి యుడిగి మగుడఁ
హించి మన యొద్దికి వత్తురు. అప్పుడు సమంబుగాఁ
యిచ్చి పొం డందము. అంతియ కాదు. కలియుగాచ
బులు వినుము. వేదవిహితంబులు గాని దురాచ
బులచేతను, జనులయన్యోన్యవైరంబులచేతను, అనా
వర్తను లగురాజులచేతను, స్త్రీద్యూతమృగయాపా
దుర్వ్యసనంబులచేతను, ధర్మపత్నీనిరాదరణంబుచేతను,
దారపరిగ్రహంబుచేతను, వేశ్యాసంగమంబుచేతను, బ
వ్యాపహరణంబులచేతను, నానాఁటికి రెట్టించు లోభ
హామాత్సర్యంబులచేతఁ గలియుగంబు దర్పించి ధర్మ
నొప్పించి యందులోనఁ బ్రథమపాదంబున దురాచా
బులు సదాచారంబులు సమ్మిశ్రంబు లై పెరుఁగు వచ్చు
పినకరణి వర్ణాశ్రమధర్మంబులు సంకరంబు లగు.
నొక్క రాజరూపంబున నవతరించి కొంత కొంత

డెందంబున నానందింపవలయు" నని జైమినిమునీంద్రు నతిచ్చుటయు జనమేజయనరపాలుండు కౌతూహల చిత్తుండై యమ్మునివరునకుఁ గనకాంబరంబులు, రత్న భూషణంబులు,....నపారంబగుగోసహస్రంబులు సమ చతుస్సాగరవేలావలయితమహీచక్రంబు నేలుచుఁ ద సత్కథలు వినుచు శాశ్వతైశ్వర్యభోగంబు లనుభవిం చుండె.

గద్యము. ఇది శ్రీమత్పాండ్యమండలాధీశ్వర శ్రీవిజయ చొక్కనాథమహీనాథకరుణాకటాక్షసంపాదిత రంగమాందోళికా ప్రముఖ నిఖిలసంపత్సార మేధమాన సముఖమీనాక్షీనాయకతనూభవ నాక్షీదేవీకటాక్షలబ్ధకవితాసాంప్రదాయక కృష్ణప్పనాయకప్రణీతంబైన జైమినిభారతం నశ్వమేధపర్వ మ్మనువచన [illegible] ందుఁ మాశ్వాసము.

సర్వము సంపూర్ణము.